www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14

ఝార్ఖండ్‌లో గందరగోళం
ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించండి 2
గవర్నర్‌ను కోరిన జేఎంఎం నేత చంపయి సోరెన్
కూటమి ఎమ్మెల్యేలను హైదరాబాద్ తరలించే యత్నం
పొగమంచుతో విమానాల రద్దు.. నేడు వచ్చే చాన్స్?

శుక్రవారం | 2-2-2024 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 288
| శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: సప్తమి సా. 4.04 తదుపరి అష్టమి; నక్షత్రం: స్వాతి తె. 5.58 తదుపరి విశాఖ; వర్జ్యం: ఉ. 9.55-11.40; దుర్ముహూర్తం: ఉ. 9.07-9.52, మ. 12.52-1.37; అమృతఘడియలు: రా. 8.23-10.07; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 6.07 | విజయవాడ సిటీ**
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


బడ్జెట్ ట్యాబ్‌తో ఆర్థిక మంత్రి నిర్మల

వరాలు.. వాతలు లేకుండానే..
ఓట్లాటకు సై
బడ్జెట్ ప్రసంగంలోనే గెలుపుపై ధీమా
పదేళ్ల 'ప్రగతే' గెలిపిస్తుందని నిర్మల ఉద్ఘాటన

(న్యూఢిల్లీ - ఆంధ్రజ్యోతి)
ఎన్నికల ముందు మరో 'బడ్జెట్ బండి' దూసుకొచ్చింది. 'ఓటాన్' బడ్జెట్ కాస్తా మధ్యంతర బడ్జెట్‌గా మారిపోయింది. పదేళ్ల 'ప్రగతి'పై వివరణ! వరాలూ... వడ్డింపులు లేకుండా... అందమైన భవిష్యత్ వర్ణనతో బడ్జెట్ కథా చిత్రం రక్తి కట్టింది. గురువారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజాకర్షక ప్రకటనలు ఉంటాయని... వేతన జీవికి భారీ ఊరట లభిస్తుందని... గ్యాస్, పెట్రో ధరల మంట తగ్గుతుందని ఆశించిన వారికి నిరాశే మిగిలింది. 'అయోధ్య రాముడి' ఆశీస్సులు మెండుగా ఉన్నాయనుకున్నారేమోగానీ... ఓటరు దేవుడికి మాత్రం ఒట్టి చెయ్యే చూపించారు. గత ఎన్నికల ముందు కూడా మధ్యంతర బడ్జెట్‌నే ప్రవేశపెట్టారు. అప్పట్లో స్టాండర్డ్ డిడక్షన్‌ను 50 వేలకు పెంచారు. పన్ను ఆదాయం 5 లక్షల వరకూ ఉన్నవారికి రిబేటు ప్రకటించారు. 'పీఎం కిసాన్' పేరిట కొత్త పథకానికి శ్రీకారం చుట్టారు! దాంతో, ఈ బడ్జెట్‌లోనూ వరాల జల్లులు కురిపించవచ్చని
మిగతా 11వ పేజీలో...

ఆదాయ పన్ను రేట్లు మారలేదు
దిగుమతి సుంకాలు, ప్రత్యక్ష, పరోక్ష పన్ను రేట్లలో ఎలాంటి మార్పులూ చేయట్లేదని నిర్మలమ్మ వెల్లడి
ఐటీ పరిమితి పెంపుపై సగటు వేతన జీవికి నిరాశే
2009-10 వరకూ రూ.25 వేలలోపు ఉన్న చిల్లర, వివాదాస్పద డిమాండ్ నోటీసులు రద్దు
2010-11 నుంచి 2014-15 నడుమ రూ.10 వేల లోపు డిమాండ్ నోటీసులు కూడా
వీటివల్ల 1.1 కోట్ల మందికి రూ.3,500 కోట్ల లబ్ధి

మూలధన వ్యయం
11,11,111 కోట్లు
11.1 శాతం పెంపు
రాష్ట్రాలకూ రూ.1.3 లక్షల కోట్ల వడ్డీ లేని రుణాలు
మొత్తం బడ్జెట్ 47,65,768 కోట్లు
పన్ను ఆదాయం 26,01,574 కోట్లు
అప్పులు 16,85,494 లక్షల కోట్లు
రక్షణ బడ్జెట్ 6.1 లక్షల కోట్లు
రైల్వే బడ్జెట్ 2,55,393 కోట్లు



సమగ్ర కథనాలు 9, 10, 11, 12లో

భవిష్యత్ భారతంపై బంగారు కలలు
మోదీ సర్కారు 'మధ్యంతర' బడ్జెట్
మౌలిక రంగానికే పెద్దపీట
మధ్య తరగతి ఇళ్లకు కొత్త పథకం
ఆవాస యోజన కింద మరో 2 కోట్ల ఇళ్లు
300 యూనిట్ల వరకు ఉచిత సోలార్
రైల్వేలో ఇంధన, మినరల్, సిమెంట్‌కు భారీ కారిడార్లు
వందే భారత్ స్థాయికి మరో 40 వేల బోగీలు
వెయ్యికిపైగా విమానాల కొనుగోలుకు ఆర్డర్లు
స్టార్టప్‌ల ప్రారంభానికి లక్ష కోట్ల కార్పస్ ఫండ్
దేశవ్యాప్తంగా ఐదు ఆక్వా పార్కుల ఏర్పాటు
9-14 ఏళ్ల బాలికలకు సర్వైకల్ క్యాన్సర్ టీకా
ఆయుష్మాన్ భారత్‌లోకి అంగన్వాడీలు, ఆశాలు
జిల్లాల్లో ఆస్పత్రులు, మరిన్ని వైద్య కాలేజీలు

మళ్లీ మాదే అధికారం!
అద్భుతమైన మెజారిటీతో వస్తాం: నిర్మల
దేశాభివృద్ధికి గ్యారెంటీ
యువతకు భారీగా ఉపాధి అవకాశాలు: మోదీ
బడ్జెట్ నిరాశాజనకం: కాంగ్రెస్

అసంబద్ధంగా 'సిద్ధం'

ఏలూరు జిల్లా పాలగూడెంలో 'సిద్ధం' సభా వేదిక వద్ద పూడ్చివేస్తున్న పంట కాల్వ

సభ కోసం పచ్చని చెట్ల నరికివేత.. 2 వేల ఎకరాలకు నీరిచ్చే కెనాల్ పూడ్చివేత
ఎటు చూసినా మొండి మానులు.. పూడికలు
గగ్గోలు పెడుతున్న రైతన్నలు.. స్థానికులు
సభయ్యాక కాల్వను బాగుచేస్తామన్న నేతలు
మీ మాట ఎవరు నమ్ముతారంటున్న రైతులు
ఏలూరు జిల్లాలో రేపు వైసీపీ బహిరంగ సభ

ఏలూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏలూరు జిల్లాలో శనివారం నిర్వహించనున్న 'సిద్ధం' సభ కోసం ఆ పార్టీ నాయకులు అసంబద్ధ నిర్ణయాలు తీసుకుని పచ్చని పర్యావరణాన్ని ధ్వంసం చేశారు. సీఎం జగన్ ఫొటోతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేసేందుకు అడ్డు వస్తున్నాయన్న మిషతో ప్రధాన రహదారిపై ఉన్న డివైడర్లలో ఏపుగా పెరిగిన చెట్లను సగానికి నరికేశారు. దీంతో ఎటు చూసినా మొండి మానులే కనిపిస్తున్నాయి. మరోవైపు సభాస్థలి వద్ద ఉన్న ప్రధాన కాల్వలో మట్టిని పోసి దానిని కూడా పూడ్చేశారు. ఈ కాల్వ ద్వారా పారే నీరు వేలాది ఎకరాలకు నీరందిస్తోంది. ఈ విషయం తెలిసి కూడా స్థానిక నాయకులు స్వామి భక్తి ప్రదర్శించారు. దీంతో పర్యావరణ ప్రేమికులు సహా.. స్థానిక రైతులు ఇదేం పని అంటూ వైసీపీపై
మిగతా 2వ పేజీలో...

విశాఖపై జగన్ ప్రేమ ఇదేనా?
రైల్వే జోన్‌కు నాలుగున్నరేళ్లుగా భూములివ్వని వైనం
జోన్‌కు 53 ఎకరాలు ఇవ్వలేరు.. కానీ... రాజధాని చేస్తారట!
రుషికొండకు గుండు కొట్టి 450 కోట్లతో విలాసాల ప్యాలెస్
ఉత్తరాంధ్ర సెంటిమెంట్ 'జోన్'పై మాత్రం అంతులేని నిర్లక్ష్యం
విశాఖలో దోచుకున్న భూముల్లో 53 ఎకరాలు పదో వంతైనా కాదు
వారంలో భూములిస్తే మర్నాడే శంకుస్థాపన చేస్తామన్న కేంద్రం
అయినా పట్టని రాష్ట్ర ప్రభుత్వం

స్వయంగా కేంద్ర మంత్రి వెల్లడి

అశ్విని వైష్ణవ్

విశాఖ రైల్వే స్టేషన్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)
పాలనారాజధాని అని ఆర్భాటంగా చెబుతున్న సీఎం జగన్మోహన్‌రెడ్డి విశాఖపట్నంపై కపట ప్రేమ చూపుతున్నారని తేలిపోయింది. రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణానికి కేంద్రం సిద్ధంగా ఉన్నా.. నాలుగున్నరేళ్లుగా భూమి కేటాయించకుండా దాగుడుమూతలు ఆడుతున్నారు. ఈ విషయాన్ని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ గురువారం ఢిల్లీలో కుండబద్దలు కొట్టారు. రైల్వే శాఖ స్వయంగా అడుగుతున్నా జగన్ పట్టించుకోవడం లేదు. ఇక్కడ చేజిక్కించుకున్న భూముల విలువ పెంచుకోవడానికే విశాఖను పరిపాలనా రాజధానిగా ప్రకటించారని రాజకీయ వర్గాలు మండిపడుతున్నాయి. విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటును మోదీ ప్రభుత్వం 2019లో ప్రకటించింది. దీని ప్రధాన కార్యాలయం విశాఖలో నిర్మించడానికి గత బడ్జెట్‌లో రూ.107 కోట్లు కేటాయించింది. అందులో రూ.10 కోట్లు ప్రాథమికంగా విడుదల చేసింది. కార్యాలయం నిర్మాణానికి 53 ఎకరాలను ముడసర్లోవ ప్రాంతంలో ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. కానీ ఇంతవరకూ దానిని రైల్వే శాఖకు అప్పగించలేదు. ఆ భూమిలో ఆక్రమణదారులు ఉన్నారు. వారిని తొలగించడం లేదు. ప్రత్యామ్నాయ భూమైనా చూపడం లేదు. ఈ విషయాలన్నీ తొక్కిపెట్టి బీజేపీ నాయకులే రైల్వే జోన్‌ను
మిగతా 2వ పేజీలో...


ఎలక్షన్ వేళ కరెన్సీ మేళా!
నెల్లూరు జిల్లాలో స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసులు
ఒకేరోజు వేర్వేరుచోట్ల రూ.12 కోట్లు పట్టివేత
నెల్లూరు జిల్లాలో 7.23 కోట్లు.. తిరుపతిలో 5.12 కోట్లు జప్తు
భీమవరంలో 6 కేజీల బంగారం స్వాధీనం
14 మంది అరెస్టు 3

సొంత మనుషులకే పోలీస్ సబ్ డివిజన్లు
రాష్ట్రంలో 104 మంది డీఎస్పీల బదిలీ
42లో 10పోస్టులు సొంత సామాజికవర్గం వారికే!
బాబు, లోకేశ్‌ను ఇబ్బంది పెట్టిన సుధాకర్ రెడ్డికి అందలం.. 'అనంత' రాఘవరెడ్డి అక్కడికే! 9


ఎవరికి కావాలి మీ సర్వే?



మా ఇళ్లకొచ్చి మమ్మల్ని వేధించొద్దు
సచివాలయ ఉద్యోగులపై జనం అసహనం
మరోవైపు జిల్లా అధికారుల తీవ్ర ఒత్తిడి
90% సర్వే చేయకపోతే సస్పెండ్ చేస్తాం
అడకత్తెరలో పోకచెక్కలా సిబ్బంది పరిస్థితి
కులగణనపై ప్రభుత్వ వ్యతిరేక ప్రభావం
ఇవి ఎన్నికల గిమ్మిక్కులంటూ విముఖత

(అమరావతి-ఆంధ్రజ్యోతి)
కులగణన కోసం వెళుతున్న సచివాలయ సిబ్బందికి జనం నుంచి అనూహ్యరీతిలో నిరసనలు ఎదురవుతున్నాయి. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన కుల సర్వే ప్రక్రియ ఊహించని రీతిలో ప్రతిఘటనలను చవిచూస్తోంది. సర్వేల పేరుతో పదేపదే ఇళ్లకొచ్చి విసిగించొద్దు... ఎన్నికల ముందు ఈ సర్వేలు ఎందుకు... అంటూ కొందరు; మేం ప్రభుత్వం నుంచి ఏ సాయం తీసుకోవడం లేదు... సర్వే పేరుతో మా ఇళ్ల చుట్టూ తిరగొద్దు...అంటూ ఇంకొందరు; కుల గణన సర్వేకు ఇన్ని వివరాలెందుకంటూ మరికొందరు; వైసీపీ ప్రభుత్వం ఓట్ల కోసం చేసే గిమ్మిక్కులివీ అంటూ
మిగతా 9వ పేజీలో...

అచ్చెన్నపై చార్జిషీటుకు.. గవర్నర్ అనుమతి తీసుకున్నారా?
సెక్షన్ 19 ప్రకారం అది తప్పనిసరి
ఈఎస్ఐ కేసులో ఏసీబీ కోర్టు స్పష్టీకరణ
అనుమతి అక్కర్లేదన్న ప్రభుత్వ న్యాయవాదులు
అలా సుప్రీంకోర్టు తీర్పులుంటే సమర్పించాలని న్యాయాధికారి ఆదేశం 9


9
శిరోముండనం కేసులో వైసీపీ నేతలకు హైకోర్టు షాక్
నిందితులపై కేసు కొట్టేసేందుకు నిరాకరణ
రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సీతానగరం పోలీస్ స్టేషన్ ఘటన

బోర్డు నియంత్రణలోకి శ్రీశైలం, సాగర్!

2 రాష్ట్రాల అంగీకారం.. విద్యుత్కేంద్రాలు మినహా 10 కాంపోనెంట్ల అప్పగింత
ప్రతి చోటా ఇరు రాష్ట్రాల నుంచి ఒక్కో ఉద్యోగి.. త్రిసభ్య కమిటీ నిర్ణయం
మేరకే నీటి విడుదల.. సాగర్ వరకే సీఆర్‌పీఎఫ్.. కేఆర్ఎంబీ భేటీలో నిర్ణయం 9

సజ్జల ఖాతాలోకి 140 కోట్లు
మొత్తం సలహాదారులకు ముట్టజెప్పింది రూ.680 కోట్లు
ఏ అర్హతతో ఈ పదవులిచ్చారు?
ఏ పద్దు కింద ఈ జీత భత్యాలు?
వారి పేర్లయినా మీకు గుర్తున్నాయా?
సీఎం జగన్‌పై జనసేన నేత నాదెండ్ల ఫైర్

2

వీసా ఫీజులను భారీగా పెంచిన అమెరికా 2

హేమంత్ సోరెన్‌కు ఒక రోజు కస్టడీ

- 10 రోజుల పాటు ఇవ్వాలన్న ఈడీ వినతిపై నేడు తీర్పు
- రాంచీలో 8.5 ఎకరాలు ఆక్రమించినట్టు కేసు నమోదు

రాంచీ, ఫిబ్రవరి 1: మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను గురువారం ఇక్కడి పీఎంఎల్‌ఏ ప్రత్యేక కోర్టు ఒక రోజు జ్యుడీషియల్ కస్టడీకి పంపించింది. పోలీసులు ఆయనను ఇక్కడి బీర్సా ముండా సెంట్రల్ జైలుకు తరలించారు. ఆయనను పది రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలన్న వినతిపై కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించనుంది. ఈడీ బుధవారం ఆయనను ఏడు గంటల పాటు విచారించింది. అనంతరం ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయగా రాత్రి పది గంటల సమయంలో గవర్నర్ హౌస్ వద్ద అరెస్టు చేసింది. కాగా, రాత్రి సమయంలో గవర్నర్ హౌస్ ఆవరణలోనే అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ గురువారం సోరేన్ లాయర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ సమయంలో ఆయన ధరించిన మతమపరమైన లాకెట్, రింగ్‌లను తీసివేయాలని ఈడీ అధికారులు కోరగా అందుకు ఆయన నిరాకరించారు. రాంచీలో సోరేన్ 12 చోట్ల 8.5 ఎకరాల విస్తీర్ణంగల స్థలాలను అక్రమంగా కలిగి ఉన్నారంటూ ఈడీ కేసుపెట్టింది. ఈ వ్యవహారంలో నగదు అక్రమ నగదు చలామణి జరిగినట్టు ఆరోపించింది.

ఝార్ఖండ్‌లో గందరగోళ పరిస్థితులు!

- ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించండి
- గవర్నర్‌ను కోరిన జేఎంఎం నేత చంపయి సోరెన్
- కూటమి ఎమ్మెల్యేలను హైదరాబాద్ తరలించే యత్నం

రాంచీ, ఫిబ్రవరి 1: ఝార్ఖండ్‌లో రాజకీయంగా గందరగోళ పరిస్థితులు కొనసాగుతున్నాయి. జేఎంఎం శాసనసభా పక్ష నేత చంపయి సోరెన్ గురువారం ఆ రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కలిశారు. హేమంత్ సోరెన్ రాజీనామా చేసిన అనంతరం ముఖ్యమంత్రి లేకపోవడంతో రాజకీయ సంక్షోభం ముదిరిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్న తమ విజ్ఞప్తిని అంగీకరించాలని కోరారు. కాగా, చంపయిను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించడంలో గవర్నర్ ఆలస్యం చేయడంతో.. జేఎంఎం నేతృత్వంలోని కూటమి ఎమ్మెల్యేలను హైదరాబాద్ తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. గురువారం సాయంత్రం 6.30 గంటల సమయంలో విమానాలు ఎగిరేందుకు అనువైన వాతావరణం లేకపోవడంతో వాటిని రద్దు చేశారు. 81 మంది సభ్యులున్న ఝార్ఖండ్ అసెంబ్లీలో జేఎంఎం కూటమికి 43 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇక మనీలాండరింగ్ కేసులో ఈడీ తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ మాజీ సీఎం హేమంత్ సోరెన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరపనున్నారు.

కోర్టు ఆదేశాలిచ్చిన గంటల్లోనే..

జ్ఞాన్‌వాపీ సెల్లార్‌లో పూజలు

వారాణసి, ఫిబ్రవరి 1: జ్ఞాన్‌వాపీ మసీదు సెల్లార్‌లోని 'వ్యాస్ కీ టెఖానా'లో ఉన్న హిందూ దేవత విగ్రహాలకు పూజలు చేసుకోవచ్చంటూ జిల్లా కోర్టు ఆదేశాలు ఇచ్చిన కొద్ది గంటల్లోనే అక్కడ ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో పూజలు చేసి లక్ష్మీదేవి, వినాయకులకు హారతి ఇచ్చారు. 31 సంవత్సరాల అనంతరం టెఖానాను పూజల కోసం తెరిచారని కాశీ విశ్వనాథ మందిర ట్రస్టు అధ్యక్షుడు నాగేంద్ర పాండే తెలిపారు.

వాళ్లు రోడ్లేయరు.. వేస్తే ఊరుకోరు!

- ధర్మవరం రోడ్లన్నీ గుంతలమయం
- మరమ్మతుల కోసం టీడీపీ నేత గోనుగుంట్ల వినతులు
- మీరు వేయకపోతే.. నేనే వేస్తానంటూ అల్టిమేటం
- పట్టించుకోని అధికారులు.. మరమ్మతులకు పూనుకున్న గోనుగుంట్ల
- అడ్డుకుని.. అరెస్టు చేసిన పోలీసులు
- అతడి అనుచరులపై పోలీసుల పిడిగుద్దులు.. ఉద్రిక్తత


డీఎస్పీ శ్రీనివాసులుతో వాగ్వాదం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల

ధర్మవరం, ఫిబ్రవరి 1: శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో ప్రధాన రోడ్లన్నీ గుంతల మయంగా మారి, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత గోనుగుంట్ల సూర్యనారాయణ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గత నెల 16న అధికారులను కలిసి రోడ్ల మరమ్మతులకు డెడ్‌లైన్ పెట్టారు. అధికారులు స్పందించకపోతే తానే మరమ్మతు పనులు చేపడతానని లిఖితపూర్వకంగా తెలిపారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో 24వ తేదీన ఎస్‌ఈని కలిశారు. వారం రోజుల్లో గుంతలు పూడ్చుతామని ఆయన హామీ ఇచ్చారు. వారం గడిచిపోవడంతో గోనుగుంట్ల స్వయంగా రోడ్ల మరమ్మతులకు పూనుకున్నారు. మెటీరియల్ తీసుకుని గురువారం ఆయన ధర్మవరం చేరుకున్నారు. డీఎస్పీ శ్రీనివాసులు నేతృత్వంలోని పోలీసులు ఆయన ప్రయత్నాలను అడ్డుకున్నారు. దీంతో గోనుగుంట్ల, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం సాగింది. కొందరు పోలీసులు గోనుగుంట్ల అనుచరులను తోసేస్తూ.. పిడిగుద్దులు కురిపించారు. గోనుగుంట్లను పోలీసులు అరెస్టు చేసి, తరలిస్తుండగా అనుచరులు అడ్డుపడ్డారు. ధర్మవరం మార్కెట్ యార్డు వద్ద అటు పోలీసులు, ఇటు గోనుగుంట్ల వర్గీయుల వాగ్వాదాలు, తోపులాటలతో రెండున్నర గంటపాటు రణరంగాన్ని తలపించింది. చివరకు గోనుగుంట్లను పోలీసులు ధర్మవరం టూటౌన్ స్టేషన్‌కు తరలించారు. శాంతిభద్రలకు విఘాతం కలిగించారంటూ.. గోనుగుంట్లతోపాటు మరో 29 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉమ్మడి కర్నూలులో.. 9 మంది అభ్యర్థులు సిద్ధం!

- ఖరారు చేసిన టీడీపీ నాయకత్వం
- జనసేన సీట్లపై ఇంకా రాని స్పష్టత

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరారైన టీడీపీ అభ్యర్థుల వివరాలు..

నియోజకవర్గం	అభ్యర్థి
కర్నూలు	టీజీ భరత్
నంద్యాల	ఎన్ఎండీ ఫరూక్
పాణ్యం	గౌరు చరితారెడ్డి
బనగానపల్లె	బీసీ జనార్దనరెడ్డి
డోన్	కోట్ల కుటుంబం
ఆళ్లగడ్డ	భూమా అఖిలప్రియ
పత్తికొండ	కేఈ శ్యాం
ఎమ్మిగనూరు	బీవీ జయనాగేశ్వరరెడ్డి
శ్రీశైలం	బుడ్డా రాజశేఖరరెడ్డి

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాలకు గాను 9 చోట్ల టీడీపీ అభ్యర్థులు ఖరారయ్యారు. అధికారికంగా ప్రకటించకపోయినా ఈ సీట్లలో బరిలోకి దిగే అభ్యర్థులపై ఆ పార్టీలో స్పష్టత వచ్చినట్లు సమాచారం. సామాజిక సమీకరణలు, విజయావకాశాలు, స్థానికంగా ఉన్న పట్టు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆ పార్టీ నాయకత్వం వీరిని ఖరారు చేసినట్లు తెలుస్తోంది. మిగిలిన ఐదు సీట్లపై కసరత్తు నడుస్తోంది. గట్టి అభ్యర్థులను ఎంపిక చేయడానికి ఆ పార్టీ సర్వేలు నిర్వహిస్తోంది. దీంతోపాటు కొన్ని చోట్ల కొత్త అభ్యర్థుల పేర్లు కూడా పరిశీలనకు వస్తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు లోక్‌సభ స్థానాలు.. కర్నూలు, నంద్యాల ఉన్నాయి. వీటి పరిధిలోని 14 అసెంబ్లీ సీట్లలో కర్నూలు, నంద్యాల, పాణ్యం, బనగానపల్లె, ఆళ్లగడ్డ, శ్రీశైలం, డోన్, పత్తికొండ, ఎమ్మిగనూరు సీట్లలో టీడీపీ నిలిపే అభ్యర్థులు దాదాపు ఖాయమయ్యారు. ఇంకా నందికొట్కూరు (ఎస్సీ), కోడుమూరు(ఎస్సీ), ఆదోని, ఆలూరు, మంత్రాలయం సీట్లపై నిర్ణయం జరగాల్సి ఉంది. నందికొట్కూరులో జయరాజు, జయసింహ, కాకర్లవాడ వెంకట స్వామి పోటీలో ఉన్నారు. మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య కుటుంబానికి చెందిన కొప్పుల లావణ్య తాజాగా రేసులోకి వచ్చారు. ఆమె భర్త టీడీపీలో చురుగ్గా పనిచేస్తున్నారు. ఈ నియోజకవర్గ బాధ్యతలు చూస్తున్న పార్టీ నేత మాండ్ర శివానంద రెడ్డి ఇటీవల ఈ నియోజకవర్గానికి ఓ అభ్యర్థి పేరు బహిరంగంగా ప్రకటించారు. కానీ పార్టీ వర్గాలు మాత్రం అధిష్ఠానం కసరత్తు ఇంకా కొలిక్కి రాలేదని అంటున్నాయి. ఇక్కడి సిటింగ్ ఎమ్మెల్యే ఆర్థర్‌కు వైసీపీ టికెట్ నిరాకరించింది. ఆయన టీడీపీ నేతలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కోడుమూరులో కూడా ముగ్గురు రేసులో ఉన్నారు. ప్రస్తుత ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్ కోట్ల వర్గానికి సన్నిహితుడు. విష్ణువర్ధన్‌రెడ్డి వర్గం నుంచి దస్తగిరితో కిరణ్మయి అనే మహిళా నేత కూడా ఈ టికెట్ ఆశిస్తున్నారు. ఈ నియోజకవర్గంపైనా టీడీపీ నాయకత్వం తుది నిర్ణయానికి రాలేదు. ఆదోని సీటుకు ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు ఉన్నారు. ఆయనతోపాటు పార్టీ నేతలు కృష్ణమ్మ, శ్రీకాంత్‌రెడ్డి, మధిర భాస్కరరెడ్డి కూడా ఆశిస్తున్నారు. అంతర్గత సర్వేల్లో మీనాక్షినాయుడి వైపే మొగ్గ కనిపిస్తున్నా.. ఇతర కోణాలను కూడా పరిశీలించేందుకు నాయకత్వం నిర్ణయాన్ని పెండింగ్‌లో పెట్టింది. ఆలూరుకు మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాత ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆమె కుటుంబానికి డోన్‌లో అవకాశం ఇస్తుండడంతో ఇక్కడి రేసు నుంచి ఆమె వైదొలిగారు. పార్టీ నేతలు వీరభద్ర గౌడ్, వైకుంఠం జ్యోతి, వైకుంఠం మల్లికార్జున ఇక్కడ పరిశీలనలో ఉన్నారు. ఇక్కడి ఎంపికను ఆదోని అభ్యర్థి ఎంపిక ప్రభావితం చేసే అవకాశాలు ఉన్నాయి. మంత్రాలయానికి ప్రస్తుతం తిక్కారెడ్డి ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆయనతోపాటు మాధవరం రామచేంద్ర పేరు కూడా పరిశీలనలో ఉంది. సర్వే ఫలితాలను బట్టి ఇక్కడ నిర్ణయం జరుగుతుందని అంటున్నారు. డోన్ సీటును కోట్ల కుటుంబానికి ఇవ్వాలని టీడీపీ నాయకత్వం ప్రాథమికంగా ఒక నిర్ణయానికి వచ్చింది. కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి గత ఎన్నికల్లో కర్నూలు ఎంపీ సీటుకు పోటీ చేసి ఓడిపోయారు. ఈసారి ఈ స్థానాన్ని బీసీ వర్గాలకు ఇవ్వాలని నిర్ణయించడంతో.. ప్రత్యామ్నాయంగా ఆ కుటుంబానికి డోన్ అసెంబ్లీ సీటు ఇస్తున్నారు.

ఎంపీ సీట్లకు పోటీ..

కర్నూలు, నంద్యాల ఎంపీ సీట్లలో టీడీపీ అభ్యర్థుల ఎంపిక ఇంకా పూర్తి కాలేదు. కర్నూలుకు బీసీ నేతలు బస్తీ నాగరాజు, డాక్టర్ పార్థసారథి పేర్లు వినిపిస్తున్నాయి. తాజాగా వైసీపీ సిటింగ్ ఎంపీ సంజీవ్‌కుమార్ పేరును కొందరు స్థానిక టీడీపీ నేతలు ప్రతిపాదించారు. నంద్యాల ఎంపీ సీటుకు బైరెడ్డి శబరి, మాండ్ర శివానందరెడ్డి, కేవీ సుబ్బారెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. ఇక ఉమ్మడి జిల్లాలో జనసేన సీట్ల విషయంలో స్పష్టత రాలేదు. ఆళ్లగడ్డ, ఆదోని సీట్లు ఆశిస్తున్నా.. వారు అక్కడ అంత బలంగా లేరన్న అభిప్రాయం టీడీపీ వర్గాల్లో ఉంది. రెండు పార్టీల మధ్య చర్చలు పూర్తయితే ఈ విషయం ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

లోకం తీరు



తేలని మంత్రుల భవిత..!

- అభ్యర్థులను ఖరారు చేయకుండా ఎన్నికల ప్రచారానికి సీఎం జగన్

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయడంపై మంత్రుల భవిత ఇంకా తేలలేదు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాలకు పూర్తిస్థాయిలో అభ్యర్థులను ప్రకటించకుండానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి సిద్ధం కావడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. మంత్రులు గుడివాడ అమర్నాథ్, ఆర్కే రోజా, పినిపె విశ్వరూప్, ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, బూడి ముత్యాలనాయుడు, కొట్టు సత్యనారాయణ, అంబటి రాంబాబు, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, దాడిశెట్టి రాజా, పీడిక రాజన్నదొర అభ్యర్థిత్వాలను ఇంకా జగన్ ఖరారు చేయలేదు. గుమ్మనూరు జయరాంను కర్నూలు ఎంపీగా ప్రకటించినా ఆయన అందుకు సంసిద్ధతను వ్యక్తం చేయలేదు. సర్వే నివేదికల ఆధారంగా అసెంబ్లీ ఇన్‌చార్జీలను ప్రకటిస్తానని సీఎం జగన్ పదే పదే చెబుతూ వస్తున్నారు. ఇప్పటికే మంత్రులు మేరుగ నాగార్జున, తానేటి వనిత, ఆదిమూలపు సురేశ్, ఉషశ్రీ చరణ్, జోగి రమేశ్‌లకు సిట్టింగ్ స్థానాల్లో కాకుండా కొత్త నియోజకవర్గాలకు బదిలీ చేశారు. దీంతో ఈ మంత్రులకు తాము పోటీ చేస్తామన్న విశ్వాసం కలిగింది. కాని మిగిలిన మంత్రుల విషయంలో టికెట్లను ఖరారు చేయకపోడంతో వారిలో ఆందోళన కనిపిస్తోంది. అనకాపల్లి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న గుడివాడ అమర్నాథ్ విషయం ఎటూ తేలలేదు. నగరి ఎమ్మెల్యే ఆర్కే రోజాకు ఈసారి సీటు దక్కుతుందో లేదోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ విషయంలోనూ సందిగ్ధం నెలకొంది. ఇక కీలక మంత్రులు గోవర్ధన్‌రెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పీడిక రాజన్న దొర వంటి వారి విషయంలోనూ వైసీపీ అధినేత ఎటూ తేల్చలేదు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావుకూ సీటు వస్తుందో లేదోనన్న సందేహాలు నెలకొన్నాయి. అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాంకు సీటు సందేహాస్పదంగా మారింది.


శ్రీశైలం ఆలయం ఎదుట లోకేశ్ దంపతులు

మల్లన్న సన్నిధిలో లోకేశ్

- కుటుంబ సభ్యులతో కలసి ప్రత్యేక పూజలు

శ్రీశైలం, ఫిబ్రవరి 1: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ దంపతులు కుమారుడు దేవాన్ష్‌తో కలసి గురువారం దర్శించుకున్నారు. హైదరాబాద్ నుంచి ఉదయం ప్రత్యేక హెలికాప్టర్‌లో సున్నిపెంటకు చేరుకున్న వారికి మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిలు బీసీ జనార్దన్‌రెడ్డి, భూమా అఖిలప్రియ తదితరులు స్వాగతం పలికారు. రోడ్డు మార్గాన లోకేశ్ దంపతులు సాక్షిగణపతి ఆలయం చేరుకొని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శ్రీశైలం ప్రధానాలయం రాజగోపురం వద్ద ఆలయ అధికారులు, అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో రత్నగర్భ గణపతిని దర్శించుకున్న లోకేశ్.. మల్లికార్జున స్వామివారికి అభిషేకం, భ్రమరాంబికా దేవికి కుంకుమార్చన జరిపించారు. ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో లోకేశ్ దంపతులకు వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం లోకేశ్ శ్రీశైలం నుంచి సున్నిపెంట హెలిప్యాడ్‌కు చేరుకుని అక్కడినుంచి హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు.

విజయవాడ పశ్చిమ సీటు.. లేదా అనకాపల్లి ఎంపీ స్థానం ఇవ్వండి: బుద్దా వెంకన్న


విజయవాడ వన్‌టౌన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బుద్దా వెంకన్న

విజయవాడ(వన్‌టౌన్), ఫిబ్రవరి 1: విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి గానీ, లేదా అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గం నుంచి గానీ పోటీ చేయడానికి తనకు టికెట్ ఇవ్వాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి బుద్దా వెంకన్న విజ్ఞప్తి చేశారు. పొత్తు ఉన్నా సరే తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని అటు పార్టీ అధినేత చంద్రబాబును, ఇటు జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌ను కోరారు. ఈ మేరకు చంద్రబాబుకు అందజేయనున్న దరఖాస్తును దుర్గమ్మ ఆశీస్సులు కోరుతూ కనకదుర్గమ్మ పాదాల చెంత ఉంచారు. గురువారం తన ఇంటి నుంచి కనకదుర్గ గుడి వరకు అనుచరులు, పార్టీ క్యాడర్‌తో ఆయన భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు తనకు దైవంతో సమానమని, ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా శిరసావహిస్తానని తెలిపారు. అయితే తనకు సీటు రాలేదని చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లను విమర్శించిన వారి తాట తీస్తానని హెచ్చరించారు. కేశినేని నాని అనే కుక్కకు బుద్ధి చెప్పడానికే ఈ ర్యాలీ నిర్వహించినట్టు చెప్పారు.

వీసా ఫీజులను భారీగా పెంచిన అమెరికా

వాషింగ్టన్, ఫిబ్రవరి 1: అమెరికాలోని బైడెన్ ప్రభుత్వం బుధవారం నాన్-ఇమిగ్రెంట్ వీసా ఫీజులను భారీగా పెంచింది. 2016 తరువాత వీసా ఫీజులు పెంచడం ఇదే ప్రథమం. ఏప్రిల్ 1 నుంచి ఇవి అమల్లోకి వస్తాయి. భారతీయులకు అత్యంత ఉపయోగకరంగా ఉండే హెచ్-1బీ, ఎల్-1, ఈబీ-5 వీసాల రుసుములు గణనీయంగా పెరిగాయి. హెచ్-1బీ వీసాల కోసం ఉద్దేశించిన ఫారం 1-129 ఫీజు 460 డాలర్ల (రూ.38,150) నుంచి 780 డాలర్ల (రూ.64,690)కు పెరిగింది. హెచ్-1బీ వీసాల రిజిస్ట్రేషన్ రుసుము 10 డాలర్ల (రూ.830) నుంచి 215 డాలర్ల (రూ.17,830)కు పెంచారు. ఈ నిర్ణయం మాత్రం వచ్చే ఏడాది నుంచి అమల్లోకి వస్తుంది. బహుళ జాతి కంపెనీ ఉద్యోగుల బదిలీకి ఉద్దేశించిన ఎల్-1 వీసాల రుసుములు 460 డాలర్ల (రూ.38,150) నుంచి 1,385 డాలర్ల (రూ.1,14,860)కు పెరిగాయి. మరికొన్ని రకాల వీసాల ఫీజులు మాత్రం స్వల్పంగా తగ్గాయి.

అసంబద్ధంగా.. 'సిద్ధం'

(మొదటి పేజీ తరువాయి)



ఏలూరు నగరం ప్రధాన రహదారి డివైడర్‌లో ఉన్న చెట్లను నరికేసిన దృశ్యం

నిప్పులు చెరుగుతున్నారు. ఏలూరు రూరల్ మండలం పాలగూడెం వద్ద 'సిద్ధం' పేరుతో సీఎం జగన్ బహిరంగ సభ కోసం వైసీపీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం జరగనున్న ఆ సభ ఏర్పాట్లను జిల్లా ఉన్నతాధికారులతో పాటు మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఆళ్లనాని, అబ్బయ్య చౌదరి తదితర నేతలు పర్యవేక్షిస్తున్నారు. సభ ఏర్పాట్ల నిమిత్తం ఏలూరు నగరంలోని ప్రతి రహదారిపైనా చిన్నా, పెద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. జూట్ మిల్ నుంచి వసంత మహల్ సెంటర్ వరకు సెంట్రల్ డివైడర్లలో నాయకులు ఫెక్సీలు పెట్టించారు. ఆ ఫ్లెక్సీలకు అడ్డుగా ఉన్నాయన్న కారణంతో డివైడర్లలో ఏపుగా పెరిగిన పచ్చని చెట్లను నరికించేశారు. ఇదిలావుంటే, జాతీయ రహదారి సమీపంలో ఉన్న ఓ రియల్ ఎస్టేట్ సంస్థకు చెందిన స్థలంలో ఏర్పాటు చేస్తున్న ఈ సభకు వెళ్లాలంటే స్థానిక సీతంపేట కెనాల్‌ను దాటాలి. అయితే.. దీనిని దాటేందుకు వీలు లేక పోవడంతో ఏకంగా సదరు కెనాల్‌నే నాయకులు, అధికారులు దగ్గరుండి పూడ్చేయించారు. దెందులూరులోని 1600, మల్కాపురం గ్రామంలోని 600 ఎకరాలు వెరసి 2,200 ఎకరాలకు ఆ కెనాల్ నుంచి నీరందుతోంది. ఇలాంటి కెనాల్‌ను పూడ్చేందుకు ఎవరూ అనుమతించరు. అయినప్పటికీ.. అడ్డగోలుగా వైసీపీ నాయకులు కీలకమైన కెనాల్‌ను పూడ్చేయించారు. పైగా.. సభ పూర్తికాగానే తిరిగి బాగు చేయిస్తామని చెబుతున్నారు. కానీ.. సభ అయిపోయిన తర్వాత ఎవరి దారిలో వారు వెళ్లిపోతారని.. తమ గోడు వినే వారు ఎవరూ ఉండరని.. వారి మాటలు ఎవరు నమ్ముతారని, ఈ నీటిపై ఆధారపడి సాగు చేస్తున్న అన్నదాతలు గగ్గోలు పెడుతున్నారు.

విశాఖపై జగన్ ప్రేమ ఇదేనా?

(మొదటి పేజీ తరువాయి)

తీసుకు రాలేకపోతున్నారని వైసీపీ నాయకులు ఎదురుదాడి చేస్తున్నారు. దీనికి సంబంధించిన డీపీఆర్ కూడా ఇంకా ఆమోదించలేదని ఆరోపిస్తున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం భూములు ఇవ్వకపోవడం వల్లే జోన్ పనులు ప్రారంభించలేకపోతున్నామని రైల్వే మంత్రి స్పష్టంచేశారు. నిరుడు డిసెంబరు 10న.. మంత్రి అశ్వినీ వైష్ణవ్ విశాఖ వచ్చినప్పుడు ఇక్కడి విలేకరులు రైల్వేజోన్‌పై ప్రశ్నించారు. ప్రభుత్వం వారం రోజుల్లో భూమి ఇస్తే ఆ మరుసటిరోజే నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తామని ఆయన ప్రకటించారు. ఆ సమయంలో అక్కడే ఉన్న జిల్లా కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ.. వారం రోజుల్లో భూములు అప్పగిస్తామని హామీ ఇచ్చారు. ఆ మాట చెప్పి ఈ నెల 9వ తేదీకి రెండు నెలలవుతుంది. కానీ ఇప్పటికీ రైల్వేకు అప్పగించలేదు. రాష్ట్రంలో జగన్ సీఎం అయ్యాక విశాఖలో వైసీపీ నాయకులు ఆక్రమించిన, బెదిరించి లాక్కున్న భూముల్లో రైల్వే జోన్‌కు ఇవ్వాల్సిన భూమి (53 ఎకరాలు) పదో వంతు కూడా ఉండదు. రైల్వేజోన్‌ను రూ.170 కోట్లతో నిర్మిస్తామంటే 53 ఎకరాలు ఇవ్వడానికి జగన్‌కు చేతులు రావడం లేదు. కేంద్రం చెబితే తప్ప ప్రజలకు ఈ విషయం తెలియలేదు.

రైల్వే జోన్‌కు.. జగన్ ప్రభుత్వం భూమి ఇవ్వలేదు

- 53 ఎకరాలు ఇవ్వాల్సి ఉంది
- డీపీఆర్ ఆమోదం పొందింది
- భూకేటాయింపే మిగిలింది
- ఏపీ రైల్వే ప్రాజెక్టులకు 9,138 కోట్లు
- రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటుకు జగన్ ప్రభుత్వం ఇప్పటివరకూ భూమి కేటాయించలేదని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు. జోన్ ఏర్పాటుకు తమ శాఖకు 53 ఎకరాలు కేటాయించాల్సి ఉందన్నారు. దీనిపై జగన్ ప్రభుత్వాన్ని అడగాలని మీడియాకు సూచించారు. రైల్వే జోన్ ఏర్పాటుకు సంబంధించి డీపీఆర్‌కు ఆమోదం లభించిందని, జగన్ ప్రభుత్వం భూమిని కేటాయించడమే మిగిలి ఉందన్నారు. గురువారమిక్కడ రైల్ భవన్‌లో మంత్రి విలేకరులతో మాట్లాడారు. ఏపీకి 2024-25లో రూ.9,138 కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలో రైల్వే ట్రాకుల విద్యుదీకరణ 97 శాతం పూర్తయిందని.. గత పదేళ్లలో 709 రైల్వే ఫ్లై-ఓవర్‌లు, అండర్ బ్రిడ్జిలను నిర్మించినట్లు తెలిపారు. ఏటా సగటున 246 కిలోమీటర్ల మేర నూతన రైల్వే ట్రాకులను నిర్మిస్తున్నామన్నారు. 33 ప్రాజెక్టులకు సంబంధించి రూ.68,059 కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని.. 72 రైల్వేస్టేషన్లను అమృత్ స్టేషన్లుగా ఆధునికీకరిస్తున్నట్లు చెప్పారు.

తెలంగాణకు 5,071 కోట్లు

2009-14 మధ్యకాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సగటున ఏడాదికి రూ.886 కోట్లు కేటాయిస్తే.. 2024-25 ఏడాదికి తెలంగాణ రాష్ట్రానికి రూ.5,071 కోట్లు కేంద్రం కేటాయించినట్లు వైష్ణవ్ తెలిపారు. తెలంగాణలో రైల్వే విద్యుదీకరణ 100 శాతం పూర్తయిందని.. ఏటా 142 కిలోమీటర్ల మేర నూతన రైల్వే ట్రాకులను నిర్మిస్తున్నట్లు చెప్పారు. 14 ప్రాజెక్టులకు సంబంధించి రూ.31,221 కోట్ల విలువైన ట్రాకుల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. అమృత్ స్టేషన్ల కింద 40 రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నట్లు చెప్పారు. గత పదేళ్లలో రాష్ట్రంలో 414 రైల్వే ఫ్లై-ఓవర్‌లు, అండర్ బ్రిడ్జిలను నిర్మించినట్లు తెలిపారు.

సజ్జల ఖాతాలోకి 140 కోట్లు

- మొత్తం సలహాదారులకు ముట్టజెప్పింది 680 కోట్లు: నాదెండ్ల




అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం సలహాదారులకు పెట్టిన ఖర్చు రూ.680 కోట్లని జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. గురువారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సలహాదారుల్లో అత్యధికంగా సజ్జల రామకృష్ణారెడ్డికే రూ.140 కోట్లు ముట్టజెప్పారని అన్నారు. ఇంత భారీగా ప్రజాధనాన్ని వెచ్చించి ఏర్పాటు చేసుకున్న ప్రభుత్వ సలహాదారులు ఈ ప్రభుత్వానికి ఇచ్చిన సలహాలు ఏమిటో చెప్పాలని సీఎం జగన్‌ను డిమాండ్ చేశారు. ఆ సలహాల వల్ల తీసుకున్న నిర్ణయాలు, వాటి వల్ల అందిన అభివృద్ధి ఫలాలు, అసలు ఎవరికి ఎంత ఖర్చు చేశారో అసెంబ్లీ వేదికగా వెల్లడించాలన్నారు. సలహాదారుల వివరాలను ప్రభుత్వం అత్యంత రహస్యంగా ఎందుకు ఉంచుతోందో కూడా బయటపెట్టాలన్నారు. ముఖ్యమంత్రికి తన ప్రభుత్వంలో ఎంత మంది సలహాదారులున్నారో, వారి పేర్లు ఏవిటో కూడా తెలియదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వంలో సుమారు 89 మంది సలహాదారులను నియమించారని, ఏ అర్హతా లేకుండా నియమించిన ఈ సలహాదారుల విషయంలో గతంలోనే కోర్టు మొట్టికాయలు వేసిందని గుర్తు చేశారు. ప్రభుత్వంలో ఎంతో మంది సీనియర్ అధికారులు, మంత్రులు ఉన్నారని, వారి సేవలను సంపూర్ణంగా వినియోగించుకుంటే సరిపోతుందని అన్నారు. కానీ, వారిని పక్కన పెట్టి సమాంతర పాలన తీసుకువచ్చేందుకు రూ.680 కోట్లు వెచ్చించడం అంటే సాధారణ విషయం కాదన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని, అసలేం జరిగిందో ప్రజలకు తెలిజేయాలని మనోహర్ డిమాండ్ చేశారు.

బడ్జెట్ బాగుంది

కేంద్రం ప్రవేశ పెట్టిన 2024-25 మధ్యంతర బడ్జెట్ బాగుందని నాదెండ్ల మనోహర్ అన్నారు. భావి భారతాన్ని ఆవిష్కృతం చేసిందన్నారు. స్టార్టప్‌లకు రూ.లక్ష కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు, 50 ఏళ్లపాటు వడ్డీ లేని రుణాలు వినియోగించుకునేలా తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. ప్రధాని ఆవాస్ యోజన కింద 2 కోట్ల ఇళ్లను నిర్మిస్తామని చెప్పడం మంచి నిర్ణయమన్నారు. కేంద్ర బడ్జెట్‌ను జనసేన పార్టీ స్వాగతిస్తోందని చెప్పారు.

ఎన్నికల శంఖారావం పూరించిన బీజేపీ

- భీమవరంలో కార్యాలయాన్ని ప్రారంభించిన పురందేశ్వరి


భీమవరంలో విల్లును ఎక్కుపెట్టిన పురందేశ్వరి

అమరావతి, భీమవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఏపీలో కమలం పార్టీ ఎన్నికల శంఖారావం పూరించింది. రాష్ట్రంలోని పాతిక పార్లమెంటు నియోజక వర్గాల కేంద్రాల్లో బీజేపీ కార్యాలయాలను ప్రారంభించింది. అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి స్వయంగా భీమవరంలో ప్రత్యేక పూజలు చేసి నర్సాపురం పార్లమెంటు పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. మిగతా ప్రాంతాల్లో పార్టీ నేతలు, శ్రేణులు పాల్గొనగా అధ్యక్షురాలు వర్చువల్‌గా వీక్షించారు. అనంతరం శంఖం పూరించిన ఆమె 'ఎన్నికల నగారా మోగించాం' అని ప్రకటించారు. 'ప్రశ్నించిన వారిపై అట్రాసిటీ కేసులు పెట్టి, జైలుకు పంపే అధికార వైసీపీకి రాష్ట్రంలో సామాజిక సాధికార యాత్ర చేసే నైతిక హక్కు లేదు. విద్వేషపూరిత పాలన సాగిస్తున్న వైసీపీని సాగనంపాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉంది' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పిలుపునిచ్చారు. 'వైసీపీ అధికారంలోకి రాగానే ప్రజావేదికను కూల్చడంతో విధ్వంసకర, ప్రజాకంటక పాలనను తెచ్చింది. ఇప్పుడది విద్వేషపూరిత పాలనగా మారింది. రాజధాని నిర్మాణానికి డీపీఆర్ ఇవ్వకముందే కేంద్రం రూ.2,500 కోట్లు ఇచ్చింది. ప్రస్తుతం తల లేని మొండెంలా రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ మిగిలిపోయింది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేమని గత టీడీపీ ప్రభుత్వానికి చెప్పిన తరువాతే కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ ఇచ్చింది. ఇప్పుడు కాంగ్రెస్ నేత షర్మిల ప్రత్యేక హోదా కోసం పోరాడాలని అంటున్నారు. ఈ విషయంలో టీడీపీ, వైసీపీ కూడా బీజేపీపై నిందలు వేయడం సరికాదు. కేంద్ర ప్రభుత్వ పథకాలను బీజేపీ కార్యకర్తలందరూ ఈ నెల 9 నుంచి ప్రారంభమయ్యే 'పల్లెకు పోదాం'లో ప్రజలందరికి వివరించాలి' అని పురందేశ్వరి అన్నారు. పార్టీని రాష్ట్రంలో బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం శ్రమించాలని పిలుపునిచ్చారు.



గుడ్లూరు మండలం కమ్మపాలెంలోని పువ్వాడి చిన్న వెంకయ్య కుటుంబానికి చెక్కు అందజేస్తున్న భువనేశ్వరి

కార్యకర్తలే టీడీపీకి బలం

- ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించండి
- శ్రేణులు, ప్రజలకు నారా భువనేశ్వరి పిలుపు
- నెల్లూరు జిల్లాలో కొనసాగిన 'నిజం గెలవాలి'
- బాబు అక్రమ అరెస్టుతో మరణించిన వారి కుటుంబాలను పరామర్శించిన భువనేశ్వరి

నెల్లూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు, అభిమానులే తెలుగుదేశం పార్టీకి బలమని, వీరిని కాపాడుకోవడానికి చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని ఆయన సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. 'నిజం గెలవాలి' యాత్రలో భాగంగా రెండోరోజు గురువారం నెల్లూరు జిల్లా కందుకూరు, ఉదయగిరి, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల్లో పర్యటించిన ఆమెకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు బ్రహ్మరథం పట్టారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక మరణించినవారి కుటుంబాలను ఆమె పరామర్శించారు. కందుకూరు నియోజకవర్గం గుడ్లూరులో కర్పూరపు సుబ్రహ్మణ్యం, పువ్వాడిలో చిన్నవెంకటయ్య, దర్కానిపాడు గ్రామంలో దగ్గుమాటి వెంకటేశ్వర్లు, ఉదయగిరి నియోజకవర్గం కొండాపురం మండలం కొమ్మి గ్రామంలో తాటిపర్తి సుధాకర్, నెల్లూరు నగరం, రూరల్ నియోజకవర్గానికి చెందిన రేగల వెంకయ్య, పూల సుబ్బారావు కుటుంబాలను ఓదార్చి, ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. బాధిత కుటుంబాల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు టీడీపీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అబ్దుల్ అజీజ్, ఇంటూరి నాగేశ్వరరావు, బొల్లినేని వెంకటరామారావు, పోలంరెడ్డి దినేశ్‌రెడ్డి, ఇతర నేతలు పాల్గొన్నారు. సాయంత్రం 7గంటలకు భువనేశ్వరి జొన్నవాడలో కామాక్షితాయి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉత్సాహంగా 'విజ్ఞాన్ మహోత్సవ్' ప్రారంభం



వేడుకల్లో పాల్గొన్న రఘు కుంచె, పద్మశ్రీ గడ్డం సమ్మయ్య, డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 1: యువతలో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీయడమే లక్ష్యంగా విజ్ఞాన్ వర్సిటీ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే విజ్ఞాన్ మహోత్సవ్ గురువారం గుంటూరు సమీపంలోని వడ్లమూడిలో అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి చిందు యక్షగాన కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంత కళ అయిన చిందు యక్షగానం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి మార్పునకు శ్రీకారం చుట్టినట్టు పేర్కొన్నారు. యువత చదువుకే పరిమితం కాకుండా యోగా, సంగీతం, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో ముందు వరుసలో ఉండాలని సూచించారు. సంగీత దర్శకులు రఘు కుంచె మాట్లాడుతూ యువతలో అంతర్లీనంగా సృజనాత్మక శక్తులు ఉంటాయని, ఈ సృజనాత్మకతను వెలికి తీయడానికే ఈ మహోత్సవాలన్నారు. చదువు అంటే పుస్తకాలు ఒక్కటే కాదని, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా పాఠ్యాంశాలేనన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ విజ్ఞాన్ యూనివర్సిటీ గడిచిన 20 సంవత్సరాల నుంచి విజ్ఞాన్ మహోత్సవాన్ని నిర్విరామంగా నిర్వహిస్తోందని తెలియజేశారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మా ఇలాకాలో టీడీపీ కార్యక్రమాలు చేస్తే నరుకుతాం!

- టీడీపీ బూత్ కన్వీనర్‌పై వైసీపీ సర్పంచ్ అరాచకం
- శ్రీసత్యసాయి జిల్లాలో అధికార పార్టీ నేతల జులుం



శ్రీసత్యసాయిజిల్లా వైసీపీ నేతల దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్త శివయ్య

బత్తలపల్లి, ఫిబ్రవరి 1: "ఏమి రా.. టీడీపీ తరఫున తిరిగేంత మగాడివా రా?. మా ఇలాకాలో టీడీపీ కార్యక్రమాలు చేస్తే నరుకుతాం" అంటూ శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం తంబాపురం గ్రామానికి చెందిన టీడీపీ బూత్ కన్వీనర్ శివయ్యపై వైసీపీ సర్పంచ్ జయచంద్రారెడ్డి రెచ్చిపోయారు. సోదరులతో కలిసి నడి గ్రామంలో విచక్షణారహితంగా దాడి చేశారు. టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి నారాయణస్వామితో కలిసి శివయ్య గురువారం తంబాపురంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. విషయం తెలుసుకున్న వైసీపీ మద్దతుదారు, గ్రామ సర్పంచ్ జయచంద్రారెడ్డి తన సోదరులు వీరారెడ్డి, కృష్ణారెడ్డితో కలిసి అక్కడికి చేరుకున్నారు. వచ్చీరాగానే శివయ్యను కులం పేరుతో దూషిస్తూ- గ్రామంలో అందరూ చూస్తుండగానే కర్రలతో శివయ్యపై దాడి చేశారు. సెల్‌ఫోన్ లాక్కున్నారు. "మా ఇలాకాలో టీడీపీ కార్యక్రమాలు చేస్తే నరుకుతాం" అని బెదిరించారు. స్థానికులు అడ్డుపడి, సర్దిచెప్పి వైసీపీ నాయకులను అక్కడి నుంచి పంపించేశారు. గాయపడిన శివయ్యను కుటుంబ సభ్యులు బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, తెలుగు రైతు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జగ్గు, తెలుగు యువత నేత తాళ్లూరు సతీశ్ తదితరులు శివయ్యను పరామర్శించారు. అనంతరం శివయ్యను బత్తలపల్లి పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేయించారు. గిరిజనుడైన శివయ్యపై దాడి చేయడం హేయమైన చర్య అని టీడీపీ నేతలు మండిపడ్డారు.

పార్టీ మారితే డబ్బులు కక్కిస్తా!

- వెళ్లాలనుకుంటే పదవి వదిలేసి పోండి
- వైసీపీ కౌన్సిలర్ భర్తకు గురజాల ఎమ్మెల్యే బెదిరింపు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 1: "ఉంటే పార్టీలో ఉండు. సాయంత్రం గురజాల మీటింగ్‌కు రా! లేదంటే పదవులకు రాజీనామా చేసి వెళ్లు" అని గురజాల నగర పంచాయతీ 12వ వార్డు వైసీపీ కౌన్సిలర్ మహంకాళి అనిత భర్త నీలంరాజుకు గురజాల ఎమ్మెల్యే కాసు మహేశ్ రెడ్డి ఫోన్‌లో హూంకరించారు. అంతేకాదు, "కొందరు నీకు కౌన్సిలర్ సీటు వద్దన్నా ఇప్పించా. లక్షల రూపాయలు నీకిచ్చా. అవన్నీ కాదనుకుంటే పదవులకు రాజీనామా చేసి ఎంపీ మాదిరిగా వెళ్లు. కాదు కూడదంటే సాయంత్రంలోగా డబ్బులు కక్కిస్తా" అని ఎమ్మెల్యే బెదిరించినట్టు నీలంరాజు గురువారం మీడియాకు తెలిపారు. "నువ్వు ఒక్కడివి పోతే మరో 10 మంది కార్యకర్తలు వస్తారు" అని అన్నట్టు చెప్పారు. వైసీపీ ద్వారా సీటు ఇచ్చి డబ్బులు ఖర్చుచేసి గెలిపిస్తే ఆటలాడుతున్నావా? అని గద్దించారని, నీతో ఎలా ఆటలాడాలో మాకు తెలుసని అన్నారని నీలంరాజు వాపోయారు. గురజాలలో కొంత కాలం క్రితం ఫ్లెక్సీలు కట్టే విషయంలో ఏర్పడిన వివాదంతో నీలంరాజు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. జనవరి 23న నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయులకు మద్దతుగా పార్టీకి రాజీనామా చేశారు. అప్పటి నుంచి పార్టీ శ్రేణులు కొందరు అడపాదడపా బెదిరిస్తూనే ఉన్నారని నీలంరాజు తెలిపారు. బీసీ వడ్డెర సామాజిక వర్గానికి చెందిన తనను బెదిరించడం ఎంతవరకు సమంజసమని నీలంరాజు ఆవేదన వ్యక్తం చేశారు.

బెదిరించలేదు.. మందలించాను: ఎమ్మెల్యే

నీలంరాజు తాను బెదిరించలేదని, కేవలం మందలించానని ఎమ్మెల్యే కాసు మహేశ్‌రెడ్డి తెలిపారు. పార్టీ సీటిచ్చి లక్షలు ఖర్చుచేసి గెలిపిస్తే ఇష్టమొచ్చినట్లు పార్టీ మారాలనుకుంటే అది వారిష్టమని అన్నారు. అయితే, పార్టీ ద్వారా వచ్చిన పదవులకు కూడా రాజీనామా చేసి వెళ్లాలని మందలించానన్నారు. "అవును మందలించాను. మందలిస్తాను కూడా. పార్టీ ఎన్నో ఆశలు పెట్టుకొని సీటిస్తే గెలిచాక పార్టీ మారాలనుకుంటే రాజీనామా చేసి వెళ్లాలి. కానీ, పదవిలో కొనసాగుతామంటే ఎలా కుదురుతుంది" అని అన్నారు.

ఎలక్షన్ వేళ కరెన్సీ మేళా!

- రాష్ట్రంలో ఒకేరోజు రూ.12 కోట్లు పట్టివేత
- భీమవరంలో 6 కేజీల బంగారం స్వాధీనం

నెల్లూరు (క్రైం), భీమవరం (క్రైం), గూడూరు, ఫిబ్రవరి 1 : రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ డబ్బు కట్టలు తెగుతున్నాయి. వందలు కాదు.. వేలు కాదు.. లక్షలు కాదు.. కోట్ల రూపాయల నగదు ఒక్క గురువారమే మూడు జిల్లాల్లో పట్టుబడింది. నెల్లూరులో 7.23 కోట్లు, తిరుపతిలో రూ..5.12కోట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఆరు కేజీల బంగారం పట్టుబడింది. నెల్లూరులో వేర్వేరు ఘటనల్లో గుర్తించిన భారీ డబ్బు కట్టలను లెక్కించడానికే పోలీసులకు గంటల సమయం పట్టింది. నెల్లూరు సిటీ పరిధిలోని నవాబుపేట, వెంకటాచలం పోలీసు స్టేషన్ల పరిధిలో పోలీసులు సోదాలు జరిపారు. ఈ క్రమంలో లెక్కలు చూపని డబ్బు భారీగా పట్టుబడింది. సరైన రశీదులు లేనందున తదుపరి చర్యల నిమిత్తం ఆదాయపన్ను అధికారులకు ఆ నగదును అప్పగించారు. ఈ మేరకు నెల్లూరులోని ఉమేశ్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో నగర, రూరల్ డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, వీరాంజనేయ రెడ్డి స్వాధీనం చేసుకున్న నగదు పూర్వాపరాలను వివరించారు. వారి కథనం ప్రకారం, నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండు వద్ద నవాబుపేట సీఐ ఎమ్ బాబీ, ఎస్ఐ బి. శివప్రకాశ్ తమ సిబ్బందితో తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన రాజమహేంద్రవరానికి చెందిన లచ్చిరెడ్డి అప్పారావు, బి.పవన్, సురా దుర్గాప్రసాద్, బొబ్బిల్లి శ్రీరామ్‌కృష్ణ, కాకినాడకు చెందిన తోట తాతరావు, తోట రమేశ్, తోట సత్యవేణి, పుప్పల మణికంఠలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద బ్యాగులను పరిశీలించగా రూ.4,38,50,000 నగదు కనిపించింది. వాటికి ఎలాంటి బిల్లులు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే నవాబుపేట పోలీసులు రైల్వేస్టేషన్ తూర్పు వైపు మెయిన్ గేటు వద్ద తనిఖీ చేస్తుండగా.. కొందరు వారి కంటపడ్డారు. ఈ క్రమంలో రాజమహేంద్రవరానికి చెందిన కె.వికాస్, బి.నరసింహం, వి.సత్యనారాయణ, పి.అరవింద్‌లను అదుపులోకి తీసుకున్నారు. బిల్లులు లేని రూ.1,44,50,000 నగదును వారి వద్ద గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు.

రూ.5.12కోట్ల నగదు స్వాధీనం

సరైన పత్రాలు లేని కారణంగా రూ.5.12 కోట్లను స్వాధీనం చేసుకుని, ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తిరుపతి జిల్లా గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు ఆయన వివరాలు అందించారు. గూడూరు, చిల్లకూరు మండలాల పరిధిలో గురువారం వేకువజామున వాహనాల తనిఖీ చేపట్టారు. చిల్లకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని వరగలిక్రాస్‌రోడ్డు వద్ద పశ్చిమగోదావరికి చెందిన సాయికృష్ణ, గుంటూరుజిల్లాకు చెందిన శ్రీధర్, రవిల నుంచి రూ.3,67,41,180, గూడూరు పరిధిలోని పోటుపాళెం జంక్షన్ వద్ద గుంటూరు జిల్లాకు చెందిన లక్ష్మణరావు, ఖమ్మం జిల్లాకు చెందిన మహేష్‌కుమార్ నుంచి రూ.95,50,000, పట్టణంలోని ముత్యాలపేట వద్ద తూర్పుగోదావరి జిల్లాకు చెందిన సూర్యనారాయణమూర్తి నుంచి రూ.50లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నగదు ఆదాయ పన్నులశాఖకు అప్పగిస్తామని డీఎస్పీ తెలిపారు.

వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద....

వెంకటాచలం సీఐ బి.అంకమరావు తన సిబ్బందితో వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేపట్టారు. విజయవాడ నుంచి పుదుచ్చేరి వెళుతున్న శ్రీకృష్ణ ట్రావెల్స్ బస్సును ఆపి సోదాలు జరిపారు. ఈ తనిఖీల్లో పల్నాడు జిల్లాకు చెందిన దూదేకుల జిలాని, షేక్ దావూద్, షేక్ అర్షద్‌ల నుంచి రూ.1,40,50,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించిన రశీదులు చూపలేక పోవడంతో వారిని స్టేషన్‌కు తరలించారు. కాగా, ప్రభుత్వం కళ్లుగప్పి అక్రమ మార్గాలలో బంగారం కొనుగోలు చేసేందుకు ప్రయాణికుల ముసుగులో అధిక మొత్తంలో నగదును తరలిస్తున్నారని నెల్లూరు పోలీసులు తెలిపారు.

6 కిలోల బంగారం స్వాధీనం.. భీమవరంలో 10మంది అరెస్టు

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం టౌన్ రైల్వేస్టేషన్ రోడ్డులో బంగారం అక్రమ రవాణా చేస్తున్న పది మందిని అరెస్టు చేసి, 6 కిలోల బంగారం, 49,970 నగదు స్వాధీనం చేసుకున్నట్లు భీమవరం టూటౌన్ సీఐ జి.శ్రీనివాస్ తెలిపారు. పట్టుబడినలో తూర్పు గోదావరి జిల్లా కోరుకొండకు చెందిన చిలకల సాయి కిరణ్, చిలకల ఆనంద్, బాక్కా వీరసాయి, రాజమహేంద్రవరానికి చెందిన కోళ్ళ వెంకట కాంతారావు, వంకా వెంకటేశ్, గూన వీర వెంకటరమణ, దాసరి గణేష్, గొడ్డు పైడిరాజు, అవిడి హేమంత్ వినయ్, బండి వాసు ఉన్నారు. వీరు నెల్లూరు జిల్లా గూడూరు నుంచి రాజమండ్రికి బంగారం అక్రమ రవాణా చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గూడూరులో శేషాద్రి ఎక్స్‌ప్రెస్ ఎక్కిన వీరు.. భీమవరంలో ట్రైన్ దిగి రోడ్డు మార్గంలో రాజమండ్రి వెళ్దామనుకున్నట్లు విచారణలో వెల్లడైందని సీఐ తెలిపారు.

పశ్చిమలో ఐదుగురు బీఎల్‌వోల సస్పెన్షన్

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లాలో ఓటర్ల జాబితా తయారీలో నిర్లక్ష్యం వహించిన ఐదుగురు బీఎల్‌వోలను సస్పెండ్ చేసి, పూర్తి విచారణకు ఆదేశిస్తూ కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 29న ఇద్దరు బీఎల్వోలను సస్పెండ్ చేయగా, ఇప్పటివరకు మొత్తం ఏడుగురు బీఎల్‌వోలు సస్పెండ్ అయ్యారు.

ఇంటర్ పర్యావరణం పరీక్ష వాయిదా

అమరావతి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా అర్హత పరీక్షగా నిర్వహించే పర్యావరణ విద్య పరీక్షను ఇంటర్ విద్యామండలి అకారణంగా వాయిదా వేసింది. శనివారం జరగాల్సిన పరీక్షను ఈ నెల 23కు వాయిదా వేసినట్టు గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. కానీ ఎందుకు వాయిదా వేశారనే విషయాన్ని వెల్లడించలేదు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నేతిబీర...!

ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్లో చెప్పుకోదగ్గ మెరుపులూ లేవు, జనాకర్షక చర్యలూ లేవు. విత్త క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఆమె పలు రంగాలకు కేటాయింపులు చేశారు. దేశంలో మౌలిక వసతుల అభివృద్ధికి మోదీ ప్రభుత్వం పదేళ్లుగా ప్రాధాన్యత ఇస్తోంది కనుక, అదే ధోరణి కొనసాగిస్తూ రోడ్లు, విమానాశ్రయాలు, రైల్వే, పోర్టులు, గృహనిర్మాణ రంగాలకు కేటాయింపుల్లో పెద్ద పీట వేశారు. వివిధ మౌలిక వసతుల రంగాలపై రూ.11.11 లక్షల కోట్లు ఖర్చు చేయనున్నట్టు ప్రకటించారు.


బడ్జెట్లో మహిళలు, స్టార్టప్‌లకు కొన్ని నజరానాలు ఉన్నాయి. స్వయం సహాయక బృందాల మహిళలు ఏడాదికి కనీసం లక్ష రూపాయలు ఆర్జించుకోగల విధంగా జీవనోపాధి కార్యక్రమాలు అందుబాటులో ఉంచడం లక్ష్యంగా "లక్షాధికారి దీదీ"ల సంఖ్య రెండు నుంచి మూడు కోట్లకు పెంచనున్నట్టు ప్రకటించారు. ఆయుష్మాన్ భారత్ బీమా పథకం ప్రయోజనాలు ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు వర్తింపచేయడం వారి ఆరోగ్య సంరక్షణ దిశగా పెద్ద చర్య. మహిళల సంపూర్ణ వ్యాక్సినేషన్‌కు ప్రాధాన్యం ఇస్తున్నందున, అందులో భాగంగా 9 నుంచి 14 సంవత్సరాల మధ్యవయస్కులైన బాలికలు సెర్విక్ కేన్సర్ బారిన పడకుండా నివారించే వ్యాక్సినేషన్‌ను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. ఈ చర్యలు జనాభాలో అర్ధభాగం ఉన్న మహిళల ఆరోగ్య పరిరక్షణకు, ఆర్థిక సాధికారతకు ఉపకరిస్తాయి. స్టార్టప్‌ల రంగంలో మనదేశం అమెరికా, చైనా తర్వాత మూడో స్థానంలో ఉంది. స్టార్టప్‌లలో సావెరీన్ వెల్త్ ఫండ్, పెన్షన్ ఫండ్ సంస్థలు పెట్టే పెట్టుబడులకు సంపూర్ణ పన్ను విరామం 2025 మార్చి 31 వరకు పొడిగిస్తున్నట్టు ఆర్థిక మంత్రి చేసిన ప్రకటన స్టార్టప్‌లలోకి కొత్త పెట్టుబడులకు, ఉపాధి అవకాశాల కల్పనకు దోహదపడుతుంది.

అయోధ్య రామమందిరం ఆరంభం నాడే, తన కొత్త సంకల్పం అంటూ నరేంద్రమోదీ 'ప్రధానమంత్రి సూర్యోదయ యోజన'ను ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ప్రాణప్రతిష్ఠను, ప్రధాని సంకల్పాన్ని తన బడ్జెట్ ప్రసంగంలో చక్కగా మేళవించి కోటి ఇళ్ల సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు గురించి ఆర్థికమంత్రి వివరించారు. సోలార్ ఫైకప్పు ఏర్పాటు చేసుకునే ఇళ్ళు 300 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితంగా వాడుకొని, మిగతా విద్యుత్తును గ్రిడ్‌కు విక్రయించుకోవచ్చు. దీనివల్ల గృహవినియోగదారులకు బిల్లుల భారం తగ్గుతుంది. దీనితోపాటు, ప్రజారవాణా వ్యవస్థలో మరిన్ని విద్యుత్ బస్సుల ప్రవేశం ప్రతిపాదన కూడా వాతావరణంలో కర్బన్ ఉద్గారాలను 'నెట్ జీరో' చేసే లక్ష్యానికి ప్రభుత్వాన్ని చేరువ చేస్తుంది. "అందరికీ ఇల్లు" పథకం కింద వచ్చే ఐదేళ్ల కాలంలో మరో రెండు కోట్ల ఇళ్ల నిర్మించాలన్న లక్ష్యం మధ్యతరగతికి ప్రయోజనకారి.

వ్యక్తిగత ఆదాయపు పన్నులో గాని, కార్పొరేట్ పన్నుల్లో గాని ఈ బడ్జెట్లో ఎలాంటి మార్పులు లేవు. భావోద్వేగాలతో ప్రజలను ఆకర్షించగలుగుతున్నప్పుడు మినహాయింపులు, రాయితీలు ప్రత్యేకంగా అక్కరలేదని ప్రభుత్వం అనుకొని ఉంటుంది. 2014—-15 ఆర్థిక సంవత్సరానికి ముందు జారీ చేసిన రూ.25,000 లోపు ఐటీ డిమాండు నోటీసులన్నింటినీ ఉపసంహరించుకోబోవడం పన్ను వివాదాల్లో చిక్కుకున్న కోటిమందికి ఉపశమనం. తాత్కాలిక బడ్జెట్లో ఆర్థికమంత్రి చేసిన భారీ ప్రకటన బహుశా ఇదే. పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యం రూ.50,000 కోట్లకు కుదించారు. ఇది, ప్రభుత్వ సంస్థలను ఆదరాబాదరాగా కాక, సరైన ధర వచ్చినప్పుడే అమ్మాలన్న దిశగా ప్రభుత్వ వైఖరి మారిందనేందుకు సంకేతమని కొందరి విశ్లేషణ. కానీ, ఏటా ప్రభుత్వం నిర్దేశిత లక్ష్యంలో వెనుకబడుతూండటంతోనే ఈ కుదింపు జరిగిందన్నది వాస్తవం.

గత పది సంవత్సరాల్లో మోదీ నాయకత్వంలో దేశం ఆర్థికంగా ప్రపంచస్థాయిలో ఐదోస్థానానికి ఎదిగిందని చెబుతూ ఆర్థికమంత్రి ఈ సందర్భంలో తమ విజయాలన్నింటినీ ఏకరువుపెట్టారు. 2014లో అధికారంలోకి వచ్చినది మొదలు పాలనా వ్యవస్థలన్నింటినీ దారిలోపెట్టడానికి, ఆర్థిక రంగాన్ని పట్టాలపైకి ఎక్కించడానికి ఎంతో శ్రమించామని పరోక్షంగా చెప్పుకున్నారు. 2014 సంవత్సరం ముందు స్థితిగతులపై శ్వేతపత్రం విడుదల చేస్తామన్న ప్రకటన వెనుక రాజకీయ కారణాలు ఉండవచ్చునేమో కానీ, విస్తృత చర్చకు తగినంత అవకాశమిస్తుంది.

అయోధ్య సయోధ్యకు దారితీయదా?



సుప్రీంకోర్టు తీర్పుతో నాలుగేళ్ల క్రితం బాబ్రీ మసీదు చరిత్ర ముగిసింది. మసీదు కూలిన చోట రామమందిరం ఘనంగానూ ప్రారంభమైంది. సుదీర్ఘ వివాదాల చరిత్రలో ఒక ఘట్టానికి తెరపడింది. కానీ వివాదాల చరిత్ర ప్రయాణం మాత్రం ఆగలేదు. మరో రెండు వివాదాలు తీవ్రస్థాయిలో ముసురుకుంటున్నాయి. జ్ఞానవాపి, షాహి ఈద్గా మసీదులను హిందువులకు అప్పగించాలన్న డిమాండ్లు మొదలయ్యాయి. అయోధ్య—బాబ్రీమసీదు వివాదం మూడు దశాబ్దాల పాటు రాజకీయాలను తీవ్రంగా ప్రభావితం చేసింది. సగటు మనిషి ఆలోచనల్లో సైతం తీవ్ర మార్పును తీసుకొచ్చింది. మత దృష్టితో చరిత్రను చూసే పద్ధతిని బాగా పెంచింది. మధ్యయుగాల చరిత్రను హిందు—ముస్లిం సమరంగా భావించే ధోరణి మధ్యతరగతి ప్రజల్లో స్థిరపడటం మొదలైంది. ఈ తరహా సంకుచిత దృష్టికి మూల కారణం ఇప్పటిది కాదు. బ్రిటిషు కాలంలోనే అది మొదలైంది. తమకు ముందున్న పాలకులను క్రూరులుగా, నిరంకుశులుగా, మతోన్మాదులుగా చిత్రీకరించే ధోరణిని బ్రిటిషు అధికారులు, చరిత్రకారులు ప్రారంభించారు. సముద్రాలను దాటి వచ్చి ఇక్కడ ప్రజలపై అంతులేని ఆధిపత్యాన్ని చలాయించాలంటే బలప్రయోగం ఒక్కటే సరిపోదు. తమకు ముందున్న పాలకులకంటే తాము అన్ని విధాలా ఉన్నతులమనీ, నాగరీకులమనీ చెప్పుకోవాలి. ప్రజలు దాన్ని నమ్మేలా చేయటానికి చరిత్ర రచనను మించిన సాధనం లేదు. దానిని చదువరుల బుర్రల్లో బలంగా నాటాలి. అలా జరగాలంటే ప్రభుత్వ నివేదికలు, పాఠ్యపుస్తకాలు, గజెట్లలో దానికి తగిన స్థానం కల్పించాలి. హిందూ జమిందార్లకు, సుల్తాన్లకు మధ్య పేచీలను ప్రజల మధ్య పేచీలుగా చూపాలి. స్వదేశీ—విదేశీ పీడకుల మధ్య పంపకాల జగడాలను ప్రజల మధ్య జగడాలుగా వ్యాఖ్యానించాలి. ఇలాంటి రాజకీయ అవసరాలతో రూపొందిన చరిత్ర.. గతాన్ని గురించి మనలో కొన్ని బలమైన భావనలు ఏర్పరిచింది. స్వాతంత్ర్యం తర్వాత కూడా ఈ భావనలే ప్రధానంగా కొనసాగాయి. దీనికి తోడు 1947 నుంచి నిన్నమొన్నటి వరకూ జరిగిన మొత్తం చరిత్రను ముస్లింలను సంతృప్తిపరచే చర్యల సమాహారంగా భావించే ధోరణితో ఆ భావనలు మరింత బలాన్ని సంపాదించుకున్నాయి.

నిష్పాక్షిక దృక్పథంతో మన చరిత్రపై గొప్ప రచనలు రాలేదని చెప్పలేం. కానీ ప్రజలకు చేరింది తక్కువ. అధికారం కోసం వెంపర్లాడే రాజకీయాల్లో పైచేయి సాధించటానికి అవి పనికిరావు. కాబట్టే వాటికి తగినంత ప్రాధాన్యం రాలేదు. సుదీర్ఘమైన మన చరిత్రను హిందూ, ముస్లిం యుగాలుగా విభజించిందే బ్రిటిషు వారు. ఆ అసంబద్ధ విభజనను అట్లాగే ఉంచుతూ ప్రాచీన, మధ్యయుగాలుగా కేవలం పేర్లు మార్చి ఇప్పటికీ కొనసాగించే స్వదేశీ చరిత్రకారులు చాలా మంది ఉన్నారు. పాలకులు అనుసరించిన మతాన్ని బట్టి చరిత్రను యుగాలుగా విభజించటం ఎన్నో అనర్థాలకు దారితీసింది. హిందువులు, ముస్లింలు మధ్య ఘర్షణలు, పోరాటాలు, ఓటముల చుట్టూ చరిత్రను తిప్పారు. హిందూ రాజుల పాలనను స్వర్ణయుగంగానూ, ముస్లిం రాజుల పాలనను చీకటి యుగంగానూ చిత్రీకరించే ధోరణే ప్రధానమైంది. ఇలాంటి చరిత్ర రచనల నుంచి ప్రేరణ పొందిన వ్యక్తులే దేశంలో మతాధిక్య భావజాల సంస్థలను,

స్థల ఉపయోగం, దాని స్వాధీనత, సుదీర్ఘకాలం అక్కడ ప్రార్థనలు, పూజలు జరగటం లాంటి అంశాలను సాక్ష్యాలుగా పరిగణించి సుప్రీంకోర్టు అయోధ్య తీర్పు ఇచ్చింది. జ్ఞానవాపి, మథుర మసీదుల్లో పరిస్థితి దీనికి పూర్తిగా భిన్నం. అయోధ్య తీర్పు ప్రకారం చూస్తే వాటిని అక్కడ తొలగించటం అసాధ్యం! రాజ్యాంగ నియమాలు, విలువల కంటే మత విశ్వాసం ఉన్నతమైందనే భావన దేనినైనా సాధ్యం చేస్తుంది! మసీదును కూల్చటం కిరాతక చర్యగా సర్వోన్నత న్యాయస్థానం అభివర్ణించినా.. ప్రార్థనాలయాల పరిరక్షణ చట్టాన్ని సముచితమైందిగా పేర్కొన్నా.. జరుగుతున్న పరిణామాలను చూస్తే స్పష్టమయ్యేది అదే!

పార్టీలను ఏర్పాటు చేశారు. ఆలయాల విధ్వంసాలకు అసలు కారణాలను వదిలేసి ఒక్క మత కోణం నుంచే వాటిని చూశారు. ప్రార్థనా స్థలాలను విధ్వంసం, అపవిత్రం చేయటం చాలా దేశాల్లోనూ జరిగింది. మతోన్మాదం, రాజకీయ ప్రయోజనం, సంపద దోపిడి లాంటి కారణాలు ఎన్నో వీటి వెనుక ఉన్నాయి. రాజకీయ కారణాలతో ఆలయాలను కూల్చిన పాలకులే మరికొన్ని చోట్ల అదే రాజకీయాల కోసం ప్రార్థనాలయాలకు తోడ్పడిన సంఘటనలూ చరిత్రలో ఉన్నాయి.

హిందూ—ముస్లిం సంఘర్షణగా మన చరిత్రను చూడటంతోనే అయోధ్య వివాదం జటిలమైంది. ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఈ ఆలోచనలోనే ఉండదు కాబట్టి సయోధ్యకు జరిగిన ప్రయత్నాలన్నీ బెడిసికొట్టాయి. అయోధ్యలో హిందూ ఆలయాన్ని కూల్చి దాని స్థానంలో మసీదుని కట్టారనే వాదన నుంచి ఒక మెట్టు దిగటానికి హిందూ పక్షం అంగీకరించలేదు. ముస్లిం పక్షమూ వెనక్కి తగ్గలేదు. ఇరు వర్గాల ఆధారాలను పరిశీలించి చివరికి హిందూ పక్షానికి అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. అలా ఇచ్చినప్పటికీ ఆలయాన్ని కూల్చి మసీదును కట్టారనే వాదనకు సాక్ష్యాలు లేవనే సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. భారత పురావస్తు సంస్థ (ఏఎస్ఐ) నివేదిక కూడా దీన్ని నిర్ధారించలేకపోయిందనీ స్పష్టం చేసింది. నిజానికిది చాలా కీలకమైన విషయం. అప్రియ సత్యం కావటంతో చర్చల్లో దీనికి ప్రాధాన్యం దక్కలేదు. ప్రచార సాధనాలూ దీన్ని తగినంతగా పట్టించుకోలేదు. ఆలయానికి అనుకూలంగా తీర్పును ఇచ్చింది కాబట్టి కూల్చివేత వాదనకు సుప్రీంకోర్టు ఆమోదముద్ర వేసిందనే ప్రచారం పైచేయి సాధించింది. వివాదస్పద స్థలం హిందువులకే చెందుతుందన్న అంశానికే ప్రాధాన్యమిచ్చి తీర్పులోని మిగతా విషయాలను విస్మరించటంతో ఇతర నిర్ధారణలు మరుగున పడిపోయాయి. ఏ ప్రాతిపదికన హిందువులకు స్థలాన్ని అప్పగించాలని సుప్రీంకోర్టు నిర్ణయించిందో తెలుసుకుంటే ముఖ్య విషయాల్లో స్పష్టత వస్తుంది. అయోధ్యలాగా.. జ్ఞానవాపి, షాహి ఈద్గా మసీదుల విషయంలో ఆ తరహా నిర్ణయాన్ని తీసుకోవటం అంత సులువు కాదనీ తెలుస్తుంది.

ఏఎస్ఐ నివేదికలో పేర్కొన్న కీలక విషయాలను సుప్రీంకోర్టు క్రోడీకరించింది. అందులో ప్రధానమైనవి: 1) మసీదు స్థలం కింది పొరల్లో 12వ శతాబ్దికి చెందిన నిర్మాణం ఉన్నట్లు తేలింది. 17 వరుసల్లో 85 స్తంభాల తాలూకు పునాదులు అక్కడున్నాయి 2) అది హిందూ మతానికి చెందిన నిర్మాణమే కావచ్చు. 3) అప్పటికే అక్కడున్న పునాదులను ఉపయోగించి మసీదును కట్టారు. 4) చిన్న వృత్తాకారపు మందిరం కూడా అక్కడ బయటపడింది. 8—10 శతాబ్దికి మధ్య అక్కడ పూజలు జరిగాయనటానికి దాన్ని చిహ్నంగా భావించొచ్చు. ఏఎస్ఐ నివేదికలోని ఈ అంశాలను ప్రస్తావించిన తర్వాత సుప్రీంకోర్టు కొన్ని కీలక వ్యాఖ్యలను చేసింది. అవి: 12వ శతాబ్దికి చెందిన హిందూ నిర్మాణం ఎందుకు నాశనం అయిందన్న విషయంపై ఏఎస్ఐ ఏ కారణాన్ని చెప్పలేదు. అలాగే అక్కడున్న నిర్మాణాన్ని కూల్చివేసి మసీదుని కట్టారా? లేదా? అన్న విషయాన్ని కూడా ఏఎస్ఐ తేల్చలేదు. ఏఎస్ఐ పేర్కొన్న ప్రకారం హిందూ నిర్మాణం 12వ శతాబ్దం నాటిది. మసీదు 16వ శతాబ్దానికి చెందినది. రెండింటికి మధ్య 400 ఏళ్ల అంతరం ఉంది. ఆ 400 ఏళ్ల కాలంలో ఏ జరిగిందన్న దానిపై సాక్ష్యాధారాల్లేవు. పునాదులను మినహా మొత్తం మసీదు నిర్మాణానికి.. పురాతన కట్టడం తాలూకూ వస్తువులను ఉపయోగించారన్న నిర్ధారణకు ఏఎస్ఐ రాలేదు. మసీదులోని రాతి స్తంభాలు.. పూర్వ కట్టడ పునాదులకు సంబంధించిన స్తంభాలే అనటానికి కూడా ఏఎస్ఐ సాక్ష్యాలను చూపించలేదు.


■ రాహుల్ కుమార్

ఆలయాన్ని కూల్చి మసీదు కట్టారనటానికి ఏఎస్ఐ నివేదిక ప్రకారం ఆధారాల్లేవు. మరి దేని ఆధారంగా మసీదు స్థలాన్ని హిందువులకు అప్పగించారు? ఎవరికైనా వచ్చే సందేహమే అది. విశ్వాసాల ఆధారంగా ఒక స్థలంపై హక్కుని నిర్ణయించటం చట్ట ప్రకారం సాధ్యం కాదని తీర్పులో సుప్రీంకోర్టు పలుచోట్ల స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు నిర్ధారణల ప్రకారం.. మసీదును 16వ శతాబ్దంలో కట్టినా 1856—57 వరకూ అక్కడ అవిచ్ఛిన్నంగా ప్రార్థనలు జరిగాయనటానికి ముస్లిం పక్షం ఆధారాలు సమర్పించలేకపోయింది. బాబర్ ఆదేశం మేరకు మసీదును కట్టారని చెబుతున్నా అందుకు సంబంధించి లిఖిత సాక్ష్యాల్లేవు. మసీదుపై యాజమాన్య హక్కును నిర్దేశించే సనద్‌లు, ఫర్మానాల్లాంటివి లేవు. హిందూ—ముస్లిం గొడవలతో 1857లోనే మసీదు ప్రాంగణాన్ని బ్రిటిషు పాలకులు రెండుగా విభజించి గోడకట్టారు. గుమ్మటాలున్న కట్టడాన్ని ముస్లింలు ఉపయోగిస్తే మిగతా స్థలాన్ని హిందువులు వాడుకునేవారు. 1857కు పూర్వం కూడా హిందువులు అక్కడ పూజలు చేసేవారనీ విదేశీ యాత్రికులు కూడా పేర్కొన్నారు. మసీదులో ఒకవంక ప్రార్థనలు జరుగుతున్నా ప్రధాన గుమ్మటం ఉన్న స్థలాన్ని రామజన్మభూమిగా విశ్వసించటాన్ని హిందువులు మానలేదు. అక్కడకు వెళ్లటానికి ప్రయత్నించటంతో జరిగిన ఘర్షణల వల్లే అడ్డుగోడను కట్టాల్సి వచ్చింది. అంటే రామజన్మభూమికి సంబంధించి హిందువుల కార్యకలాపాలకు సుదీర్ఘ చరిత్ర ఉంది. 1934లో కూడా హిందువులు మసీదులోకి ప్రవేశించి ప్రధాన గుమ్మటంతో పాటు మరికొన్ని చోట్ల భౌతికంగా నష్టం కలిగించారు. 1949లోనైతే ఏకంగా ప్రధాన గుమ్మటంలోకి చొరబడి విగ్రహాలనే అక్కడ పెట్టారు. దాంతో మసీదులో ప్రార్థనలు ఆగిపోయాయి. 1857 నుంచి 1949 వరకూ మసీదులో క్రమం తప్పకుండా నమాజు చేశారటానికి సాక్ష్యాలున్నాయి. మసీదు ప్రాంగణం నూటికినూరు శాతం ఎన్నడూ ముస్లింల కింద లేదనేది మాత్రం స్పష్టం.

ప్రధానంగా స్థల ఉపయోగం, దాని స్వాధీనత, సుదీర్ఘకాలం అక్కడ ప్రార్థనలు, పూజలు జరగటం లాంటి అంశాలను సాక్ష్యాలుగా పరిగణించి సుప్రీంకోర్టు అయోధ్య తీర్పు ఇచ్చింది. జ్ఞానవాపి, మథుర మసీదుల్లో పరిస్థితి దీనికి పూర్తిగా భిన్నం. అక్కడ నిరంతరం ప్రార్థనలు జరుగుతున్నాయి. అవి ప్రస్తుతం పూర్తిగా ముస్లింల స్వాధీనంలో ఉన్నాయి. అయోధ్య తీర్పు ప్రకారం చూస్తే వాటిని అక్కడ తొలగించటం అసాధ్యం! అయితే ప్రస్తుత రాజకీయ వాతావరణంలో దేన్నీ అసాధ్యంగా చెప్పలేం. గడిచిన 1000 ఏళ్లలో హిందువులకు అంతా అన్యాయమే జరిగిందనే విపరీత ధోరణి ఎన్ని వైపరీత్యాలకైనా దారితీస్తుంది. రాజ్యాంగ నియమాలు, విలువల కంటే మత విశ్వాసం ఉన్నతమైందనే భావన దేనినైనా సాధ్యం చేస్తుంది! మసీదును కూల్చటం కిరాతక చర్యగా సర్వోన్నత న్యాయస్థానం అభివర్ణించినా.. ప్రార్థనాలయాల పరిరక్షణ చట్టాన్ని సముచితమైందిగా పేర్కొన్నా.. జరుగుతున్న పరిణామాలను చూస్తే స్పష్టమయ్యేది అదే!

'గ్రీన్ సిమెంట్' అసాధ్యం కాదు

ప్రపంచ వ్యాప్తంగా, హరిత గృహ వాయు ఉద్గారాలను తగ్గించడం కష్టసాధ్యంగా ఉన్న రంగాలలో సిమెంట్ పరిశ్రమ ఒకటి. ఆర్థికాభివృద్ధి సాధనకు కీలకమైన ఈ పరిశ్రమ భారీ కర్బన ఉద్గారాలకు కూడా పేరు పొందింది. ప్రపంచవ్యాప్తంగా కార్బన్—డై—ఆక్సైడ్ (సిఒ2) ఉద్గారాలలో 7 శాతం సిమెంట్ ఫ్యాక్టరీల నుంచే వెలువడుతున్నాయి. సిమెంట్ తయారీలో కర్బన ఉద్గారాలు ఒక స్వతస్సిద్ధ భాగం. సిమెంట్ ఉత్పత్తికి వినియోగించే ముడి పదార్థం సున్నపురాయి. సిమెంట్ ఉత్పత్తికి సున్నపురాయి నుంచి కార్బన్—డై—ఆక్సైడ్‌ను విధిగా తొలగించి తీరాలి. ఇది మొత్తం కర్బన ఉద్గారాల తీవ్రతను పెంచుతోంది. ఈ భస్మీకరణ ప్రక్రియకు బట్టీలో చాలా తీవ్ర ఉష్ణోగ్రత (ఇంచుమించు 1450 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు) అవసరం ఎంతైనా ఉన్నది. ఈ భస్మీకరణకు ఇంధనం అవసరం. సిమెంట్ ఫ్యాక్టరీల నుంచి వెలువడే మొత్తం కర్బన ఉద్గారాలలో సగానికి పైగా ఉత్పత్తి ప్రక్రియ నుంచి వెలువడుతున్నవే కావడం గమనార్హం. మిగతావి కొలిమిలోని దహన చర్యల నుంచి ఉత్పన్నమవుతాయి. ఈ దృష్ట్యా ఈ పరిశ్రమను హరితీకరణ (గ్రీనింగ్) చేయడం కష్ట సాధ్యం. అయితే అసాధ్యం కాదు.


■ సునీతా నారాయణ్

మట్టివాసన

నేనూ, సిఎస్ఇ (సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్)లోని నా సహచరులు భారతీయ సిమెంట్ పరిశ్రమను సమగ్రంగా అధ్యయనం చేసి, దాని భవిష్యత్తుకు ఒక దీర్ఘకాలిక ప్రణాళిక (రోడ్ మ్యాప్)ను రూపొందించాము. భారత సిమెంట్ పరిశ్రమను డీ కార్బొనైజ్ (కర్బన ఉద్గారాల రహితంగా) చేసేందుకు ఎంతో చేయవలసి ఉన్నది. ఇది సమర్థంగా చేయగలిగితే ఇతర పరిశ్రమల్లో కూడా పరిస్థితిని చక్కదిద్దవచ్చని మా విశ్లేషణ స్పష్టం చేసింది. కర్బన ఉద్గారాల రహితంగా సిమెంట్‌ను ఉత్పత్తి చేయవచ్చని మేము చెప్పబోవడం లేదు. అయితే ఈ కీలక పరిశ్రమను సాధ్యమైనంతగా హరితీకరణ చేయవచ్చునని మేము దృఢంగా విశ్వసిస్తున్నాము.


భారత ప్రభుత్వ పర్యావరణ మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం 2016లో మొత్తం కర్బన ఉద్గారాలలో 5.63 శాతం సిమెంట్ పరిశ్రమ నుంచి వెలువడినవేనని తెలుస్తుంది. 2019 సంవత్సరంలో ఇది 5.72 శాతంగా ఉన్నదని కూడా ఆ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. సిమెంట్ పరిశ్రమ సత్వరమే అభివృద్ధి చెందుతోంది. చెందాలి కూడా. ఎందుకంటే దేశ ఆర్థికాభివృద్ధికి కీలకమైన మౌలిక సదుపాయాల కల్పనకు సిమెంట్ పరిశ్రమలో మరింత అధిక స్థాయిలో పెట్టుబడులు పెట్టవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

భారతీయ సిమెంట్ పరిశ్రమ తొలి నుంచీ ఇతర దేశాలలోని ఆ రంగానికి లేనటువంటి అనుకూలతలతో ఉన్నది. ముఖ్యంగా ముడిపదార్థం నుంచి కార్బన్—డై—ఆక్సైడ్‌ను తొలగించడంలో ఈ అనుకూలతలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇందుకు రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి. అవి: సిమెంట్ తయారీకి సున్నపురాయి బదులు ఫ్లైయాష్ (థర్మల్ విద్యుత్కేంద్రాల నుంచి వెలువడే బూడి)ను ఉపయోగించడం; ఇంధన సామర్థ్యాన్ని కలిగి ఉండడం (ఇది ఇంధన వినియోగ వ్యయాలలో భారీ తగ్గుదలకు విశేషంగా తోడ్పడుతోంది). ఈ చర్యలు ఉత్పత్తి నాణ్యతకు, మార్కెట్ మన్నికకు విశేషంగా దోహదం చేస్తున్నాయి. ఈ పరిస్థితులు భవిష్యత్తులో కూడ సుస్థిరంగా ఉండే అవకాశం పూర్తిగా ఉన్నది.

వస్తువుల ఉత్పత్తిలో ఉపయోగించే పదార్థాలపై కర్బన ఉద్గారాల తీవ్రత ఆధారపడి ఉంటుంది. ఈ దృష్ట్యా మనం వివిధ రకాల సిమెంట్‌లను, అర్థం చేసుకోవల్సి వున్నది. వాతావరణ మార్పును నిరోధించేందుకు ఈ అవగాహన చాల ముఖ్యం. మనం ఉపయోగించుకునే సిమెంట్ మూడు రకాలుగా ఉంటుంది. (1) సాధారణ పోర్ట్ ల్యాండ్ సిమెంట్ (ఒపిసి) — దీని ఉత్పత్తికి సున్నపురాయిని ముడి పదార్థంగా వినియోగిస్తారు; (2) పొజ్జోలనా పోర్ట్ ల్యాండ్ సిమెంట్ (పిపిసి) — దీని తయారీకి ఫ్లైయాష్‌ను, పాక్షికంగా సున్నపురాయిని ఉపయోగిస్తారు; (3) పోర్ట్ ల్యాండ్ శ్లాగ్ సిమెంట్ (పిఎస్‌సి)— దీని ఉత్పత్తిలో సున్నపురాయికి బదులు శ్లాగ్ (లోహ మలం — కరిగించిన లోహం నుంచి బయటికి వచ్చిన మురికి)ను పాక్షికంగా ఉపయోగిస్తారు. భారతీయ ప్రమాణాల బ్యూరో మరోరకం సిమెంట్ (దీన్ని కాంపోజిట్ సిమెంట్ —సిసి అంటున్నారు)కు కూడా ప్రమాణాలను నోటిపై చేసింది. దీని ఉత్పత్తిలో సున్నపురాయికి ప్రత్యామ్నాయంగా ఫ్లైయాష్, శ్లాగ్‌ను గరిష్ఠంగా 60 శాతం మేరకు ఉపయోగిస్తారు. సిమెంట్ ఉత్పత్తిలో సున్నపురాయిని ఎంత తక్కువగా ఉపయోగిస్తే కర్బన ఉద్గారాలు అంత తక్కువగా వెలువడుతాయి. సున్నపురాయిని గరిష్ఠంగా ఉపయోగించుకునే ఒపిసి సిమెంట్ ప్రతి ఒక్క టన్ను సిమెంట్‌కు 0.84 టన్ను కార్బన్—డై—ఆక్సైడ్‌ను ఉద్గారిస్తుంది. పారిశ్రామిక వ్యర్థ పదార్థాన్ని ఉపయోగించుకునే పిఎస్‌సి ఉత్పత్తిలో కర్బన ఉద్గారాలు అర టన్ను కంటే తక్కువగా ఉంటాయి.

ప్రస్తుతం అతి తక్కువ ఉద్గారాలకు కారణమవుతున్న పిపిసి సిమెంట్‌కు మార్కెట్‌లో 65 శాతం వాటాను కలిగి ఉన్నది. అయితే మన దేశంలో ఇప్పటికీ ఒపిసి సిమెంట్‌నే అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్నారు. ఉత్పత్తి అవుతున్న మొత్తం సిమెంట్‌లో ఒపిసి సిమెంట్ 30 శాతం వరకూ ఉంటోంది. భారతీయ సిమెంట్ పరిశ్రమ పురోభివృద్ధికి సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ రూపొందించిన దీర్ఘకాలిక ప్రణాళిక ఒపిసి సిమెంట్ ఉత్పత్తిని నియంత్రించాలని సూచించింది. కేవలం 10 శాతం మేరకే దాని ఉత్పత్తిని అనుమతించాలని సిఫారసు చేసింది. 2030 సంవత్సరం నాటికి ఇతర రకాల సిమెంట్ ఉత్పత్తికి లక్ష్యాలను నిర్దేశించాలని పేర్కొంది. పిపిసి సిమెంట్ ఉత్పత్తిలో ఫ్లైయాష్ వినియోగాన్ని మరింతగా 35 శాతం నుంచి 45 శాతానికి పెంచాలని కూడా సిఫారసు చేసింది ఆ సిమెంట్‌ల వినియోగం పెరుగుతున్న కొద్దీ కర్బన ఉద్గారాల తీవ్రత తగ్గుతుంది.

సిమెంట్ పరిశ్రమ డీ కార్బొనైజేషన్‌కు అనుసరించాల్సిన రెండో మార్గం కంబశ్చన్ (దహన క్రియ — ప్రాణవాయువుతో కాంతిని, ఉష్ణాన్ని కలిగించే రసాయనిక చర్య) ప్రక్రియ స్థానంలో ఇంధనాన్ని ఉపయోగించడం. దీనివల్ల వ్యర్థ పదార్థాల



సిమెంట్ తయారీలో సున్నపురాయికి ప్రత్యామ్నాయంగా వేరే ముడి పదార్థాలను ఉపయోగించి ఉత్పత్తి చేసిన, బొగ్గుకు బదులు పునరుద్ధరణీయ ఇంధనంతో ఉత్పత్తి అవుతున్న సిమెంటును హరిత, తక్కువ కార్బన్ సిమెంట్‌గా నిర్వచించాలని ప్రభుత్వానికి సిఎస్ఇ సిఫారసు చేసింది. తదనుగుణంగా, భారతీయ సిమెంట్ పరిశ్రమ తన ఉత్పత్తిని 2030 సంవత్సరం నాటికి రెట్టింపు చేసినా కర్బన ఉద్గారాలను సగానికి తగ్గించుకోవడం సాధ్యమవుతుంది.

నిర్వహణకు అవకాశాలు మెరుగవుతాయి. సిమెంట్ పరిశ్రమ ప్రస్తుతం ప్రధానంగా బొగ్గు, లిగ్నైట్, పెట్‌కోక్‌పై ఆధారపడుతోంది వీటి వాడకాన్ని తగ్గించడం వల్ల ఉద్గారాల తీవ్రత కూడా తగ్గుతుంది. చాలా సిమెంట్ కంపెనీలు నేడు తమ బట్టీలలో భస్మీకరణకు మునిసిపల్ ఘన వ్యర్థాలను ఉపయోగించుకుంటున్నాయి. అయితే అది సిమెంట్ తయారీకి పూర్తిగా అనువైన ఇంధనం కాదు. కనుక చెత్త-చెదారాన్ని ప్రాసెస్ చేసి దాన్ని బొగ్గుకు ప్రత్యామ్నాయ ఇంధనంగా ఉపయోగించుకోవచ్చు.

సిమెంట్ తయారీలో సున్నపురాయికి ప్రత్యామ్నాయంగా వేరే ముడి పదార్థాలతో ఉత్పత్తి చేసిన, బొగ్గుకు బదులు పునరుద్ధరణీయ ఇంధనంతో ఉత్పత్తి అవుతున్న సిమెంట్‌ను హరిత, తక్కువ కార్బన్ సిమెంట్‌గా నిర్వచించాలని ప్రభుత్వానికి సిఎస్ఇ సిఫారసు చేసింది. తద్వారా, భారతీయ సిమెంట్ పరిశ్రమ తన ఉత్పత్తిని 2030 సంవత్సరం నాటికి రెట్టింపు చేసినా కర్బన ఉద్గారాలను సగానికి తగ్గించుకోవడం సాధ్యమవుతుంది. ఈ హరిత సిమెంట్‌కు జీఎస్టీ తక్కువగా ఉంటుంది. ఇది అటు ఉత్పత్తిదారుకు, ఇటు వినియోగదారుకు, మరీ ముఖ్యంగా పర్యావరణ భద్రతకు హితకరమైనదిగా చెప్పవచ్చు. అయితే ఈ హరిత భారతదేశాన్ని నిర్మించేందుకు ప్రభుత్వమూ పారిశ్రామికవేత్తలతో పాటు వినియోగదారులు కూడా పూర్తిగా సహకరించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్'

కమ్యూనిస్టు పార్టీలకు ఇది మంచి తరుణం!

మన దేశంలో కాంగ్రెస్, భాజపా, ప్రాంతీయ పార్టీలు — అన్నీ పెట్టుబడిదారీ వ్యవస్థకు అనుకూలంగా ఉన్నవే. జాతీయరంగంలోని పరిశ్రమలు దిగజారటానికి కాంగ్రెసు దోహదం చేసింది. కొన్ని ప్రైవేటుపరం చేసింది, కొన్నిటిని మూసివేసింది. భాజపా మరో ముందడుగు వేసి, ప్రభుత్వ సంస్థలన్నిటినీ ప్రైవేటుపరం చేయడానికి పూనుకుంది. ఉత్పత్తిరంగమంతా బడా వ్యాపారుల చేతుల్లోకి వెడుతోంది. వీళ్ళలో చాలామంది ఈ పార్టీల నాయకులకి బినామీలే. దీంతో శ్రామికవర్గాలు, సన్నకారు, కౌలు రైతులు, చిరువర్తకులేగాక, మధ్యతరగతి ప్రజలు కూడా ఇబ్బందులకి గురవుతున్నారు. దేశంలో వ్యవసాయం దెబ్బతిన్నది, నిరుద్యోగం పెరుగుతున్నది. చిన్న, మధ్యతరగతి పరిశ్రమల్ని ప్రోత్సహించి నిరుద్యోగాన్ని తగ్గించడం, ఉత్పత్తుల్ని పెంచడం, ధరల నియంత్రణకి కృషి చేయవలసిన ప్రభుత్వాలు నిమ్మకునీరెత్తినట్టున్నాయి. విద్యావ్యవస్థ కూడా దిగజారుతున్నది. ప్రభుత్వరంగ పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యా నాణ్యత కొరవడింది. నూతన విద్యావిధానం విద్యార్థులు చదువు మానివేసినా సర్టిఫికెట్లు, డిప్లమాలు ఇస్తామంటూ మానివేయడాన్ని ప్రోత్సహిస్తున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో తగినంత మంది ఉపాధ్యాయులు లేరు. మన ప్రభుత్వ వైద్యశాలల పరిస్థితి రోజురోజుకి దిగజారుతుందేగాని మెరుగుపడటం లేదు. ఏ వైద్యశాల చూసినా వైద్యులు గాని, సహాయ సిబ్బంది గాని ఉండవలసిన దానికన్నా సగం కూడా లేరు.



పౌరహక్కుల పరిస్థితి ఎలావుందో తెలిసిందే. ప్రజలు తమ సమస్యలకై ఉద్యమించినా పోలీసులు విరుచుకుపడుతున్నారు. రాష్ట్రంలో అరాచకశక్తులు విజృంభిస్తున్నా పట్టించుకోని పోలీసులు, చట్టాల్ని ఉల్లంఘించి మరీ ఈ దాడుల్ని కొనసాగిస్తున్నారు. సమాజంలో మహిళలపై, ప్రత్యేకించి పేద, దళిత వర్గాల మహిళలపై లైంగికదాడులు, హత్యలు పెరిగాయి.

మన రాష్ట్రంలో ఇప్పుడు ప్రముఖ పార్టీలలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా పెద్ద మార్పేమీ ఉండదు. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తే, ఆ పార్టీకి ప్రత్యక్షంగానో పరోక్షంగానో మద్దతు పలుకుతున్నారు. కేంద్రంలో అధికారంలో వున్న బీజేపీ సమాఖ్య స్ఫూర్తిని దిగజార్చి రాష్ట్ర అధికారాల్ని లాగేసుకుంటున్నా ప్రాంతీయ పార్టీలు నోరెత్తలేని పరిస్థితిలో ఉన్నాయి. ప్రజలకి వేరే అవకాశం లేక వాటిలో ఏదో ఒక దానిని గెలిపిస్తున్నారు. ఢిల్లీలో ప్రత్యామ్నాయంగా ఆమ్ ఆద్మీపార్టీ కనిపిస్తే గెలిపించారు. మన రాష్ట్రంలో ప్రత్యామ్నాయం కమ్యూనిస్టు పార్టీలే. సమస్యలపై అవగాహన కలిగి, ఉద్యమాలు చేసిన పార్టీలు. కమ్యూనిస్టు పార్టీలు కొద్ది సీట్లకి పోటీచేసినా, అధికారంలోకి రారు కాబట్టి పెద్దగా ఓట్లుపడే అవకాశం ఉండదు. అలా కాకుండా ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న కమ్యూనిస్టు పార్టీలు, మార్క్సిస్టు—లెనినిస్టు పార్టీలతో సహా అన్నీ కలిసి అన్ని స్థానాలకు పోటీ చేస్తే, అధికారంలోకి రాగలిగే బలమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తాయి కనుక గెలిచే అవకాశాలు ఎక్కువ. ఇప్పటికీ ప్రజలలో కమ్యూనిస్టు పార్టీలే మేలు చేస్తాయనే భావన, వారి పట్ల అభిమానం ఉంది. కలిసి అన్ని సీట్లకు పోటీ చేస్తే తప్పకుండా పరిస్థితులు మారతాయి. ముందుగా మీమీ భేషజాలని పక్కనబెట్టి, ఎట్టి పరిస్థితుల్లోనూ కలిసే పోటీచేయాలని ప్రతి పార్టీ స్థిర నిర్ణయం తీసుకుంటే అది అసాధ్యమేమీకాదు. సమస్య వచ్చినప్పుడు చర్చించుకుని, ఇచ్చిపుచ్చుకునే ధోరణి అనుసరిస్తే పరిష్కారం దొరుకుతుంది. తద్వారా సీట్ల సర్దుబాటు కూడా సాధ్యమవుతుంది. మార్పు మొదలు కావాలి. అది ఇప్పుడే ఎందుకు కాకూడదు? కమ్యూనిస్టులకి ఉద్యోగులు, కార్మికులు, రైతులు, రైతుకూలీలు, యువత, విద్యార్థులు, మహిళలందరిలో ఎంతోకొంత పలుకుబడి ఉంది, సభ్యులున్నారు. కమ్యూనిస్టు పార్టీలన్నీ కలిస్తే ఆ సంఖ్య బాగానే ఉంటుంది. నియోజకవర్గంలో ఏ పార్టీ అభ్యర్థి పోటీచేస్తున్నా, అన్ని పార్టీలు కలిసికట్టుగా ఉమ్మడి ప్రచార కమిటీని ఏర్పాటు చేసి పనిచేయవచ్చు. కమ్యూనిస్టు పార్టీలు అధికారంలోకి రావటానికి ఇదే మంచి అవకాశం. ముందు షరతులు లేకుండా, స్వేచ్ఛగా చర్చలు జరిపి, ఒక కూటమిగా ఈ ఎన్నికలలో పోటీచేసి పోరాడితే, తప్పక విజయవంతమౌతారు. ప్రజలకి మేలైన పాలనని అందించగలుగుతారు.

■ కారుమంచి విజయకుమార్

కాంగ్రెస్‌కు పూర్వవైభవం ఖాయం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా నియుక్తులైన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తె వైఎస్ షర్మిల..పార్టీని నడిపించడంలో తండ్రిని తలపిస్తున్నారు. ఆమె బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజుల్లోనే సీనియర్ నాయకులను సమన్వయం చేసుకుంటూ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవాన్ని కల్పించే దిశగా దూసుకుపోతున్నారు. సార్వత్రిక ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ జనంలోకి వెళ్లడానికి ముందు పార్టీ బలోపేతానికి ఉత్తరాంధ్ర నుంచి జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టిన షర్మిల.. తన ప్రసంగాలతో పార్టీ శ్రేణుల్లో ఉత్తేజాన్ని నింపుతున్నారు. ప్రతి ఒక్క కార్యకర్త ఒక సైన్యంలా పోరాడాలన్న ఆమె పిలుపు పార్టీ శ్రేణుల హృదయాలను తాకుతోంది. ఎక్కడికి వెళ్లినా ఆమెకు ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి ఆదరణ లభిస్తోంది. ప్రత్యేకించి నిరాడంబరత, ఉన్నది ఉన్నట్లు ఆమె మాట్లాడుతున్న తీరు, ముఖ్యమంత్రిగా ఉన్నది సొంత అన్న అని కూడా లెక్కచేయకుండా ప్రభుత్వ వైఫల్యాలను ఆమె ఎండగడుతున్న తీరు సామాన్యులకు సైతం అర్థమవుతోంది.

కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి చేస్తున్న అన్యాయం.. ఒక్క ఎమ్మెల్యే గానీ, ఎంపీ గానీ లేకుండానే రాష్ట్రంలో పాలనను ఆ పార్టీ శాసిస్తున్న విధానం.. ఆ పార్టీకి వంతపాడుతున్న అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ తీరుపై షర్మిల విస్పష్టంగా సంధిస్తున్న ప్రశ్నలు ఐదు కోట్ల మంది ప్రజలను ఆలోచింపచేస్తున్నాయి. ఇంతకాలం కాంగ్రెస్ పార్టీనే విభజన ద్వారా ఆంధ్రులకు అన్యాయం చేసిందన్న ప్రచారాన్ని, కాంగ్రెస్ అధిష్ఠానం వైఎస్‌ఆర్ కుటుంబానికి అన్యాయం చేసిందన్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టడంలో కొద్దిరోజుల్లోనే ఆమె సఫలమయ్యారు. కేవలం కాంగ్రెస్ పార్టీ వల్లే ఆంధ్రప్రదేశ్‌కు భవిష్యత్తు ఉందని కుండబద్దలు కొడుతున్నారు.

కాంగ్రెస్ మాజీ నేతలను, అనేక ప్రజా సంఘాల వారిని, క్రియాశీలక రాజకీయాల నుంచి తప్పుకొన్న వారినీ మళ్లీ పార్టీలో చేరాలంటూ వైఎస్ షర్మిల ఆహ్వానిస్తున్నారు. ఈ క్రమంలో తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనను, ఆయన ఆశయాలను ప్రస్తావిస్తున్నారు. అదే సమయంలో బీజేపీతో దోస్తీ కోసం వైఎస్ జగన్, చంద్రబాబు రాష్ట్ర ప్రజల హక్కులను కేంద్ర ప్రభుత్వం వద్ద తాకట్టు పెట్టిన విషయాన్ని వివరిస్తున్నారు. వైఎస్ షర్మిల గత నాలుగున్నరేళ్ల వైసీపీ అసమర్థ పాలనను ఎత్తిచూపుతున్నారు. అభివృద్ధిని, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని విస్మరించి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన వైనాన్ని, దళితులపై దాడులు, మహిళలపై అరాచకాలను తూర్పారబడుతున్నారు. బడుగు బలహీనవర్గాలకు జరుగుతున్న అన్యాయాలను ఎత్తిచూపుతున్నారు.

షర్మిల రాకతో రానున్న ఎన్నికల్లో ఏ పార్టీకి లాభం? ఏ పార్టీకి నష్టం? అన్న వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయంటే... ఆమె చరిష్మా ఏ విధంగా ఉందో అర్థమవుతుంది. ప్రస్తుతం వైసీపీలో ఉన్న 90శాతం మంది గతంలో కాంగ్రెస్‌లో ఉన్నవారే. షర్మిల జనంలోకి వెళ్లిన తర్వాత రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారుతుంది.



కాంగ్రెస్ బలోపేతానికి, వైఎస్‌ఆర్ ఆశయాల సాధనకు కృషి చేస్తానని షర్మిల వివరిస్తున్నారు. ప్రజల బాధలను పట్టించుకోని, ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టే పార్టీగా వైసీపీని అభివర్ణించారు. వైఎస్సార్ ఆశయాలను నిలబెట్టని పార్టీ అంటూ మండిపడ్డారు. 25మంది ఎంపీలనిస్తే ప్రత్యేక హోదా సాధిస్తామని వైఎస్ జగన్ ప్రజలకిచ్చిన హామీని విస్మరించడాన్ని ప్రస్తావిస్తున్నారు. ప్రత్యేక హోదా ఉంటే రాష్ట్రానికి ఐదు లక్షల కోట్ల రూపాయల మేర జరిగే మేళ్లను వివరిస్తున్నారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం, హంద్రీ నీవా సహా నీటిపారుదల ప్రాజెక్టులను ఎందుకు పూర్తిచేయలేకపోయారని, ఐదువేల ఎకరాల విలువైన భూములపై కన్నేసిన మోదీ సర్కారు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తుంటే ఏం చేస్తున్నారని సూటిగా ప్రశ్నిస్తున్నారు. ప్రజలకిచ్చిన హామీలు, తండ్రి రాజశేఖర్ రెడ్డి ప్రారంభించిన పనులు పూర్తి చేయలేని జగన్ వారసుడు ఎలా అవుతారని ప్రశ్నించారు. కొంతమంది వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలను ఆమె సూటిగా తిప్పికొడుతున్నారు. నా పుట్టింటికి వచ్చి రాజకీయం చేస్తున్నా... ఎంతటి త్యాగానికైనా, పోరాటానికైనా సిద్ధమేనని... దాడులకు, బెదిరింపులకు లొంగబోనని ప్రకటించారు. టీడీపీ, జనసేన, వైసీపీలకు ఓటేస్తే బీజేపీకి వేసినట్టేనన్న విషయాన్ని ఆమె ప్రజలకు వివరిస్తున్నారు.

షర్మిల నాయకత్వంలో రాష్ట్రంలో తిరిగి కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావడం ఖాయం. రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు పోటీ చేస్తారని ఆమె ప్రకటించారు. ప్రత్యేక పరిస్థితుల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉండిపోయిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తిరిగి సొంత గూటికి చేరుతున్నారు. ఎన్నికల వేళ ఇంకా అనేక మంది నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సంప్రదింపులు జరుపుతున్నారు. కేవలం పదిరోజుల వ్యవధిలోనే రాష్ట్రంలోని 13 జిల్లాల్ని చుట్టబెట్టిన షర్మిల బహిరంగ సభల కోసం రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారు. షర్మిల రాకతో రానున్న ఎన్నికల్లో ఏ పార్టీకి లాభం? ఏ పార్టీకి నష్టం? అన్న వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయంటే.. ఆమె చరిష్మా ఏ విధంగా ఉందో అర్థమవుతుంది. ప్రస్తుతం వైసీపీలో ఉన్నవారిలో 90శాతం మంది గతంలో కాంగ్రెస్‌లో ఉన్నవారే. షర్మిల జనంలోకి వెళ్లిన తర్వాత రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారుతుంది. ప్రజలు వాస్తవాలను అర్థం చేసుకుంటే రాష్ట్రంలో షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కష్టమేమీ కాదు. ఇందుకు ప్రతీ కార్యకర్త ప్రతి ఇంటి తలుపు తట్టి.. వాస్తవాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

• కొలనుకొండ శివాజీ



మరోసారీ

ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లోనూ అమరావతికి మొండిచెయ్యే..





ఎన్నికల వత్సరంలోనూ పైసా కేటాయింపుల్లేవ్..

- రాష్ట్ర ప్రభుత్వ మూడు రాజధానుల స్వరం ఫలితమే..
- బెజవాడ మెట్రో రైలు ఊసెత్తని కేంద్రం
- అమరావతి రైల్వేట్రాక్ అటకెక్కినట్టే..
- రైల్వేకు అత్తెసరు కేటాయింపులు
- విజయవాడ-గూడూరుకు నాల్గో లైన్ మంజూరు
- విజయవాడ-విశాఖ మార్గంలో మూడు, నాలుగు లైన్లు
- కొత్త రైళ్ల మాట లేదు.. ప్రాజెక్టుల ఊసూ లేదు..

అంతన్నారు.. ఇంతన్నారు.. ఎన్నికల ముందు వరాల బడ్జెట్ అంటూ డప్పు కొట్టారు.. చివరికి ఎలక్షన్ ఇయర్‌లోనూ ఆంధ్రాకు చిల్లర కూడా విదల్చకుండా ఉత్త చెయ్యి చూపారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఈసారి కూడా అమరావతికి మొండిచేయే చూపారు. విభజన హామీలపై ప్రస్తావన లేకపోవడం రాజధాని ప్రాంతవాసులను నిరాశకు గురిచేసింది. రాజధానివాసుల చిరకాల వాంఛ అయిన అమరావతి రైల్వేట్రాక్‌ను ఈసారీ అటకెక్కించారు. విజయవాడ, గుంటూరు మధ్య అమరావతిని అనుసంధానించేలా 106 కిలోమీటర్ల మేర నూతన రైల్వేలైన్ నిర్మాణానికి రూ.3,272 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలకు రైల్వేబోర్డు ఆమోదం తెలిపినా 2019 నుంచి ఏ బడ్జెట్‌లోనూ దాని ఊసెత్తలేదు. ఇక విజయవాడ మెట్రో రైలు కథ కూడా కంచికి చేరింది. విజయవాడ-గూడూరు నాల్గో లైన్‌ను మంజూరు చేయడం కాస్త ఊరట కలిగించే అంశం. విజయవాడ-విశాఖపట్నం మార్గంలో మూడు, నాల్గో లైన్లను కూడా కేటాయిస్తున్నట్టు ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం అమరావతిని నిర్లక్ష్యం చేస్తూ మూడు రాజధానుల స్వరం అందుకోవడంతో అమరావతి రైలు, మెట్రో రైలు ప్రాజెక్టులపై కేంద్రం దృష్టిపెట్టడమే మానేసింది. వేతన జీవులకు పన్ను విధానాల్లో ఊరట కలిగించకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

పేదలకు ఒరిగిందేమీ లేదు



పార్లమెంటులో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ ప్రజా జీవనానికి ఏమాత్రం ఉపశమనం కలిగించేదిలా లేదు. పొంతన లేని గణాంకాలతో బడ్జెట్‌ను కూర్చారు. కార్పొరేట్ పన్నుల్లో ఏవిధమైన మార్పులు లేవు. దిగుమతి సుంకాలు కూడా పాత శ్లాబులకే పరిమితం చేశారు. బడ్జెట్‌లో బీమారంగ వృద్ధికి ఏ విధమైన పన్ను రాయితీ, ప్రోత్సాహకాలు ఇవ్వలేదు. ఆదాయపు పన్ను శ్లాబుల్లో మార్పు లేకపోవడం శోచనీయం. రాయితీలను ఏమాత్రం పెంచలేదు. గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం నిర్మూలించడానికి ఏ విధమైన చర్యలు చేపట్టలేదు. ప్రజల కొనుగోలు శక్తి పెరిగే విధంగా లేదు. ద్రవ్యోల్బణాన్ని నిలువరించలేదు.

- జి.కిషోర్‌కుమార్, ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శి

ఉద్యోగ వర్గాలకు నిరాశ



ఉద్యోగులు ఎంతో ఎదురుచూసిన ఆదాయపు పన్ను వినహాయింపులు లేకపోవటం బాధాకరం. కరోనా తర్వాత జీవన వ్యయం విపరీతంగా పెరిగిపోయింది. ఖర్చులు పెరిగాయి. ఈ క్రమంలో ఎన్నికల ముందు ప్రవేశపెడుతున్న మధ్యంతర బడ్జెట్‌లో ఉపశమనాలు ఉంటాయని మేమంతా భావించాం. తీరా చూస్తే ఆదాయపు పన్నులనే అంటుకోలేదు. చాలా ఆశ్చర్యంగా అనిపించింది. శ్లాబ్‌లు తగ్గించి ఉంటే బాగుండేది. ఉద్యోగులకు ఇది నిజంగా బాధాకరమైన విషయం.

- రాజబాబు, రవాణా నాన్ టెక్నికల్ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు

ధరల నియంత్రణ చర్యలు శూన్యం



ధరల నియంత్రణ చర్యలు ఈ బడ్జెట్‌లో మచ్చుకు కూడా కనిపించలేదు. కరోనా తర్వాత రాకెట్ కంటే వేగంతో పదేళ్లలో పెరగాల్సిన ధరలు ఒక్క ఏడాదిలోనే పెరిగాయి. ఆ తర్వాత బడ్జెట్లలో అయినా ధరల నియంత్రణ చర్యలు చేపడతారనుకుంటే అదీ జరగలేదు. కనీసం ఎన్నికల ముందు అయినా తగ్గిస్తారేమోనని అనుకుంటే అలాంటి చర్యలు చేపట్టకపోవటం బాధాకరం.

- సీహెచ్ కోటేశ్వరమ్మ, గృహిణి

తిరువూరు.. తారుమారు



గందరగోళంగా ఓటర్ల తుది జాబితా

- డబుల్ ఎంట్రీలు 1,728 ఓట్లు
- ఇతర నియోజకవర్గాలవి 2,248 ఓట్లు
- అధికారులకు ఫిర్యాదు చేసినా అవే తప్పులు

తిరువూరు, ఫిబ్రవరి 1 : తిరువూరు నియోజకవర్గం ఓటర్ల జాబితా తప్పులతడకగా తయారైంది. ఒకే ఓటరుకు రెండు మండలాల్లో ఓటు ఉండటంతో పాటు నూజివీడు, మైలవరం, జగ్గయ్యపేట నియోజకవర్గానికి చెందిన బూత్, డోర్ నెంబర్లతో ఓట్లు ఈ జాబితాలో దర్శనమిస్తున్నాయి. నియోజకవర్గ ఓటర్ల జాబితాల్లో 1,728 డబుల్ ఎంట్రీలు, 2,248 ఓట్లు తిరువూరు సహా నూజివీడు, మైలవరం, జగ్గయ్యపేట ప్రాంతాల డోర్ నెంబర్లతో ఉన్నాయి. మొత్తం 3,976 ఓట్లపై అభ్యంతరాలను అధికారులకు అందించినప్పటికీ ఇటీవల విడుదల చేసిన ఓటర్ల జాబితాలో సైతం అవే తప్పులు రావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

డబుల్ ఎంట్రీ ఇలా..

- విస్సన్నపేటలో బూత్ నెంబర్ 175లో ఆకుల సత్యవతికి డోర్ నెంబర్ 1-117 (బీసీ కాలనీ)లో ఓటు ఉండగా, బూత్ నెంబర్ 178, డోర్ నెంబర్ 5-24 (సత్తుపల్లి రోడ్డు)లో ఓటు కల్పించారు.
- ఎ.కొండూరు మండలం చీమలపాడులో బూత్ నెంబర్ 225లో డోర్ నెంబర్ 42-11/1లో షేక్ జానీకి ఓటుహక్కు ఉండగా, తిరువూరు పట్టణంలోని రాజుపేట బూత్ నెంబర్ 81లో డోర్ నెంబర్ 14-17లో మరో ఓటు ఉంది. ఇదే మండలంలోని ఎరుకోపాడు బూత్ నెంబర్ 115లో డోర్ నెంబర్ 1-187లో కొంగల ఆదామ్‌కు ఓటు ఉండగా, విస్సన్నపేట మండలం పుట్రాల బూత్ నెంబర్ 142లో డోర్ నెంబర్ 2-153లో కూడా ఓటు ఉంది.
- గంపలగూడెం మండలం గోసవీడులో బూత్ నెంబర్ 60లో అబ్బూరి వెంకటేశ్వరరావుకు డోర్ నెంబర్ 4-16లో ఓటు ఉండగా, రాజవరం గ్రామంలోని బూత్ నెంబర్ 23లో డోర్ నెంబర్ 1-24 అడ్రసుపై ఓటు ఉంది. నియోజకవర్గ పరిధిలో రెండు ప్రాంతాల్లో ఓట్లు ఉన్నవారు సుమారు 1,728 మంది ఉన్నట్లు సమాచారం.

ఏ నియోజకవర్గం ఓటరో..

నియోజకవర్గ పరిధిలో ఇటీవల ప్రకటించిన ఓటర్ల జాబితాల్లో తిరువూరుతో పాటు మైలవరం, జగ్గయ్యపేట, పశ్చిమ గోదావరి జిల్లా నూజివీడు ప్రాంతాల్లో ఓటు ఉండటంతో ఈ ఓటర్లు ఏ నియోజకవర్గానికి చెందినవారో తెలియని దుస్థితి ఏర్పడింది. ఈ జాబితాల్లో విస్సన్నపేటలో బూత్ నెంబర్ 34లో డోర్ నెంబర్ 5-23లో ఆకుల శ్రీనివాసరావుకు ఓటు ఉండగా, నూజివీడు మండలం హరిశ్చంద్రాపురం శివారు గ్రామం బూత్ నెంబర్ 29లో డోర్ నెంబర్ 6-110/2లో కూడా ఓటు ఉంది. గంపలగూడెం మండలం నెమలిలో బూత్ నెంబర్ 20లో డోర్ నెంబర్ 3-156లో పజ్జూరి ఆంజనేయులుకు ఓటు ఉండగా, చాట్రాయి మండలం పోలవరంలో బూత్ నెంబర్ 25లో డోర్ నెంబర్ 2-295లో ఓటు కల్పించారు. పట్టణంలోని పాత తిరువూరు బూత్ నెంబర్ 33లో డోర్‌నెంబర్ 5-103లో రంగమ్మ అర్యపల్లికి ఓటు ఉండగా, నూజివీడు మండలం మోర్సపూడిలో బూత్‌నెంబర్ 3లో డోర్ నెంబర్ 1-10లో కూడా ఉంది. నడిం తిరువూరు బూత్ నెంబర్ 26లో డోర్‌నెంబర్ 8-105లో అబ్దుల్ అజీద్‌షేక్‌కు ఓటు ఉండగా, జగ్గయ్యపేట మండలం గోపినేనిపాలెం బూత్ నెంబర్ 112లో డోర్ నెంబర్ 2-170/1లోనూ ఓటుహక్కు కల్పించారు. ఒకే జాబితాలో తిరువూరు, మైలవరం, జగ్గయ్యపేట, నూజివీడు నాలుగు నియోజకవర్గాలకు చెందినవారి ఓట్లు 2,248 ఉన్నట్లు గుర్తించారు. ఈ తప్పులపై సంబంధిత అధికారులకు వినతిపత్రం ఇచ్చేందుకు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు సన్నద్ధమవుతున్నారు.

సుమధురం



సుమధుర కళానికేతన్ 50వ వార్షికోత్సవం సందర్భంగా మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో గురువారం తెలుగు హాస్య నాటిక పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

భారీ ర్యాలీ



పశ్చిమ ఎమ్మెల్యేగా గానీ, అనకాపల్లి ఎంపీగా గానీ పోటీ చేయడానికి తనకు టికెట్ ఇవ్వాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి బుద్దా వెంకన్న.. అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్‌ను కోరారు. వన్‌టౌన్‌లోని తన ఇంటి నుంచి దుర్గగుడి వరకు గురువారం ఆయన భారీ ర్యాలీ నిర్వహించారు.

దళితులే దోషులా..!

గన్నవరం టీడీపీ నాయకుడు కాసరనేని రంగబాబుపై దాడి కేసులో తెరవెనుక పన్నాగాలు పన్నుతున్నారా? అసలు దొంగలను వదిలేసి ఓ దళితుడిని ఇరికించే ప్రయత్నాలు చేస్తున్నారా? తెరవెనుక జరుగుతున్న ఈ హైడ్రామాకు కథ, స్ర్కీన్‌ప్లే ఎమ్మెల్యే వంశీ, ఆయన అనుచరగణానిదేనా? డైరెక్షన్ మాత్రం పోలీసులు చేస్తున్నారా? అంటే అవుననే సమాధానమే వస్తుంది.

గన్నవరం టీడీపీ నేతపై దాడి కేసులో హైడ్రామా

- కథ, స్ర్కీన్‌ప్లే ఎమ్మెల్యేది.. డైరెక్షన్ పోలీసులది..
- అసలు సూత్రధారిని తప్పించి దళితుడిని ఇరికించే యత్నం
- ఎమ్మెల్యే తీరుపై దళితుల్లో వెల్లువెత్తుతున్న ఆగ్రహం



నిందితులను గన్నవరం కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

విజయవాడ-ఆంధ్రజ్యోతి/గన్నవరం : గన్నవరానికి చెందిన టీడీపీ నాయకుడు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) మాజీ అధ్యక్షుడు కాసరనేని రంగబాబుపై జనవరి 21న కొందరు వ్యక్తులు దాడి చేశారు. రంగబాబు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారు. దీన్ని ఆసరాగా చేసుకుని 'పొలం కొనుగోలు చేస్తాం.. చూపించండి' అంటూ ఎలైట్ హోటల్ వద్దకు కొందరు పిలిపించారు. ఆయనపై కర్రలతో దాడి చేసి విచక్షణారహితంగా కొట్టారు. ఈ ఘటనలో ఆయన కాళ్లు, చేతులు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. తనకు కంట్లో నలుసుగా ఉన్న టీడీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని వంశీ, ఆయన అనుచరులే ఈ దాడి చేయించారన్నది అందరికీ తెలిసిన సత్యం. కానీ, తన రాజకీయం కోసం దళితుడిని పావుగా వాడుకున్నారు. రంగబాబుపై దాడి చేసింది చిరంజీవేనంటూ అతన్ని కేసులో ఇరికించి ఎమ్మెల్యే, ఆయన అనుచరులు చేతులు దులిపేసుకున్నారు. పోలీసులు సైతం ఎమ్మెల్యే చెప్పినట్టుగా విచారణ సాగించి మమ.. అనిపించారు. చిరంజీవితో పాటు హైదరాబాద్‌కు చెందిన నరేశ్ మరో ముగ్గురిని నిందితులుగా చూపారు.

ఎవరు ఈ చిరంజీవి..?

రంగబాబుపై దాడి కేసులో నిందితుడిగా చూపిన ముగ్గిరాల చిరంజీవిది మధ్యతరగతి దళిత కుటుంబం. గన్నవరం నియోజకవర్గంలోని ఆత్కూరు ఆయన గ్రామం. ఎమ్మెల్యేకి అత్యంత సన్నిహితుడైన రంగా వెనుక తిరిగే వ్యక్తుల్లో చిరంజీవి ఒకరు. రంగబాబుపై దాడి చేయించే స్థాయి ఇతనికి లేదు. వాస్తవానికి ఈ దాడిలో ఉపయోగించిన ఇన్నోవా కారు దాడికి ఒకరోజు ముందు అంటే.. జనవరి 20వ తేదీ మధ్యాహ్నం 2 గంటల సమయంలో హైదరాబాద్ నుంచి బయల్దేరి సాయంత్రం 7 గంటల ప్రాంతంలో విజయవాడ వెటర్నరీ కాలనీకి చేరుకుంది. మరుసటి రోజు మధ్యాహ్నం ఒంటిగంట వరకు అదే ప్రాంతంలో ఉన్న కారు మధ్యాహ్నం 2.30 సమయంలో రంగబాబుపై దాడి జరిగిన ప్రాంతంలో ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. అదేరోజు రాత్రి కారును విద్యాధరపురంలోని కుమ్మరిపాలెం వద్ద వదిలి నిందితులు వెళ్లిపోయారు. 22వ తేదీ ఉదయం 11 గంటలకు కారును గుర్తించి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం కారు కంకిపాడు పోలీసుస్టేషన్ వద్ద ఉంది. అయితే, నిందితులు హైదరాబాద్ నుంచి వచ్చాక వెటర్నరీ కాలనీలోని ఓ ఇంటి వద్ద సుమారు 18 గంటలపాటు ఉన్నారు. ఈ ఇల్లు ఎవరిది? నిందితులకు ఆ ఇంట్లో ఉన్నవారికి సంబంధం ఏవిటనే కోణంలో పోలీసులు విచారణ జరపకుండా చిరంజీవిని ఇరికించడంపై దృష్టి సారించారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. రంగబాబుపై దాడి వెనుక కచ్చితంగా పెద్దస్థాయి వ్యక్తులే ఉన్నారని వారిని తప్పించేందుకు పోలీసులు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారన్నది స్పష్టంగా కనిపిస్తోంది. ఎమ్మెల్యే, ఆయన అనుచరుల కోసం దళితులను పావులుగా వాడుకోవడం ఏమిటని దళిత సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రంగబాబుపై హత్యాయత్నం కేసు అని అలాంటి కేసులో దళితులను ఇరికించడం ఏమిటని దళిత సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

నిందితులకు 14 రోజుల రిమాండ్

రంగబాబుపై జరిగిన దాడి ఘటనలో నిందితులను పోలీసులు అరెస్టు చేసి గురువారం కోర్టులో హాజరుపరిచారు. స్థానిక అదనపు జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి శిరీష నిందితులకు 14 రోజులు రిమాండ్ విధించగా, గన్నవరం సబ్‌జైలుకు తరలించారు. ఆరుగురు వ్యక్తులు కారులో వచ్చి రంగబాబుపై దాడి చేయగా, వారిలో ఐదుగురు మాత్రమే దొరికారని, మరొకరు పరారీలో ఉన్నారని

- మిగతా 6లో

పదిమంది డీఎస్పీల బదిలీ

- విజయవాడ పశ్చిమ ఏసీపీగా మురళీకృష్ణారెడ్డి
- ట్రాఫిక్ ఏసీపీగా అశోక్‌కుమార్ గౌడ్
- మచిలీపట్నం డీఎస్పీగా రాంబాబు

విజయవాడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి పదిమంది డీఎస్పీలు బదిలీ అయ్యారు. ఈ మేరకు డీజీపీ కార్యాలయం గురువారం ఉత్తర్వులు విడుదల చేసింది. అమలాపురం దిశ డీఎస్పీగా ఉన్న ఎస్.మురళీమోహన్‌ను మైలవరం ఏసీపీగా బదిలీ చేశారు. కాకినాడ డీఎస్పీగా ఉన్న పడాల మురళీకృష్ణారెడ్డిని విజయవాడ పశ్చిమ ఏసీపీగా నియమించారు. నూజివీడు డీఎస్పీ ఈ.అశోక్‌కుమార్ గౌడ్‌ను విజయవాడ-2 ట్రాఫిక్ ఏసీపీగా బదిలీ చేశారు. పోలవరం డీఎస్పీ జి.రత్నరాజును విజయవాడ సౌత్ ఏసీపీగా నియమించారు. కృష్ణాజిల్లా సీసీఎస్ డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణకు విశాఖపట్నం నార్త్ ఏసీపీగా పోస్టింగ్ ఇచ్చారు. విజయవాడ పశ్చిమ ఏసీపీగా ఉన్న డాక్టర్ కె.హనుమంతరావును కాకినాడకు బదిలీ చేశారు. విజయవాడ నార్త్ ఏసీపీగా ఉన్న సీహెచ్ రవికాంత్‌ను గుంటూరు నార్త్ డీఎస్పీగా నియమించారు. దిశ ఏసీపీ వీవీ నాయుడును గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీగా పంపారు. విజయవాడ టాస్క్‌ఫోర్స్‌లో ఉన్న బీవీ సుబ్బరాజును గుంటూరు దిశ డీఎస్పీగా బదిలీ చేశారు. మైలవరం ఏసీపీగా ఉన్న మార్గాని రమేశ్‌ను గుంటూరు సీసీఎస్ డీఎస్పీగా నియమించారు. గుంటూరు నార్త్ డీఎస్పీ జవంగుల రాంబాబుకు మచిలీపట్నం డీఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. గుంటూరు సీసీఎస్ డీఎస్పీ కూరపాటి ప్రకాశ్‌బాబును విజయవాడ దిశ డీఎస్పీగా నియమించారు. సైబర్ క్రైం ఏసీపీ సీహెచ్ శ్రీనివాస రావును ప్రకాశం జిల్లా దిశ డీఎస్పీగా బదిలీ చేశారు. విజయవాడ ట్రాఫిక్-2 ఏసీపీ జె.వెంకట నారాయణను పశ్చిమగోదావరి జిల్లా ఎస్ఈబీకి పంపారు.

సిద్ధంగా లేనట్టే..!

వైసీపీ 'సిద్ధం' సభకు ఎమ్మెల్యే వసంత హ్యాండ్

- దెందులూరు సభ నిమిత్తం జనసమీకరణకు ససేమిరా
- మైలవరం జనసమీకరణ బాధ్యతలు కేశినేని నానీకి..
- త్వరలో వైసీపీకి గుడ్‌బై చెప్పనున్న వసంత
- మైలవరం వైసీపీ అభ్యర్థి కోసం వెతుకులాట
- జోగి రమేశ్‌ను పంపే యోచన



(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : వైసీపీ అట్టహాసంగా నిర్వహిస్తున్న 'సిద్ధం' రెండో సభకే ఎన్టీఆర్ జిల్లా నుంచి ఎదురుదెబ్బ తగిలింది. సిద్ధం సభను ఏలూరు ఆశ్రం ఆసుపత్రి సమీపంలో ఈనెల 3వ తేదీన నిర్వహిస్తున్నారు. ఈ సభకు ఉభయగోదావరి జిల్లాలతో పాటు ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి కూడా భారీ ఎత్తున జనసమీకరణ చేయాలని వైసీపీ నాయకులు నిర్ణయించారు. ఈ బాధ్యతను ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులకు అప్పగించారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో అందరు ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు జనసమీకరణలో నిమగ్నమవ్వగా, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాత్రం ఈ హడావుడి తనకు పట్టనట్టు ఉండిపోయారు. వసంత తీరుపై కంగుతిన్న వైసీపీ పెద్దలు బుధవారం ఆయన్ను సంప్రదించగా, తాను సిద్ధం సభకు హాజరుకావడం లేదని, జనసమీకరణ కూడా తాను చేయబోవడం లేదని తేల్చిచెప్పారు. దీంతో అప్పటికప్పుడు మైలవరం నుంచి జనసమీకరణ చేసే బాధ్యతను ఇటీవలే వైసీపీ కండువా కప్పుకొన్న విజయవాడ ఎంపీ కేశినేని నానికి అప్పగించారు.

త్వరలో వైసీపీకి గుడ్‌బై

వసంత కృష్ణప్రసాద్ త్వరలోనే వైసీపీని వీడనున్నారని విశ్వసనీయ సమాచారం. ఆయన టీడీపీ తరఫున పోటీ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. వసంత సైతం వైసీపీ తీరుపై వివిధ వేదికలపై తన అసంతృప్తిని వెళ్లగక్కుతూ వచ్చారు. తాజా పరిణామాల నేపథ్యంలో వసంత వైసీపీని వీడటం ఖాయమైనట్లేనని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. వసంతకు ఏ స్థానాన్ని కేటాయించాలన్న అంశంపై టీడీపీ పెద్దలు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. దానికోసమే ఆయన వేచిచూస్తున్నారని సమాచారం. వసంత వైసీపీని వీడే పక్షంలో మైలవరంలో వైసీపీ కొత్త అభ్యర్థి కోసం వెతుకులాట మొదలు పెట్టాల్సిన పరిస్థితి. ఈ స్థానం నుంచి పోటీ చేయడానికి మంత్రి జోగి రమేశ్ ఉవ్విళ్లూరారు. అధిష్ఠానం ఆయన్ను పెనమలూరు ఇన్‌చార్జిగా నియమించింది. అయితే, గత్యంతరం లేని పరిస్థితుల్లో మైలవరం నుంచి జోగి రమేశ్‌ను బరిలో దింపేందుకు వైసీపీ పెద్దలు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.



ర్యాలీలో పాల్గొన్న ప్రైవేటు డిగ్రీ కళాశాలల ప్రతినిధులు

ప్రభుత్వ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

» ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాల ర్యాలీ

పెనమలూరు, ఫిబ్రవరి1 : డిగ్రీ కోర్సులకు ఏఐసీటీఈ అనుమతి తీసుకోవాలంటూ వచ్చిన నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజిమెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. కామయ్య తోపు నుంచి వీఆర్ సిద్ధార్థ కళాశాల వరకు జరిగిన ర్యాలీలో 15యూనివర్సిటీలకు సంబంధించిన ప్రైవేటు కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు. డిగ్రీ కోర్సులు బీబీఏ, బీసీఏ, బీఎంఎస్ కోర్సులకు ఏఐసీటీఈ అనుమతి తప్పనిసరంటూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను తక్షణం ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. డిగ్రీ కళాశాలల కోర్సులను ఏఐసీటీఈ పరిధిలోకి తీసుకెళ్లే పక్షంలో పేద విద్యార్థికి చదువు ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఏఐసీటీఈ నోటిఫికేషన్ రద్దు చేసి ఏపీలో ఉన్న డిగ్రీ కళాశాలల మనుగడను కాపాడుకోవడానికి ప్రతి డిగ్రీ కళాశాల యాజమాన్యం పూనుకోవాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో అసోసియేషన్ ప్రెసిడెంటు కనుమర్ల గుండారెడ్డి, కార్యదర్శి జెర్రిపోతుల రమణాజీ, ఆర్థిక కార్యదర్శి గుర్రాల వెంకటరెడ్డి, గౌరవాధ్యక్షులు చింతల విజయభాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మచిలీపట్నంలో రిలే దీక్షా శిబిరంలో యూటీఎఫ్ నేతలు

టీచర్లు, ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

» యూటీఎఫ్ రిలే దీక్షలు

మచిలీపట్నం టౌన్ , ఫిబ్రవరి 1 : టీచర్లు, ఉద్యోగులకు అందాల్సిన బకాయిలు చెల్లించాలంటూ యూటీఎఫ్ నాయకులు గురువారం మచిలీపట్నం ధర్నాచౌక్ వద్ద రిలే దీక్షలు చేపట్టారు. దీక్షా శిబిరాన్ని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేఏ ఉమామహేశ్వరరావు సందర్శించి ప్రసంగించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉన్న రూ. 1896 కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రతినెల ఒకటో తేదీన జీతాలు చెల్లించాలన్నారు. రూ.4500 కోట్లు సరెండర్ లీవు ఎన్‌క్యాష్‌మెంట్, రుణాల బకాయిలు, పీఎఫ్ చెల్లింపులు సుమారు రూ.1000 కోట్ల వరకు చెల్లించాల్సి ఉందన్నారు. జిల్లా అధ్యక్షుడు జె.లెనిన్‌బాబు మాట్లాడుతూ, సీపీఎస్, జీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ప్రభుత్వం దిగిరాక పోతే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. దీక్షా శిబిరంలో యూటీఎఫ్ నేతలు నాగేశ్వరరావు, ఝాన్సీ, సీహెచ్ శ్రీధర్, జోగిరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుపతమ్మ రంగులోత్సవం



పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 1 : తిరుపతమ్మ అమ్మవారి రంగులోత్సవం గురువారం వైభవంగా ప్రారంభమైంది. వైదిక కమిటీ నిర్వహించిన శుభముహూర్తం మేరకు గురువారం తిరుపతమ్మ-గోపయ్య, సహదేవతల విగ్రహాలను ఆలయం నుంచి బయటకు తీసుకువచ్చారు. తొలుత చైర్మన్ జంగాల శ్రీనివాసరావు (వాసు), ధర్మకర్తలు, ఆలయ ఈవో కె.రమేష్ నాయుడులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాన్ని ప్రారంభించారు. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం గ్రామానికి చెందిన రజకులు 11 విగ్రహాలను నెత్తిన పెట్టుకొని మేళతాళాలతో భారీ ఊరేగింపుగా పడమర బజారున ఉన్న అమ్మవారి రంగుల మండపం వద్దకు చేర్చారు. ప్రత్యేక పూజల అనంతరం లాటరీ ద్వారా ఎంపిక చేసిన 11 ఎద్దుల బండ్లలో విగ్రహాలతో గురువారం రాత్రి జగ్గయ్యపేటకు బయలుదేరి వెళ్లారు. జగ్గయ్యపేట సీఐ ఎం.జానకిరామ్ పర్యవేక్షణలో ఎస్సై సీహెచ్ కనకదుర్గా ప్రసాద్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. తహసీల్దార్ కె.లక్ష్మి కల్యాణి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, మాజీ చైర్మన్స్ వాసిరెడ్డి బెనర్జీ, నూతలపాటి చెన్నకేశవరావు, కర్ల వెంకట నారాయణ, లగడపాటి వెంకటేశ్వరరావు, గూడపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నిమ్మకాయల రాజప్ప, సౌమ్య

మండవ వరలక్ష్మికి నేతల నివాళి

నందిగామ రూరల్ : నందిగామ మున్సిపల్ చైర్‌పర్సన్ స్వర్గీయ మండవ వరలక్ష్మి సంస్మరణ సభ గురువారం ఆమె ఇంటి వద్ద జరిగింది. కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల నుంచి పార్టీలకతీతంగా రాజకీయనాయకులు, అభిమానులు వేలాదిగా తరలి వచ్చారు. టీడీపీ నేతలు చినరాజప్ప, నెట్టెం రఘురాం, దేవినేని ఉమామహేశ్వరరావు, కేశినేని శివనాథ్, తంగిరాల సౌమ్య, వైసీపీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు, ఎమ్మెల్సీ అరుణ్ కుమార్, జనసేన పార్టీ సమన్వయకర్త రమాదేవిలు వరలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబసభ్యులు పిచ్చయ్య, భవానిశంకర్, శ్రీనివాసరావు, కృష్ణకుమారిలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



రాత్రి సమయంలోనూ మిల్లు వద్దే వేచి ఉన్న రైతులు

ధాన్యం విక్రయాల్లో అవస్థలు!

» ఆన్‌లైన్ చేసినా తీసుకునేందుకు నిరాకరిస్తున్న మిల్లర్

» రెండ్రోజులుగా మిల్లు వద్దే ట్రాక్టర్లతో రైతుల పడిగాపులు

మోపిదేవి, ఫిబ్రవరి 1 : ధాన్యం విక్రయించేందుకు రైతులు నానా అవస్థలు పడాల్సి వస్తున్నది. ఆన్‌లైన్‌లో నమోదు చేసినా ధాన్యం కొనుగోలు చేసేందుకు మిల్లర్లు కొర్రీలుపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రింబవళ్లు మిల్లువద్ద ధాన్యంతో పడిగాపులు పడుతున్నారు. మండలంలోని కె.కొత్తపాలెం గ్రామానికి చెందిన కౌలురైతు మత్తి వెంకట రామారావు తాను సాగు చేసిన రెండు ఎకరాలు నూర్పిడి చేసి ధాన్యం విక్రయించేందుకు పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ఆన్‌లైన్ చేశాడు. ట్రాక్టర్‌పై ధాన్యాన్ని తీసుకుని బుధవారం పెదకళ్లేపల్లిలోని మిల్లుకు తీసుకువెళ్లి ఆన్‌లైన్‌లో వచ్చిన ట్రక్ షీట్‌ను మిల్లరుకు చూపగా.. ధాన్యం రంగు మారింది.. నిబంధనల మేరకు తీసుకోవటం జరగదని మిల్లరు నిరాకరించినట్టు రైతు వాపోయాడు. ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రెండ్రోజులుగా తిరుగుతున్నా మిల్లర్లు నిరాకరిస్తున్నారని, విషయం గ్రామ, మండల స్థాయి రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ స్పందించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చేసేది లేక మిల్లు చెంతనే ధాన్యం ట్రాక్టర్‌పై ఉంచి కాపలా కాయాల్సి వస్తున్నదని రైతు చెబుతున్నారు. రెండు రోజులైనా కనీసం సమాధానం చెప్పే వారు కానరావటం లేదని ఆందోళన చెందుతున్నారు. రైతులకు వైస్ ఎంపీపీ కడవకొల్లు సీతారామాంజనేయులు, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు రంగారావులు బాసటగా నిలిచి ధాన్యాన్ని కొనుగోలు చేయకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

అసంతృప్త మధ్యంతర బడ్జెట్

మధ్యంతర బడ్జెట్‌పై ఉద్యోగ, వ్యాపార, వాణిజ్య రంగాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఎన్నికల 'మధ్యంతర' బడ్జెట్ కావటంతో.. ఎంతో కొత్త రాయితీలు ఉంటాయని భావించాయి. ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విజయవాడ వచ్చినపుడు కూడా వ్యాపార వర్గాల నుంచి పలు ప్రతిపాదనలు అందించటం జరిగింది. ఇవేవీ మధ్యంతర బడ్జెట్‌ను పెద్దగా ప్రభావితం చేయకపోవటంతో ఆయా వర్గాలు అసంతృప్తితో ఉన్నాయి.

» ఉద్యోగ, వ్యాపార వర్గాల పెదవి విరుపు

» ఆదాయ పన్ను ఉపశమనాలు లేవు

» ప్రత్యక్ష, పరోక్ష పన్నుల్లో పారిశ్రామిక వర్గాల నిరాశ

» రైల్వేకు అత్తెసరు కేటాయింపులు.. కొత్త రైళ్లు.. ప్రాజెక్టులూ లేవు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక రంగాలు ప్రధానంగా ప్రత్యక్ష, పరోక్ష పన్ను విధానాలలో మార్పులు, రాయితీలు ప్రకటిస్తారని ఆశించాయి. బడ్జెట్ కోసం ఉత్కంఠగా చూశాయి. మధ్యంతర బడ్జెట్‌లో అలాంటివేమీ లేకపోవటంతో తీవ్ర నిరాశ చెందాయి. ఆదాయపు పన్నులో పరిమితులకు సంబంధించి ఎలాంటి ఉపశమనాలు లేకపోవటంతో ఉద్యోగులు నిరుత్సాహం చెందారు. కరోనా తదనంతర పరిస్థితుల్లో ప్రజల జీవన వ్యయం పెరిగి ఆదాయానికి మించి ఖర్చులు నెలకొన్నాయి. ఆదాయపు పన్ను మినహాయింపుల మీద కనీసం దృష్టి సారించకపోవటంతో వారు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. కొవిడ్ తర్వాత కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ధరలు నియంత్రించేందుకు ఈ బడ్జెట్‌లో కేంద్రం దృష్టి సారిస్తుందనుకుంటే అది జరగలేదు. నిత్యావసరాలపైనా జీఎస్టీలు వేస్తోంది. ఉత్పాదక వర్గాలు నిత్యావసరాలపై జీఎస్టీని తగ్గించాలని కోరినా.. ఈ బడ్జెట్‌లో అలాంటిదేమీ లేకపోవటంతో నిరాశ చెందాయి.

బెజవాడ రైల్వేకు కేటాయింపులు..

విజయవాడ-గూడూరు నాలుగో లైన్‌ను మంజూరు చేసింది. ఈ మార్గంలో ఇప్పటికే మూడోలైన్ పనులు పూర్తి కావస్తున్నాయి. ఈ క్రమంలో నాలుగో లైన్‌ను మంజూరు చేసింది. విజయవాడ-విశాఖపట్నం మార్గంలో మూడు, నాలుగో లైన్లను కూడా కేటాయిస్తున్నట్టు ప్రకటించింది. విజయవాడ-విశాఖపట్నం మధ్య రద్దీ తీవ్రంగా ఉంటుంది. ఈ అదనపు లైన్లు కూడా అందుబాటులోకి వస్తే పశ్చిమబెంగాల్ నుంచి దేశంలో దక్షిణ భాగానికి సరుకు రవాణాతో పాటు, ప్రయాణికులకు సౌకర్యవంతమైన సేవలు అందించటం సాధ్యమౌతుంది. రూ.150 కోట్ల వ్యయంతో 15 గూడ్స్ షెడ్లలో అత్యాధునిక సౌకర్యాలు కల్పించేందుకు



కేటాయింపులు చేయటం జరిగింది. ఇంతకు మించి మధ్యంతర బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు విజయవాడ డివిజన్‌కు జరగలేదు. పాత ప్రతిపాదనల, కొత్త రైళ్ల ఊసు లేదు. విజయవాడ స్టేషన్ రీ డెవలప్‌మెంట్, కోచింగ్ డిపోల గురించి ప్రస్తావనే లేకుండా పోయింది.

ద్రవ్యలోటు తగ్గించలేదు

లక్ష్మీప్రసాద్, అధ్యక్షుడు సీఐఐ, ఏపీ చాప్టర్

ద్రవ్యలోటు 5.1 శాతానికి తగ్గిస్తామని బడ్జెట్‌లో చెప్పినా ఎలా తగ్గిస్తామన్నది స్పష్టం చేయలేదు. నానో డీఏపీ ప్రకటన మంచి పరిణామమే.. తద్వారా రవాణా ఖర్చులు తగ్గి వ్యవసాయానికి మేలు జరుగుతుంది. నూనె గింజల దిగుమతిపై ఆధారపడుతున్న దేశంగా భారత్ పరిశోధనపై దృష్టి సారించాలి. ఆయిల్ పామ్‌కు ప్రోత్సాహకాలు ఇవ్వాల్సి వుంది. దిగుమతి డ్యూటీ తగ్గించడం వల్ల రేటు పడిపోయింది. ప్రపంచంలోనే పెద్దదైన మంచినీటిలో సాగు ఆక్వా పరిశ్రమ ఏపీకి వుంది. కేంద్రం ప్రకటించిన ఐదు ఆక్వా పార్కుల్లో ఏపీకి ఒకటి ఇవ్వాలని కోరుతున్నాం. జై అనుసంధాన్ అని ప్రకటన చేసిన కేంద్రం కనెక్టివిటీ మౌలిక సదుపాయాలపై ప్రధానంగా దృష్టి పెట్టాలి. ప్రాంతాల వారీగా పరిశ్రమలకు కావాల్సిన అంశాలపై కేంద్రానికి ప్రతిపాదనలు పంపుతాం.

నైపుణ్యాలు పెరగాలి

- డి.రామకృష్ణ, సీఐఐ ప్రతినిధి

స్కిల్ ఇండియాపై భారీగా వ్యయం చేస్తున్న కేంద్రం యువత నైపుణ్యాలు, విద్యా సంస్కరణలపై దృష్టి సారించాల్సి వుంది. విశ్వవిద్యాలయాలు బోధిస్తున్న పాఠ్యాంశాలకు, పరిశ్రమ అవసరాలకు భారీ వ్యత్యాసం వుంది. ప్రస్తుత నైపుణ్యాలు సమీప భవిష్యత్ అవసరాలకు ఏమాత్రం సరిపోని పరిస్థితులు వున్నాయి. పరిశ్రమలకు అనుగుణంగా సామర్థ్యాలు పెరగాల్సి వుంది. సామర్థ్యాలు వెంటనే పెరగకపోతే భారత్ తీవ్రంగా ఇబ్బంది పడే అవకాశం వుంది. భారతీయ మానవవనరుల్లో సామర్థ్యాల పెంపు, జీవన నైపుణ్యాలు పెరగాల్సి వుంది.

స్వాగతించిన ఏపీ హోటల్స్ అసోసియేషన్

పర్యాటక రంగం దృష్టిలో పెట్టుకొని మధ్యంతర బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కొన్ని చర్యలు ఆ రంగం అభివృద్ధికి బాటలు వేస్తాయని ఆశిస్తున్నామని ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.వి.స్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐకానిక్ టూరిస్ట్ కేంద్రాల సమగ్ర అభివృద్ధి, ప్రపంచస్థాయిలో బ్రాండింగ్, మార్కెటింగ్ చేసే రాష్ట్రాలను ప్రోత్సహిస్తామని ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం ఆహ్వానించదగ్గదన్నారు. మ్యాచింగ్ ప్రాతిపదికన అటువంటి అభివృద్ధికి ఆర్థిక సహాయం చేయడానికి రాష్ట్రాలకు దీర్ఘకాలిక వడ్డీలేని రుణాలు అందచేస్తామని ఆర్థిక మంత్రి భరోసా ఇచ్చినందుకు రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. చిన్న, పెద్ద హోటళ్ల అభివృద్ధి, ప్రయోజనాలు కూడా పరిగణలోకి తీసుకొని తగు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నట్టు ఆయన తెలిపారు. కేంద్రం ఇచ్చిన ఈ భరోసాకి రాష్ట్ర ప్రభుత్వం కూడా తోడైతే పర్యాటక, అతిథ్య రంగం అభివృద్ధి సాధించడమే కాకుండా, ఉపాధి, ఉద్యోగావకాశాలు ఇంకా పెరుగుతాయని, ఇది అందరికీ మేలు చేస్తుందని భావిస్తున్నట్టు తెలిపారు. దీనితో పాటు హోటల్ రంగానికి చిరకాలంగా ఉన్న సమస్యల పరిష్కారంపై కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


చిన్న హోటళ్ల నుంచి వసూలు చేసే 12 శాతం జీఎస్టీని 7 శాతానికి తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రికి విన్నవించామని, అది అమలు చేసే దిశగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. అలాగే కొవిడ్ తర్వాత హోటల్ రంగం ఇంకా కుదుటపడలేదని, అప్పట్లో ఇచ్చిన వడ్డీ రాయితీ కేవలం మూడేళ్ల వరకే ప్రకటించారని, దీనిని ఆరేళ్లకు పెంచితే హోటల్ రంగం నిలదొక్కుకుంటుందని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో హోటల్ మేనేజ్‌మెంట్, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.

బడ్జెట్ పరిశ్రమలకు నిరాశాజనకం

» ఏపీ ఎంఎస్ఎంఈఐఏ ప్రతినిధులు

ఆటోనగర్(పెనమలూరు) : కేంద్ర మధ్యంతర బడ్జెట్ పరిశ్రమలకు ఏమాత్రం ఊతమిచ్చేదిగా లేదని ఆటోనగర్ పారిశ్రామిక వేత్తలు అభిప్రాయపడ్డారు. గురువారం వారు ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అసోసియేషన్ కేంద్రంలో సమావేశమై మధ్యంతర బడ్జెట్‌లోని అంశాలు, పరిశ్రమలకు ఒనగూరే ప్రయోజనాలపై చర్చించారు. పరిశ్రమల మనుగడకు ఈ బడ్జెట్ ఏ మాత్రం ఉపయోగపడదన్నారు. బడ్జెట్‌లోని అంశాలు నిరాశాజనకంగా ఉన్నాయని పేర్కొన్నారు. కొవిడ్‌లో తీవ్ర నష్టాలను చవిచూసిన పరిశ్రమలను ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం మొండిచేయి చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల అనంతరం కొత్త బడ్జెట్‌లో పరిశ్రమల పునరుత్తేజానికి మరిన్ని ప్రోత్సాహకాలు ఉండేలా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మలినేని నారాయణ ప్రసాద్, అన్నే శివనాగేశ్వరరావు, టి.పార్థసారథి, పొన్నం శ్రీరాం, రమేశ్, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, అన్నే నరసింహరావు, టీవీ కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





బంటుమిల్లి ప్రధాన కాలువ నీటి మట్టం పరిశీలిస్తున్న కాగిత

సాగు, తాగు నీటికి కటకట!

» ఆరుతడి పంటలకు అందని సాగునీరు!

» తాగునీరూ ఇవ్వలేని ప్రభుత్వం : కాగిత

బంటుమిల్లి : కనీసం ప్రజలకు తాగునీటిని కూడా అందించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని పెడన ఇన్‌చార్జ్ కాగిత అన్నారు. గురువారం మండల పార్టీ కన్వీనర్ కూనపరెడ్డి వీరబాబు ఆధ్వర్యంలో పెడన ఇన్‌చార్జ్ కాగిత కృష్ణప్రసాద్, టీడీపీ నాయకులు, రైతులు బంటుమిల్లి ప్రధానకాల్వను పరిశీలించారు. అనంతరం జలవనరుల శాఖ డీఈ బి.వి.ఎస్ గణపతికి అర్జీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరుతడి పంటలకు నీరివ్వలేని వారు రైతులకు సబ్సిడీపై అపరాలు ఎందుకిచ్చారని ప్రశ్నించారు. మూడు పంటలకు నీరు ఇస్తామని ప్రగాల్భాలు పలికిన వైసీపీ నేతలు ఆరుతడి పంటలకే కాదు కనీసం తాగునీటిని కూడా ఇవ్వడం లేదని ఎద్దేవా చేశారు. బంటుమిల్లి ప్రధాన కాలవ నీటిమట్టం సుమారు రెండు అడుగులు మాత్రమే ఉండగా.. కనీసం ఐదు అడుగులు నిలకడగా ఉంటేనే మంచినీటి చెరువులు నింపవచ్చన్నారు. డీఈ గణపతిని వివరణ కోరగా.. బంటుమిల్లి ప్రధాన కాలవకు ఈనెల 29న గుడ్లవల్లేరు నుంచి వంద క్యూసెక్కుల నీరు వదిలారని తెలిపారు. నాలుగు వందల క్యూసెక్కులకు పైగా వదిలితేనే బంటువిల్లి ప్రధాన కాలవపై ఉన్న పంచాయతీ చెరువులు నింపుకోవచ్చని తెలిపారు. జలాశయాల్లో తగినంత నీటి నిల్వలు లేకపోవడమే సమస్యలకు కారణమని తెలిపారు. కార్యక్రమంలో జేఈ రాజ్యలక్ష్మీ, బొర్రా కాశీ,యిల్లూరి లీలాకృష్ణ, చెన్ను శ్రీనివాసరావు, రేవు గోపాలకృష్ణ, కంఠమనేని మురళీ, యార్లగడ్డ శ్రీనివాసరావు, తాతా రాజా, కొండా, బొల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడికి ఇంజన్లే దిక్కు..



సాగునీటి కోసం మోటార్ల ఏర్పాటు

అవనిగడ్డ రూరల్ : ఆరుతడి పంటలకు సాగునీరు అందకపోవటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జలాశయాలు అడుగంటడంతో పంట తడిపేందుకు నీటికోసం దివిసీమ రైతులు నానా ఆగచాట్లు పడుతున్నారు. చెరువులు, కుంటలు నింపుకోవటానికి సాగునీరు విడుదల చేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు తమ పంట పొలాలకు నీరు మళ్లించుకుంటున్నారు. దివిసీమలోని మోదుమూడి వంతెన వద్ద సుమారు ఏడు మోటార్లతో నీటిని తోడే కార్యక్రమం చేపట్టారు. రాత్రి, పగలు ఆరుతడి పంటలు కాపాడుకోవటానికి రైతులు శ్రమిస్తున్నారు. మినుము రైతుకు నీటి ఎద్దడి తలెత్తటంతో దివిసీమలోని పలు ప్రాంతాల్లో సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆరుతడి పంటలు తడుపుకోవటానికి సాగునీటిని విడుదల చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

గొర్రెల్లా తరలించి.. తలుపులు మూసేసి..

» నరకం చూపిన ఆసరా సంబరం

» ఆద్యంతం ప్రతిపక్షాలపైనే విమర్శలు

» అసహనంతో మధ్యలోనే వెళ్లిపోయిన డ్వాక్రా సంఘాల మహిళలు

అవనిగడ్డ, ఫిబ్రవరి 1 : నాల్గవ విడత ఆసరా సంబరాల కార్యక్రమం డ్వాక్రా మహిళలకు నరకాన్ని చూపింది. మండలంలో సుమారు 7600 మందికి పైగా ఉన్న డ్వాక్రా మహిళలను ఎట్టి పరిస్థితుల్లో కనీసం ఐదువేలకు తగ్గకుండా ఆసరా సంబరాల కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలని ప్రజాప్రతినిధులు, నేతలు వెలుగు సిబ్బందికి హుకుం జారీ చేయడంతో బుక్ కీపర్లు, వీవోఏలు పెద్ద సంఖ్యలో మహిళలను సమీకరించారు. అయితే గురువారం టీటీడీ కళ్యాణమండపంలో నిర్వహించిన ఆసరా సభలో తగిన ఏర్పాట్లు చేయకపోవటంతో మహిళలు నరకాన్ని చవిచూశారు. కనీసం కుర్చీలు, తాగునీరు అందుబాటులో లేకుండా గొర్రెల మందను తోలినట్టు తమను కళ్యాణ మండపంలో కుక్కి అధికారులు వేడుక చూడటం ఏమిటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం జరుగుతుండగానే వెనుతిరిగి వెళ్లేందుకు ప్రయత్నించగా వైసీపీ నేతలు మహిళలను బయటకు వెళ్లకుండా గేట్లు మూసేయటంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ తలుపులు తోసుకుని మరీ గుంపులుగా బయటికి వెళ్లిపోయారు. నాల్గవ విడత ఆసరాలో భాగంగా మండలంలో లబ్ధిదారులకు రూ.9.35 కోట్ల చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రారంభించారు. పార్టీ నేతలంతా ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తూ కార్యక్రమాన్ని రాజకీయ సభగా మార్చివేయటంతో ఇందుకోసమేనా? బలవంతంగా తరలించారని మహిళలు అసహనం వ్యక్తం చేశారు.



ఆసరా సభ మధ్యలోనే వెళ్లిపోతున్న డ్వాక్రా మహిళలు

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణలంక, ఫిబ్రవరి 1 : ఉమ్మడి జిల్లాలోని 13 డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికిగాను 5వ తరగతి, ఇంటర్మీడియట్, ఐఐటీ/నీట్ శిక్షణతో కూడిన ప్రవేశాలకు ఈనెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయకర్త బి.సుమిత్రాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 2080 సీట్లు (5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 1040, జూనియర్ ఇంటర్ ఎంపీసీ-440, బైపీసీ-440, ఎంఈసీ-80, సీఈసీ-80) వున్నట్టు చెప్పారు. హెచ్‌టీటీపీ://ఏపీబీఆర్‌ఏజీసెట్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్, హెచ్‌టీటీపీ://ఏపీబీఆర్‌ఏజీసెట్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్/ఇంటర్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని, దరఖాస్తు సమయంలోనే గురుకులాన్ని ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఇంటర్‌లో అదనంగా నీట్, ఐఐటీ శిక్షణ కావాలనుకొనే వారు ఆప్షన్ ఇచ్చుకోవాలన్నారు. వీరికి ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహిస్తారని, ఉత్తమ ప్రతిభ చూపితే రాష్ట్రస్థాయికి ఎంపికై కర్నూలు, గుంటూరు, విజయవాడ కేంద్రాల్లో చేరవచ్చన్నారు. మార్చి 10న ప్రవేశపరీక్ష వుంటుందని, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు 10వ తరగతి సిలబస్, 5వ తరగతిలో ప్రవేశాలకు 4వ తరగతి సిలబస్‌లో పరీక్ష వుంటుందని తెలిపారు. గురుకులాల్లో ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, వీటిని సద్వినియోగం చేసుకోవచ్చని సుమిత్రాదేవి సూచించారు.

అర్హతలు : 5వ తరగతి ప్రవేశాలకు ఎస్సీ, ఎస్టీ వారు 1-9-2011 నుంచి 31-8-2015 మధ్య, ఓసీ, బీసీ విద్యార్థులు 1-9-2013 నుంచి 31-8-2015 మధ్య జన్మించి వుండాలి.

- ఇంటర్ కోసం 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షలకు హాజరుకావాలి.
- 3, 4 తరగతులు సొంతజిల్లాలో గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివి, వార్షికాదాయం రూ.1 లక్ష దాటకూడదు.
- ఎస్సీలకు 75శాతం, ఎస్సీ కన్వర్టెడ్ క్రిస్టియన్-12, ఎస్టీ-6, బీసీ-5, ఇతరులకు రెండు శాతం రిజర్వేషన్. వీరిలో దివ్యాంగులకు 3 శాతం, ప్రత్యేక విభాగాలకు చెందిన వారు, సైనిక ఉద్యోగుల పిల్లలకు 15 శాతం సీట్లు కేటాయిస్తారు.

ఎంపీడీవోల బదిలీలు

ఆంధ్రజ్యోతి- విజయవాడ/భవానీపురం : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లా ఎంపీడీవోలను గురువారం బదిలీ చేశారు. వీరి స్థానంలో ప్రకాశం, గుంటూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి పలువురు ఎంపీడీవోలకు పోస్టింగ్‌లు ఇచ్చారు.

బదిలీపై వచ్చిన వారు..

జి.లక్ష్మీదేవి(ప్రకాశం) ఉయ్యూరు, ఎస్‌కే.మహబూబ్ సుభాని(గుంటూరు) పమిడిముక్కల, సి.చంద్రశేఖర్(గుంటూరు) మొవ్వ, ఐ.సత్యనారాయణ(గుంటూరు)తోటవల్లూరు, ఎస్.నాగలక్ష్మి(గుంటూరు) చల్లపల్లి, మారుతీ శేష మాంబ(గుంటూరు) ఘంటసాల, ఈ.మహేశ్వరరావు(తూర్పుగోదావరి) ఉంగుటూరు, ఎం.భారతి(తూర్పుగోదావరి) పామర్రు, కె.రత్నకుమారి(తూగోజిల్లా) బాపులపాడు, జీవీఎస్.రామకృష్ణంరాజు(పగోజిల్లా) గూడూరు, కుంజా జ్యోతి(పగోజిల్లా) గుడివాడ, ఎంవీఆర్ కుమార్‌బాబు(తూగోజిల్లా) పెనమలూరు, కె.శివపార్వతి(గుంటూరు) వీరులపాడు, ఎ.శ్రీరమ్య(గుంటూరు) విజయవాడ రూరల్, ఎ.దీప్తి(గుంటూరు) చందర్లపాడు, పి.ఉమాదేవి(గుంటూరు) ఇబ్రహీంపట్నం, ఎన్.వెంకటేశ్వరరావు(గుంటూరు) కంచిక చర్ల, ఎ.శ్రీనివాసరావు(గుంటూరు) జి.కొండూరు, టీసీకేజే భరత్‌రాజ్(తూగోజిల్లా) వత్సవాయి, పి.శ్రీనివాస్(పగోజిల్లా) మైలవరం, ఎస్.ఆశీర్వాదం(పగోజిల్లా) రెడ్డిగూడెం,జి. విజయకుమారి(పగోజిల్లా) నుంచి విస్సన్నపేట, ఎం.విశ్వనాథ్(పగోజిల్లా) నందిగామ, డి.రాంబాబు(గుంటూరు) ఎ.కొండూరుకు బదిలీపై వచ్చారు.

5 నుంచి 20 వరకు ఇంటర్ ప్రాక్టికల్స్

» మార్చి 1 నుంచి థియరీ పరీక్షలు

» 23కు వాయిదా పడిన ఎన్విరాన్‌మెంటల్

» 2న ఎథిక్స్ ఎన్విరాన్‌మెంట్ పరీక్షలు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 1 : ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 5 నుంచి 20వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందుకు గాను 93 పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశారు. 77 కేంద్రాలు ఎంపీసీ, బైపీసీ, 16 కేంద్రాలు ఒకేషనల్ విద్యార్థులకు ఎంపిక చేశారు. శుక్రవారం ఎథిక్స్ ఎన్విరాన్‌మెంట్ పరీక్షలు జరగనున్నాయి. 3వ తేదీ జరగాల్సిన ఎన్విరాన్‌మెంట్ పరీక్షను 23వ తేదీకి వాయిదా వేశారు. జిల్లాలో మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న థియరీ పరీక్షలు 59 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించనున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరానికి 21340 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షకు 20161 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. 131 కళాశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. పరీక్షల ఏర్పాట్లపై మచిలీపట్నం ఆశీర్వాద భవన్‌లో ఆర్ఐవో రవికుమార్ చీఫ్ సూపరింటెండెంట్‌లు, కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

కేశినేని నానికి మతి భ్రమించింది

» కేశినేని శివనాథ్ (చిన్ని)

విద్యాధరపురం : కేశినేని శ్రీనివాస్ (నాని)కి మతి భ్రమించిందని టీడీపీ సీనియర్ నేత కేశినేని శివనాథ్ (చిన్ని) వ్యాఖ్యానించారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కుక్కకు ఉన్నపాటి విశ్వాసం నానికి లేదన్నారు. సైకోలందరు ఒక చోటకు చేరాయంటూ విమర్శించారు. అతను ఎంపీగా పోటీ చేస్తే మూడు లక్షల ఓట్ల తేడాతో ఓటమి పాలవుతాడని, అసలు జగన్ అతడికి టికెట్ ఇస్తాడో లేదో కూడా చెప్పలేమన్నారు. నాని ప్రజాజీవితం ఇంతటితో ముగుస్తుందని పేర్కొన్నారు. వైసీపీలో ఎవరూ తోడు దొరక్క అవినాశ్‌కి ముఖ్య అనుచరుడిగా ఉన్నాడన్నారు.

దళితులే దోషులా..!

(5వ పేజీ తరువాయి)

పోలీసులు చెబుతున్నారు. ఏ1గా ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామానికి చెందిన ముగ్గిరాల చిరంజీవిని పెట్టారు. ఏ2గా అడప వెంకటరాజు (మహాత్మా గాంధీ నగర్, హైదరాబాద్), ఏ3గా అబ్దుల్ యహియ (హైదరాబాద్), ఏ4గా మహమ్మద్ జహీర్ (రాజేంద్రనగర్ మండలం, రంగారెడ్డి జిల్లా), ఏ5గా మహమ్మద్ జునైద్ (బహదూర్‌పుర, హైదరాబాద్)పై 326 సెక్షన్ నమోదు చేశారు. రంగబాబు చాలాకాలంగా వైసీపీలో ఉండి, ఈ మధ్యకాలంలో టీడీపీలో చేరి, ఎమ్మెల్యే వల్లభనేని వంశీని, సీఎం వైఎస్ జగన్‌ను, కుటుంబ సభ్యులను అసభ్యంగా బూతులు తిట్టడం వల్ల దాడి చేసినట్టు పోలీసులు తెలిపారు. కేసులో ఇన్నోవా కారును సీజ్ చేశామని, మరో ముద్దాయి అతీక్ పరారీలో ఉన్నాడని, స్కోడా కారును పట్టుకోవాల్సి ఉందని సీఐ ప్రసాద్ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114, 122, 133
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.25

రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి: కమిషనర్



కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న రామిరెడ్డి

రాణిగారితోట: ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ అధికారులను ఆదేశించారు. ఆయన గురువారం17వ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన డివిజన్‌లోని గ్రంథాలయం వద్ద సీసీ రోడ్ వేయాలని, బాలాజీనగర్‌లో పబ్లిక్ టాయిలెట్ ఎదురుగా రోడ్డు ప్యాచ్ వర్క్ చేయాలని, డ్రెయిన్ల మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి డివిజన్‌లో పలుచోట్ల వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరగా వెంటనే వాటిని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సీఈ ఎం.ప్రభాకర్‌రావు, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజధాని లేని రాష్ట్రంగా మార్చిన జగన్

కుట్టుమిషన్‌లు, ఇస్త్రీ పెట్టెలు, తోపుడు బండ్ల పంపిణీలో గద్దె

మొగల్రాజపురం, ఫిబ్రవరి 1: రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని, మళ్లీ వైసీపీకి ఓటేస్తే అంతే సంగతులని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. మొగల్రాజపురం 7వ డివిజన్ బందిలదొడ్డి సెంటర్‌లో కేశినేని శివనాథ్ (చిన్ని), జనసేన నాయకులతో కలిసి మహిళలకు కుట్టుమిషన్‌లు, రజకులకు ఇస్త్రీ పెట్టెలు, తోపుడు బండ్లను గద్దె పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్ సీఎం అయిన తరువాత తీసుకున్న నిర్ణయాల వల్ల రాష్ట్రం పరువు పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు అధికారంలో ఉన్నపుడు నిరుద్యోగ యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించారని, టైలరింగ్, కుటీర పరిశ్రమల ఏర్పాటు వంటి వాటితో వారిని నిలబెట్టామన్నారు. అమరావతిని నిర్వీర్యం చేసి రాజధాని లేని రాష్ట్రంగా మార్చారని అన్నారు. జనసేన నాయకులు అమ్మిశెట్టి వాసు మాట్లాడుతూ కల్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చిన జగన్ బీసీలు, ఎస్సీ, ఎస్టీల వెన్ను విరిచాడన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం జనసేన అధినేత పవన్ చంద్రబాబుకు అండగా ఉన్నారని ప్రజలు కూడా అశీర్వదించి టీడీపీ- జనసేనకు మద్దతుగా నిలవాలని కోరారు. టీడీపీ నాయకులు సొంగా సంజయ్ వర్మ, కొక్కిర తిరపతయ్య, పేరేపి ఈశ్వర్, రాయి రంగమ్మ, గోగుల రమేష్, పలిశెట్టి అన్నారావు, జనసేన నాయకులు గాదిరెడ్డి అమ్ములు, పటాల హరిప్రసాద్, చందు శివరాం ప్రసాద్, వెంకట్ పాల్గొన్నారు.



కుట్టుమిషన్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్, జనసేన నాయకులు

మహాశక్తితో మహిళలకు ఆర్థిక భరోసా : బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్: టీడీపీ మినీ మేనిఫెస్టోతో మహిళలకు, అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక భరోసా ఉంటుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ మహిళలతో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న ఉద్దేశ్యంతో తమ అధినేత చంద్రబాబు మహాశక్తి పథకాన్ని రూపొందించారన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రంలో సుస్థిరపాలన సాధ్యమని రాబోయే ఎన్నికల్లో మళ్లీ చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న బొండా ఉమా

టీడీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని సెంట్రల్ టీడీపీ కార్యాలయంలో గురువారం 59వ డివిజన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన పార్టీలు ప్రకటించిన ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలకు తీసుకెళ్లి వారిని చైతన్యవంతులు చేయాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



వివేకానంద స్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ గురుప్రకాష్, సీఐ వెంకటనారాయణ

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 1 : రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అజిత్‌సింగ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని న్యూ రాజరాజేశ్వరిపేట, అజిత్‌సింగ్‌నగర్, రామకృష్ణాపురం, దేవినగర్, తదితర ప్రాంతాల్లో పలు పోలింగ్ కేంద్రాలను సీఐ జి. గురుప్రకాష్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో మొత్తం 24 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిలో సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు.

సత్యనారాయణపురం: స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలోని పోలింగ్‌బూత్‌లను సీఐ వెంకట నారాయణ గురువారం పరిశీలించారు. స్టేషన్ పరిధిలో 14 ప్రాంతాల్లో ఉన్న 60 పోలింగ్‌స్టేషన్‌లను సిబ్బందితో కలిసి పరిశీలించారు. మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు.

వన్‌టౌన్: వన్‌టౌన్ పోలీసు స్టేషన్ సీఐ దుర్గా శేఖరరెడ్డి గురువారం పోలింగ్ బూత్‌ల వద్ద మౌలిక సదుపాయాలను పరిశీలించారు. సామారంగం చౌక్, మెయిన్ బజార్, రమణయ్య కూల్ డ్రింక్ షాపు సెంటర్, తారాపేట, వెస్ట్ రైల్వే స్టేషన్ బుకింగ్ ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించారు.

గుణదల: గుణదల పోలీస్ స్టేషన్ సీఐ వాసిరెడ్డి శ్రీను పోలింగ్ బూత్‌లను గురువారం పర్యవేక్షించారు. సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను పర్యవేక్షించారు. కార్మెల్‌నగర్లోని పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లి పోలింగ్ సిబ్బందికి రక్షణ ఎలా కల్పించాలి, పోలింగ్ ఏజెంట్ల వివరాలపై దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. పోలింగ్ ఏజెంట్లకు కౌన్సెలింగ్ నిర్వహించి పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించేలా ప్రణాళిక సిద్ధం చేసుకునేందుకే పోలింగ్ కేంద్రాలను సందర్శించినట్లుగా సీఐ తెలిపారు.



కృష్ణలంక ఐడియల్ స్కూల్‌లో చిన్నారి డాక్టర్లు

కృష్ణలంక, ఫిబ్రవరి 1: కృష్ణలంక పాత పోలీసు స్టేషన్ రోడ్డులోని సుధాకర్స్ ఐడియల్ స్కూల్‌లో ఎల్‌కేజీ విద్యార్థులు గురువారం డాక్టర్ల అవతారమెత్తారు. యాక్టివిటీ ప్రోగ్రాంలో భాగంగా డాక్టర్ దుస్తులు ధరించిన చిన్నారులు మెడలో స్టెతస్కోప్ ధరించి మిగిలిన విద్యార్థులకు పంటి పరీక్షలు నిర్వహించారు. పళ్లను ఏ విధంగా తోముకోవాలి, పంటి సంరక్షణకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై స్కూల్ టీచర్ కనకమహాలక్ష్మి చిన్నారులకు డిజిటల్ క్లాస్ నిర్వహించారు. స్కూల్ చైర్మన్ సుధాకరరెడ్డి, ప్రిన్సిపాల్ రామకోటేశ్వరరావు, స్కూల్ హెడ్ దేవినేని వరలక్ష్మి, ఉపాధ్యాయినులు నందరపు కనకమహాలక్ష్మి, గాయత్రి, శ్రీదేవి, సంధ్య, భారతి, అన్నపూర్ణ, రమాదేవి, ఉమ, శిరీష, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి శ్రీదత్తసాయి మందిరం వార్షికోత్సవం

సత్యనారాయణపురం, ఫిబ్రవరి 1: పశుపతోట దత్తసాయి మందిరంలో ఈ నెల 7నుంచి 9వరకూ మందిరం 9వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నామని మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీర మోహనరావు తెలిపారు. దత్తసాయి మందిరంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో వార్షికోత్సవ వివరాలను తెలిపారు.

ఇద్దరు మద్యం విక్రేతలపై కేసు

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 1 : నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న ఓ మహిళ, మరో వ్యక్తిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం న్యూ రాజరాజేశ్వరిపేటలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగుతున్నట్టు సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో మహిళ ఐ. కనకమ్మ, మరో వ్యక్తి జగన్నాధం షణ్ముఖ్‌లు మద్యం సీసాలు కలిగి ఉండటాన్ని గుర్తించారు. మహిళ వద్ద నుంచి 26 మద్యం సీసాలు, షణ్ముఖ్ వద్ద నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే పోలీసుల తనిఖీలు : ఒకరి అరెస్టు

రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 1: రైల్వేస్టేషన్‌లో మంగళగిరికి చెందిన జంజనం శ్రీనివాస్ వద్ద రైల్వే పోలీసులు గురువారం రూ. 11,210 విలువ గల ఏడు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, అతనిని అరెస్టు చేశారు. జీఆర్‌పీ సీఐ పి. శ్రీనివాస్, ఆర్‌పీఎఫ్ సీఐ టి.చంద్రశేఖరరెడ్డి, ఎస్ఐ ఖాదర్ హుసేన్, ఆర్‌పీఎఫ్ ఎస్ఐ మక్కతలాల్ నాయక్ సిబ్బంది తదితరులు స్టేషన్‌లోని పలుప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు

వివాహిత కనిపించడం లేదని ఫిర్యాదు

సితారసెంటర్ కొండబడి సమీపంలో ఉంటున్న తాడిశెట్టి మహాలక్ష్మి(30) అదృశ్యమైనట్లు ఆమె తల్లి కొండమ్మ గురువారం భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మహాలక్ష్మి, దుర్గాప్రసాద్ దంపతులకు ఇద్దరు సంతానం. మనస్పర్థల వల్ల భార్యాభర్తలు విడిగా ఉంటున్నారు. తల్లి ఇంటికి సమీపంలోనే మహాలక్ష్మి ఉంటోంది. గత నెల 9న విశాఖపట్నంలో బంధువులు చనిపోతే మహాలక్ష్మి, ఆమె పిల్లలు, కొండమ్మ వెళ్లారు. అత్త ఫోన్ చేసి సంక్రాంతికి పిల్లలను తీసుకు రమ్మని చెప్పడంతో మహాలక్ష్మి గత నెల 16న పిల్లలతో విజయవాడ బాల భాస్కర్ నగర్‌లోని అత్తింటికి వచ్చి, పిల్లలను వదిలి వెళ్లిపోయింది. 19న కుమార్తె గురించి కొండమ్మ ఆరా తీయగా ఆమె ఆచూకీ తెలియరాలేదు. ఫోన్‌కు కూడా స్పందన లేదు. దీంతో కొండమ్మ భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఘనంగా ఐఈటీఈ స్టూడెంట్స్ ప్లాటినం జూబ్లీ వేడుకలు



బెస్ట్ స్టూడెంట్ ఫోరం అవార్డును అందుకుంటున్న పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు

వన్‌టౌన్, ఫిబ్రవరి 1: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, టెలికమ్యూనికేషన్ ఇంజనీర్స్ (ఐఈటీఈ) స్టూడెంట్స్ ప్లాటినం జూబ్లీ వేడుకలు గురువారం వన్‌టౌన్‌లోని పొట్టి శ్రీరాములు చలువాది మల్లిఖార్జునరావు సాంకేతిక ఇంజనీరింగ్ కాలేజీలో ఘనంగా జరిగాయి. ఐఈటీఈ, పొట్టి శ్రీరాములు సాంకేతిక ఇంజనీరింగ్ కాలేజీ, ఐఈటీఈ స్టూడెంట్స్ ఫోరం సంయుక్త సహకారంతో ఈ వేడుకలను నిర్వహించారు. ఐఈటీఈ విజయవాడ సెంటర్ చైర్మన్ డాక్టర్ బి.రాజశేఖర్ మాట్లాడుతూ, సంస్థ లక్ష్యాలను, ఇంజనీరింగ్ విద్యార్థులకు ఏవిధంగా సహకరిస్తున్నదీ వివరించారు. సంస్థ కార్యదర్శి డాక్టర్ కల్లూరి సుజిత్ మాట్లాడుతూ, సాంకేతిక అంశాల్లో ఆలోచనల మార్పిడికి తమ సంస్థ ఉమ్మడి వేదికగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా 2023 సంవత్సరానికి బెస్ట్ స్టూడెంట్స్ ఫోరం అవార్డును పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కాలేజీకి అందజేశారు. కళాశాల కార్యదర్శి పి.లక్ష్మణస్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ జే లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ పతంజలి శాస్త్రి, ఈసీఈ విభాగాధిపతి ఏ వీ కిరణ్మయి, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సామా మణికంఠ, కో- ఆర్డినేటర్ శిఖామణి తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉత్సవ్ కరపత్రం ఆవిష్కరణ



మొగల్రాజపురం, ఫిబ్రవరి 1: జనశిక్షణా సంస్థాన్ ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి 11వరకు నిర్వహి స్తున్న మహిళా ఉత్సవ్ 2024ను జయప్రదం చేయా లని సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాఖన్నా విజ్ఞప్తి చేశారు. గురువారం మొగల్రాజపురం కార్యాలయంలో మహిళా ఉత్సవ్ కార్యక్రమం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొగల్రాజపురం మొగల్ ఎగ్జిబిషన్ హాలులో నిర్వహించే ఉత్సవ్‌లో మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు, ప్రింటెడ్ చీరలు, బాతిక్ పెయింటింగ్, స్క్రీన్ ప్రింటింగ్, చేనేత చీరలు, ఫ్యాషన్ జ్యూయలరీ, ఫుడ్ ప్రాసెసింగ్ ఉత్పత్తులు, పిండి వంటలు, సబ్బులు, బొమ్మలు, అనేక రకాల వస్తువులు విక్రయిస్తారని అన్నారు. ఈ వేదిక మీద మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తామన్నారు. జ్యూస్‌ల తయారీ, మెహందీ పోటీలు, హెయిర్ స్టైల్ , వస్త్రధారణ , పెయిటింగ్ పోటీలు వంటివి పోటీలో ఉంటాయన్నారు. డైరెక్టర్ పూర్ణిమ, సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

● సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్



డ్రెయిన్‌ను శుభ్రం చేస్తున్న జి.కోటేశ్వరరావు

భవానీపురం,ఫిబ్రవరి 1 : నగరంలో దోమలు ప్రజలపై దండయాత్రలు చేస్తున్నాయని, ఒకవైపు ప్రజలు కంటి మీద కునుకు లేకుండా అల్లాడుతుంటే మరోవైపు అధికార వైసీపీ ప్రజాప్రతినిధులు మొద్దు నిద్ర నటిస్తున్నారని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం కార్పొరేషన్ అధికారులు అయినా స్పందించి వెంటనే నగరంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి దోమల నివారణకు చర్యలను చేపట్టాలని డిమాండ్ చేశారు. 43వ డివిజన్ ఊర్మిళానగర్‌లో గురువారం పారిశుధ్య పనులను చేపట్టి నిరసన ప్రకటించారు. డ్రెయినేజీల్లోకి దిగి సైడు కాల్వలను ఆయన శుభ్రం చేశారు. డెంగీ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధుల బారినపడకుండా ప్రజలను కాపాడాలన్నారు. మహిళా సమాఖ్య నగర ప్రధాన కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ, నాయకులు ఎర్రసాని జోసెఫ్, సైకం నారాయణెడ్డి, ఎస్‌కే.ఉస్మాన్, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎం.సాయికుమార్‌లు పాల్గొన్నారు.

నామమాత్రపు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్

● చార్టర్డ్ అకౌంటెంట్ సీహెచ్ అమర సుధీర్

వన్‌టౌన్, ఫిబ్రవరి 1: కేంద్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నామమాత్రపు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని చార్టర్డ్ అకౌంటెంట్ సీహెచ్ అమర సుధీర్ అన్నారు. బడ్జెట్ సందర్భంగా కేబీఎన్ కాలేజీ యూజీ, పీజీ కామర్స్, మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ అంటే కేవలం కొద్ది కాలానికి మాత్రమే వర్తించేదని తెలిపారు. ప్రభుత్వం చేసే వ్యయాలను ఆమోదించేందుకు బడ్జెట్‌లో ప్రవేశపెడతారన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ నామమాత్రంగానే ఉందన్నారు. మరో ఆడిటర్ బీవీఎస్ లింగమూర్తి మాట్లాడుతూ, ఎన్నికల తరువాత వచ్చే కొత్త ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతుందన్నారు. మరో ఆడిటర్ గుండా గంగాధర్ మాట్లాడుతూ, దేశ భవిష్యత్తు కోసం బడ్జెట్ అవసరమన్నారు. విద్యార్థులు బడ్జెట్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీజీ డైరెక్టర్ ఎస్ వెంకటేష్, విభాగాధిపతులు హేమంత్, రవికుమార్ పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన పెంపొందించాలి

పాయకాపురం, ఫిబ్రవరి 1 : చట్టాలపై మహిళలకు అవగాహన పెంపొందించాలని మహిళా పోలీసులకు నున్న రూరల్ సీఐ ఎన్. దుర్గాప్రసాద్ సూచించారు. నున్న రూరల్ సీఐగా ఆయన పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా గురువారం మహిళా పోలీసులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.



పేదలకు కూరగాయలు పంపిణీ చేస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, టీడీపీ నాయకులు

గద్దె అనురాధ జన్మదినం సందర్భంగా

పేదలకు కూరగాయల పంపిణీ

కృష్ణలంక, ఫిబ్రవరి 1: జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ జన్మదినం సందర్భంగా కృష్ణలంక 22వ డివిజన్‌లోని టీడీపీ కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు పి.అన్నారావు, వేముల దుర్గారావులు అనురాధ చేతుల మీదుగా పేదలకు కూరగాయలు పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 5 వరకు పార్టీ నాయకులు పేదలకు అవసరమైన నిత్యావసర వస్తువులను పంపిణీ చేయడం ముదావహమన్నారు. అనంతరం టీడీపీ నాయకులు అనురాధతో కేక్ కట్ చేయించారు. 500 మంది మహిళలకు కూరగాయలు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు రాజ్యలక్ష్మి, రమాదేవి, శాంతిబాబు, రవికిరణ్ పాల్గొన్నారు.

రాణిగారితోట: జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ పుట్టిన రోజు సందర్భంగా రాణిగారితోట టీడీపీ నాయకులు మైలమూరి పీరుబాబు గురువారం శ్రీ వెంకట సాయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, నిత్యావసరాలు, మందుల పంపిణీతో పాటు అన్నదానం చేశారు. వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ జాబితాను బీఎల్వోలతో మరోమారు వెరిఫికేషన్ చేయించండి

చిట్టినగర్, ఫిబ్రవరి 1: సెంట్రల్ నియోజకవర్గం ఓటర్ జాబితాలో తప్పులు ఉన్నాయని, బిఎల్‌వోలతో పూర్తి స్థాయిలో వెరిఫికేషన్ చేయించాలని టీడీపీ సెంట్రల్ నియోజకవర్గం నాయకులు గురువారం వీఎంసీ కార్యాలయంలో సిటీప్లానర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. వేరే నియోజకవర్గాల నుంచి ఫాం -8 పేరిట ఓట్లను అధిక సంఖ్యలో సెంట్రల్ నియోజకవర్గానికి మార్పులు చేస్తున్నారని, వెంటనే ఫాం- 8 ద్వారా వచ్చిన ఓట్లను బిఎల్‌వోలతో సక్రమంగా వెరిఫికేషన్ చేయించాలని కోరారు. డబల్ ఓట్లు ఎక్కువగా ఉన్నాయని, ఓటర్ లిస్టులో ఒకే కుటుంబ ఓట్లు క్రమపద్ధతిలో వచ్చేలా చూడాలని వారు కోరారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

చిరంజీవి నో.. వెంకటేశ్ ఎస్ ?





ఇండస్ట్రీలో ఒక హీరో నో చెప్పిన చిత్రాలకు మరో హీరో ఎస్ చెప్పడం పరిపాటే. తాజాగా టాలీవుడ్‌లోనూ అలాంటి సంఘటనే చోటు చేసుకుందని ఇండస్ట్రీ టాక్. దిల్ రాజు నిర్మాతగా దర్శకుడు అనిల్ రావిపూడి చిరంజీవి కోసం ఓ కథను సిద్ధం చేశారనే మాట కొన్నాళ్లుగా పరిశ్రమలో వినిపిస్తోంది. ప్రాజెక్ట్ కూడా దాదాపు ఓకే అయినట్లేనని భావించారు. కానీ ఆ కథ చిరంజీవిని మెప్పించలేకపోయిందనే మాట ప్రస్తుతం వినిపిస్తోంది. దాంతో వెంకటేశ్ దగ్గరకు వెళ్లిన అనిల్ రావిపూడి అదే కథను ఓకే చేయించుకున్నారనీ, త్వరలోనే అధికారిక ప్రకటన రావొచ్చని సమాచారం. అయితే ఇంతకీ ఆ కథలో చిరంజీవికి ఏం నచ్చలేదు, వెంకటేశ్‌కు ఏం నచ్చి ఓకే చేశారు అనేది ఆ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చి ప్రేక్షకుల ముందుకు వచ్చేవరకూ మిస్టరీగానే మిగిలిపోతుంది.

కొత్త ప్రపంచంలోకి వెళతారు



గీతానంద్

'ఇదొక యూనిక్ స్టోరీ. రెగ్యులర్‌గా కాకుండా కొత్తగా చూపించాలని ప్రయత్నించాం. లూజర్ నుంచి విన్నర్‌గా హీరో ఎలా మారాడు అనేది ఆసక్తికరంగా ఉంటుంది' అన్నారు గీతానంద్. ఆయన హీరోగా నటించిన 'గేమ్ ఆన్' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా గీతానంద్ మీడియాతో మాట్లాడుతూ 'మా తమ్ముడు దయానంద్ డైరెక్టర్ కావడంతో స్క్రిప్ట్ విషయంలో ఇద్దరం బాగా చర్చించుకున్నాం. ఇద్దరం కలసి ఇంతకుముందు షార్ట్ ఫిల్మ్స్ చేశాం. ఈ సినిమా విషయంలో ఆ అనుభవం మాకు హెల్ప్ అయింది. నిర్మాత రవి కస్తూరి కూడా నాకు ఫ్రెండ్ కావడంతో ముగ్గురం కలసి చర్చించుకుని నిర్ణయాలు తీసుకొనేవాళ్లం. రియల్ టైమ్ సైకలాజికల్‌గా సాగే ఈ సినిమాతో ప్రేక్షకులు కొత్త గేమ్ వరల్డ్‌లోకి వెళ్లిపోతారు' అని చెప్పారు. సీక్వెల్ కోసం వేరే ప్లానింగ్ ఉందనీ, ఈ సినిమాకు వచ్చే రియాక్షన్ బట్టి దాన్ని ప్రకటిస్తామని తెలిపారు.



సుహాస్ హీరోగా దుష్యంత్ కటికినేని దర్శకత్వం వహించిన 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో హీరో విజయ్ దేవరకొండ ఈ చిత్రం బిగ్‌టికెట్‌ను రిలీజ్ చేసి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు.

పన్నెండు గుంజల పందిరి కింద



చైతన్యరావు, భూమిశెట్టి జంటగా నటించిన చిత్రం 'షరతులు వర్తిస్తాయి'. కుమారస్వామి దర్శకత్వంలో నాగార్జున సామల, శ్రీష్ కుమార్ గుండా, డాక్టర్ కృష్ణకాంత్ చిత్తజల్లు నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రం నుంచి 'పన్నెండు గుంజల పందిరి కింద' అంటూ సాగే గీతాన్ని దర్శకుడు శేఖర్ కమ్ముల చేతులు మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ పాట చూస్తుంటే తెలంగాణ మట్టి వాసన కనిపిస్తోంది. పెద్దింటి అశోక్ కుమార్ సాహిత్యం, సురేశ్ బొబ్బిలి సంగీతం ఆకట్టుకున్నాయి. ఇకపై ప్రతిపెళ్లిలో ఈ పాట వినిపిస్తుంది' అన్నారు. మా సినిమాకు ఈ పాట ప్రత్యేకాకర్షణ అవుతుందని దర్శకుడు తెలిపారు.

ఎవరూ టచ్ చేయని పాయింట్‌తో...

'బిగ్‌బాస్' అమర్‌దీప్ హీరోగా, నటి సురేఖా వాణి కుమార్తె సుప్రీత హీరోయిన్‌గా నటించే చిత్రం షూటింగ్ గురువారం ప్రారంభమైంది. హీరోహీరోయిన్లపై చిత్రీకరించిన తొలి షాట్‌కు నిర్మాత ఎ.ఎం.రత్నం కెమెరా స్విచ్ ఆన్ చేయగా, బసిరెడ్డి క్లాప్ ఇచ్చారు. వీరశంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ 'భారతీయ సినిమా చరిత్రలో ఇంతవరకూ ఎవరూ టచ్ చేయని పాయింట్‌తో ఈ సినిమా తీస్తున్నాం' అని చెప్పారు. 'బిగ్‌బాస్' హౌస్‌లోకి వెళ్లకముందే ఈ సినిమాకు సైన్ చేసినట్లు హీరో అమర్‌దీప్ చెప్పారు. నటి సురేఖా వాణి మాట్లాడుతూ 'ఈ ప్రాజెక్ట్ విన్న తర్వాత వీళ్లు చేస్తారా లేదా అనే అనుమానం వచ్చింది. దర్శకనిర్మాతల మీద నమ్మకంతోనే నా బిడ్డను వాళ్ల చేతులో పెట్టా' అన్నారు. ఈ చిత్రానికి మాటలు: మరుధూరి రాజా, ఫొటోగ్రఫీ: బాల సరస్వతి.



విశ్వంభర కోసం సన్నద్ధం



చిరంజీవి కథానాయకుడిగా 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'విశ్వంభర'. రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుండడంతో చిత్రీకరణలో పాల్గొనేందుకు చిరంజీవి సన్నద్ధమవుతున్నారు. సరికొత్త లుక్‌లో కనిపించేందుకు జిమ్‌లో కసరత్తు మొదలుపెట్టారు. దీనికి సంబంధించిన వీడియోను గురువారం ఆయన సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. 'విశ్వంభర' కోసం సిద్ధమవుతున్నానని ఆ వీడియోలో చిరంజీవి తెలిపారు. యువీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ భారీస్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఎం. ఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఛోటా కే నాయుడు సినిమాటోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు.




రూఫ్‌టాప్ సోలార్ ద్వారా

300 యూనిట్ల ఉచిత విద్యుత్తు

» అదనపు విద్యుత్తును విక్రయించుకునేందుకూ అవకాశం

» 'ప్రధానమంత్రి సూర్యోదయ యోజన' పేరుతో కొత్త పథకం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: కేంద్ర ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్‌లో గృహవిద్యుత్తు వినియోగానికి సంబంధించి 'ప్రధానమంత్రి సూర్యోదయ యోజన' పేరిట సరికొత్త పథకాన్ని ప్రకటించింది. ఇందులో భాగంగా.. ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు చేసుకున్న వారికి నెలకు 300 యూనిట్ల వరకు ఉచితంగా వినియోగించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపింది. అంతేకాకుండా.. అదనపు విద్యుత్తును డిస్ట్రిబ్యూషన్ కంపెనీలకు విక్రయించవచ్చని, తద్వారా ఏడాదికి రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు ఆదా చేసుకోవచ్చని పేర్కొంది. ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్‌కు కూడా ఈ పథకాన్ని వినియోగించవచ్చని తెలిపింది. ఈ సోలార్ సిస్టమ్ ఏర్పాటు ద్వారా వ్యాపార అవకాశాలు పెరుగుతాయని, వీటి తయారీ, సరఫరా, ఇన్‌స్టాలేషన్, నిర్వహణతో పెద్దసంఖ్యలో యువతకు ఉపాధి లభిస్తుందని వివరించింది. జనవరి 22న అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ అనంతరం ప్రధాని మోదీ ఈ పథకాన్ని ప్రకటించిన విషయాన్ని నిర్మలా సీతారామన్ గుర్తు చేశారు. ప్రభుత్వరంగ సంస్థ అయిన ఆర్ఈసీ లిమిటెడ్‌కు ఈ పథకం అమలు బాధ్యతలు అప్పగించినట్లు ప్రకటించారు. ఏడాదిలోగా దేశంలో కోటి ఇళ్లకు రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు చేయాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 2019 మార్చి 8న న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ మంత్రిత్వ శాఖ రెసిడెన్షియల్ రూఫ్‌టాప్ సోలార్ (ఆర్‌టీఎస్) ఫేజ్-2ను ప్రారంభించింది. కేంద్ర ఆర్థిక సహాయం, సబ్సిడీతో రెసిడెన్షియల్ సెక్టార్‌లో 4 వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యంతో ఆర్‌టీఎస్‌ను ఏర్పాటు చేయాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నారు. 2023 నవంబరు నాటికి 2651.10 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఆర్‌టీఎస్‌ను ఏర్పాటు చేశారు. తాజాగా ప్రధానమంత్రి సూర్యోదయ యోజనలో మరింత మెరుగైన సబ్సిడీ ఇచ్చే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.



రూ.లక్ష కోట్లతో ప్రత్యేక నిధి

» ఆధునిక రంగాల్లో పరిశోధనలకు దన్ను

» రక్షణ రంగంలో డీప్‌టెక్‌ను బలోపేతం చేసేందుకు కొత్త పథకం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ఆధునిక రంగాల్లో పరిశోధనలు, ఆవిష్కరణలను పెంచేందుకు వీలుగా ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా 50 ఏళ్లపాటు వడ్డీరహిత రుణాలను అందించనుంది. ఇందుకుగాను రూ.లక్ష కోట్లతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయనుంది. ఈ నిధితో నామమాత్ర లేదా వడ్డీ లేకుండా దీర్ఘకాలిక రుణాలను ఇవ్వనున్నారు. మరోవైపు రక్షణ రంగంలో డీప్‌టెక్‌ను బలోపేతం చేసేందుకు గాను నూతన పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించనుంది.

ఆదాయ పన్ను రేట్లు మారలే!

» దిగుమతి సుంకాలు, ప్రత్యక్ష పరోక్ష పన్ను రేట్లలో ఎలాంటి మార్పులూ చేయట్లేదని నిర్మలమ్మ వెల్లడి

» ఐటీ పరిమితి పెంపుపై సగటు వేతనజీవికి నిరాశే

ఊహించిందే జరిగింది. నిర్మలమ్మ పద్దులో సగటు వేతనజీవికి ఎలాంటి ఊరటా లభించలేదు. దిగుమతి సుంకాలతో సహా.. ప్రత్యక్ష, పరోక్ష పన్ను రేట్లలో ఎలాంటి మార్పులూ చేయబోవట్లేదని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. అంటే.. ఆదాయపన్నుకు సంబంధించి ప్రస్తుతం ఉన్న పాత, కొత్త విధానాలు యథాతథంగా కొనసాగుతాయన్నమాట. అయితే.. 1962 నుంచి అపరిష్కృతంగా ఉన్న చిల్లర, వివాదాస్పద పన్ను డిమాండ్ నోటీసుల్లో కొన్నింటిని ఉపసంహరించుకోవడం ద్వారా 1.1 కోట్ల మందికి రూ.3500 కోట్ల మేర ప్రయోజనం కల్పించే ప్రకటన ఒకటి నిర్మల తన బడ్జెట్ ప్రసంగంలో చేశారు. 2009-10 ఆర్థిక సంవత్సరం వరకూ పెండింగ్‌లో ఉన్న ఈ తరహా వివాదాస్పద పన్ను డిమాండ్లలో రూ.25 వేలలోపు ఉన్నవాటిని.. 2010-11 ఆర్థిక సంవత్సరం నుంచి 2014-15 ఆర్థిక సంవత్సరం వరకూ పెండింగ్‌లో ఉన్న పన్ను నోటీసుల్లో రూ.10 వేల లోపు ఉన్న వాటిని ఉపసంహరించుకుంటామని ఆమె ప్రకటించారు. ఉదాహరణకు.. 2001లో ఒక వ్యక్తి రూ.5000 పన్ను చెల్లించాడనుకుందాం. కానీ, అతడి ఆదాయం ప్రకారం చెల్లించాల్సింది రూ.30 వేలు. ఈ వ్యత్యాసాన్ని గుర్తించిన ఆదాయపన్ను అధికారులు మిగతా రూ.25 వేలూ చెల్లించాలని డిమాండ్ నోటీసు ఇస్తారు. దానికి ఆ వ్యక్తి.. తాను అంత పన్ను చెల్లించక్కర్లేదని జవాబు ఇస్తాడు. ఇలా 2001 నుంచి పెండింగ్‌లో ఉన్న ఆ వ్యవహారం తాజాగా నిర్మలా సీతారామన్ ప్రకటించిన మినహాయింపుతో పరిష్కారమైపోతుంది. ఇలాంటి ప్రత్యక్ష పన్ను డిమాండ్లు 2.68 కోట్లు ఉన్నాయని.. వాటి విలువ రూ.35 లక్షల కోట్ల దాకా ఉంటుందని రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. వాటిలో 2.1 కోట్ల డిమాండ్లు రూ.25 వేలలోపువేనని.. అందులో 2009-10 లోపువి 58 లక్షలు.. 2010-11 నుంచి 2014-15 దాకా ఉన్నవి 53 లక్షలని.. మొత్తం కలిపి 1.1 కోట్ల డిమాండ్లు అని ఆయన వివరించారు. కాగా.. సావరిన్ వెల్త్ ఫండ్స్, పెన్షన్ ఫండ్లు పెట్టిన పెట్టుబడులకు, 'యాక్షన్ ప్లాన్ ఆఫ్ స్టార్టప్ ఇండియా' పథకం కింద స్టార్టప్ కంపెనీలకు, ఐఎఫ్ఎస్‌సీ (ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీస్ సెంటర్స్) యూనిట్లకు.. ఇస్తున్న పన్ను ప్రయోజనాలు ఈ ఏడాది మార్చి 31తో ముగిసిపోనున్నాయి. వాటిని మరో ఏడాది పాటు (2025 మార్చి 31 దాకా) కొనసాగించాలని నిర్ణయించినట్లు నిర్మల వెల్లడించారు. ఆదాయపన్ను రిటర్నుల ప్రాసెసింగ్ సమయం 2013-14 నాటికి సగటున 93 రోజులుగా ఉండేదని.. తమ ప్రభుత్వం ఇప్పుడు ఆ సమయాన్ని 10 రోజులకు తగ్గించివేసిందని, తద్వారా రిఫండ్లు వేగంగా వస్తున్నాయని గుర్తుచేశారు.

రూపాయి రాక

కార్పొరేట్ పన్ను	17
ఆదాయపు పన్ను	19
కస్టమ్స్ సుంకం	4
కేంద్ర ఎక్సైజ్ సుంకం	5
జీఎస్టీ	18
పన్నేతర ఆదాయం	7
రుణేతర మూలధన వసూళ్లు	1
రుణాల ద్వారా	28

కేంద్ర పథకాలకు	16
వడ్డీ చెల్లింపులకు	20
రక్షణకు	8
సబ్సిడీలకు	6
ఆర్థిక సంఘం, ఇతర బదిలీలకు	8
కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటా	20
కేంద్ర ప్రాయోజిత పథకాలకు	8
పింఛన్లు, ఇతర ఖర్చులకు	13

రూపాయి పోక

మధ్యంతర బడ్జెట్‌లో మహిళ, శిశు అభివృద్ధి శాఖకు రూ.26 వేల కోట్లు కేటాయించారు.

ప్రధాన మంత్రి ముద్ర యోజన పథకం ద్వారా రూ. 22.5 లక్షల కోట్ల విలువైన 43 కోట్ల రుణాలను మంజూరు చేసినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు.

రాష్ట్రాలకు వడ్డీలేని రుణాల పథకాన్ని మరో ఏడాది పాటు పొడగించనున్నారు. రాష్ట్రాలకు మూలధన వ్యయం పెంచేందుకు ఈ ఏడాది రూ.1.3 లక్షల కోట్ల మేరకు వడ్డీ లేని రుణం కల్పిస్తామని వెల్లడించారు.

ఆర్థికం పరుగుకు 'కూ.. చుక్‌చుక్..!

» ఎనర్జీ-మినరల్-సిమెంట్ సరఫరాకు ఒకటి

» హై-ట్రాఫిక్ మార్గాలుగా మరొకటి

» పోర్టులతో కనెక్టివిటీకి ఇంకొక కారిడార్

» 40వేల బోగీలు 'వందేభారత్' స్థాయికి అప్‌గ్రేడ్

2.55 లక్షల కోట్లతో రైల్వే బడ్జెట్

3 కారిడార్లుగా రైల్వే శాఖ

న్యూఢిల్లీ: ఆర్థికం పరుగులు పెడుతూ.. జీడీపీకి ఊతవిచ్చేలా రైల్వేలను అభివృద్ధి చేస్తామని కేంద్ర బడ్జెట్ స్పష్టం చేసింది. తాజా నిర్ణయాలతో ప్రయాణికుల సేవలు మరింత మెరుగవుతాయని పేర్కొంది. ప్రస్తుత రైల్వే నెట్‌వర్క్‌ను మూడు కారిడార్లుగా విభజించడంతోపాటు.. 40 వేల సాధారణ ప్యాసింజర్ బోగీలను వందేభారత్ స్థాయికి అప్‌గ్రేడ్ చేస్తామని రైల్వే బడ్జెట్‌లో స్పష్టం చేసింది. ఈ సారి రైల్వే బడ్జెట్‌లో రూ.2,55,393 కోట్లను ప్రకటించగా.. గత ఏడాది కంటే ఇది రూ.15 వేల కోట్లు ఎక్కువ కావడం గమనార్హం..!

మూడు భాగాలుగా రైల్వే..!

రైల్వే శాఖను మూడు ప్రధాన ఆర్థిక కారిడార్లుగా అభివృద్ధి చేస్తారు. వీటిల్లో మొదటి కారిడార్ ఎనర్జీ-మినరల్-సిమెంట్‌కు సంబంధించినదని, రెండో దానికి పోర్టులతో కనెక్టివిటీ ఉంటుంది. ఇక మూడోది.. రవాణా సాంద్రత ఎక్కువగా ఉండే కారిడార్. ఈ మూడు కారిడార్లను 'పీఎం గతిశక్తి పథకం' కింద గుర్తించి, వివిధ మార్గాల ద్వారా అనుసంధానిస్తారు. ఈ కారిడార్ల వల్ల సరుకు రవాణా, ప్యాసింజర్ రైళ్ల కార్యకలాపాలు మెరుగవుతాయని, ప్రమాదాలను నివారించే సురక్షిత సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని కేంద్రం భావిస్తోంది. అన్నింటికీ మించి, ఈ మూడు కారిడార్ల వల్ల జీడీపీ పెరుగుదల ఉంటుందని అభిప్రాయపడుతోంది. 40 వేల సాధారణ రైలు బోగీలను వందేభారత్ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. ఈ నిర్ణయం వల్ల ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించవచ్చని కేంద్రం భావిస్తోంది. ఇప్పటికే దేశంలో వందేభారత్ సెమీ-హైస్పీడ్ రైళ్లు నడుస్తుండగా.. రానున్న రోజుల్లో వీటి సంఖ్య మరింత పెరగనుంది. ప్రస్తుతం వందేభారత్ రైళ్లను స్లీపర్ కోచ్‌లుగా అప్‌గ్రేడ్ చేస్తున్నారు.

పట్టణీకరణ నేపథ్యంలో..

దేశంలో పట్టణీకరణ వేగవంతంగా జరుగుతున్న నేపథ్యంలో.. పట్టణాల రూపురేఖల మార్పునకు మెట్రోరైల్, నమో భారత్ రైళ్లు మరింత ఊతమివ్వనున్నట్లు కేంద్రం అభిప్రాయపడింది. గత ఏడాది అక్టోబరులో ప్రధాని నరేంద్ర మోదీ రీజినల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్(ఆర్ఆర్‌టీఎస్) రైలును ఢిల్లీ-మేరఠ్ మధ్య ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ రైళ్ల పేరును నమో భారత్‌గా మార్చారు. 200 కిలోమీటర్లలోపు ప్రాంతీయ ప్రాంతాలను ఈ రైళ్లు అనుసంధానం చేస్తాయి. ప్రస్తుతం దేశంలోని 20 నగరాల్లో 895 కిలోమీటర్ల మేర మెట్రోరైలు సేవలు కొనసాగుతుండగా.. మరో 986 కిలోమీటర్ల మేర మెట్రోలైన్లు



శిరోముండనం కేసును ఆరు నెలల్లో తేల్చండి

» విశాఖ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టుకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రధాన నిందితుడిగా ఉన్న దళితుల శిరోముండనం కేసు విచారణను ఆరు నెలల్లో పూర్తి చేయాలని విశాఖ ఎస్సీ ఎస్టీ కేసుల ప్రత్యేక కోర్టును హైకోర్టు ఆదేశించింది. బాధితులు కోటి చిన్నరాజు, డి.వెంకటరత్నం సమర్పించిన కుల ధృవీకరణ పత్రాలను సాక్ష్యాలుగా పరిగణించకపోవడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. దిగువ కోర్టు చర్య సీఆర్పీసీ సెక్షన్ 311, ఎస్సీ ఎస్టీ చట్టం ఉద్దేశానికి విరుద్ధంగా ఉందని పేర్కొంది. కుల ధృవీకరణ పత్రాలను సాక్ష్యాలుగా పరిగణించేందుకు నిరాకరిస్తూ విశాఖ ఎస్సీ ఎస్టీ ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేసింది. కోర్టు ఉత్తర్వులు అందిన 6నెలల్లోగా విచారణను పూర్తి చేయాలని ప్రత్యేక కోర్టును ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు తీర్పుఇచ్చారు. దళితులకు శిరోముండనం చేసిన ఘటనలో తూర్పుగోదావరి జిల్లా ద్రాక్షారామం పోలీసులు 1997లో ఎస్సీ, ఎస్టీ చట్టంతో పాటు ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రస్తుత వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మరికొందరిని నిందితులుగా పేర్కొన్నారు. ఈ కేసు దర్యాప్తు పూర్తిచేసి డీఎస్పీ ట్రయల్ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. దానికి ఫిర్యాదుదారుల కులధృవీకరణ పత్రాలను జత చేయలేదు. కేసు ట్రయల్ ముగుస్తున్న దశలో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ రెండు అనుబంధ పిటిషన్లు దాఖలు చేస్తూ ఫిర్యాదుదారులను విచారణకు పిలిచి వారి కుల ధృవీకరణ పత్రాలను సాక్ష్యాలుగా పరిగణించాలని అభ్యర్థించారు. అందుకు నిరాకరిస్తూ 2021 సెప్టెంబరు 21న ఎస్సీ ఎస్టీ ప్రత్యేక కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ బాధితుడు కోటి చిన్నరాజు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో నేర నిరూపణకు కుల ధృవీకరణ పత్రం చాలా కీలకమని చిన్నరాజు తరపు న్యాయవాదులు వాదించారు. బాధితుల కుల ధృవీకరణ పత్రాలను స్వీకరించేలా ట్రయల్ కోర్టును ఆదేశించాలని అభ్యర్థించారు. ఇరువైపుల వాదనలు పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి.. బాధితులు సమర్పించిన కుల ధృవీకరణ పత్రాలను సాక్ష్యాలుగా పరిగణించడానికి నిరాకరిస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

శిరోముండనం కేసులో వైసీపీ నేతలకు హైకోర్టు షాక్

» నిందితులపై కేసు కొట్టేసేందుకు నిరాకరణ

» రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సీతానగరం పోలీస్ స్టేషన్‌లో ఘటన

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): దళిత యువకుడు వరప్రసాద్ శిరోముండనం కేసులో అధికార వైసీపీ నాయకులకు హైకోర్టు షాక్ ఇచ్చింది. తూర్పు గోదావరి జిల్లా, సీతానగరం పోలీస్ స్టేషన్‌లో దళిత యువకుడు వరప్రసాద్‌కు శిరోముండనం చేసిన ఘటనలో తమపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ నిందితులు దాఖలు చేసిన పిటిషన్లను తోసిపుచ్చింది. దర్యాప్తు దశలో ఉన్న కేసును కొట్టివేయడానికి వీల్లేదని సుప్రీం కోర్టు పలుతీర్పులు ఇచ్చిందని న్యాయస్థానం గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో వ్యాజ్యాన్ని కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. నిందితులపై తదుపరి చర్యలను నిలువరిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం తీర్పు ఇచ్చారు. ఇసుక మాఫియాను ఎదిరించినందుకు వైసీపీ నాయకుడు కవల కృష్ణమూర్తి ప్రోద్బలంతో అతని అనుచరులు ఏకంగా తూర్పు గోదావరి జిల్లా, సీతానగరం పోలీస్ స్టేషన్‌లోనే దళిత యువకుడు వరప్రసాద్‌కు శిరోముండనం చేశారు. ఈ ఘటన అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దళిత, ప్రజా సంఘాలు నిరసనకు దిగడంతో వరప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా వైసీపీ నేత కవల కృష్ణమూర్తి, అతని బంధువులు, అనుచరులు కవల వెంకట నాగదుర్గాశివ ప్రసాద్, కే వీరబాబు, కే నాగేంద్రబాబు, అడపా పుష్కరం, అడపా భూషణంపై సీతానగరం రాణా పోలీసులు 2020 జూలైలో కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ నిందితులు అదే ఏడాది హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన న్యాయస్థానం నిందితులపై తదుపరి చర్యలు నిలుపుదల చేస్తూ 2020 సెప్టెంబరు 4న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధాన పిటిషన్‌పై ఇటీవల విచారణ జరిపిన న్యాయమూర్తి గురువారం నిర్ణయాన్ని వెల్లడించారు. కేసును కొట్టివేసేందుకు నిరాకరిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

ఎవరికి కావాలి మీ సర్వే?

(మొదటి పేజీ తరువాయి)

మరికొందరు ఇలా.. సచివాలయ సిబ్బందిని ఎక్కువమంది గడపలోనే నిలదీస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు రెండు నెలల ముందు కులగణన సర్వే చేపట్టడంతో రాష్ట్ర వ్యాప్తంగా కుటుంబాల నుంచి నిరసనలు వ్యక్తమవుతోంది. పైగా సర్వే చేపట్టినట్లు ఓటీపీ చెప్పాల్సి రావడంపై ఆయా కుటుంబాలు అసహనం వ్యక్తం చేస్తున్నాయి. కులగణన పేరిట వేస్తున్న సంబంధ ప్రశ్నలకు స్పందిస్తే ఉన్న పథకాలు పోతాయన్న బెంగ కొందరిలో కనిపిస్తోంది. ఉపయోగం లేని సర్వే అన్న అభిప్రాయమే ఎక్కువమందిలో ఉంది. గతంలో టీడీపీ వాళ్లు కరపత్రాలు పంపిణీ చేస్తున్న సందర్భంగా ఆ పార్టీ సానుభూతిపరుల కుటుంబాల నుంచి ఓటీపీ అడిగి నమోదు చేసేవారు. ఈ విషయం తెలుసుకున్న వైసీపీ నేతలు ఎవరొచ్చినా ఓటీపీలు చెప్పొద్దని అప్పట్లో ప్రచారం చేశారు. ఇప్పుడు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఓటీపీలు అడుగుతుండటంతో జనం నిరాకరిస్తున్నారు. పలువురు ఫోన్లు చేసి ఓటీపీ చెప్పమని కోరుతున్నారు. అయితే, సర్వే కోసమే వారు ఫోన్ చేస్తున్నారా? లేక బ్యాంకుల్లో డబ్బులు కాజేసే ముఠా చేసే ఫోన్లా? అనేది తేల్చుకోలేక పలువురు ఆందోళనకు గురి అవుతున్నారు. ఏతావాతా సచివాలయ సిబ్బందికి సహకరించేందుకు అత్యధికులు ముందుకు రావడం లేదు. మరోవైపు అధికారులు.... సచివాలయ ఉద్యోగులపై ఒత్తిడి తెస్తున్నారు. 90శాతం సర్వే పూర్తి కాకుంటే సస్పెండ్ చేస్తామంటూ బెదిరిస్తున్నారు. దీంతో సచివాలయ ఉద్యోగుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది.

ఒక్క నెలలోనే 10 ఓటీపీలు...: సర్వే సేకరణలో చిత్తశుద్ధి లేకపోవడంతో ఎక్కువ కుటుంబాలు సర్వేకు సహకరించడం లేదని తెలుస్తోంది. దీంతో సచివాలయ ఉద్యోగులు కులం వరకు తెలుసుకుని మిగతా వివరాలన్నీ తమకు తోచినట్టు నమోదు చేస్తున్నారు. కానీ, ఓటీపీలు ఇచ్చేందుకు ఎక్కువమంది అంగీకరించడం లేదు. దీంతో సర్వేలకు వెళ్లినవాళ్లు ఇబ్బందులు పడుతున్నారు. పైగా వలస వెళ్లిన కుటుంబాల నుంచి కూడా సర్వే వివరాలు సేకరించాలని సచివాలయ ఉద్యోగులపై ఒత్తిడి పెంచారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు పలు రకాల పథకాలు, సర్వేల పేరుతో ఒక్క జనవరి నెలలోనే 10 సార్లు ఆయా కుటుంబాల నుంచి ఓటీపీ తీసుకుని ఎంటర్ చేశారు. కులగణనకు సంబంధించిన వివరాలు సేకరించాలంటే ముందుగా ఒక సారి ఓటీపీ ఎంటర్ చేసి సర్వే పూర్తయిన తర్వాత మరోసారి ఓటీపీ ఎంటర్ చేస్తున్నారు. కులగణన పేరుతో ఆయా కుటుంబాలకు సంబంధించిన అన్నీ వివరాలు సేకరిస్తుండటంతో వారు సర్వేకు సహకరించడం లేదు. పదే పదే ఓటీపీలు చెప్పమని విసిగిస్తుండటంతో సర్వేలు మాకొద్దు అంటూ మొహం మీదనే చెప్తున్నారు. ఈ నెలలో ప్రభుత్వం ఆరోగ్య సురక్ష, ఆరోగ్య శ్రీకార్డు, ఆరోగ్యశ్రీ యాప్, ఆడుదాం ఆంధ్ర ఇలా పలు పథకాలకు సంబంధించి ఓటీపీల కోసం సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు...ఇళ్ల చుట్టూ తిరిగారు. జనవరి ఒక్క నెలలోనే పదిసార్లు కుటుంబాల వద్దకు ఓటీపీ కోసం సిబ్బంది వెళ్లాల్సి వచ్చింది. దీంతో ఆయా కుటుంబ సభ్యులు విసిగిపోయారు. తాము ప్రభుత్వం నుంచి ఎలాంటి సంక్షేమ పథకాలు తీసుకోవడం లేదని, తమ ఇళ్ల వద్దకు సచివాలయ ఉద్యోగులు గానీ, వలంటీర్లు గానీ రావొద్దంటూ ప్రభుత్వ ఉద్యోగుల్లో ఎక్కువమంది మొహం మీద చెప్పేస్తున్నారు.

90% వివరాలు సేకరించకుంటే చర్యలు...

కుటుంబాలు సర్వేకు సహకరించక సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇబ్బంది పడుతుంటే మరోవైపు జిల్లా అధికారులు 90 శాతం రిజల్ట్ కనిపించాలంటూ హుకుం జారీచేస్తున్నారు. సర్వేలు పూర్తి చేయలేని వారిని సస్పెండ్ చేస్తామని బెదిరిస్తున్నారు. ప్రతిరోజు టెలీకాన్ఫరెన్స్ పెట్టి వేధిస్తున్నారు. సర్వేకు పలు కుటుంబాలు సహకరించడం లేదని నిస్సహాయత వ్యక్తం చేసిన వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఆవేదనను పట్టించుకోవడం లేదు.

చిత్తశుద్ధి లేని సర్కారు

వైసీపీ సర్కారు ప్రారంభించిన ఏ పథకాన్నీ విజయవంతం చేసిన దాఖలాల్లేవు. వందేళ్లకొకసారి చేపట్టే భూముల రీసర్వేను ఇప్పటికే ఒక్కో మండలంలోని రెండు, మూడు గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు ప్రారంభించారు. ఇక్కడే ప్రభుత్వం చేతగానితనం వెల్లడైంది. పైలట్ ప్రాజెక్టు చేపట్టిన గ్రామాల్లో భారీగా ఫిర్యాదులు అందుతున్నాయి. గతంలో పకడ్బందీగా ఉన్న రికార్డులను సైతం భ్రష్టుపట్టిస్తున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దీంతో రీసర్వేపై జనాలకు విశ్వాసం సన్నగిల్లింది. వలంటీర్ల సహకారంతో చేపట్టే ఏ ప్రాజెక్టు అయినా నిష్పాక్షికంగా జరగదనే భావన ఉంది. వలంటీర్ల ద్వారా చేపట్టే కులగణన ఎంతమేరకు సత్ఫలితాలిస్తుందని పలువురు అనుమానిస్తున్నారు. యాప్‌లతో జిమ్మిక్కులు చేయడం తప్ప కచ్చితమైన సమాచారాన్ని వలంటీర్ల ద్వారా సేకరించడం సాధ్యం కాదని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. కుటుంబాల వద్దకు వెళ్లి ఎంచక్కా ఎన్నికల ప్రచారం చేసుకోవచ్చన్న జిమ్మిక్కులతో కులగణన తెచ్చారంటున్నారు. ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే.. సర్వేను అడ్డుకుంటున్నారని ప్రచారం చేసేందుకు ఎత్తులు వేస్తున్నారని పలువురు నేతలు చెప్తున్నారు. ఎన్నికల ముందు హడావుడిగా కులగణన చేయడం వల్ల ఒరిగేదేముందని తప్పుపడుతున్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఆర్థిక వివరాలను అడగడంతో జనాలు ముఖం చాటేస్తున్నారు. దీంతో వారికి సర్వే పెద్ద భారంగా మారింది.

అచ్చెన్నపై చార్జిషీటుకు..

గవర్నర్ అనుమతి తీసుకున్నారా?

» సెక్షన్ 19 ప్రకారం అది తప్పనిసరి

» ఈఎస్ఐ కేసులో ఏసీబీ కోర్టు స్పష్టీకరణ

» విచారణ 6వ తేదీకి వాయిదా

విజయవాడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 19 ప్రకారం.. ఒక ప్రజాప్రతినిధిపై చార్జిషీటు దాఖలు చేయాలంటే.. గవర్నర్ అనుమతి తప్పనిసరని విజయవాడ ఏసీబీ కోర్టు స్పష్టం చేసింది. ఒకవేళ సీఆర్పీసీ సెక్షన్ 197ని వర్తింపజేసినా ఈ విధంగా అనుమతి తీసుకోవాలి కదా అని ఏసీబీ అధికారులను ప్రశ్నించింది. ఈఎస్ఐ కార్పొరేషన్‌లో 2014-19 మధ్యకాలంలో రూ.900 కోట్ల విలువైన వైద్యపరికరాలు, మందుల కొనుగోళ్లలో రూ.150 కోట్ల అవినీతి జరిగిందని ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ మాజీ మంత్రి అచ్చెన్నాయుడిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి ఏసీబీ అధికారులు నెల కిందట ఏసీబీ కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. దీనికి నంబర్ కేటాయించే సమయంలో న్యాయాధికారి బి.హిమబిందు గవర్నర్ అనుమతి గురించి ప్రస్తావించారు. దీనిపై గురువారం విచారణ జరిగింది. చార్జిషీటు దాఖలుకు గవర్నరు అనుమతి అవసరంలేదని ఏసీబీ తరఫున హైకోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ దుష్యంత్‌రెడ్డి తెలిపారు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 13(1)(ఈ)కి సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కాపీని కోర్టుకు అందజేశారు. దీని ప్రకారం కేసు నమోదు చేసినప్పటి నుంచి ట్రయల్ జరిగే క్రమంలో ఎప్పుడైనా గవర్నర్ అనుమతి తీసుకోవచ్చని చెప్పారు. ఇది ఆదాయానికి మించిన ఆస్తుల వ్యవహారానికి సంబంధించింది కదా అని న్యాయాధికారి ప్రశ్నించారు. సెక్షన్ 19 ప్రకారమైనా.. సీఆర్పీసీ సెక్షన్ 197 ప్రకారమైనా.. చార్జిషీటు దాఖలు చేయడానికి గవర్నర్ అనుమతి అవసరం లేదని సుప్రీంకోర్టు ఏవైనా తీర్పులిస్తే ఆ కాపీలను కోర్టుకు అందజేయాలని ఆమె ఆదేశించారు. అనంతరం విచారణను ఈ నెల ఆరో తేదీకి వాయిదా వేశారు.

బోర్డు నియంత్రణలోకి శ్రీశైలం, సాగర్!

» రెండు రాష్ట్రాల అంగీకారం

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కృష్ణా బేసిన్‌లోని ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాలను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కి అప్పగించేందుకు ఏపీ, తెలంగాణ అంగీకరించాయి. గురువారమిక్కడి జలసౌధలో చైర్మన్ శివ్‌నందన్‌కుమార్ అధ్యక్షతన బోర్డు సమావేశం జరిగింది. దీనికి తెలంగాణ నుంచి ఈఎన్‌సీ సి.మురళీధర్, అంతర్రాష్ట్ర విభాగం చీఫ్ ఇంజనీర్ మోహన్‌కుమార్, నాగార్జునసాగర్ చీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్, కృష్ణా బేసిన్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.విజయకుమార్, ఏపీ నుంచి ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డితో పాటు ఇతర అధికారులు హాజరయ్యారు. దాదాపు గంటన్నరపాటు సమావేశం జరిగింది. జలవిద్యుత్కేంద్రాలు తప్ప మిగిలిన 10 ఔట్‌లెట్లు.. శ్రీశైలం ప్రాజెక్టు స్పిల్‌వేతో పాటు రివర్ స్లూయిస్, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, హంద్రీ-నీవా సుజల స్రవంతి, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం, మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, నాగార్జునసాగర్ లెఫ్ట్ కెనాల్ హెడ్ రెగ్యులేటర్, నాగార్జునసాగర్ ఫ్లడ్‌ఫ్లో కెనాల్-హెడ్‌రెగ్యులేటర్-పరిసరాలు, ఏఎమ్మార్ ఎత్తిపోతల పథకం-పంప్ హౌస్ పరిసరాలు, సాగర్ ప్రాజెక్టు స్పిల్‌వేతో పాటు రివర్, చూట్ స్లూయిస్, నాగార్జునసాగర్ రైట్ కెనాల్ హెడ్ రెగ్యులేటర్‌పై చర్చించారు. వీటన్నింటినీ బోర్డు నియంత్రణలోకి తీసుకెళ్లడానికి రెండు రాష్ట్రాల ఈఎన్‌సీలు అంగీకరించారు. నీటి విడుదల కోసం కేఆర్ఎంబీ ప్రత్యక్ష నియంత్రణలో ప్రతి కాంపోనెంట్ వద్ద తెలంగాణ నుంచి ఒకరు, ఏపీ నుంచి మరొక ఉద్యోగిని నియమించాలని నిర్ణయించారు. 10 కాంపోనెంట్ల వద్ద మూడు షిఫ్టుల్లో (ఒక షిఫ్టు 8గంటలు) 30 మంది చొప్పున బోర్డు నియంత్రణలో పనిచేయడానికి సమ్మతించారు. నీటి విడుదల మాత్రం బోర్డుకు చెందిన త్రిసభ్య కమిటీ (బోర్డు సభ్యకార్యదర్శి డీఎం రాయిపూరే, తెలంగాణ ఈఎన్‌సీ సి.మురళీధర్, ఏపీ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి) నిర్ణయం మేరకే జరిగేలా అంగీకారం కుదిరింది. అయితే సాగర్ ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్ పనులను తెలంగాణ.. శ్రీశైలం పనులను ఏపీ చేయాలని నిర్ణయించారు. ప్రాజెక్టులు/కాంపోనెంట్ల తాత్కాలిక నిర్వహణకు నియమించిన సిబ్బందికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే వేతనాలు చెల్లించాలని నిశ్చయించారు. సీఆర్‌పీఎఫ్ బలగాలను సాగర్ ప్రధాన కట్ట వద్దే పరిమితం చేయనున్నారు. వివాదం తలెత్తితే మాత్రం శ్రీశైలంతో పాటు ఇతర కాంపోనెంట్ల వద్దా సీఆర్‌పీఎఫ్ బలగాలను మోహరిస్తారు.

సొంత మనుషులకే పోలీస్ సబ్ డివిజన్లు

» 104మంది డీఎస్పీల బదిలీ.. 42 డివిజన్లలో 10 చోట్ల సొంత సామాజికవర్గం వారే!

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో గెలిచేందుకు అన్ని ఎత్తుగడలు వేస్తున్న జగన్ ప్రభుత్వం కీలక సబ్ డివిజన్లతో తమ వారిని నియమించుకుంది. రాష్ట్రంలో 104మంది డీఎస్పీలను బదిలీ చేయగా అందులో 42సబ్ డివిజన్లలో మార్పు చేర్పులు చేసింది. చిత్తూరు జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డి సైన్యానికి నాయకుడిలా పేరు తెచ్చుకున్న సుధాకర్‌రెడ్డికి ఆళ్లగడ్డలో పోస్టింగ్ ఇచ్చారు. వైసీపీ అరాచకాలకు వత్తాసు పలికే వ్యక్తిగా పేరు తెచ్చుకున్న వీరరాఘవరెడ్డిని అనంతపురానికి తెచ్చుకుంది. చంద్రబాబు అరెస్టు సమయంలో ఓవర్ యాక్షన్ చేసిన మహేశ్వర్‌రెడ్డిని నంద్యాల నుంచి పలమనేరుకు తెచ్చుకోవడం ఎన్నికల్లో లబ్ధి కోసమేనని ప్రచారం జరుగుతోంది. ఇంటెలిజెన్స్‌లో నమ్మకస్థుడైన శ్రీనివాసరెడ్డికి నాయుడుపేట సబ్ డివిజన్ అప్పగించింది. తాడేపల్లిగూడెం, కొవ్వూరు, అమలాపురం, బొబ్బిలి, నూజివీడు, రామచంద్రపురం, రాజమండ్రి దక్షిణ, మైలవరం, ద్వారక(విశాఖ), తూర్పు విశాఖ, సత్తెనపల్లి, చంద్రగిరి, రాజమండ్రి ఉత్తర, నరసరావుపేట, విజయవాడ దక్షిణ, పోలవరం, విశాఖ ఉత్తరం, జంగారెడ్డిగూడెం, కాకినాడ, నందిగామ, గుంటూరు ఉత్తరం, మచిలీపట్నం, విజయవాడ పడమర, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, విజయవాడ ఉత్తర, ఒంగోలు, తుళ్లూరు, కందుకూరు సబ్ డివిజన్లలో అనుయాయులకు అవకాశం కల్పించింది.

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధంకండి: డీజీపీ

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 1: రాబోయే ఎన్నికలకు పోలీసులు సిద్ధం కావాలని డీజీపీ కె.రాజేంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఐజీలు అమ్మిరెడ్డి, సెంథిల్‌కుమార్‌తో పాటు కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప జిల్లాల ఎస్పీలతో సమావేశమయ్యారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు.





16,81,944 కోట్లు

అప్పులు..

రెవెన్యూ లోటును పూడ్చేందుకు రూ.16,81,944 లక్షల కోట్లు అప్పులు చేయాలని కేంద్రం నిర్ణయించింది. 2023-24లో రూ.11,80,456 కోట్ల అప్పును కేంద్ర సర్కారు తీసుకుంది. 2022-23లో రూ.11,05,836 కోట్లు అప్పులు చేసింది.

పన్నుల ద్వారా



11.7% రాబడి అంచనా

ఈ ఏడాది ప్రత్యక్ష పన్నుల ద్వారా 6.7 శాతం, పరోక్ష పన్నుల ద్వారా 4.9 శాతం ఇలా జీడీపీలో 11.7 శాతం పన్నుల ద్వారా సమకూరుతాయని బడ్జెట్ అంచనా వేసింది. 2023-24లో ప్రత్యక్ష పన్నుల ద్వారా 6.6 శాతం, పరోక్ష పన్నుల ద్వారా 5 శాతం.. మొత్తంగా 11.6 శాతం నిధులు సమకూరాయి. 2022-23లో పన్నుల ద్వారా 11.2 శాతం ఆదాయం వచ్చింది.

విద్య, ఆరోగ్యానికి అంతంతే..



ఆరోగ్య రంగానికి కేంద్రం రూ.90,658..63 కోట్లు కేటాయించింది. ఇది మొత్తం బడ్జెట్‌లో 0.9 శాతం మాత్రమే. 2023-24లో 0.79 శాతం, 2022-23లో 0.74 శాతం నిధులను కేంద్రం కేటాయించింది. విద్యా రంగానికి బడ్జెట్‌లో రూ.1,20,627.8 కోట్లు కేటాయించారు. 2023-24లో ఇది రూ.1,12,898.9 కోట్లుగా ఉంది. గత ఏడాది ఇదే రంగానికి రూ.1.12 లక్షల కోట్లు కేటాయించారు.

గ్రామీణాభివృద్ధికి రూ.1.77 లక్షల కోట్లు

» గతేడాది బడ్జెట్‌తో పోలిస్తే 12% అధికం

» ఉపాధి హామీకి 43% ఎక్కువ నిధులు

» లఖ్‌పతి దీదీ పథకం లక్ష్యం 3కోట్లకు పెంపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను మధ్యంతర బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధి శాఖకు కేంద్రం రూ.177 లక్షల కోట్లు కేటాయించింది. గతేడాది కేటాయించిన రూ.1.57 లక్షల కోట్లతో పోలిస్తే ఇది దాదాపు 12శాతం అధికం. అయితే సవరించిన అంచనాల ప్రకారం గతేడాది ఈ శాఖ చేసిన వ్యయం రూ.1.71 లక్షల కోట్లు కాగా, ప్రస్తుతం అంతకంటే 3శాతం ఎక్కువ కేటాయించారు.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మధ్యంతర బడ్జెట్‌లో రూ.86వేల కోట్లు కేటాయించారు. ఈ పథకానికి గత బడ్జెట్‌లో కేటాయించిన రూ.60వేల కోట్లతో పోలిస్తే ఇది 43శాతం ఎక్కువ. సవరించిన అంచనాల ప్రకారం గత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకానికి చేసిన వ్యయం రూ.86వేల కోట్లు కాగా, ఈ మొత్తం వచ్చే ఆర్థిక సంవత్సరానికి చేసిన కేటాయింపులతో సమానం.

ఉపాధి హామీ పథకానికి 2022-23లో ప్రభుత్వం రూ.73వేల కోట్లు కేటాయించింది. అయితే బడ్జెట్ డాక్యుమెంట్ ప్రకారం వాస్తవ వ్యయం రూ.90,805 కోట్లుగా నమోదైంది. 2021-22లో ఈ పథకానికి రూ.73వేల కోట్లు కేటాయించగా, ఆ ఏడాది వాస్తవ వ్యయం రూ.98,467.85 కోట్లుగా ఉంది. ఇక 2020-21లో రూ.1.11 లక్షల కోట్లు ఖర్చు చేశారు. మహిళలను లక్షాధికారులను చేసే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన 'లఖ్‌పతి దీదీ' పథకం లక్ష్యాన్ని 3 కోట్లకు పెంచారు. ఈ పథకంలో భాగంగా స్వయం సహాయక బృందాల్లోని మహిళలకు శిక్షణ ఇస్తారు. దాంతో వారు ఏటా రూ.లక్షకు పైగా ఆదాయం సంపాదించే అవకాశం ఉంటుంది.

జాతీయ జీవనోపాధి మిషన్-అజీవికకు రూ.15,047 కోట్లు కేటాయించారు. గతేడాది కేటాయించిన రూ.14,129.17 కోట్లతో పోలిస్తే ఇది 6శాతం అధికం. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజనకు కేటాయింపులు తగ్గాయి. మధ్యంతర బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.12వేల కోట్లు కేటాయించగా గతేడాది సవరించిన అంచనాల ప్రకారం చేసిన వ్యయం రూ.17వేల కోట్లుగా నమోదైంది.

గ్రామీణ మార్కెట్లలో అధికాదాయాన్ని సృష్టించే లక్ష్యంతో రోడ్లు, జాతీయ రహదారుల నిర్మాణానికి నిధుల కేటాయింపులు పెంపు.

మళ్లీ మాదే అధికారం!

అద్భుతమైన మెజారిటీతో వస్తాం.. మధ్యంతర బడ్జెట్‌లో నిర్మల ఉద్ఘాటన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: "మా దృష్టిలో ప్రధానమైన కులాలు నాలుగు. అవి... పేదలు, మహిళలు, యువత, రైతులు! ఈ ప్రధాన వర్గాల సంక్షేమానికే మా ప్రాధాన్యం" అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. గురువారం ఆమె లోక్‌సభలో వరుసగా... తన ఆరో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఎన్నికల ముందు తాత్కాలికంగా, 'ఓటాన్ అకౌంట్ బడ్జెట్ మాత్రమే సమర్పించడం సంప్రదాయం! కానీ... 'ఓట్ల కాలం' ముందున్న నేపథ్యంలో నిర్మల 2024-25 ఆర్థిక సంవత్సరానికి 'మధ్యంతర బడ్జెట్‌'ను తీసుకొచ్చారు. 56 నిమిషాలపాటు సాగిన బడ్జెట్ ప్రసంగంలో పదేళ్లలో సాధించిన ఘనతలు, భవిష్యత్ లక్ష్యాలను వివరించేందుకు ప్రాధాన్యమిచ్చారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో విజయం తమదేనని... 'హ్యాట్రిక్' కొట్టేస్తామని నిర్మలా సీతారామన్ పరోక్షంగా చెప్పేశారు. "అద్భుతమైన పాలన అందించాం. వచ్చే ఎన్నికల్లో అద్భుతమైన మెజారిటీతో ప్రజలు మమ్మల్ని ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నాం" అని నిర్మల పేర్కొన్నారు. ఆ సమయంలో అధికార పక్షం వైపు నుంచి చప్పట్ల హోరు వినిపించగా... విపక్ష సభ్యులు మాత్రం నిరసన తెలిపారు. ఈ ఒక్క సందర్భంలో తప్ప... మిగిలిన మొత్తం బడ్జెట్ ప్రసంగాన్ని ప్రతిపక్ష సభ్యులు శ్రద్ధగా విన్నారు.



నిర్మలా సీతారామన్ 2020లో 2 గంటలా 40 నిమిషాలపాటు బడ్జెట్ ప్రసంగం చేశారు. ఇది ఆమె అత్యంత సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగం! గురువారం మాత్రం 56 నిమిషాల్లో ముగించేశారు. ఇది.. ఆమె అత్యంత క్లుప్తమైన బడ్జెట్ ప్రసంగం!

నాలుగు వర్ణాలు... వీరే!

"సమ్మిళిత, సమగ్ర అభివృద్ధిపై మా ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో అన్ని వర్ణాల వారూ ఉంటారు. కానీ... ప్రధానంగా నాలుగు వర్ణాల సంక్షేమంపై దృష్టి పెడతాం. వారే... పేదలు, మహిళలు, అన్నదాతలు,యువత! వీరు పురోగమిస్తేనే దేశమూ పురోగమిస్తుంది. 2047 నాటికి వికసిత్ భారత్ సాధనే మా లక్ష్యం" అని నిర్మల పేర్కొన్నారు. గతంలో 'సామాజిక న్యాయం' కేవలం ఒక రాజకీయ నినాదంగా ఉండేదని, దానిని తాము మాత్రమే నిజమైన విధానంగా అమలు చేశామని చెప్పారు. ప్రస్తుతం సామాజిక స్థితితో సంబంధం లేకుండా అందరికీ సమాన అవకాశాలు, వనరులు అందుతున్నాయని చెప్పారు. సామాజిక-ఆర్థిక పరివర్తన సాధించేందుకు తాము 'కేటాయింపు'లకంటే ఫలితాల సాధనపై ఎక్కువ దృష్టి సారించామని తెలిపారు. దీని ఫలితంగా... గత పదేళ్లలో 25 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి లభించిందన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందే లా పారదర్శకత పాటించామని తెలిపారు. 2014తో పోల్చితే... తలసరి ఆదాయం రెట్టింపు అయ్యిందని, రూ.1.74 లక్షలకు చేరిందని చెప్పారు. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో పదో స్థానంలో ఉన్న భారత్... ఈ పదేళ్లలో ఐదో స్థానానికి చేరుకుందని నిర్మల పేర్కొన్నారు. ఆధార్, కొవిడ్ వ్యాక్సినేషన్ వంటి బృహత్ కార్యాలను వేగంగా పూర్తి చేశామన్నారు. కొవిడ్ కష్టకాలంలో ఏ ఒక్కరూ ఖాళీ కడుపుతో పడుకోకూడదని... 28నెలలపాటు 80కోట్లమందికి ఉచితంగా ఆహార ధాన్యాన్ని అందించామన్నారు. పేదలకు 'పౌష్టిక- ఆహారం' అందించాలనే లక్ష్యంతో 'అంత్యోదయ' కుటుంబాలకు 2023 జనవరి నుంచి మరో ఏడాదిపాటు ఉచిత ఆహార ధాన్యాన్ని అందించామన్నారు. 'వసుధైక కుటుంబ' నినాదంతో భారత్ వేదికగా నిర్వహించిన జీ-20 సదస్సును గుర్తు చేశారు.

ఇదీ లక్ష్యం... ఇదీ మార్గం...

సాంకేతిక, విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థను నిర్మించడమే తమ లక్ష్యమని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. దీనిని సాధించేందుకు 'ప్రజా భాగస్వామ్యం' (జన్ భాగీదారీ), సబ్‌కా సాథ్ సబ్‌కా ప్రయాస్ (అందరితో కలిసి, అందరి కృషి) ఎంతో అవసరమన్నారు. పౌరులకు విస్తృతంగా అవకాశాలు కల్పించడం, ఉపాధి అవకాశాలు మెరుగయ్యేలా వృద్ధిరేటుపై దృష్టి సారించడం, స్థిరమైన సూక్ష్మ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు.

బడ్జెట్‌లో ప్రాధాన్యాలు..

మధ్యంతర బడ్జెట్‌ను ఏడు ప్రాధాన్యాల ఆధారంగా రూపొందించారు. అవి...

1) సమ్మిళిత అభివృద్ధి 2) చివరి వ్యక్తికీ లబ్ధి చేకూర్చడం 3) మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు 4) ప్రబల శక్తిని వినియోగించడం 5) గ్రీన్ గ్రోత్ 6) యువ శక్తి 7) ఆర్థిక రంగం

ఇవీ సాధించాం..

స్వచ్ఛ భారత్ కింద 11.7 కోట్ల గృహాలకు మరుగుదొడ్లు.

ఉజ్వల ద్వారా 9.6 కోట్ల గ్యాస్ కనెక్షన్లు

102 కోట్ల మందికి 202 కోట్ల కొవిడ్ టీకా డోస్‌లు.

47.8 కోట్ల పీఎం జన్‌ధన్ ఖాతాలు

పీఎం సురక్షా బీమా, .జీవన్ జ్యోతి బీమా కింద 44.6 కోట్ల మందికి బీమా

కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా 11.4 కోట్ల మందికి రూ.2.2 లక్షల కోట్లు బదిలీ.

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు టీకాలు!




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: దేశ ప్రజల ఆరోగ్య సంరక్షణకు సంబంధించి కేంద్ర బడ్జెట్‌లో కొన్ని కీలక ప్రకటనలు చేశారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న ఆస్పత్రులు, మౌలిక సదుపాయాలను వినియోగించుకొని మరిన్ని వైద్య కళాశాలలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని పరిశీలించేందుకు కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. 9-14 ఏళ్ల బాలికల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రోత్సహించనున్నట్లు వెల్లడించారు. "వైద్యులుగా ప్రజలకు సేవ చేయాలని చాలామంది యువత ఆశ పడుతున్నారు. ఈ నేపథ్యంలో దేశంలో మరిన్ని వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తాం. ఈ అంశాన్ని పరిశీలించి, అవసరమైన సిఫారసులు చేసేందుకు కమిటీని నియమిస్తాం" అని నిర్మల చెప్పారు. పిల్లల్లో రోగ నిరోధక శక్తిని పెంచడానికి తీసుకొచ్చిన 'మిషన్ ఇంద్ర ధనుస్సు' నిర్వహణకు కొత్తగా ఏర్పాటు చేసిన 'యు-విన్' వేదికను దేశవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తామన్నారు. ప్రస్తుతం ఈ కార్యక్రమాన్ని దేశంలోని రెండు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్నారు. యు-విన్ పోర్టల్‌ను కొ-విన్ పోర్టల్‌కు అనుసంధానం చేస్తారు. యు-విన్ పోర్టల్ ద్వారా వ్యాక్సినేషన్ స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. ఇక మాతా, శిశు ఆరోగ్య సంరక్షణ పథకాలను పక్కాగా అమలు చేసేందుకు సమగ్ర కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు నిర్మల తెలిపారు. సాక్షమ్ అంగన్‌వాడీ పథకం కింద అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునికీకరిస్తామని.. చిన్నారుల ఎదుగుదల కోసం పోషకాహార పంపిణీని మెరుగ్గా అందించేందుకు 'పోషణ్ 2.0' కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేస్తామని వివరించారు.

పదేళ్ల కిందటి ఆర్థిక అస్తవ్యస్తంపై శ్వేతపత్రం: నిర్మల

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: పదేళ్ల కింద యూపీఏ హయాంలోని ఆర్థిక అస్తవ్యస్త పరిస్థితులపై మోదీ ప్రభుత్వం తాజాగా శ్వేతపత్రం తీసుకురానుంది. వాటి నుంచి పాఠాలు నేర్చుకునే ఉద్దేశంతో దీనిని పార్లమెంటులో ప్రవేశపెడతామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో వెల్లడించారు. 2014లో మనం ఎక్కడున్నాం.. ఇప్పుడు ఎక్కడ ఉన్నామో తెలుసుకోవాలన్నారు. 'మోదీ ప్రభుత్వం పగ్గాలు చేపట్టినప్పుడు ఆర్థిక వ్యవస్థను దశలవారీగా సరిదిద్ది పాలనా వ్యవస్థలన్నిటినీ గాడిలో పెట్టాల్సిన పరిస్థితి. దేశమే మొదట అనే విశ్వాసంతో.. ఆ బాధ్యతను ప్రభుత్వం విజయవంతంగా నిర్వర్తించింది. 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్' అనే మంత్రంతో నాటి సంక్షోభాన్ని, సవాళ్లను అధిగమించాం. ఆత్మనిర్భర్ భారత్ దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నాం. భారత్ అభివృద్ధి, వలస వాసనల సమూల నిర్మూలన, మన సంస్కృతీ వారసత్వాలకు గర్వపడడం.. పౌరుల్లో కర్తవ్య భావం నింపడం అనే 'పంచ్ ప్రాణ్' ప్రమాణంతో అమృత కాలానికి పటిష్ఠ పునాదులు నిర్మించాం. మేం చేసిన అద్భుత కృషి ఆధారంగా ప్రజలు వచ్చే ఎన్నికల్లో మళ్లీ మా ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తారని ప్రగాఢంగా విశ్వసిస్తున్నాం' అని నిర్మల తెలిపారు.


దేశాభివృద్ధికి గ్యారెంటీ

యువతకు భారీగా ఉపాధి అవకాశాలు.. మధ్యంతర బడ్జెట్‌పై ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశాభివృద్ధి కొనసాగింపునకు గ్యారెంటీ అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశాభివృద్ధికి వడిన పునాదులను మరింత బలోపేతం చేస్తుందని అభిప్రాయపడ్డారు. అంతేకాక, ఇది మధ్యంతర బడ్జెట్ కాదని. సృజనాత్మక, సమ్మిళిత బడ్జెట్ అని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి నాలుగు స్తంభాలైన యువత, పేద, మహిళలు, రైతుల సాధికారతకు దోహదపడుతుందని చెప్పారు. యువ భారత్ ఆకాంక్షలను బడ్జెట్ ప్రతిబింబిస్తోందని అన్నారు. పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు భరోసా నిస్తుందని తెలిపారు. పరిశోధనలు, ఆవిష్కరణలకు బడ్జెట్‌లో లక్షల కోట్ల నిధులు కేటాయించడంతో స్టార్టప్‌లకు మరింత ప్రోత్సాహం లభించనుందని చెప్పారు. పీఎం ఆవాస యోజన కింద మరో రెండు కోట్ల ఇళ్లు నిర్మించాలని, మూడు కోట్ల మంది మహిళలను లక్షాధికారులు చేయాలని లక్ష్యంగా పెట్టుకోవడం పేదల సంక్షేమానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనం అన్నారు. బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన ఆదాయ పన్ను ఉపశమన పథకం వల్ల కోటి మందికి పైగా మధ్యతరగతి ప్రజలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. నానో డీఏపీ, పీఎం మత్స్య సంపద యోజన పథకాలు రైతుల ఆదాయాన్ని పెంచుతాయని మోదీ పేర్కొన్నారు. కాగా, మధ్యంతర బడ్జెట్‌లో సమాజంలోని అన్ని వర్గాల కోసం ఏదో ఒక అంశం ఉందని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభిప్రాయపడ్డారు. బడ్జెట్‌లో మూలధన వ్యయాన్ని భారీ స్థాయిలో పెంచడంతో 2027 నాటికి భారత్ ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు దోహదం చేస్తుందని అన్నారు.

బడ్జెట్ నిరాశాజనకం: కాంగ్రెస్



కేంద్రం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ నిరాశజనకంగా ఉందని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ సభ్యులు అభిప్రాయపడ్డారు. మధ్యంతర బడ్జెట్‌లో జవాబుదారీతనం, ముందుచూపు కనిపించడం లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే అన్నారు. గత ప్రభుత్వ పాలనపై శ్వేతపత్రం విడుదల చేస్తామని చెప్పిన ఆర్థిక మంత్రి నిర్మల.. పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం ఎన్ని హామీలను నెరవేర్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ద్రవ్య లోటు గణాంకాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని కాంగ్రెస్ నేత మనీశ్ తివారి అన్నారు. బడ్జెట్ ప్రసంగం ప్రచార ఆర్భాటంలా కనిపించిందని తెలిపారు. ఇక, వైఫల్యాలను విజయాలుగా చూపించుకునే సామర్థ్యం ఈ ప్రభుత్వానికి ఉందని బడ్జెట్‌తో స్పష్టమైందని శశి థరూర్ అన్నారు. నిరుద్యోగం వంటి అనేక అంశాలను ప్రస్తావించకుండా బడ్జెట్ ప్రసంగం ఉండడం నిరాశ కలిగించిందని తెలిపారు. బడ్జెట్ కేటాయింపుల్లో వివక్ష చూస్తోంటే దక్షిణాది రాష్ట్రాలను ప్రత్యేక దేశంగా ఏర్పాటు చేయాలని కోరడం తప్ప మరో దారి కనిపించడం లేదని కర్ణాటక కాంగ్రెస్ నేత, ఎంపీ డీకే సురేశ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. దక్షిణాది రాష్ట్రాలకు రావాల్సిన నిధులను ఉత్తరాది రాష్ట్రాలకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. డీకే సురేశ్ వ్యాఖ్యలపై బీజేపీ నేతలు తీవ్రంగా మండిపడ్డారు. విభజించి పాలించడమనే విధానం కాంగ్రెస్‌లో రక్తంలోనే ఉందని బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య విమర్శించారు. అయితే, డీకే సురేష్.. ప్రజాభిప్రాయాన్నే చెప్పారని ఆయన సోదరుడు, కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్ పేర్కొన్నారు.

విమానంలో ఎగిరిపోదాం!

» మెట్రోయేతర నగరాలకూ విమానాలు

» విమానాశ్రయాల విస్తరణ.. కొత్త వాటి అభివృద్ధి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి1: దేశంలో విమానయాన రంగ విస్తరణకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది. ప్రస్తుతమున్న విమానాశ్రయాలను విస్తరించడంతో పాటు కొత్త విమానాశ్రయాల అభివృద్ధిని వేగవంతం చేయనున్నట్టు పేర్కొంది. మెట్రోయేతర నగరాలకు కొత్త విమాన సర్వీసులు ప్రారంభించి, అంతర్జాతీయ విమాన వాణిజ్యాన్ని సులభతరం చేయడానికి చర్యలు తీసుకోనున్నట్టు తెలిపింది. 'గత పదేళ్లలో పౌర విమానయాన రంగం పుంజుకుంది. విమానాశ్రయాల సంఖ్య రెట్టింపై 149కు చేరుకుంది. ఉడాన్ పథకం కింద 2, 3 తరగతి నగరాలకు విమాన సర్వీసులను అందుబాటులోకి తేవడం ద్వారా 517 కొత్త మార్గాల్లో కోటి 30 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి' అని బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. దేశం నలుమూలలా ముఖ్యమైన నగరాల్లో విమాన సర్వీసులను అందుబాటులోకి తీసుకురావడానికి 2016లో కేంద్ర ప్రభుత్వం ఉడాన్ (ప్రాంతీయ అనుసంధాన పథకం)ను ప్రారంభించింది. ఇందులో భాగంగా భారతీయ విమానయాన సంస్థలు కొత్తగా 1000 విమానాల కొనుగోళ్లకు ఆర్డర్ ఇచ్చినట్టు నిర్మల వెల్లడించారు.



నిర్మలగారి బడ్జెట్

వివరం రూ. కోట్లలో	2022-23 (వాస్తవ)	2023-24 (బ.అం.)	2023-24 సవరించిన	2024-25 (బ.అం.)
1) రెవెన్యూ వసూళ్లు	22,83,206	26,32,281	26,99,713	30,01275
ఎ)పన్ను ఆదాయం	20,97,786	23,30,631	23,23,918	26,01,574
బి) పన్నేతర ఆదాయం	2,85,421	3,01,650	3,75,795	3,99,701
2) మూలధన వసూళ్లు	18,09,951	18,70,816	17,90,773	17,64,494
ఎ) రుణ వసూళ్లు	26,161	23,000	26,000	29,000
బి) ఇతర వసూళ్లు	46,035	61,000	30,000	50,000
సి) రుణాలు	17,37,755	17,86,816	17,34,773	16,85,494
3) మొత్తం వసూళ్లు	41,93,157	45,03,097	44,90,486	47,65,768
4) పథకాలకు వ్యయం	34,53,132	35,02,136	35,40,239	36,54,657
5) పథకేతర వ్యయం	7,40,025	10,00,961	9,50,246	11,11,111
6) మొత్తం వ్యయం	41,93,157	45,03,097	44,90,486	47,65,768
7) రెవెన్యూ లోటు	10,69,926	8,69,855	8,40,527	6,53,383

బ.అం. - బడ్జెట్ అంచనా స.అం - సవరించిన అంచనా

పర్యాటక రంగంపై ప్రత్యేక దృష్టి

» లక్షద్వీప్‌తోపాటు ఇతర పర్యాటక కేంద్రాల అభివృద్ధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: లక్షద్వీప్‌తోపాటు పలు దీవులు, ప్రముఖ పర్యాటక కేంద్రాలలో మౌలిక సదుపాయాలను కల్పించాలని కేంద్రం నిర్ణయించింది. అలాగే, దేశంలోని చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యం కలిగిన పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్రాలను ప్రోత్సహించి, వాటికి ప్రపంచ స్థాయిలో బ్రాండింగ్, మార్కెటింగ్ చేయాలని నిర్ణయించింది. వసతులు, సేవలలో నాణ్యత ఆధారంగా పర్యాటక కేంద్రాలకు రేటింగ్ ఇచ్చేలా ఓ నూతన ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించి, అభివృద్ధి పనులు చేపట్టేందుకు రాష్ట్రాలకు దీర్ఘకాలిక వడ్డీలేని రుణాలను అందించనుంది. లక్షద్వీప్‌తోపాటు ఇతర దీవులు, పర్యాటక కేంద్రాలకు పోర్టులు, విమానయాన కనెక్టివిటీ పెంచి, పర్యాటక వసతి, సౌకర్యాలను కల్పించనుంది.



మాల్దీవులకు సాయంలో కోత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: గత బడ్జెట్‌లో మాల్దీవులకు రూ.770.90 కోట్లు కేటాయించిన కేంద్రం.. ఈసారి దానిని రూ.600 కోట్లకు తగ్గించేసింది. వాస్తవానికి నిరుటి పద్దులో ఆ దేశానికి తొలుత రూ.400 కోట్లు మాత్రమే ఇస్తామని పేర్కొన్నా.. తర్వాత దానిని బాగా పెంచింది. 2022-23 బడ్జెట్‌తో పోలిస్తే ఇది 300 శాతం అధికం కావడం గమనార్హం. అయితే, ఇటీవలి పరిణామాల నేపథ్యంలో వైఖరి మార్చుకున్నట్లు కనిపిస్తోంది. కాగా, చైనాతో ఇబ్బంది ఎదుర్కొంటున్న భూటాన్‌కు రూ.2,068 కోట్లు ఇస్తూ పెద్దపీట వేసింది. నేపాల్‌కు రూ.700 కోట్లు ఇవ్వనున్నట్టు తెలిపింది. వీటితర్వాత అత్యధికం కేటాయించింది మాల్దీవులకే. మరోవైపు మొత్తమ్మీద విదేశాలకు చేసే సాయాన్ని ప్రస్తుత బడ్జెట్‌లో 10 శాతం తగ్గించారు. నిరుడు రూ.5,426 కోట్లివ్వగా.. ఇప్పుడు దానిని రూ.4,883 కోట్లకు పరిమితం చేసింది.

కీలక రంగాలు.. కేటాయింపులు (రూ. కోట్లలో)



వ్యవసాయం 1,27,470


రక్షణ 6,21,541






విద్య 1,20,628

హోంశాఖ 2,02,869





రోడ్డు రవాణా 2,78,000

ఎరువులు 1,68,380





గ్రామీణాభివృద్ధి 1,80,233



రాష్ట్రాలకు ఇచ్చేది



పన్నుల వాటా కింద చెల్లించే నిధులు, కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలకు ఇచ్చే సొమ్ము, పలు గ్రాంట్లు/లోన్లు తదితర అవసరాల కోసం రాష్ట్రాలకు కేంద్రం రూ.22,22,264 కోట్లు చెల్లించనుంది. ఇందులో రాష్ట్రాలకు పన్నుల వాటా కింద రూ.12,19,783 కోట్లు కోట్లు, ఆర్థిక కమిషన్ నిధుల రూపంలో రూ.1,32,378 కోట్లు, కేంద్ర ప్రభుత్వ పథకాలకు రూ.6,81,480 కోట్లు ఇవ్వనుంది.

22,22,264 కోట్లు

వడ్డీ చెల్లింపులకు

వివిధ అవసరాల కోసం తెచ్చిన రుణాలకు చెల్లించే వడ్డీల చెల్లింపుల కోసం సుమారు రూ.11,90,440 కోట్లు అవసరం అవుతుందని బడ్జెట్‌లో అంచనా వేశారు. 2023-24లో వడ్డీల చెల్లింపులకు 10,55,427 కోట్లు అవుతుందని అంచనా వేశారు. 2022-23లో రూ.9,28,517 కోట్ల నిధులను వడ్డీలకు చెల్లించారు.

రూ. 11.90 లక్షల కోట్లు



జీడీపీ

వచ్చే ఏడాదికిగాను జీడీపీ రూ.3,27,71,808 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. గత ఏడాదితో పోలిస్తే ఇది 10% అధికం. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ రూ.2,96,57,745 కోట్లు ఉంటుందని అంచనా వేశారు.

3.27 కోట్ల కోట్లు

ఉన్నత విద్యకు 9,624 కోట్లు కోత..!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ఈ ఏడాది బడ్జెట్‌లో ఉన్నత విద్యకు కేటాయించే నిధులను కేంద్రం రూ.9,624 కోట్ల మేర భారీగా కోత విధించింది. గతేడాది సవరించిన అంచనా రూ.57,244.48 కోట్లు ఉండగా.. ఈ సంవత్సరం దాన్ని రూ.47,619.77 కోట్లకు కోసేసింది. గతేడాది యూజీసీకి రూ.6,409 కోట్లు కేటాయించగా.. ఈ సంవత్సరం రూ.2,500 కోట్లకు పరిమితం చేసింది. ఐఐఎంకు ఈ ఏడాది సవరించిన అంచనా రూ.331 కోట్లుగా ఉన్నదాన్ని రూ.212.21 కోట్లకు తగ్గించింది. అగ్రశ్రేణి సాంకేతిక సంస్థలకిచ్చే గ్రాంట్‌ను కూడా కేంద్రం రూ.10,384.21 కోట్ల నుంచి రూ.10,324.50 కోట్లకు తగ్గించింది. అయితే సెంట్రల్ యూనివర్సిటీలకు ఇచ్చే మద్దతు గ్రాంట్ బడ్జెట్‌ను రూ.12 వేల కోట్ల నుంచి రూ.15,472 కోట్లకు పెంచింది. పాఠశాల విద్యకు గతేడాది రూ.72,473.8 కోట్లు అందించగా.. ఈ సంవత్సరం దాన్ని రూ.73,008.1 కోట్లకు పెంచింది.

మధ్య తరగతి సొంతింటి కల సాకారం!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: దేశంలో మధ్యతరగతి వర్గాలు కోరుకునే సొంతింటి కలను సాకారం చేసేందుకు కృత నిశ్చయంతో ఉన్నామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. మధ్యతరగతి వర్గం కోసమే ప్రత్యేకంగా కొత్త హౌసింగ్ పథకాన్ని తెస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఇది పూర్తిగా అద్దె ఇళ్లలో ఉండేవారు, బస్తీల్లో నివసించే వారు, అనధికార కాలనీల్లో ఉండే మధ్యతరగతి ప్రజలను లక్ష్యంగా చేసుకుని అమలు చేయనున్నట్టు తెలిపారు. ఈ కొత్త పథకం దేశంలోని కోట్లాది మంది మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను సాకారం చేస్తుందని విశ్వసిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ(పీఎంఏవైజీ) పథకం మరో ఐదేళ్ల పాటు కొనసాగుతుందని తెలిపారు. 2 కోట్ల కుటుంబాలకు సొంత ఇళ్లు కల్పించాలన్న లక్ష్యంతో ఈ పథకాన్ని కొనసాగిస్తున్నట్టు వివరించారు.

లక్ష్య సాధన దిశగా కేంద్ర బడ్జెట్!

» టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ 2047 సంవత్సరం నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేలా ఉందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు కొనియాడారు. మౌలిక రంగానికి, యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనకు బడ్జెట్‌లో ప్రాధాన్యమివ్వడం మంచి పరిణామమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ గతిని మార్చే మౌలిక రంగానికి రూ.11 లక్షల కోట్లు కేటాయించడంతోపాటు 1.40 కోట్ల మంది యువతకు స్కిల్ ఇండియా మిషన్ కార్యక్రమాన్ని అమలు చేయాలనుకోవడం హర్షణీయమన్నారు. 2014-2019 మధ్య కాలంలో నైపుణ్య శిక్షణ ద్వారా ఉద్యోగాల కల్పనలో దేశంలోనే అగ్రస్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉందని గుర్తు చేశారు.

రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు

» వీవీ లక్ష్మీనారాయణ

విజయవాడ(అజిత్‌సింగ్‌నగర్), ఫిబ్రవరి 1: కేంద్రం ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా, ఇంకా పేదరిక నిర్మూలనకు పథకాలు పెట్టే స్థాయిలో మన కేంద్ర బడ్జెట్ ఉందని ఓ ప్రకటనలో ఆక్షేపించారు.

వరాలు.. వాతలు లేకుండానే..



సార్వత్రిక ఎన్నికలున్నా సాదాసీదాగానే నిర్మల బడ్జెట్

ఓట్లాటకు సై

(మొదటిపేజీ తరువాయి)

వివిధ వర్గాలు ఆశించాయి! కానీ... నిర్మలమ్మ వీరందరినీ నిరాశపరిచారు. పదేళ్లలో ఎంతో కష్టపడ్డామని, ఇంకెంతో సాధించామని లెక్కలు విప్పారు. అందుకే.. ప్రజలు తమకు మరోసారి అద్భుత విజయం కట్టబెడతారనే ఆశాభావం ప్రకటించారు. పదేళ్లలో ఏం చేశామో బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిర్మల ఏకరువు పెట్టారు! ఎప్పట్లాగే, ఆర్థిక క్రమశిక్షణే తమ ప్రథమ లక్ష్యమని చెప్పారు! అందుకు అనుగుణంగానే.. 'గత పదేళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ అద్భుతంగా పరిణామం చెందింది' అంటూ తన బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించారు! పదేళ్ల కిందటి యూపీఏ; తమ పాలనలోని విజయ, వైఫల్యాలపై శ్వేతపత్రం విడుదల చేస్తామని ప్రకటించారు! వెరసి, 'ఈసారి బడ్జెట్‌లో ప్రజాకర్షక పథకాలు గుప్పించం.. పదేళ్ల మా పాలన చూసి ఓటు వేయండి' అని ప్రజలకు స్పష్టం చేశారు!

ఊరించి.. ఉసూరనిపించి..!

నిరుపేదలు, మహిళలు, యువత, రైతుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించిన ఆర్థిక మంత్రి నిర్మల.. వారితోపాటు ఇతరులకూ నిర్దిష్టంగా ఎటువంటి వరాలూ ప్రకటించలేదు. అలాగే వాతలూ పెట్టలేదు. మళ్లీ అధికారంలోకి వచ్చేది తామేనన్న మోదీ సర్కారు ధీమా బడ్జెట్ ప్రసంగంలో ప్రతిఫలించింది! రాబోయే ఐదేళ్లలో మునుపెన్నడూ లేని అభివృద్ధి జరగనుందని, 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ కల సాకారానికి ఇది స్వర్ణ యుగమని నిర్మల చెప్పారు. రాబోయే ఐదేళ్లలో మధ్య తరగతి గృహ నిర్మాణానికి సంబంధించి కొత్త పథకం ప్రకటిస్తామని నిర్మల ప్రకటించారు. ప్రధాన మంత్రి ఆవాస యోజన కింద మూడు కోట్ల మార్కుకు చేరుకుంటున్నామని, రాబోయే ఐదేళ్లలో మరో రెండు కోట్ల ఇళ్లను నిర్మిస్తామని వెల్లడించారు. రైల్వేలో మూడు (ఎనర్జీ, మినరల్, సిమెంట్) భారీ కారిడార్లను చేపట్టడంతోపాటు ఏకంగా 40 వేల సాధారణ బోగీలను వందే భారత్ స్థాయిలో తీర్చిదిద్దుతామని తెలిపారు. పోర్టు కనెక్టివిటీ కారిడార్లు, హై ట్రాఫిక్ డెన్సిటీ కారిడార్లనూ తీసుకొస్తామన్నారు. విమానాశ్రయాలను విస్తరించడంతో పాటు కొత్తగా వెయ్యికిపైగా విమానాలను కొంటామని చెప్పారు. రూఫ్ టాప్ సోలార్ పథకం కింద దేశవ్యాప్తంగా కోటి ఇళ్లకు 300 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్తు అందజేస్తామని ప్రకటించారు. టెక్నాలజీ అంటే చెవి కోసుకునే యువత స్టార్టప్‌లను ప్రారంభించేందుకు చేయూత ఇస్తామని, తక్కువ వడ్డీకి లేదా వడ్డీ లేకుండా రుణాలు ఇచ్చేందుకు లక్ష కోట్ల రూపాయలతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఐదు ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే, మహిళల ఆరోగ్యంపై నిర్మల ప్రత్యేకంగా దృష్టి సారించారు. 9-14 ఏళ్ల బాలికలకు సర్వైకల్ క్యాన్సర్ టీకా వేసేందుకు ప్రత్యేక పథకాన్ని తీసుకొస్తామని ప్రకటించారు. మాతా శిశు సంక్షేమానికి పెద్దపీట వేస్తామని చెబుతూనే.. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అంగన్వాడీలు, ఆశాలకూ విస్తరించారు. మహిళలను లక్షాధికారుల (లాక్‌పతి దీదీ)ను చేసే పథకం కింద ఇప్పటికే కోటి మందిని లక్షాధికారులను చేశామని, రాబోయే ఐదేళ్లలో మరో తొమ్మిది కోట్ల మందిని చేయడమే తమ లక్ష్యమని వెల్లడించారు. అన్ని జిల్లాల్లోనూ ప్రభుత్వ ఆస్పత్రులను నిర్మిస్తామని, మరిన్ని మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఉపాధి హామీ పథకం కేటాయింపులను 43 శాతం పెంచి 86 వేల కోట్లు చేశారు. ఎప్పట్లాగే రక్షణ బడ్జెట్‌కు పెద్దపీట వేశారు. గత బడ్జెట్‌తో పోలిస్తే 4 శాతం పెంచి రూ.6.2 లక్షల కోట్లు కేటాయించారు. ఇక, ప్రత్యక్ష, పరోక్ష పన్నులు సహా దిగుమతి సుంకాల్లో ఎటువంటి మార్పులు చేయలేదు. అయితే, స్టార్టప్స్‌కు ఇచ్చే కొన్ని రాయితీలు, సావరిన్ వెల్త్ బాండ్స్, పింఛను నిధుల్లో పెట్టే పెట్టుబడులకు ఇచ్చే రాయితీలు తదితరాలు వచ్చే ఏడాది మార్చి 31 వరకూ కొనసాగుతాయని తెలిపారు. ఏళ్ల తరబడి పేరుకుపోయిన 10 వేలు; 25 వేలలోపు వివాదాస్పద ఐటీ పన్ను డిమాండ్లను రద్దు చేశారు. తద్వారా, కోటి మందికి ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. విద్యుత్తు వాహన వ్యవస్థను బలోపేతం చేస్తామని చెప్పిన నిర్మల.. అందుకు సంబంధించి నిర్దిష్ట కార్యాచరణను మాత్రం బడ్జెట్లో ప్రకటించలేదు. సరికదా.. ఫేమ్ పథకం బడ్జెట్‌నూ 44 శాతం కోత కోశారు.



బడ్జెట్ తయారీ బృందంతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

మూలధన వ్యయానికి పెద్దపీట

ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, ద్రవ్యలోటును అదుపులో ఉంచడమే తమ ముందు ఉన్న ప్రధాన లక్ష్యమని పునరుద్ఘాటించిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. బడ్జెట్లో ఆ దిశగానే అడుగులు వేశారు. ఇందులో భాగంగా మూలధన వ్యయం పెంపునకు పెద్దపీట వేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి మూలధన వ్యయాన్ని భారీగా 11.1 శాతం పెంచి రూ.11,11,111 కోట్లు కేటాయించనున్నట్లు ప్రకటించారు. తద్వారా, ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పన పుంజుకుంటాయని సంకేతాలు ఇచ్చారు. అయితే, గత ఏడాది రూ.10 లక్షల కోట్లు మూలధన వ్యయం కింద ఖర్చు చేస్తామని చెప్పినా.. రూ.9.5 లక్షల కోట్లకే పరిమితం కావడం గమనార్హం. రాష్ట్రాలకు కూడా మూలధన వ్యయం పెంచేందుకు ఈ ఏడాది రూ.1.3 లక్షల కోట్ల మేరకు వడ్డీ లేని రుణం కల్పిస్తామని, వికసిత్ భారత్ యాత్రలో భాగంగా సంస్కరణల అమలుకు రాబోయే 50 ఏళ్లలో మరో రూ.75 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను రాష్ట్రాలకు అందిస్తామని వెల్లడించారు. ఆర్థిక కార్యకలాపాల్లో బలమైన వృద్ధి కారణంగా రెవెన్యూ వసూళ్లు పెరిగాయని, గత ఏడాది డిసెంబరుకు జీఎస్టీ వసూళ్లు రూ.1.65 లక్షల కోట్లు ఉన్నాయని వివరించారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో రూ.47.77 లక్షల కోట్ల మేరకు ఆదాయం లభిస్తుందని, ఇందులో కేవలం పన్ను రాబడులే రూ.26.99 లక్షల కోట్లు ఉంటాయని అంచనా వేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఇవి రూ.30 లక్షల కోట్లు ఉంటాయని తెలిపారు. ఫలితంగా, సంక్షేమ పథకాలకు వ్యయాన్ని కూడా పెంచామని వివరించారు. గత పదేళ్లలో తీసుకున్న నిర్ణయాలతో దేశ ఆర్థిక వ్యవస్థ ఎంతో పురోగతి చెందిందని గణాంక వివరాలతో సహా వివరించారు. 2023-24కు సవరించిన ఆర్థిక లోటు జీడీపీలో 5.8 శాతానికి చేరుకుందని చెప్పిన నిర్మల.. ఇది ఆర్థిక పటిష్ఠత దిశలో మోదీ ప్రభుత్వం చేపట్టిన చర్యలకు నిదర్శనమని తెలిపారు. వచ్చే ఏడాది కూడా ఆర్థిక లోటును తగ్గించి జీడీపీలో 5.1 శాతానికే పరిమితం చేస్తామని చెప్పారు. మార్కెట్ రుణాలు గత ఏడాది కంటే తక్కువగా ఉంటాయని, వీటిని మరింత తగ్గిస్తామని అంటూనే.. నికర మార్కెట్ రుణాలు రూ.11.75 లక్షల కోట్లు ఉండవచ్చునని తెలిపారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు సంబంధించి ఇది స్వర్ణయుగమని, 2005-14తో పోలిస్తే 2014-23లో రెట్టింపు ఎఫ్‌డీఐలు లభించాయని, ఈ ఐదేళ్లలోనే 596 బిలియన్ డాలర్ల (రూ.4,172 వేల కోట్లు) విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు దేశానికి వచ్చాయని వివరించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో వాస్తవ జీడీపీ 7.3 శాతం ఉంటుందని అంచనా వేశారు. 2027 నాటికి భారత్ ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ఐఎంఎఫ్ సహా పలు అంతర్జాతీయ సంస్థలు అంచనా వేశాయని చెప్పారు. ఇక, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు సంబంధించి ఎటువంటి ప్రకటన చేయలేదు. సరికదా.. సదరు లక్ష్యాన్ని రూ.30 వేల కోట్లు తగ్గించారు.



47,65,768 (రూ. కోట్లలో)

కీలక పథకాలకు కేటాయింపులు (రూ. కోట్లలో)

పథకం	కేటాయింపు
గరీబ్ కల్యాణ్ అన్న యోజన	2,05,250
ఉపాధి హామీ పథకం	86,000
ప్రధానమంత్రి ఆవాస్ యోజన	80,671
జల్ జీవన్ మిషన్	70,163
కిసాన్ సమ్మాన్ నిధి	60,000
జాతీయ ఆరోగ్యమిషన్	38,183
సమగ్ర శిక్ష	37,500
అంగన్‌వాడీ కేంద్రాలకు	21,200
గ్రామ సడక్ యోజన	19,000
జీవనోపాధి మిషన్	15,047
పంటల భీమా పథకం	14,600
ప్రధాన మంత్రి పోషణ్ శక్తి	12,467
స్వచ్ఛ భారత్	12,192
అమృత్, స్మార్ట్ సిటీస్	10,400
ఆయుష్మాన్ భారత్	7,500
నదుల అనుసంధానం	3,500



వ్యవసాయ శాఖకు 1.27 లక్షల కోట్లు!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: బడ్జెట్‌లో వ్యవసాయ శాఖకు కేంద్రం రూ. 1,27,469.88 కోట్లు కేంద్రం కేటాయించింది. ఇందులో వ్యవసాయ విభాగానికి రూ.1,17,528.79 కోట్లు, అగ్రికల్చర్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్‌కు (డేర్)కు 9,941.09 కో ట్లు కేటాయించింది. వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహిస్తామని పేర్కొంది. ఎరువుల పరంగా కీలక అంశాన్ని బడ్జెట్‌లో ప్రస్తావించారు. ఇప్పటికే వివిధ రకాల పంటల కోసం 'నానో యూరియా'ను ప్రవేశపెట్టిన మాదిరిగానే తాజాగా 'నానో డీఏపీ'ని అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించింది. నానో యూరియా విజయవంతమైన నేపథ్యంలో దేశవ్యాప్తంగా అన్ని ఆగ్రో-క్లైమేటిక్ జోన్లకు 'నానో డీఏపీ'ని విస్తరిస్తామని పేర్కొంది. రసాయనాలు-ఎరువుల శాఖకు రూ.1.68 లక్షల కోట్లను కేటాయించింది. అయితే శాఖలోని ఎరువుల విభాగానికి గత ఆర్థిక సంవత్సరంలో 1,88,947.81 కోట్లు కేటాయిస్తే దాన్ని ఈసారి రూ.1,64,150.81 కోట్లకు కుదించడం గమనార్హం. కాగా ప్రతిష్ఠాత్మకంగా అమలవుతున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకానికి నిధులు పెంచలేదు. గత బడ్జెట్‌లో మాదిరిగానే ఈ పథకానికి రూ.60వేల కోట్లను కేటాయించారు. ద్వారా దేశవ్యాప్తంగా 11.8 కోట్ల మంది రైతులు లబ్ధి పొందుతున్నట్లు కేంద్రం వెల్లడించింది. 2022లో ప్రకటించిన 'ఆత్మనిర్భర్ ఆయిల్ అభియాన్'లో భాగంగా ఆవ, వేరుశనగ, నువ్వులు, సోయాబీన్, పొద్దుతిరుగుడు గింజల సాగులో అధిక దిగుబడుల కోసం విత్తన రకాలపై పరిశోధనలను ప్రోత్సహిస్తామని పేర్కొంది. నూనెగింజల సాగులో ఆధునిక సాగు పద్ధతులు, మార్కెట్ల అనుసంధానం, పంటల భీమా వంటి అంశాలపై దృష్టిసారిస్తామని వెల్లడించింది. పాడి రైతులను ఆదుకునే చర్యలు చేపడతామని కేంద్రం పేర్కొంది. పశుసంవర్ధక-డెయిరీ శాఖకు రూ.7,105.74 కోట్లు కేటాయించింది. ఇందులో ఫిషరీస్‌కు గత ఆర్థిక సంవత్సరంలో రూ.1,701 కోట్లు కేటాయిస్తే దాన్ని రూ. 2,584.50 కోట్లకు పెంచింది. పశుసంవర్ధక-డెయిరీ విభాగానికి గతంలో రూ.3,913.93 కోట్లు కేటాయిస్తే ఈసారి రూ.4,521.24 కోట్లు కేటాయించింది.

కొత్తగా 5 ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కులు!

55 లక్షల మందికి ఉపాధి అవకాశాలే లక్ష్యం




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ఆక్వా పరిశ్రమకు మద్దతుగా అత్యాధునిక, ఇంటిగ్రేటెడ్ సదుపాయాలను కల్పించడం ద్వారా మత్స్యరంగం అభివృద్ధికి, ఆ రంగంలో భాగస్వాములైన అందరికీ అవకాశాలను పెంపొందించడానికి దేశంలో కొత్తగా ఐదు ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కులను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. వీటి ద్వారా కొత్తగా 55 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని ప్రకటించింది. ఆక్వా ఎగుమతులను రెట్టింపు చేయడం(లక్ష కోట్ల రూపాయలకు పెంచడం) దీని లక్ష్యం. అరుణాచల్‌ప్రదేశ్‌లోని తరిణ్ ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కు ఏర్పాటుకు 2022లోనే కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. దానికోసం రూ.43.59 కోట్ల నిధులను కేటాయించింది. ఫిషింగ్ కార్యకలాపాలను ప్రోత్సహించడం, ఈ ప్రాంతంలోని ఆక్వా రైతులు, సంబంధిత వర్గాల కోసం సమగ్రమైన వేదికను ఏర్పాటు చేసే ఉద్దేశంతో దీనిని ప్రకటించారు. అలాగే, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన(పీఎంఎంఎస్‌వై) ద్వారా ఆక్వా ఉత్పత్తిని హెక్టారుకు 2 టన్నులు చొప్పున పెంచనున్నారు. దేశంలో ప్రస్తుతం హెక్టారుకు 3 టన్నులు చొప్పున ఆక్వా ఉత్పత్తి జరుగుతుండగా, దీనిని 5 టన్నులకు పెంచడం లక్ష్యం. ఆక్వా రంగం ఐదేళ్లలో సమగ్రాభివృద్ధి సాధించాలనే ఉద్దేశ్యంతో రూ.20,050 కోట్ల అంచనా పెట్టుబడులతో 2021 సంవత్సరంలో పీఎంఎంఎస్‌వై పథకాన్ని ప్రవేశపెట్టారు.

శాఖ	కేటాయింపు
ప్రజా పంపిణీ	2,13,323
ఆరోగ్యం	90,659
పట్టణ వ్యవహారాలు	77,523
జల శక్తి	98,419
మైనార్టీ వ్యవహారాలు	3,183
పంచాయతీరాజ్	1,184
రైల్వేశాఖ	2,55,393
మహిళ,శిశు సంక్షేమం	26,092







రూ.11.11 లక్షల కోట్లు

2024-25 ఆర్థిక సంవత్సరానికి మూలధన వ్యయ కేటాయింపులివి..

ఎఫ్‌డీఐలకు బూస్ట్!

భారత్‌లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)ను మరింత పెంచేందుకు యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) సహా పలు దేశాలతో ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందాల కోసం చర్చలు జరుపుతున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. 2014-23 మధ్య కాలంలో దేశంలోకి 59,600 కోట్ల డాలర్ల (రూ.49 లక్షల కోట్ల పైమాటే) ఎఫ్‌డీఐలు తరలి వచ్చాయన్నారు. 2005-14 మధ్య కాలంతో పోలిస్తే గత పదేళ్లలో ఎఫ్‌డీఐలు రెండింతలయ్యాయని అన్నారు.

ఆర్‌బీఐ, పీఎస్‌బీల నుంచి డివిడెండ్ ఆదాయం రూ.1.02 లక్షల కోట్లు

2023-24లో రూ.1.04 లక్షల కోట్లు

వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఆర్‌బీఐ, ప్రభుత్వ రంగ బ్యాంక్ (పీఎస్‌బీ)ల నుంచి డివిడెండ్ల రూపంలో రూ.1.02 లక్షల కోట్ల ఆదాయం సమకూరవచ్చని ప్రభుత్వం అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో డివిడెండ్ రాబడి రూ.1.04 లక్షల కోట్లకు చేరుకోవచ్చని భావిస్తోంది. 2023-24 బడ్జెట్ అంచనా రూ.48,000 కోట్లతో పోలిస్తే రెండింతలకు పైగా అధికమిది. గత ఏడాది మేలో ఆర్‌బీఐ ప్రభుత్వానికి ఏకంగా రూ.87,416 కోట్ల డివిడెండ్ చెల్లించడం ఇందుకు దోహదపడింది. గత ఆర్థిక సంవత్సరం (2022-23)లో ఆర్‌బీఐ, పీఎస్‌బీల నుంచి డివిడెండ్ల రూపంలో కేంద్రానికి కేవలం రూ.39,961 కోట్లే సమకూరాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల (సీపీఎస్‌ఈ)ల నుంచి రూ.43,000 కోట్ల డివిడెండ్ చెల్లింపులను అంచనా వేయగా.. రూ.50,000 కోట్ల వరకు సమకూరనున్నాయి. దాంతో 2023-24లో ఆర్‌బీఐ, పీఎస్‌బీలు, సీపీఎస్‌ఈల నుంచి డివిడెండ్ ఆదాయం రూ.1,54,407 కోట్లకు చేరుకునే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది.

సీపీఎస్‌ఈల డివిడెండ్‌తో కలిపి వచ్చే ఆర్థిక సంవత్సరంలో మొత్తం రాబడి రూ.1.50 లక్షల కోట్ల కోట్లకు చేరుకోవచ్చని బడ్జెట్‌లో అంచనా వేసింది. పన్ను వసూళ్లు గణనీయంగా పెరగడంతోపాటు డివిడెండ్ ఆదాయంలో భారీ వృద్ధి కేంద్ర ద్రవ్యలోటు లక్ష్యాలను చేరుకునేందుకు దోహదడనుంది.

- జీడీపీలో 3.4 శాతానికి సమానం
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 11.1 శాతం అధికం
- వరుసగా నాలుగోసారి పెంపు



న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25)లో మౌలికాభివృద్ధి అవసరాల కోసం మూలధన వ్యయాలను రూ.11.11 లక్షల కోట్లకు పెంచుతున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరాని (2023-24)కి ప్రతిపాదించిన రూ.10 లక్షల కోట్లతో పోలిస్తే కేటాయింపులు 11.1 శాతం పెరిగాయి. అయితే, ఈసారి మూలధన పెట్టుబడులు రూ.9.5 లక్షల కోట్లకే పరిమితం కావచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం మూలధన పెట్టుబడులను గణనీయంగా పెంచడం ఇది నాలుగోసారి. 2022-23 తో పోలిస్తే, ఈ ఆర్థిక సంవత్సరంలో మూలధన వ్యయాన్ని ప్రభుత్వం ఏకంగా 37.5 శాతం పెంచింది. కొవిడ్ సంక్షోభం దెబ్బకు ప్రైవేట్ రంగ పెట్టుబడులు మందగించడంతో కేంద్రం అంతక్రితం రెండు ఆర్థిక సంవత్సరాల్లోనూ మూలధన పెట్టుబడుల కేటాయింపులను 35 శాతం చొప్పున పెంచుతూ వచ్చింది. "ఆర్థిక వ్యవస్థ మళ్లీ జోరందుకోవడంతో ఈ మధ్య కాలంలో స్టీల్, సిమెంట్, పెట్రోలియం వంటి రంగాల్లో ప్రైవేట్ రంగ పెట్టుబడులు పుంజుకున్నాయి. గత నాలుగేళ్లలో మూలధన వ్యయాలను మూడింతలు చేయడంతో ఆర్థిక వృద్ధిని పెంచడంతోపాటు భారీగా ఉద్యోగాలూ కల్పించగలిగాం. వచ్చే ఆర్థిక సంవత్సరానికి గాను మూలధన పెట్టుబడులను 11.1 శాతం వృద్ధితో రూ.11,11,111 కోట్లకు పెంచుతున్నాం. ఇది జీడీపీలో 3.4 శాతానికి సమానమ"ని గురువారం బడ్జెట్ ప్రసంగంలో సీతారామన్ తెలిపారు. కొవిడ్ సంక్షోభంతో కుదేలైన ఆర్థిక వ్యవస్థకు పునరుజ్జీవం పోసేందుకు కేంద్ర ప్రభుత్వం మూలధన పెట్టుబడులపై ప్రత్యేక దృష్టిసారించింది. దాంతో గత మూడేళ్లలో భారత్ 7 శాతానికి పైగా జీడీపీ వృద్ధిని నమోదు చేయగలిగింది. ప్రపంచంలోని పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో అత్యధిక వృద్ధి రేటును నమోదు చేసుకున్న దేశంగా నిలిచింది.

మూలధన పెట్టుబడి కేటాయింపులు

ఆర్థిక సంవత్సరం	రూ.లక్షల కోట్లు	కేటాయింపుల్లో వృద్ధి (%)
2020-21	4.39	---
2021-22	5.54	35
2022-23	7.50	35
2023-24	10.0	37.4
2024-25	11.11	11.1

డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం రూ.50,000 కోట్లు

2023-24 టార్గెట్ రూ.30,000 కోట్లకు తగ్గింపు

వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25)లో ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ (డిజిన్వెస్ట్‌మెంట్) ద్వారా రూ.50,000 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకోవాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2023-24) డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాన్ని తొలుత నిర్దేశించుకున్న రూ.51,000 కోట్ల నుంచి రూ.30,000 కోట్లకు కుదించుకుంది. లోక్‌సభలో ప్రవేశపెట్టిన 'మధ్యంతర బడ్జెట్ 2024-25' పత్రాల ప్రకారం.. ప్రభుత్వ ఆస్తుల విక్రయం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో ఎలాంటి ఆదాయం సమకూరే అవకాశం లేదని సర్కారు భావిస్తోంది. గత బడ్జెట్ (2023-24)లో మాత్రం ప్రభుత్వ ఆస్తుల విక్రయం ద్వారా రూ.10,000 కోట్ల వరకు సమీకరించాలని లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు కేంద్రం కోల్ ఇండియా, ఎన్‌హెచ్‌పీసీ, ఆర్‌వీఎన్‌ఎల్, ఐఆర్‌ఈడీఏ సహా 7 ప్రభుత్వ రంగ సంస్థల్లో మైనారిటీ వాటాల విక్రయం ద్వారా రూ.12,504 కోట్లు సమీకరించగలిగింది. ఈ మార్చి చివరినాటికల్లా డిజిన్వెస్ట్‌మెంట్ ఆదాయాన్ని రూ.30 వేల కోట్లకు పెంచుకోవాలనుకుంటోంది. గత కొన్ని ఆర్థిక సంవత్సరాలుగా ప్రభుత్వం డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాలను చేరుకోలేకపోతోంది. 2018-19, 2017-18 ఆర్థిక సంవత్సరాల్లో మాత్రం టార్గెట్‌ను మించి ఆదాయం సమకూర్చుకోగలిగింది. 2017-18లో రూ.లక్ష కోట్ల బడ్జెట్ లక్ష్యానికి గాను రూ.1,00,056 కోట్లు సేకరించింది. 2018-19లో రూ.80,000 కోట్ల లక్ష్యానికి అదనంగా రూ.4,972 కోట్లు (మొత్తం రూ.84,972 కోట్లు) సమీకరించింది.

మార్కెట్ పెదవి విరుపు

సెన్సెక్స్ 107 పాయింట్లు డౌన్



ముంబై: ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రకటించిన తాత్కాలిక బడ్జెట్ ఈక్విటీ మార్కెట్‌ను అంతగా ఆకట్టుకోలేకపోయింది. ఎలాంటి భారీ ప్రకటనలు లేకుండా బడ్జెట్ ప్రసంగం చప్పగా సాగిపోయిన నేపథ్యంలో యంత్ర పరికరాలు, మెటల్, రియల్టీ షేర్లలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకారణకు దిగడం మార్కెట్‌ను కుంగదీసింది. ఆర్థిక మంత్రి ప్రసంగం సాగుతున్నంత సేపూ భారీగా ఊగిసలాడిన ఈక్విటీ సూచీలు చివరికి నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 71,574.89-72,151.02 పాయింట్ల మధ్యన కదలాడి చివరికి 106.81 పాయింట్ల నష్టంతో 71,645.30 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 28.25 పాయింట్ల నష్టంతో 21,697.45 వద్ద క్లోజైంది. మార్చిలో కూడా వడ్డీ రేట్ల కోత ఉండదని అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ ఇచ్చిన సంకేతాలు కూడా మార్కెట్‌ను నీరసపరిచాయి.

ఈ రంగాల షేర్లదే హవా

ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రతిపాదనలతో గ్రీన్ ఎనర్జీ, గృహ నిర్మాణం, విద్యుత్ వాహన విభాగ షేర్లు లాభాల బాటలో సాగగా రైల్వే విభాగాల షేర్లు మాత్రం నష్టపోయాయి.

ఇంధన షేర్లు: సోలార్ సొల్యూషన్లు అందించే కేపీఐ గ్రీన్ ఎనర్జీ షేర్లు 9.48 శాతం లాభంతో రూ.1,996.65 వద్ద ముగిశాయి. ఇంట్రాడేలో ఈ షేరు 52 వారాల గరిష్ఠ స్థాయి రూ.2,006.15ని తాకింది. వెబ్‌సోల్ ఎనర్జీ సిస్టమ్స్ షేరు 4.99 శాతం పెరిగి ఏడాది గరిష్ఠ స్థాయి రూ.388.15ని తాకింది. స్టెర్లింగ్ అండ్ విల్సన్ రెన్యువబుల్ ఎనర్జీ షేర్లు 1.07 శాతం లాభపడి రూ.572.45 వద్ద ముగిశాయి.

గృహనిర్మాణ రంగం: ప్రభుత్వ రంగంలోని హడ్కో షేరు ఎన్‌ఎస్‌ఈలో 19.99 శాతం లాభపడి 52 వారాల గరిష్ఠ స్థాయి, ఎగువ సర్క్యూట్ లిమిట్ రూ.206.80 వద్ద ముగిసింది. బీఎస్‌ఈలో 19.62 శాతం లాభంతో రూ.206.30 వద్ద ముగిసింది. ఎన్‌బీసీసీ షేరు కూడా ఎన్‌ఎస్‌ఈలో 12.01 శాతం వృద్ధితో 52 వారాల గరిష్ఠం రూ.145 వద్ద ముగిసింది. బీఎస్‌ఈలో 9.78 శాతం లాభపడి రూ.142.05 వద్ద ముగిసింది.

విద్యుత్ వాహనాలు: ఈ రంగంలో అగ్రగామి అయిన ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ షేరు ఇంట్రాడేలో 6.21 శాతం పెరిగి 52 వారాల గరిష్ఠ స్థాయి రూ.1,849.25ని తాకినా లాభాల స్వీకారంతో 0.69 శాతం నష్టపోయి రూ.1,729 వద్ద ముగిసింది. జేబీఎం ఆటో 4.96 శాతం లాభంతో ఏడాది గరిష్ఠ స్థాయి రూ.2,010.80ని తాకి చివరికి 2.48 శాతం లాభంతో రూ.1,963.20 వద్ద ముగిసింది. గ్రీవ్స్ కాటన్ షేరు 0.95 శాతం లాభంతో రూ.165.05 వద్ద క్లోజైంది.

రైల్వే కంపెనీల షేర్లు డౌన్: పై రంగాల షేర్లకు భిన్నంగా రైల్వే షేర్లు మాత్రం నష్టపోయాయి. ఇర్కాన్ ఇంటర్నేషనల్ షేరు 3.69 శాతం, రైల్ వికాస్ నిగమ్ షేరు 3.49 శాతం, ఐఆర్‌ఎఫ్‌సీ షేరు 2.85 శాతం, జుపిటర్ వ్యాగన్స్ షేరు 1.92 శాతం, ఐఆర్‌సీటీసీ షేరు 1.57 శాతం, టెక్స్‌మాకో రైల్ అండ్ ఇంజనీరింగ్ షేరు 0.82 శాతం, టిటాఘర్ రైల్ సిస్టమ్స్ షేరు 0.55 శాతం నష్టపోయాయి.

'ఆర్థిక' బలోపేతమే లక్ష్యం

- ప్రజాకర్షక పథకాలకు స్వస్తి
- ద్రవ్య లోటు కట్టడికే ప్రాధాన్యత
- 5.1 శాతానికి తగ్గనున్న ద్రవ్య లోటు

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మధ్యంతర బడ్జెట్‌లోనూ ఆర్థిక స్థిరత్వానికి ప్రాధాన్యత ఇచ్చారు. ప్రజాకర్షక పథకాల జోలికి పోకుండా ద్రవ్య లోటును కట్టడి చేయడంపై దృష్టి పెట్టారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) జీడీపీలో 5.9 శాతంగా ఉంటుందని భావించిన ద్రవ్య లోటును 5.8 శాతం (సుమారు రూ.17,34,773 కోట్లు) వద్దే కట్టడి చేస్తామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25) దీన్ని మరింత కుదించి జీడీపీలో 5.1 శాతం (సుమారు రూ.16,85,496 కోట్లు) మించకుండా చూస్తామని ప్రకటించారు. 2026 మార్చి నాటికి ద్రవ్య లోటు జీడీపీలో 4.5 శాతం మించకుండా చూడడం తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మార్కెట్ ధరల ప్రకారం చూస్తే 2024-25 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ 10.5 శాతం పెరిగి రూ.327.71 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

పదేళ్లలో ఎంతో ఎదిగాం

ప్రధాని మోదీ నాయకత్వంలో గత పదేళ్లలో ఆర్థికంగా భారత్ ఎంతో ఎదిగిందని సీతారామన్ తెలిపారు. సంస్థాగత సంస్కరణలు, ప్రజానుకూల పథకాలు, ఉపాధి అవకాశాల పెంపుతో మన ఆర్థిక వ్యవస్థకు కొత్త జవసత్వాలు వచ్చాయన్నారు. 2020-21 ఆర్థిక సంవత్సరం కొవిడ్‌తో 5.8 శాతం క్షీణించిన జీడీపీ, ఆ మరుసటి సంవత్సరమే 9.1 శాతం పెరిగిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం 3.7 లక్షల కోట్ల డాలర్ల స్థాయిలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ మరో మూడేళ్లలో ఐదు లక్షల కోట్ల డాలర్లకు చేరి ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగబోతోందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనూ మన జీడీపీ ఏడు శాతంపైనే పెరుగుతుందని తెలిపారు.

ధరల 'సెగ' తగ్గింది

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో భగ్గుమన్న ధరల సెగ ప్రస్తుతం తగ్గుముఖం పట్టిందని ఆర్థిక మంత్రి తెలిపారు. ఆ యుద్ధం పర్యవసానంగా 8 శాతానికి పైగా పెరిగిన రిటైల్ ద్రవ్యోల్బణం 2023 డిసెంబరులో 5.69 శాతానికి తగ్గిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం, ఆర్‌బీఐ తీసుకున్న సానుకూల చర్యలు ఇందుకు ప్రధాన కారణమన్నారు. ప్రస్తుతం మన దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం పెద్దగా ఆందోళన చెందాల్సిన స్థాయిలో లేదన్నారు.

'టెల్కో'ల నుంచి రూ.1.2 లక్షల కోట్లు

స్పెక్ట్రమ్, లైసెన్స్ ఫీజుల రూపంలో వచ్చే ఆర్థిక సంవత్సరం దేశీయ టెలికాం కంపెనీల నుంచి రూ.1.2 లక్షల కోట్లు అందే అవకాశం ఉందని ఆర్థిక మంత్రి తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి అంచనా వేస్తున్న రూ.93,541.01 కోట్ల కంటే ఇది ఎక్కువ.



మహీంద్రా ఎక్స్‌యూవీ 400 ప్రో

హైదరాబాద్: ఎస్‌యూవీల తయారీలో అగ్రగామి అయిన మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) తన ఎక్స్‌యూవీల శ్రేణిలో ఎక్స్‌యూవీ 400 కొత్త వేరియెంట్లను మార్కెట్లోకి తెచ్చింది. ఎక్స్‌యూవీ ప్రో శ్రేణిలోని ఈ విద్యుత్ కార్ల ధర రూ.15.49 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. వీటిలో ఈసీ ప్రో (34.5 కిలోవాట్ల బ్యాటరీ, 33 కేడబ్ల్యూ ఏసీ చార్జర్), ఈఎల్ ప్రో (34.5 కిలోవాట్ల బ్యాటరీ, 3.3 కేడబ్ల్యూహెచ్ ఏసీ చార్జర్), ఈఎల్ ప్రో (39.4 కిలోవాట్ల బ్యాటరీ, 7.2 కేడబ్ల్యూహెచ్ చార్జర్) వేరియెంట్లు అందుబాటులో ఉంటాయి. ఈ కార్లన్నీ డ్యుయెల్ టోన్ ఇంటీరియర్లు, 26.04 సెంటీమీటర్ల ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ 26.04 సెంటీమీటర్ల ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ వంటి అత్యాధునిక కనెక్టివిటీ ఫీచర్లుంటాయి. ఈ కార్లు కేవలం 8.3 సెకండ్లలో 0-100 కిలోమీటర్ల వేగం అందుకుంటాయని, గరిష్ఠంగా గంటకి 150 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయని కంపెనీ రీజినల్ సేల్స్ మేనేజర్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) అభిషేక్ నాయర్ చెప్పారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,440 ▲	58,150 ▲	77,800 ▼
ముంబై	62,599 ▼	57,341 ▼	70,834 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

ఫిబ్రవరి 1		విజయవాడ	525
హైదరాబాద్	520	విశాఖపట్నం	545
ఫిబ్రవరి 2		వరంగల్	522
చిత్తూరు	573		
గోదావరి	525	దజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	99	గోదావరి	108
వరంగల్	99	విజయవాడ	108
కరీంనగర్	99	గుంటూరు	109
మహబూబ్‌నగర్	99	ఒంగోలు	109
కర్నూలు	99	చిత్తూరు	110
విశాఖపట్నం	110		

అకోలైట్-బోంటియస్ విలీనం

హైదరాబాద్: డిజిటల్ సేవల రంగంలో ఉన్న రెండు ప్రముఖ అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థలు 'అకోలైట్ డిజిటల్, బోంటియస్' విలీనమయ్యాయి. ఇందులో అకోలైట్ డిజిటల్ కంపెనీ ప్రపంచ వ్యాప్తంగా అనేక సంస్థలకు డిజిటల్ ఇంజనీరింగ్, క్లౌడ్ డేటా, కృత్రిమ మేధ (ఏఐ) సేవలు అందిస్తోంది. బోంటియస్ అనేక ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్లకు డిజిటల్ ఇన్నోవేషన్ భాగస్వామిగా ఉంది. అంతర్జాతీయంగా ఉన్న ఖాతాదారులకు అత్యుత్తమ సేవలందించే ఉద్దేశంతో ఇరు కంపెనీలు విలీనమయ్యాయని అకోలైట్ డిజిటల్ వ్యవస్థాపకుడు, సీఈఓ లీల కాజ, బోంటియస్ కో-ఫౌండర్, సీఈఓ కీత్ స్వాట్జ్ తెలిపారు. కాగా ఇరు కంపెనీల విలీనంతో మరిన్ని వ్యాపార అవకాశాలు ఏర్పడతాయని ఈ రెండు కంపెనీలకు నిధులు సమకూర్చిన న్యూయార్క్‌కు చెందిన ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థ న్యూ మౌంటైన్ క్యాపిటల్ ఎండీ ప్రసాద్ చింతమనేని తెలిపారు. విలీనంతో ఏర్పడిన కంపెనీకి కీత్ స్వాట్జ్ సీఈఓగా, లీల కాజ కో సీఈఓగా వ్యవహరిస్తారు. షికాగో కేంద్రంగా పని చేసే ఈ కొత్త కంపెనీ ఉత్తర అమెరికా, ఐరోపా, ఆసియా దేశాల్లోని 5,000 మంది ఉద్యోగులతో కార్యకలాపాలు సాగించనుంది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్, బీమా, కన్స్యూమర్ గూడ్స్, రిటైల్, హెల్త్‌కేర్, లాజిస్టిక్, టెలీకమ్యూనికేషన్స్ రంగాల్లోని ఖాతాదారులకు విలీన సంస్థ వినూత్న డిజిటల్ సేవలు అందించనుంది.

నేటి మ్యాచ్‌లు

- భారత్ x నేపాల్ (అండర్-19 వరల్డ్‌కప్ సూపర్ సిక్స్ పోరు) మ.1.30 నుంచి (స్టార్‌స్పోర్ట్స్, హాట్‌స్టార్)
- ఆస్ట్రేలియా x వెస్టిండీస్ (మెల్‌బోర్న్) తొలి వన్డే- ఉ.9 గం.నుంచి (స్టార్‌స్పోర్ట్స్‌లో)
- శ్రీలంక x అఫ్ఘానిస్థాన్-ఏకైక టెస్ట్ (కొలంబో) ఉ.10 గం.నుంచి (ఫ్యాన్‌కోడ్‌లో)
- ఆంధ్ర x బిహార్ (పట్నా)-రంజీ (ఎలిట్)-ఉ.9 గం
- హైదరాబాద్ x మిజోరం (హైదరాబాద్) రంజీ (ప్లేట్)-ఉ.9.30గం.

శ్రీకాంత్‌కు షాక్

క్వార్టర్స్‌లో గాయత్రి జోడీ

బ్యాంకాక్: వరల్డ్ మాజీ నెం.1 కిడాంబి శ్రీకాంత్ థాయ్‌లాండ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ రెండో రౌండ్‌లో కంగుతిన్నాడు. గురువారం జరిగిన రౌండ్-16 పోరులో మిథున్ మంజునాథ్ 21-19, 13-21, 21-17తో శ్రీకాంత్‌కు షాకిచ్చాడు. మరో మ్యాచ్‌లో శంకర్ ముత్తుసామి 9-21, 11-21తో చున్ యి లిన్ చేతిలో, మాళవికా బన్సోడ్ 22-24, 7-21తో బుసానన్ చేతిలో ఓడారు. మహిళల డబుల్స్‌లో గాయత్రి/ట్రీసా జంట 21-15, 24-22తో తనీషా క్రాస్టో/అశ్వినీ పొన్నప్పపై గెలిచి క్వార్టర్స్‌లో అడుగుపెట్టింది.

భారత్-ఎ తడ 'బ్యాటు'

అహ్మదాబాద్: పేసర్లు మాథ్యూ పాట్స్ (6/57), కార్సీ (4/52) నిప్పులు చెరగడంతో.. భారత్-ఎతో గురువారం ఆరంభమైన మూడో అనధికార టెస్ట్‌లో ఇంగ్లండ్ లయన్స్ పైచేయి సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 192 రన్స్‌కే కుప్పకూలింది. అనక మొదటి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన లయన్స్ తొలి రోజు ఆట ఆఖరికి 98/1 స్కోరు చేసింది.

బజ్‌బాల్‌కు చెక్ పెట్టేనా?

ఒత్తిడిలో టీమిండియా

ఉదయం 9.30 గంటల నుంచి జియో సినిమాలో

నేటి నుంచి ఇంగ్లండ్‌తో రెండో టెస్టు

తుది జట్టుపై అందరి దృష్టి

ద్రవిడ్‌తో జైస్వాల్



భారత్ (అంచనా)

రోహిత్ (కెప్టెన్), జైస్వాల్, గిల్, శ్రేయాస్, రజత్ పటీదార్, అక్షర్, భరత్, అశ్విన్, కుల్దీప్, బుమ్రా, సిరాజ్/సుందర్.

ఇంగ్లండ్ (తుది జట్టు): క్రాలే, డకెట్, పోప్, రూట్, బెయిర్‌స్టో, స్టోక్స్ (కెప్టెన్), ఫోక్స్, రెహాన్ అహ్మద్, టామ్ హార్ట్‌లీ, షోయబ్ బషీర్, అండర్సన్.

పిచ్, వాతావరణం

ఇక్కడ జరిగిన రెండు టెస్టుల్లో పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించింది. ఈసారి కూడా తొలి రెండు రోజులు పరుగులకు అవకాశం ఉంటుంది. ఆ తర్వాత స్పిన్నర్ల ఆధిపత్యం సాగవచ్చు. ఉష్ణోగ్రత 35 డిగ్రీలతో అధిక వేడి ఉండనుంది.

4 టెస్టుల్లో 500 వికెట్లను పూర్తి చేసేందుకు స్పిన్నర్ అశ్విన్‌కు మరో నాలుగు వికెట్లు చాలు. గతంలో భారత్ నుంచి కుంబ్లే (619) మాత్రమే 500 మార్క్ చేరాడు.

విశాఖపట్నం (స్పోర్ట్స్): ఇంగ్లండ్ ప్రధాన అస్త్రమైన బజ్‌బాల్ వ్యూహాన్ని భారత్ ఈసారి ఎలా ఎదుర్కొనబోతోంది? అంతకంటే ముందు జడేజా, రాహుల్, కోహ్లీ లేని వేళ తమ తుది జట్టు కూర్పు ఎలా ఉండబోతోంది? ఇప్పుడందరినీ ఇవే సందేహాలు వెంటాడుతున్నాయి. శుక్రవారం విశాఖలో ఆరంభమయ్యే రెండో టెస్టు భారత జట్టుకు అత్యంత కీలకం కానుంది. ఎందుకంటే ఇప్పటికే తొలి టెస్టులో అనూహ్య ఓటమి జట్టును తీవ్ర ఒత్తిడిలోకి నెట్టేసింది. ఈ అవకాశం చేజారితే తిరిగి కోలుకోవడం కష్టమవుతుంది. ఉప్పల్ టెస్టులో మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కినా బ్యాటింగ్ వైఫల్యం కొంప ముంచింది. అందుకే తాజా టెస్టులో ఇంగ్లండ్‌ను కౌంటర్ చేయాలంటే తమ ఆటతీరు మార్చుకోవాల్సిందే. డిఫెన్సివ్ ఆటను కాకుండా ఎదురుదాడిని నమ్ముకుంటేనే బజ్‌బాల్‌కు చెక్ పెట్టవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మూడేళ్ల క్రితం ఇదే జట్టుపై మొదటి టెస్టు ఓడినా.. ఆ తర్వాత భారత్ వరుసగా 3 టెస్టులు నెగ్గింది.

ఆడేది ఎవరు?: జడేజా, రాహుల్ స్థానంలో జట్టులోకి సర్ఫరాజ్, రజత్ పటీదార్, సౌరభ్ కుమార్ వచ్చారు. ఇప్పుడు తుది జట్టులో వీరిలో ఎవరికి చోటు దక్కుతుందనేది ఆసక్తికరం. అలాగే జడ్డూ స్థానంలో స్పిన్నర్‌గా కుల్దీప్ ఆడే చాన్స్ ఉంది. ఇక నలుగురు స్పిన్నర్లతో వెళ్లాలనుకుంటే పేసర్ సిరాజ్‌ను పక్కనబెట్టి ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ వైపు మొగ్గు చూపుతారు. అశ్విన్, అక్షర్ ప్రత్యర్థి స్వీప్ షాట్లకు చెక్ పెట్టేలా బౌలింగ్ చేయాల్సి ఉంటుంది. బ్యాటింగ్ విభాగంలోనూ గిల్, శ్రేయాస్‌ల ఫామ్ ఆందోళనకరంగా ఉంది. ముఖ్యంగా గిల్ డిఫెన్సివ్ ఆటతో మరింతగా విఫలమవుతున్నాడు. అరంగేట్ర స్పిన్నర్ టామ్ హార్ట్‌లీని తట్టుకోవడంలో రోహిత్ మినహా అంతా విఫలమయ్యారు. స్వీప్ షాట్లు ఆడడంలో ఇంగ్లండ్ బ్యాటర్లకన్నా వెనుకబడ్డారు. అలాగే రాహుల్ స్థానంలో సర్ఫరాజ్ కన్నా రజత్ పటీదార్‌కు ఎక్కువ అవకాశాలు కనిపిస్తున్నాయి. పిచ్‌ను బట్టి తుది జట్టుపై టీమ్ మేనేజ్‌మెంట్ ఓ అంచనాకు రావచ్చు.



అండర్సన్, బషీర్‌కు చోటు: ఇంగ్లండ్ జట్టు ఇప్పటికే తమ తుది జట్టును ప్రకటించింది. ఈ టెస్టును సైతం గెలిచి 2-0తో భారత్‌పై మరింత ఒత్తిడి పెంచేందుకు వారికిది సువర్ణావకాశం. మొదటి టెస్టులో కెప్టెన్ స్టోక్స్ తమ బౌలర్లను అద్భుతంగా వినియోగించుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో భారత బ్యాటర్లు ధారాళంగా పరుగులు సాధించినా స్పిన్నర్ హార్ట్‌లీని కొనసాగించడం.. కీలక సమయాల్లో పార్ట్‌టైం స్పిన్నర్ జో రూట్‌ను బరిలోకి దించడం అతడి నాయకత్వ ప్రతిభను సూచించాయి. వెటరన్ స్పిన్నర్ జాక్ లీచ్ దూరం కావడంతో షోయబ్ బషీర్ అరంగేట్రం చేయనున్నాడు. అలాగే పేసర్ మార్క్ ఉడ్ స్థానంలో సీనియర్ బౌలర్ అండర్సన్‌ను ఏకైక పేసర్‌గా తీసుకున్నారు.

పక్కా ప్లాన్‌తోనే ఆడతాం

'రెండో టెస్టులో ఇంగ్లండ్‌ను ఎదుర్కొనేందుకు మేం తగిన ప్రణాళికలతో బరిలోకి దిగబోతున్నాం. కీలక ఆటగాళ్లు గాయాలపాలైనా ఎలాంటి ఒత్తిడీ లేదు. మాకు స్వీప్ షాట్లు ఆడడం రాదని కాదు. కానీ పరిస్థితికి తగ్గట్టు బ్యాటర్లు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ టీమ్ డిమాండ్ చేస్తే కచ్చితంగా ఆడతాం. తొలి టెస్టులో ఓడిపోయినా డ్రెస్సింగ్ రూమ్‌లో పరిస్థితి ప్రశాంతంగానే ఉండింది. సుదీర్ఘ సిరీస్ కావడంతో భయపడాల్సిన అవసరం లేదని మాకు తెలుసు'




- కేఎస్ భరత్ (వికెట్ కీపర్)

క్రీడా బడ్జెట్ రూ. 3,400 కోట్లు

నిరుటి కంటే రూ. 45 కోట్లు అధికం

న్యూఢిల్లీ: కేంద్ర మధ్యంతర బడ్జెట్‌లో క్రీడా శాఖకు రూ. 3,442.32 కోట్లు కేటాయించారు. గత ఏడాది కంటే ఇది రూ. 45.36 కోట్లు ఎక్కువ కావడం విశేషం. గత బడ్జెట్‌లో సవరించిన అంచనాల తర్వాత క్రీడా శాఖ బడ్జెట్ రూ. 3,396.96 కోట్లు కావడం గమనార్హం. ఈ సంవత్సరం జూలై-ఆగస్టులో జరగనున్న పారిస్ ఒలింపిక్స్‌పైనే క్రీడా శాఖ ప్రధానంగా దృష్టి సారించింది. క్రీడా శాఖ ప్రధాన ఈవెంట్ ఖేలో ఇండియాకు గత బడ్జెట్ కంటే రూ. 20 కోట్లు ఎక్కువగా ఈసారి రూ. 900 కోట్లు కేటాయించారు. భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్)కు రూ. 822.60 కోట్లు కేటాయించారు. జాతీయ క్రీడా సమాఖ్యలకు రూ. 340 కోట్లు లభించనున్నాయి. కాగా..క్రీడాకారుల ప్రోత్సాహానికి ఇచ్చే బడ్జెట్‌లో గణనీయంగా కోతపెట్టారు. గత బడ్జెట్‌లో ఈ విభాగానికి రూ. 84 కోట్లు ఇవ్వగా..ఈసారి రూ. 39 కోట్లకు కుదించారు.

కోహ్లీ.. కొడుకు లాంటోడు: చేతన్ శర్మ



న్యూఢిల్లీ: విరాట్ కోహ్లీతో విభేదాల విషయంలో మాజీ చీఫ్ సెలెక్టర్ చేతన్ శర్మ యూటర్న్ తీసుకొన్నాడు. కోహ్లీ గురించి తాను తప్పుగా ఎందుకు మాట్లాడతానని, అతను తనకు కొడుకు లాంటి వాడని అన్నాడు. విరాట్‌ను సెలెక్టర్లు ఇష్టపడడం లేదంటూ ఓ స్టింగ్ ఆపరేషన్‌లో చేతన్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఈ క్రమంలో శర్మ తన పదవికి కూడా రాజీనామా చేయాల్సి వచ్చింది.

జడ్డూ.. మూడో టెస్టుకూ కష్టమే!

న్యూఢిల్లీ: ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా మూడో టెస్టుకు కూడా దూరమయ్యే అవకాశం ఉంది. తొడ కండరాల గాయంతో జడేజా విశాఖ టెస్టు నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. సహజంగా ఈ గాయంతో బాధపడేవారు 4 నుంచి 8 వారాల పాటు విశ్రాంతి తీసుకుంటారు. దీంతో నాలుగో టెస్టు వరకు ఫిట్‌నెస్ సాధిస్తే విశేషమే. అలాగే జడ్డూతో పాటు విరాట్ కోహ్లీ కూడా రాజ్‌కోట్ టెస్టులో ఆడేది సందేహంగా మారింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



ఆదమరిస్తే అంతే సంగోతులు...



కృష్ణాజిల్లా పమిడిముక్కల మండలం మర్రివాడ బందరు కాల్వపై ఉన్న ప్రధాన వంతెన ప్రమాదభరితంగా మారింది. సైడు వాల్స్ పూర్తిగా దెబ్బతిని విరిగి పడిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. రోడ్డు గుంతలు ఏర్పడి వాహనదారులను బెంబేలెత్తిస్తున్నాయి. ఆదమరిచి అటువైపుగా వెళ్తే అంతే సంగతులు.. శిథిలావస్థకు చేరుకున్న ఈ వంతెనపై నుంచి యలమర్రు, గుడివాడకు వెళ్లే వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. - విజయవాడ

ఐజీఎంఎస్ స్టేల రద్దుకు వీఎంసీ సన్నద్ధం

● ప్రణాళిక సిద్ధం చేస్తున్న అధికారులు

చిట్టినగర్: ముందు మంచిగా టెండర్లలో పాల్గొని షాపులను దక్కించుకోవడం, తర్వాత అధికారులకు కోర్టు కేసులతో చుక్కలు చూపించడం.. ఇదీ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం షాపింగ్ కాంప్లెక్స్‌లోని వ్యాపారుల పరిస్థితి. కాలపరిమితి ముగిసినా ఖాళీ చేయకుండా కోర్టులను ఆశ్రయించి వ్యాపారాలు సాగిస్తున్న వ్యాపారులకు ఝలక్ ఇవ్వడానికి వీఎంసీ సిద్ధమైంది. కోర్టులిచ్చిన స్టేలను రద్దు చేయించడానికి ప్రణాళికలు రూపొందించారు. ఐజీఎంసీ స్టేడియం షాపింగ్ కాంప్లెక్స్‌లో మొత్తం 49 షాపులున్నాయి. టెండర్ ప్రక్రియలో వీటిని వ్యాపారులు దక్కించుకున్నారు. మూడేళ్లకు లీజుకు తీసుకుని, తర్వాత ప్రతి మూడేళ్లకు ఒకసారి 33శాతం అద్దె పెంపుతో 25 ఏళ్ల వరకు పొడిగించుకున్నారు. వాటిలో 39 మంది వ్యాపారులు పెంచుకున్న 25 ఏళ్ల గడువు ముగిసినా షాపులు ఖాళీ చేయకుండా జిల్లా కోర్టును ఆశ్రయించారు. వారిలో 32 మందికి కోర్టు స్టే ఇచ్చి, మరో ఏడుగురికి నిరాకరించింది. స్టే తెచ్చుకున్న ఓ వ్యాపారి అధికారుల పట్ల దౌర్జన్యంగా వ్యవహరించడంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. అతడి స్టేను రద్దు చేయాలని పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు సానుకూలంగా తీర్పు ఇచ్చి స్టేను రద్దు చేసింది. రాజకీయ నేతల అండదండలున్న వ్యాపారులు బరి తెగించి వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీ నేతలకు ముడుపులిచ్చి అధికారుల నోరు మూయిస్తున్నారు. అందుకే వారు అధికారుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఇలాంటి వ్యాపారుల ఆగడాలకు కళ్లెం వేయాలని నిర్ణయించుకున్న అధికారులు హైకోర్టు ద్వారా మిగిలిన స్టేలను రద్దు చేయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ జిల్లా నేతలు

'ఓట్ ఫర్ ఓపీఎస్' పోస్టర్ ఆవిష్కరణ

ధర్నాచౌక్, ఫిబ్రవరి 1: 'ఓట్ ఫర్ ఓపీఎస్' పేరుతో యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ రూపొందించిన వాల్ పోస్టర్‌ను స్థానిక ధర్నాచౌక్‌లో సంఘం జిల్లా నేతలు గురువారం ఆవిష్కరించారు. అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.శ్రీనివాసరావు, ఏ సుందరయ్య మాట్లాడుతూ ఏ పార్టీ అయితే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తానని హామీ ఇస్తారో వారికి మాత్రమే రా బోయే ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులు వారి కుటుంబ సభ్యుల మద్దతు ఉంటుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరి మార్చుకుని పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

వన్‌టౌన్, ఫిబ్రవరి 1: దుర్గగుడిలో నిత్యాన్నదాన పథకానికి మధురానగర్‌కు చెందిన మద్దుల కరుణాకర్ రావు, ఉషాదేవి కుటుంబ సభ్యులు గురువారం రూ.1,00,116 విరాళం అందజేశారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కర్నా టి రాంబాబును కలసి ఈ విరాళం దేవస్థానానికి అందజేశారు. అధికారు లు, వేద పండితులు దాతకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవ స్త్రం, ఆశీస్సులు అందజేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన వృద్ధులు, దివ్యాంగులకు వీల్‌చైర్ సౌకర్యం, వారి రాకపోకలకున్న ఇబ్బందులను ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రాంబాబు పరిశీలించారు. ఆలయంలోని ధర్మపథం వే దికపై గురువారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలో ఆర్.పద్మా చ క్రవర్తి, ఎస్.నాగలక్ష్మి వీణా యుగళం జరిగింది. వాతాపి గణపతిం భజే, హిమగిరి తనయే హేమలతే, శంభోమహదేవ, సుధామయి భో శంభో కీర్తలను వీణపై పలికించారు. మృదంగంతో సూర్య సహకరించారు.



న్యాయవాదుల నిరసన దీక్షలో మాట్లాడుతున్న శ్రీనివాస్

భూహక్కు చట్టంతో నష్టపోయేది సామాన్యులే..!

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్

విజయవాడ లీగల్, ఫిబ్రవరి 1: భూ హక్కు చట్టం-2022 అమల్లోకి వస్తే మొదట నష్టపోయేది సామాన్య ప్రజలేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. బెజవాడ బార్ అసోసియేషన్ ఆవరణలో న్యాయవాదులు చేపట్టిన నిరసన దీక్షలు గురువారం 43వ రోజుకు చేరాయి. గురువారం నాటి దీక్షలో ఆలిండియా లాయర్స్ యూనియన్‌కు చెందిన ఆలూరి సుధాకరరావు, సంపర శ్రీను, వడ్లమూడి రామకృష్ణ, బొమ్మసాని రవి, సప్పా రమేష్, చిలువేరు మాధవి, సీవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, జిలానీ సహా 43మంది న్యాయవాదులు నిరసన దీక్ష చేపట్టారు. వీరికి సంఘీభావం ప్రకటించేందుకు బార్ అసోసియేషన్‌కు వచ్చిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ చట్టం ప్రవేశపెడుతూ జీవో జారీ చేసినప్పుడు సీపీఎం తరపున మొట్టమొదటగా ఖండించామన్నారు. పేదల భూములకు భద్రత ఉండదన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు వెంకటేశ్వరరావు, బార్ అధ్యక్షుడు కేబీ సుందర్, ఇతర బార్ కార్యవర్గసభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో రాపిడ్ పికప్ పాయింట్

● ప్రారంభించిన డీఆర్ఎం పాటిల్

రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 1: రైల్వే స్టేషన్ వద్ద యూజర్ ఫ్రెండ్లీ రాపిడ్ యాక్సెస్ సౌకర్యం ఏర్పాటు చేయడం ముదావహమని డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ అన్నారు. తూర్పు ద్వారం వైపు 300 చదరపు గజాల స్థలాన్ని రైల్వేశాఖ వద్ద లీజుకు తీసుకుని ఏర్పాటు చేసిన రాపిడో పికప్ పాయింట్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రోజులో సుమారు లక్ష మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే స్టేషన్ వద్ద నాన్ ఫేర్ రెవెన్యూ విధానంలో రాపిడో పికప్ పాయింట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. డివిజన్ సీనియర్ కమర్షియల్ మేనేజర్ వావిలపల్లి రాంబాబు పాల్గొన్నారు.

స్థాయీ సంఘంలో 18 అంశాలకు ఆమోదం

చిట్టినగర్, ఫిబ్రవరి 1: వీఎంసీ స్థాయీ సంఘం సమావేశంలో 18 అంశాలకు ఆమోద ముద్రవేశారు. మేయర్ భాగ్యలక్ష్మి అధ్యక్షతన గురువారం వీఎంసీ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఈ సమావేశం జరిగింది. 25అంశాలపై చర్చించి 18 అంశాలను ఆమోదించారు. ఒక అంశం రికార్డు చేయడంతోపాటు పరిపాలన పరమైన అంశాలకు సంబంధించి ఒక అంశాన్ని ధ్రువీకరించారు. 2 అంశాలను వాయిదా వేసి మూడు అంశాలను ర్యాటిఫై చేశారు. సచివాలయాల నిర్వహణ నిమిత్తం అద్దె తీసుకున్న భవనాలకు అద్దెను 5శాతం పెంచి మరో ఏడాది పొడిగిస్తూ ఆమోదించారు. పలువురు కమిటీ సభ్యులతోపాటు అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై కరపత్రాల పంపిణీ

పటమట, ఫిబ్రవరి 1: 35వ రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం నగరంలోని లారీ ఓనర్స్ హాలు ఎదుట, బెంజిసర్కిల్ కూడలిలో రహదారి భద్రతపై కరపత్రాల పంపిణీ చేశారు. బుర్రకథ కళాకారులు బుర్రా గంగాధర్, బుర్రా రవికుమార్ బృందం రోడ్డు భద్రత పై ప్రజలను అవగాహన కలిగించారు. అనంతరం డీటీసీ కార్యాలయం వద్ద, మహానాడు రోడ్డు, ఆటోనగర్‌లో కరపత్రాల పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు నాగుమోతురాజా, ఉపాధ్యక్షుడు కుచ్చర్లపాటి సత్యనారాయణ, కార్యదర్శి రావి శరత్‌బాబు, కోశాధికారి పొట్లూరి చంద్రశేఖరరావు, మాజీ అధ్యక్షుడు తుమ్మల లక్ష్మణస్వామి, పొట్లూరి రాఘవేంద్రరావు, మద్ది వెంకటకృష్ణారెడ్డి, కోనేరు నాగేశ్వరరావు, వత్సవాయి కృష్ణంరాజు, శ్రీమన్నారాయణ, తిరుమల రావు, వాసుదేవ చౌదరి పాల్గొన్నారు.

సీఐడీ విచారణకు హాజరైన ఎన్ఆర్ఐ యశస్వి

విజయవాడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టింగ్‌లు పెట్టినందుకు సీఐడీ పోలీసులు అరెస్టు చేసిన ఎన్ఆర్ఐ బొద్దులూరి యశస్విని కానూరులోని సీఐడీ కార్యాలయంలో గురువారం విచారించారు. నెలక్రితం యశస్విని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆయన హైకోర్టును ఆశ్రయించి లుక్ అవుట్ నోటీసులు రద్దు చేయించుకున్నారు. పోలీసులు విచారణకు పిలిచినప్పుడు హాజరుకావాలని ఆదేశించింది. ఇందులో భాగంగా సీఐడీ అధికారులు విచారణకు పిలిచి విచారించారు. అనంతరం యశస్వి మీడియాతో మాట్లాడుతూ ఎన్ని కేసులు పెట్టినా బెదిరే ప్రసక్తి లేదన్నారు.

కేడీ షీటర్‌తో పింఛన్ల పంపిణీ

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పింఛన్‌దారులు

చిట్టినగర్, ఫిబ్రవరి 1: అధికార పార్టీలో ఎన్ని ఎక్కువ కేసులుంటే వారే నేతలన్నట్టుగా ప్రాధాన్యత ఇస్తుందనటానికి ఈ కేడీ షీటరే ఉదాహరణ. భార్య కార్పొరేటర్, కానీ పలు కేసులున్న భర్త మాత్రం ప్రభుత్వం అందించే పింఛన్లను పంపిణీ చేస్తున్నాడు. అందుకు ఈ కేడీ షీటర్‌కు ఏం అర్హత ఉందని పలువురు పింఛన్‌దారులతోపాటు డివిజన్ ప్రజలు మండిపడుతున్నారు. సోషల్ మీడియా ఫొటోలు పెట్టి వైసీపీని ఎండగడుతున్నారు. 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగా భర్త గోదావరి బాబుపై వివిధ పోలీస్‌స్టేషన్లలో ఒకటి, రెండు కాదు సుమారు 15, 20 కేసులున్నాయి. ఏకంగా కేడీషీట్ ఉంది. అయితే ఇతడు ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌ను నేరుగా లబ్ధిదారులకు అందజేయటంతో పలువురు పార్టీ నేతలతోపాటు ప్రజలు ఇదేం దౌర్భాగ్యంరా బాబు అంటూ తమను తామే తిట్టుకుంటున్నారు. వలంటీర్లు అందించాల్సిన పింఛన్‌ను ఓ షీటర్ అందించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. బయటకు మాట్లాడితే తమ పింఛన్ ఎక్కడ తొలగిస్తారేమోనని మిన్నకుండా పోతున్నారు. అధికారులు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. మాజీ మంత్రి వెల్లంపల్లి అనుచరుడని చెప్పుకునే కేడీ షీటర్ బాబు ఇప్పటికే బహిరంగంగా దొంగతనం చేస్తూ పట్టుపడ్డాడు. ఇన్ని కేసులున్న ఇతడిపై మాజీ మంత్రి వెల్లంపల్లికి అంత ప్రేమ ఎందుకో అర్థం కావడం లేదని ప్రజలు మాట్లాడుకుంటున్నారు. పింఛన్ల విషయంలో వేల్ఫేర్ సెక్రటరీలు, వలంటీర్లు ఏమైనా అడ్డుచెబితే వారిపై విరుచుకుపడుతున్నారు. అధికారంలో ఉన్నాం ఏమైనా చేస్తామని బెదిరించడంతో వాళ్లు మిన్నకుండిపోతున్నారు. అయితే అధికార పార్టీకి చెందినవారితోపాటు కొంతమంది ప్రజలు ఆయా ఫొటోలను సోషల్‌మీడియాలో పెట్టి ప్రశ్నిస్తున్నారు. అధికార పార్టీ ఓటు రాజకీయం చేస్తుందని, ప్రభుత్వ సొమ్మును తమ జేబుల్లో నుంచి ఇస్తున్నట్టుగా ఫొటోలకు ఫోజులిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పింఛన్‌లు అందజేస్తున్న కేడీషీట్ ఉన్న కార్పొరేటర్ భర్త బాబు, సచివాలయ వైసీపీ కన్వీనర్ క్రాంతికుమార్

హాస్యనాటికలను ప్రోత్సహించాలి

● నాగార్జున వర్సిటీ డీన్ డాక్టర్ అనిత

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 1: సందేశంతో కూడిన వినోదాన్ని అందిస్తూ ఒత్తిడిని తగ్గించి హాస్య నాటికలను ప్రోత్సహించాలని ఆచార్య నాగార్జున వర్సిటీ స్కూల్ ఆఫ్ పర్‌ఫామెన్స్ ఫైనార్ట్స్ డీన్ డాక్టర్ జి.అనిత అన్నారు. సుమధుర కళానికేతన్ 50వ వార్షికోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ముమ్మినేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం సౌజన్యంతో తెలుగు హాస్య నాటిక పోటీలు ప్రదర్శితమయ్యాయి. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆమె మాట్లాడుతూ హాస్య నాటికల పోటీలకు ఏకైక వేదికగా అభివర్ణించారు. సుమధుర అధ్యక్షుడు సామంతపూడి నరసరాజు, గౌరవాధ్యక్షుడు ఎంసీ దాస్, చైర్మన్ డాక్టర్ ఎస్.మురళీకృష్ణ, సిద్ధార్థ కళాపీఠం ప్రధాన కార్యదర్శి ఎన్.లలితప్రసాద్, బాలోత్సవ్ జనరల్ సెక్రటరీ రామిశెట్టి కొండలరావు, నాగార్జున స్కూల్ అధినేత దేవినేని కిషోర్‌కుమార్, ప్రముఖ రంగస్థలం నటుడు, దర్శకుడు డాక్టర్ పీఎస్ కృష్ణ, పసుమర్తి భాస్కరశర్మలు మాట్లాడారు. వర్ధమాన నటి, దర్శకులు గుడివాడ లహరికి రావి కొండలరావు, రాధాకుమారి స్మారక పురస్కారం ప్రదానం చేశారు. డాక్టర్ డి.కైలాసరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.గుడివాడకు చెందిన శ్రీ కృష్ణ ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ బృందం 'నాన్నా నేనే గెలిచా' అలరించగా, నగరానికి చెందిన హర్ష క్రియేషన్స్ వారి ట్రీట్మెంట్ నాటిక నవ్వులు పూయించింది.



నాటికలో ఓ సన్నివేశం

వీఎంసీ కార్యాలయ ప్రారంభంలో గోప్యమెందుకు?

● టీడీపీ ఫ్లోర్‌లీడర్ బాలస్వామి

చిట్టినగర్, ఫిబ్రవరి 1: టీడీపీ హయంలో రూ.32కోట్ల కేటాయించి నిర్మించిన వీఎంసీ నూతన భవనానికి రంగులు, విద్యుత్ కనెక్షన్‌లిచ్చి రెండో అంతస్తును ఎమ్మెల్యే, మేయర్ ప్రారంభించారని, ఎవరి తాత సొమ్మని ఎవరికీ తెలియకుండా ప్రారంభించారని టీడీపీ ఫ్లోర్ లీడర్ ఎన్.బాలస్వామి దుయ్యబట్టారు. గురువారం వీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాధనంతో నిర్మించిన నూతన భవనం రెండో అంతస్తును ఏ కార్పొరేటర్లకు సమాచారం ఇవ్వకుండా గోప్యంగా ప్రారంభించాల్సిన అవసరం ఏమిటని, దీని నిర్మాణం ఎవరి జేబులో డబ్బులు, ఎవరి తాత సొమ్ముతో నిర్మాణం చేశారని, నిలదీశారు. డిప్యుటేషన్‌పై వందల సంఖ్యలో అధికారులు, సిబ్బంది పాతుకుపోయారని, ప్రమోషన్లు ఇవ్వకపోవంతో సీనియర్ అసిస్టెంట్ స్థానంలో, జూనియర్ అసిస్టెంట్లు పని చేస్తున్నారన్నారు. రికార్డు అసిస్టెంట్ ఏళ్ల తరబడి సీట్లకు అతుక్కుపోయారన్నారు. ఏసీజీగా పని చేస్తున్న ఆమె ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా మళ్లీ రెండోసారి వచ్చి ఏసీజీగా పని చేస్తున్నారన్నారు. డబ్బులివ్వకుంటే ఫైల్‌లు కదలటం లేదని, మేయర్ మాత్రం తమకు కావాల్సిన వారి పనులు చక్కబెటుకుంటున్నారు. దీనిపై కమిషనర్ స్పందించాలన్నారు. పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.



కొండమధ్యలోని గుహవద్ద దివ్యపూజాబలి సమర్పిస్తున్న గురువులు

దేవుడి రక్షణ ప్రణాళికలో మరియమాత పాత్ర విశిష్టం

● గుణదల కొండపై ఘనంగా 2వ రోజు నవదిన ప్రార్థనలు

గుణదల, ఫిబ్రవరి 1: దేవుడి రక్షణ ప్రణాళిక నెరవేర్చడంలో మరియమాత పాత్ర విశిష్టమైందని విశాఖపట్నం అతి మేత్రాసనం ఫాదర్ పసుపులేటి యుగల్ కుమార్ అన్నారు. గుణదల లూర్దుమాత నూరు వసంతాల మహోత్సవాల నవదిన ప్రార్థనల్లో భాగంగా గురువారం 2వ రోజు నవదిన ప్రార్థనలకు ముఖ్యఅతిథిగా యుగల్ కుమార్ విచ్చేశారు. ఆయన భక్తులకు సందేశమిస్తూ గుణదలమాత ఆధ్యాత్మిక తల్లిగా భక్తులచేత కొనియాడబడుతుందన్నారు. కొండపై గుహలో కొలువై అందరికీ ప్రేమానురాగాలు అందిస్తుండటమే నూరు వసంతాల మహోత్సవాలకు నిదర్శనమన్నారు. మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, ఫాదర్ ఎం. గాబ్రియేలు, ఎస్ఎస్‌సీ డైరెక్టర్ ఫాదర్ తోట సునీల్ రాజు తదితర గురువులు కొండ మధ్యలోని గుహ వద్ద మరియతల్లి వద్ద ఏర్పాటు చేసిన వేదికపై సమష్టి దివ్య పూజాబలి సమర్పించారు. ఉప్పులూరు, పెనమలూరు, కంకిపాడు విచారణ నుంచి భక్తులు ప్రార్థనలకు హాజరయ్యారు.



అయ్యగారి శ్యామసుందర్ వీణావాదనం

అలరించిన గాత్రకచేరీ

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 1: సంగీత సన్మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధన సంగీతోత్సవాలలో భాగంగా 4వ రోజు గురువారం 18 బృందాలు వీణా కచేరీలు చేయగా మిగిలిన బృందాలన్నీ గాత్ర కచేరీలతో అలరించారు. తొలుత రావులపాలెంకు చెందిన జీఎన్‌వీఎస్ శ్రావణి గాత్రం, పి.హిమబిందు, కేవీఆర్ అనిల్‌కుమార్, హైదరాబాద్‌కు చెందిన సిహెచ్.సువర్ణలక్ష్మి, కె.తుషార పూర్ణవల్లి, కాకినాడకి చెందిన ముకుంద ప్రవీణ్, శివలెంక వి శ్వనాథ్, హైదరాబాద్‌కు చెందిన వడ్డీ ఉదయ్, చెన్నైకి చెందిన చివుకుల నాగతిష్య, నూజివీడుకి చెందిన టీవీ విద్యాసాగర్, చెన్నైకి చెందిన సీవీపీ శాస్త్రి, నగరానికి చెందిన మోదుమూడి సుధాకర్ గాత్ర కచేరీతో అలరించారు. ఎస్.దుర్గేష్ నందిని వీణావాదనం, నెల్లూరుకు చెందిన రావినూతల పద్మ చక్రవర్తి శ్రీకంఠం నాగలక్ష్మి వాణాద్వయ వాదన, ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాల విద్యార్థుల బృంద వీణావాదనం, హైదరాబాద్‌కు చెందిన అయ్యగారి జయలక్ష్మి, అయ్యగారి శ్యామ్‌సుందర్ వీణావాదన కచేరీలతో వీనుల విందు సాగించారు. మోదుమూడి సుధాకర్ నిర్వహించగా జొన్నవిత్తుల ప్రభాకరశాస్త్రి, పోపూరి గౌరీనాథ్, పారుపల్లి సుబ్బరాయ ఫల్గున్, కె.శశిధర్, వేమూరి వెంకట విశ్వనాథ్, అంజన సుధాకర్, తండూరి రమా సత్యనారాయణ, శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

నాలుగేళ్లుగా రవాణా భత్యం కూడా ఇవ్వరా?

ధర్నాచౌక్, ఫిబ్రవరి 1: మహిళా ఆరోగ్య కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, వార్డు సెక్రటరీలకు నాలుగేళ్లుగా రవాణా భత్యం ఇవ్వడం లేదని రాష్ట్ర హెల్త్ డిపార్టుమెంట్ అండ్ ఉమెన్ హెల్త్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు వీకేఎస్ జయలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లోని ఎన్జీవోహోంలో అసోసియేషన్ గురువారం జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా ఆరోగ్య కార్యకర్తలకు హెల్త్ సూపర్‌వైజర్లుగా ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని లేదంటే మరో సమావేశాన్ని ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఆర్‌వీ.రమణ, వై.వరలక్ష్మి, నాగమణి, శుభశ్రీ పాల్గొన్నారు.



ఉద్యోగినులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

● ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు

వన్‌టౌన్, ఫిబ్రవరి 1: ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగినులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏపీజేఏసీ అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. నగరంలోని రెవెన్యూ భవన్‌లో గురువారం ఏపీ జేఏసీ అమరావతి కాపిటల్ యూనిట్ మహిళా కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు దాదాపుగా 50శాతం ఉంటారని, ఆ మేరకు వారికి మౌలిక సదుపాయాలు లేవన్నారు. మహిళా విభాగం రాష్ట్ర చైర్‌పర్సన్ పారేలక్ష్మి, ప్రధాన కార్యదర్శి పొన్నూరు విజయలక్ష్మి, సహ చైర్‌పర్సన్ సైకం శివకుమారిరెడ్డి, కోశాధికారి గంటా పావనితో పాటు, అమరావతి జేఏసీ కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు, కాపిటల్ జేఏసీ చైర్మన్ ఆర్ దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి మందపాటి శంకరరావు, జేఏసీ నేతలు కిషోర్, ఈశ్వర్, డి శ్రీనివాస్, బత్తిన రామకృష్ణ, జిల్లా ఉమెన్ కమిటీ చైర్‌పర్సన్ జి.జ్ఞాన పాల్గొన్నారు.

ఏపీజేఏసీ అమరావతి క్యాపిటల్ యూనిట్ మహిళా కమిటీ

ఏపీజేఏసీ అమరావతి కాపిటల్ యూనిట్ మహిళా కమిటీకి చైర్‌పర్సన్‌గా పోలీసు శాఖకు చెందిన పి శ్రీదేవి, ప్రధాన కార్యదర్శిగా షుగర్ కేన్ విభాగ ఉద్యోగిని ఎం వాణి, సహ చైర్‌పర్సన్‌గా పంచాయతీ రాజ్ శాఖలో ఉద్యోగిని సీహెచ్ హరిత, రెవెన్యూశాఖ లో పనిచేసే మోతీ షేక్‌తో పాటు నలుగురు సహ చైర్‌పర్సన్లు, నలుగురు కార్యదర్శులను ఎంపిక చేశారు. ఉమెన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నూరు విజయలక్ష్మి ప్రమాణ స్వీకారం చేయించారు.

బెనర్జీకి ఎమ్మెల్యే వంశీ పరామర్శ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని పలువురిని ఎమ్మెల్యే వంశీ గురువారం పరామర్శించారు. టీడీపీ వీరవల్లి అధ్యక్షుడు లంక సురేంద్ర మోహనబెనర్జీ సతీమణి జానకిరత్నం ఇటీవల మరణించడంతో ఇంటికి వెళ్లి పరామర్శించారు. గూడవల్లి సుధాకర్, రాయి గోపాలకృష్ణ, మోర్ల ఆంజనేయులు పాల్గొన్నారు. కాకులపాడు గ్రామ సర్పంచ్ కాజ ప్రసాద్ తండ్రి దనుమంతరావు బుధవారం మృతి చెందడంతో ఆయన భౌతికకాయానికి ఎమ్మెల్యే వంశీ నివాళులర్పించారు. ఎంపీపీ యరగొర్ల నగేష్, తిప్పనగుంట పీఏసీఎస్ అధ్యక్షుడు మూల్పూరు ప్రభుకాంత్, చలపతిరావు పాల్గొన్నారు.

మందడం, కొండమరాజపాలెం ఈ-లాటరీ 7కి వాయిదా

కృష్ణలంక: ఏపీ సీఆర్‌డీఏ పరిధిలో భూ సమీకరణ పథకంలో భూములను ఏపీ సీఆర్‌డీఏకి అప్పగించిన రైతులకు కేటాయించిన నివేశన, వాణిజ్య స్థలాలు భూ సేకరణలో ఉన్నాయని, అదింకా పూర్తికాకపోవడటంతో అవి కేటాయించేందుకు ఫిబ్రవరి 1న జరగాల్సిన మందడం 1&2, కొండమరాజపాలెం గ్రామాలకు సంబంధించిన మూడో విడత ఈ-లాటరీ ఫిబ్రవరి 7 మధ్యాహ్నానికి వాయిదా వేస్తున్నట్టు సీఆర్‌డీఏ అధికారులు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. రెండుసార్లు నోటీసులిచ్చినా రైతులు హాజరు కాకపోవడంతో మరో అవకాశం ఇచ్చి ఫిబ్రవరి 7న బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు మందడం 1&2, మధ్యాహ్నం 3.30 గంటలకు కొండరాజపాలెం గ్రామాలకు లాటరీ నిర్వహిస్తామని తెలిపారు.

అత్యాచారం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

విజయవాడ లీగల్: వృద్ధురాలిపై అత్యాచారానికి యత్నించిన నిందితుడిపై నేరం రుజువుకావడంతో ఐదేళ్ల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ మహిళా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఐ.శైలజా దేవి గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కొండపల్లి గ్రామానికి చెందిన మార్కపూడి జాషువా 2023 మే 14న బాధితురాలు ఇంటిలో ఉండగా అర్ధరాత్రి 1 గంట సమయంలో ఆమె ఇంట్లోకి ప్రవేశించి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలు కేకలేయడంతో స్థానికులు నిందితుడిని పట్టుకొనేందుకు ప్రయత్నించగా పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ చంద్రగిరి విష్ణువర్ధన్ 8 మంది సాక్షులను విచారించగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి, నిందితుడిపై నేరం రుజువుకావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

ప్రపంచ మాస్టర్స్ టెన్నిస్ చాంప్‌కు వరప్రసాద్

విజయవాడ స్పోర్ట్సు: టర్కీలో మార్చి 15 నుంచి జరిగే ప్రపంచ మాస్టర్స్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌కు నగరానికి చెందిన వెటరన్ ప్లేయర్ సీబీఎస్ వరప్రసాద్ ఎంపికయ్యారు. ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్ ఆయన్ను ఎంపిక చేసింది. దేశం నుంచి 75 ప్లస్ ఏజ్ గ్రూప్‌లో వరప్రసాద్ బరిలో దిగనున్నారు. పలు టైటిళ్లను సాధించిన వరప్రసాద్ ఈ టోర్నీలోనూ సత్తాచాటేందుకు కసరత్తు చేస్తున్నారు.

రేపు ఎంబీపీలో జిల్లా హాకీ ఎంపికలు

జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 3న ఉదయం 7 గంటలకు సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో జిల్లా బాలబాలికల హాకీ జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్టు జిల్లా హాకీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9 నుంచి 11 వరకు శ్రీకాకుళంలో జరిగే 14వ జూనియర్ అంతర్ జిల్లాల బాలికలు, 11 నుంచి 13 వరకు కర్నూల్‌లో జరిగే జూనియర్ బాలుర అంతర్ జిల్లాల పోటీలకు ఎంపికైన వారిని పంపుతామన్నారు. ఆసక్తి కలిగినవారు ఆధార్ జిరాక్సు, పాస్‌పోర్టు ఫొటోలు, పుట్టినతేదీ అర్హతా పత్రాలతో సంప్రదించాలన్నారు.

ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్ జయకేతనం

మూలపాడు ట్విన్ స్టేడియం వేదికగా ఏసీఏ పర్యవేక్షణలో జరుగుతున్న బీసీసీఐ అండర్-23 ఉమెన్ వన్డే గ్రూప్-డీ మ్యాచ్‌ల్లో విదర్భపై ఉత్తరాఖండ్, బరోడాపై ఉత్తరప్రదేశ్ టీమ్‌లు గురువారం విజయం సాధించాయి. ఉత్తరాఖండ్-విదర్భ మ్యాచ్‌లో తొలుత బ్యాట్‌పట్టిన ఉత్తరాఖండ్ 49.1 ఓవర్లలో 222 పరుగులకు ఆలౌటయ్యింది. 223 పరుగుల లక్ష్య ఛేదనలో విదర్భ టీమ్ 50 ఓవర్లలో 171 పరుగులకు కుప్పకూలి పరాజయం పాలైంది. బరోడా-ఉత్తర్‌ప్రదేశ్ మ్యాచ్‌లో తొలుత బ్యాట్‌పట్టిన బరోడా 46.4 ఓవర్లలో 96 పరుగులకు ఆలౌటయ్యింది. 97 పరుగుల లక్ష్యాన్ని ఉత్తరప్రదేశ్ 24.4 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి అధిగమించింది.

పరమానంద శుక్లాకు విద్యా వాచస్పతి సరస్వత్ అవార్డు

భవానీపురం: నగరంలోని షామ్‌ర్యాక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డాక్టర్ పరమానంద 'శుక్లా విద్యా వాచస్పతి సరస్వత్' అవార్డును ఉపరాష్ట్రపతి అరవింద్‌కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు. న్యూఢిల్లీలోని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ హిందీ పీఠ్ గత నెల 28న దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వివిధ పండితులను విద్యా వాచస్పతి బిరుదుతో సత్కరించింది. హిందీ రచన, హిందీ బాషా బోధన, సాహిత్య అభ్యాసం రంగంలో శుక్లా చేసిన పరిశోధనకు ఈ అవార్డు వరించింది. ఈ అవార్డు తమ స్కూల్‌కే కాకుండా యావత్ రాష్ట్రానికే దక్కినట్టు తాము భావిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ భారతీధర్ అన్నారు.



డిగ్రీ కాలేజీల మనుగడకే కష్టం

▸ కోర్సులను ఏఐసీటీఈ పరిధిలోకి తేవొద్దు: యాజమాన్యాలు

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): బీసీఏ, బీబీఏ, బీఎంఎస్ కోర్సులను అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) పరిధిలోకి తీసుకురావడం తో డిగ్రీ కాలేజీల మనుగడనే దెబ్బతీస్తుందని యాజమాన్యాలు ఆందోళన వ్యక్తంచేశాయి. ఈ కోర్సులను ఎప్పటిలాగే యూనివర్సిటీల పరిధిలో ఉంచాలని, ఏఐసీటీఈకి ఇవ్వొద్దని డిమాండ్ చేశాయి. కోర్సులను ఏఐసీటీఈకి ఇవ్వాలని యూజీసీ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్రంలోని ప్రైవేటు డిగ్రీ కాలేజీల సంఘం గురువారం విజయవాడలో నిరసన ర్యాలీ నిర్వహించింది. అనంతరం, వీఆర్ సిద్ధార్థ కాలేజీలో సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. సంఘం అధ్యక్షుడు కె.గుండారెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణాజీ, కోశాధికారి వెంకటరెడ్డి, సుమారు 300 మంది యాజమాన్యాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జగన్.. డీజీపీని స్వతంత్రంగా పనిచేయనివ్వండి

▸ షర్మిలకు రక్షణ కల్పించండి: మాణిక్కం ఠాగూర్

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): 'పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డికి రక్షణ కల్పించండి. డీజీపీకి స్వతంత్రంగా పనిచేసుకునే అధికారం ఇవ్వండి' అని సీఎం వైఎస్ జగన్‌కు ఏపీసీసీ ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్ విజ్ఞప్తి చేశారు. షర్మిల భద్రతపై పీసీసీ మాజీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి ఎక్స్ వేదికగా ఆందోళన వెలిబుచ్చారు. షర్మిలకు భద్రత తగ్గించారని, వెంటనే ఆమె కోరిన విధంగా 4+4 సెక్యూరిటీ, ఎస్కార్ట్ వాహన సౌకర్యం కల్పించాలని ఆయన ఎక్స్ వేదికగా డీజీపీకి విజ్ఞప్తి చేశారు.

షర్మిల రాకతో వైసీపీకి భారీ డామేజీ: సీపీఎం

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 1: వైఎస్ షర్మిల రాకతో కాంగ్రెస్‌లో జోష్ కనిపిస్తోందని, అది వైసీపీకి భారీ డామేజీ చేసే అవకాశాలు ఉన్నాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఎ గఫూర్ అన్నారు. గురువారం కడపలో మాట్లాడారు. ఓటమి భయంతో సీఎం జగన్ సిట్టింగ్ ఎమ్మెల్యేలను ఇష్టానుసారంగా మారుస్తున్నారని అన్నారు. ఎన్ని మార్పులు చేసినా వైసీపీ గెలిచే అవకాశాలు కనిపించడం లేదన్నారు.

జగన్‌కు షర్మిల ఉసురు తగులుతుంది: మస్తాన్ వలీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఏపీని జగన్ ప్రభుత్వం అప్పుల ఊబిలోకి తీసుకెళ్లిందని కాంగ్రెస్ ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలీ ధ్వజమెత్తారు. గురువారం ఏపీ భవన్‌లో ఆయన మాట్లాడారు. 'వైఎస్ షర్మిల నిర్దిష్ట విమర్శలకు సమాధానం చెప్పలేక తన సోషల్ మీడియా ద్వారా వైఎస్ జగన్ ఆమె రాజకీయ ప్రయాణం, వ్యక్తిత్వంపై దుర్మార్గమైన ప్రచారం చేస్తున్నారు. షర్మిల ఉసురు జగన్ సర్కారుకు తగులుతుంది' అని అన్నారు.

జోన్‌కు భూమివ్వకపోవడం దారుణం: రఘురామ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రైల్వే జోన్ కోసం కేంద్ర ప్రభుత్వం స్థలాన్ని కేటాయించమని కోరగా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకపోవడం దారుణమని నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు మండిపడ్డారు. రైల్వే జోన్ కోసం స్థలాన్ని ఇస్తే పనులు చేయడానికి కేంద్రం సిద్ధంగా ఉందని చెప్పారు. జగన్ వల్ల ఏపీ ఎంతో నష్టం జరిగిందన్నారు. రెండు కంపెనీల కోసం 20 వేల ఎకరాలను కేటాయించిన సీఎం.. రైల్వే జోన్ కోసం 53 ఎకరాలను కేటాయించలేరా? అంటూ నిలదీశారు. గురువారం రచ్చబండ కార్యక్రమంలో భాగంగా రఘురామరాజు మీడియా ప్రతినిధులతో మాట్లాడారు.

రాజ్యసభ ప్యానెల్ వైస్ చైర్‌పర్సన్‌గా కనకమేడల

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ప్యానెల్ వైస్ చైర్‌పర్సన్‌గా టీడీపీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్‌ను రాజ్యసభ చైర్మన్ జగదీప్ దన్‌ఖడ్ ఎంపిక చేశారు. గురువారం, రాజ్యసభ వైఎస్ చైర్‌పర్సన్ల ప్యానెల్‌ను రాజ్యసభ చైర్మన్ పునర్వ్యవస్థీకరించారు. ఈ ప్యానెల్‌లో వైసీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రొఫెసర్ మనోజ్‌కుమార్ ఝా, లెఫ్టినెంట్ జనరల్ డీపీ వత్స్, రామిలాబెన్ బారాకు అవకాశం కల్పించారు.

అంగన్వాడీ టాయిలెట్‌లో సరుకులు..!



టాయిలెట్ గదిలో బయటపడ్డ సరుకులు

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 1: బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందజేయాల్సిన పౌష్టికాహారాన్ని అంగన్వాడీ కార్యకర్తలు టాయిలెట్ గదిలో దాచారు. అనంతపురం జిల్లా కంబదూరు మండలం ములకనూరు గ్రామంలో ఈ వ్యవహారం గురువారం వెలుగు చూసింది. అంగన్వాడీ కార్యకర్తలు సమ్మెలో ఉన్న సమయంలో సచివాలయ సిబ్బంది అంగన్వాడీ కేంద్రం నిర్వహణ బాధ్యతలు తీసుకున్నారు. వారు సమ్మె విరమించిన అనంతరం తిరిగి అప్పగించారు. గ్రామంలోని రెండో అంగన్వాడీ కేంద్రం పరిధిలో పౌష్టికాహారం పంపిణీ జరగకపోవడంతో అప్పట్లో పనిచేసిన యానిమేటర్, మహిళా పోలీస్, వీఆర్‌ఏలను లబ్ధిదారులు పలుమార్లు ప్రశ్నించారు. అనుమానం వచ్చి టాయిలెట్ గది తాళాలను పగులగొట్టారు. అందులో పది బియ్యం ప్యాకెట్లు, 20 ఆయిల్ ప్యాకెట్లు, 20 గోధుమ పిండి ప్యాకెట్లు, 10 కందిపప్పు ప్యాకెట్లు దొరికాయి. ఈ వ్యవహారంపై సీడీపీవో వనజా అక్కమ్మ విచారణ చేపట్టారు.

నలుగురిపై ఎలుగుబంట్ల దాడి.. తీవ్ర గాయాలు

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 1: శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం చీపురుపల్లి పంచాయతీలో ఎలుగుబంట్లు బీభత్సం సృష్టించాయి. గురువారం వేర్వేరు గ్రామాల్లో నలుగురిపై దాడి చేయగా.. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. చీపురుపల్లి పంచాయతీ గడూరు గ్రామానికి చెందిన పిన్నాసి కుమారస్వామి(60), పిన్నాసి చలపతి గురువారం ఉదయం చేపలవేటకు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యంలో జీడితోట వద్ద తల్లీ పిల్ల ఎలుగుబంట్లు కుమారస్వామిపై దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. డెప్పూరుకు చెందిన లైశెట్టి నారాయణమ్మ(65) తన జీడితోటలో కంచె వేస్తుండగా ఎలుగుబంట్లు దాడి చేశాయి. దీంతో ఆమె తలపై తీవ్రంగా గాయాలయ్యాయి. డెప్పూరుకు చెందిన శీలం తాతారావు, పోకల ఊర్మిళ కూలి పనులకు వెళ్తుండగా ఎలుగుబంట్లు దాడి చేసేందుకు ప్రయత్నించాయి. వారు బిగ్గరగా అరవడంతో అవి జీడితోటల్లోకి పారిపోయాయి.

తుది ఓటర్ల జాబితాలో తప్పులను సరి చేయండి

▸ కేంద్ర ఎన్నికల సంఘానికి టీడీపీ నేత వర్ల లేఖలు

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఓటర్ల తుది జాబితాలో తప్పులను సరిదిద్దాలని కేంద్ర ఎన్నికల సంఘానికి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు ఓటర్ల తుది జాబితా తప్పులపై కేంద్ర ఎన్నికల సంఘానికి 3 లేఖలు రాశారు. ఈ లేఖలకు వివిధ వార్తా పత్రికల్లో ప్రచురితమైన కథనాలను క్లిప్పింగులను జత చేశారు. నెల్లూరు, మైలవరం, చిత్తూరు, విజయవాడ తూర్పు, పలమనేరు, పాణ్యం, విశాఖపట్నం, నర్సరావుపేట, పెద్దాపురం, చోడవరం అసెంబ్లీ నియోకవర్గాల్లోని తప్పులను సరిదిద్దాలని కోరారు. ఆ లేఖల్లో... 'నెల్లూరులో 17 ఏళ్ల బాలుడికి ఓటు హక్కు కల్పించారు. మైలవరం నియోజకవర్గంలో వలస వెళ్లిన వారి ఓట్లు, చిత్తూరు, పులిచర్లలో చనిపోయిన వారి ఓట్లు జాబితా నుంచి తొలగించలేదు. పలమనేరులో టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగించారు. పుత్తూరులో కేవలం ఛ అనే అక్షరంకు ఓటు హక్కు కల్పించారు. అదేవిధంగా పుంగనూరులో మృతులకు సైతం ఓటుంది. ఎచ్చర్లలో కేవలం ఒకే భవనంలో 250 మంది నివాసం ఉంటున్నట్లు జాబితాలో చోటిచ్చారు. చంద్రగిరిలో పోలింగ్ స్టేషన్ 322లో దాదాపు 44 మంది ఓట్లు గుర్తించడమే కష్టంగా ఉంది. ఈ తప్పులను సరిదిద్దండి' అని కేంద్ర ఎన్నికల సంఘాన్ని వర్ల కోరారు.

రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న కేడెట్లకు పతకాలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ డే క్యాంపెయిన్‌లో ప్రతిభ చూపి టైటిళ్లు సాధించిన ఎన్‌సీసీ కేడెట్లకు ఏపీ తెలంగాణ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమాండర్ వీఎం రెడ్డి పతకాలను అందించారు. సికింద్రాబాద్ ఎన్‌సీసీ డైరెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొన్న 128 మంది కేడెట్లను అభినందించారు. ఈ సందర్భంగా జూనియర్ డివిజన్ ఎస్‌జీటీ కేడెట్స్ విభాగంలో ఆలిండియా బెస్ట్ కేడెట్స్ ఆర్మీ, నేవీ పతకాలు సాధించిన ఎం శ్రీశాంత్, ఎస్.ధీరజ్, ఎస్‌కే రిహాన, చిత్రేష్ రావులను ట్రోఫీలతో సత్కరించారు.

నిండు 'గోదారి'లా.. పరుగులు

గోదారోళ్ల రైలు గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు 50 ఏళ్లు

▸ ఈ ఐదు దశాబ్దాల్లో ఎన్నో రికార్డులు సొంతం

▸ ఉత్తరాంధ్ర ప్రజలతో విడదీయరాని అనుబంధం

▸ ఆరంభంలో బొగ్గు ఇంజన్‌తో సేవలు ప్రారంభం

▸ దక్షిణ మధ్య రైల్వేలో మొదటి ఏసీ కోచ్ రైలుగా రికార్డు

▸ 1990లోనే 24 కోచ్‌లతో నడిచిన పెద్ద రైలుగా ఘనత

▸ ఎన్ని రైళ్లు వచ్చినా గోదారోళ్ల గుండెల్లో ప్రత్యేక స్థానమే

(విశాఖపట్నం, రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)



గోదావరి ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం విశాఖ రైల్వే స్టేషన్‌లో కేక్ కట్ చేసిన సిబ్బంది

ఉత్తరాంధ్ర నుంచి హైదరాబాద్ వెళ్లాలంటే ముందుగా గుర్తొచ్చేది 'గోదావరి'.. పెళ్లిళ్లయినా.. పేరంటమైనా.. గోదారోళ్లు చెప్పే సమాధానం 'ఆయ్.. గోదారికొచ్చేత్తామండీ..' రిజర్వేషన్ టైమ్‌లో అందరి నోటా వినిపించేది.. 'ముందు గోదావరిలో ఉన్నాయో లేదో సూడండ్రా..' అని. గోదావరి జిల్లాల ప్రయాణికులతో ఆ రైలుది విడదీయరాని అనుబంధం. అచ్చంగా అది గోదారోళ్ల రైలంటే అతిశయోక్తికాదు..! వీఐపీలు సైతం మొదటిగా ప్రాధాన్యవిచ్చే రైలు ఇది. అదే 'గోదావరి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్'. ఈ రైలు పట్టాలెక్కిన నాటి నుంచీ నేటి వరకూ నిండు గోదారిలా పరుగులు పెడుతూనే ఉంది. ఎన్ని కొత్త రైళ్లు వచ్చినా.. వస్తున్నా.. గోదారోళ్ల గుండెల్లో 'గోదావరి ఎక్స్‌ప్రెస్'ది ప్రత్యేక స్థానమే. ఈ గోదావరి ఎక్స్‌ప్రెస్ గురువారంతో 50 వసంతాలు పూర్తిచేసుకొని గోల్డెన్ జూబ్లీ జరుపుకొంటోంది. భారతీయ రైల్వేలో అతి ప్రధానమైన రైళ్లలో ఒకటిగా గుర్తింపుపొందిన 'గోదావరి'లో ఈ నాటికీ టికెట్ దొరకడం గొప్పే మరి. ఆదాయంలోనూ తోపే. సమయపాలన పక్కా..! అదీ గోదారోళ్ల రైలు లెక్క. తొలిరోజు నుంచీ ప్రయాణికుల ఆదరణ చూరగొని 50 ఏళ్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ప్రత్యేక కథనం....

1974 ఫిబ్రవరి 1న ప్రారంభం: విశాఖపట్నం నుంచి గోదావరి జిల్లాలను కలుపుతూ హైదరాబాద్ వరకూ రైలు సదుపాయం కల్పించాలనే ఉద్దేశంతో 1973లో రైల్వే బడ్జెట్‌లో వాల్తేరు (విశాఖ)-హైదరాబాద్ డెక్కన్ రైలును ప్రకటించారు. అయితే.. ఇది 1974 ఫిబ్రవరి 1న హైదరాబాద్‌లో బొగ్గు ఇంజన్‌తో పట్టాలెక్కింది. 1975లో లింక్ ఎక్స్‌ప్రెస్‌గా రూపాంతరం చెందింది. కాకినాడ నుంచి వేరే ఇంజనుతో ఐదు కోచ్‌లను తీసుకొచ్చి ఈ రైలుకు సామర్లకోటలో జతచేసేవారు. సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌తో ర్యాక్ షేరింగ్ కూడా ఉండేది. 1990 నాటికి 24 కోచ్‌ల స్థాయికి చేరి.. అతి పెద్ద రైలుగా రికార్డుకెక్కింది. బొగ్గు ఇంజను వీడి డీజిల్ ఇంజన్ వచ్చింది. 1993లో స్లీపర్ కోచ్‌లను తగ్గించి ఆరు థర్డ్ ఏసీ బోగీలను కలిపారు. 2000లో ఫస్ట్ క్లాస్ ఏసీ బోగీని జతచేశారు. దీంతో 1966 అక్టోబరు 2న దక్షిణ మధ్య రైల్వే జోన్ ఏర్పడిన తర్వాత ఆ జోన్‌లో ఏసీ బోగీలతో నడిచిన మొదటి రైలుగా ఇది రికార్డు నెలకొల్పింది. 2011లో గోదావరిని సూపర్‌ఫాస్ట్‌గా ఉన్నతీకరించారు. దీంతో అప్పటి వరకూ 7007, 7008 నంబర్లతో నడిచిన ఈ రైలు నంబర్లు 12727, 12728గా మారాయి. మొదట హైదరాబాద్-వాల్తేరు ఎక్స్‌ప్రెస్‌గా నడిచిన ఈ రైలుకు గోదావరి జిల్లాల్లో ఎక్కువగా స్టాప్‌లు ఉండడంతో గోదావరి ఎక్స్‌ప్రెస్‌గా నామకరణం చేశారు. విమాన సర్వీసులు అంతగా అందుబాటులోకిరాని కాలంలో (పదేళ్ల కిందటి వరకూ) ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్ర ప్రాంతానికి చెందిన రాజకీయ, వ్యాపార, తదితర రంగాల ప్రముఖులు హైదరాబాద్ వెళ్లేందుకు, అక్కడి నుంచి వచ్చేందుకు 'గోదావరి'నే ఆశ్రయించేవారు. ఇప్పటికీ ఏడాది పొడవునా రద్దీగానే ఉంటుంది. రోజూ సాయంత్రం 5.20 గంటలకు విశాఖలో బయల్దేరి 707 కి.మీ. ప్రయాణించి మర్నాడు ఉదయం 6.45 గంటలకు హైదరాబాద్ చేరుతుంది.

గోదారోళ్లతో అనుబంధం

ఇప్పుడైతే హైదరాబాద్ వెళ్లడానికి గౌతమి, ఈస్ట్‌కోస్ట్, ఫలక్‌నుమా తదితర రైళ్లు అందుబాటులో ఉన్నాయి గానీ.. ఓ 30 ఏళ్ల వెనక్కి వెళితే హైదరాబాద్ వెళ్లడానికి గోదావరి ఎక్స్‌ప్రెస్ కోసం ఎదురుచూడక తప్పని పరిస్థితి. ఈ ప్రాంతం నుంచి అరటి గెలలు, పాలు, కూరగాయలు వంటి వాటిని కూడా ఈ రైలు మోసుకెళ్లేదని పెద్దలు చెప్తారు. ఈ రైలుతో అందుకే గోదారోళ్లకు ఎంతో అనుబంధం ఉంది. ఇప్పటికీ ఈ రైలులో రిజర్వేషను దొరకడం కష్టమే. ఏసీ బోగీలతో సహా రెండు నెలల ముందే నిండిపోతాయి. విశాఖ, రాజమండ్రి ప్రాంతం నుంచి హైదరాబాద్ వెళ్లేవాళ్లకు, వచ్చేవారికి దీని సమయాలు ఎంతో అనుకూలం. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు అటు తూర్పు ఏజెన్సీ ప్రాంతం నుంచి కూడా ఈ రైలులో రాకపోకలు సాగించేవాళ్లు అధిక సంఖ్యలోనే ఉంటారు. రోజుకు 5 వేల మంది వరకూ గోదావరిలో రాకపోకలు సాగిస్తారు. ఈ ప్రాంతం నుంచి హైదరాబాద్ వెళ్లేవారు మొదటిగా గోదావరికే ప్రాధాన్యమిస్తారు. తర్వాతి స్థానంలో గౌతమి ఉంటుంది.

అన్ని స్టేషన్లలోనూ అర్ధ శతాబ్ది వేడుకలు

గోదావరి ఎక్స్‌ప్రెస్ ప్రయాణికుల సేవలో ఐదు దశాబ్దాల పాటు నిరుపమాన సేవలందించింది. ఈ మధుర ఘట్టానికి గుర్తుగా గురువారం ఈ రైలు ఆగే 18 స్టేషన్లలోనూ ఘనంగా వేడుకలు నిర్వహించాలని దక్షిణ మధ్య రైల్వే పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో గోదావరి ఎక్స్‌ప్రెస్‌ను గురువారం పూలతో అలంకరించారు. విశాఖలో రైలు బయల్దేరే ముందు ప్లాట్‌ఫామ్‌పై స్టేషన్ డైరెక్టర్, సూపరింటెండెంట్, ఇతర సిబ్బంది కేక్ కట్ చేసి 'గోదావరి'ని హైదరాబాద్‌కు పంపించారు. గురువారం రాత్రి విజయవాడకు చేరుకున్న ఈ రైలుకు ఇక్కడ కూడా వేడుకలు నిర్వహించారు.

విశాఖ నుంచి బ్యాంకాక్, కౌలాలంపూర్!

▸ ఏప్రిల్ నుంచి అందుబాటులోకి విమాన సర్వీసులు



సమావేశంలో మాట్లాడుతున్న నరేశ్ కుమార్‌రాజా, డీఎస్ వర్మ

విశాఖపట్నం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి ప్రస్తుతం సింగపూర్‌కు మాత్రమే అంతర్జాతీయ విమాన సర్వీసులు ఉండగా త్వరలో బ్యాంకాక్, కౌలాలంపూర్‌లకు కూడా సర్వీసులు అందుబాటులోకి రానున్నాయని ఏపీ విమాన ప్రయాణికుల సంఘం వెల్లడించింది. విశాఖపట్నంలో గురువారం సంఘం ప్రతినిధులు కుమార్‌రాజా, నరేశ్‌కుమార్, డీఎస్ వర్మ మాట్లాడుతూ ఏప్రిల్ 9 నుంచి బ్యాంకాక్‌కు మంగళ, గురు, శనివారాల్లో ఎయిర్ ఏసియా విమాన సర్వీసులు ఉంటాయన్నారు. టికెట్ ధర రూ.7,999గా నిర్ణయించినట్టు తెలిపారు. బ్యాంకాక్ నుంచి కాంబోడియా, చైనా, హాంగ్‌కాంగ్, ఇండోనేషియా, జపాన్, లావోస్, ఫిలిప్పీన్స్, వియత్నాం దేశాలకు కూడా వెళ్లవచ్చునన్నారు. అలాగే ఏప్రిల్ 26 నుంచి కౌలాలంపూర్‌కు బుధ, శుక్ర, ఆదివారాల్లో ఎయిర్ ఏసియా విమానం నడుస్తుందని, దీనికి కూడా కాంబోడియా, చైనా, హాంకాంగ్, జపాన్, ఫిలిప్పీన్స్, వియత్నాం, ఆస్ట్రేలియా దేశాలకు కనెక్టింగ్ విమానాలు ఉంటాయని తెలిపారు. చెన్నై నుంచి విశాఖపట్నం మీదుగా పుదుచ్చేరికి క్రూయిజ్ నౌక ఆగస్టు నుంచి అందుబాటులోకి రానుందని ఏపీ టూర్స్,ట్రావెల్స్ సంఘం అధ్యక్షుడు విజయమోహన్ తెలిపారు.

ఎడారిలో ప్రవాసీ మహిళలకు

మొండిచేయి

▸ ఆఫ్రికాలో చైనాను ఎదుర్కొనేందుకు కేటాయింపులు నిల్

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

గల్ఫ్ దేశాల్లో సమస్యలను ఎదుర్కొనే ప్రవాస భారతీయ మహిళల సహాయార్థం వన్ స్టాప్ సెంటర్ నెలకొల్పుతున్నట్లు ప్రకటించిన కేంద్రం ఈసారి బడ్జెట్‌లో మళ్లీ మొండిచేయి చూపింది. నిర్భయ నిధి కింద కేంద్రం ఈసారి తాత్కాలిక బడ్జెట్‌లో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు ఎలాంటి కేటాయింపులు జరుపలేదు. అలాగే, ప్రవాసీయుల సంక్షేమానికి సంబంధించి కూడా ఏ రకమైన కేటాయింపులు లేవు. నూతన పాసుపోర్టు కేంద్రాలు, కార్యాలయాల ఏర్పాటు, భవనాల నిర్మాణానికి సంబంధించి కూడా ఎలాంటి ప్రకటనలూ చేయలేదు. దశలవారీగా చిప్‌లతో కూడిన ఈ-పాసుపోర్టుల జారీ కోసం ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం పాసుపోర్టు సేవల కోసం గతేడాది కంటే కూడా తక్కువగా కేటాయింపులు జరిపింది. విదేశీ ప్రభుత్వాలకు ప్రత్యేకించి పొరుగు దేశాలు, ఆఫ్రికా ఖండంలో అభివృద్ధి ప్రాజెక్టుల కోసం రూ.6,541.79 కోట్లను కేటాయించగా అందులో భూటాన్‌ది సింహభాగం. విదేశాల్లో ప్రత్యేకించి నేపాల్ నుంచి మొదలు అటు ఆఫ్రికా వరకు చైనా క్రియాశీలకంగా దౌత్య సంబంధాలను పటిష్ఠం చేసుకోవడానికి పావులు కదుపుతుండగా కేంద్ర ప్రభుత్వం మాత్రం ఆఫ్రికా దేశాల్లో చెప్పుకోదగ్గ స్థాయిలో ఏవిధమైన సహాయక ప్రాజెక్టులకు కేటాయింపులు చేయలేదు. కొన్నిచోట్ల మహిళలకు గ్యాస్ పొయ్యిలు, కుట్టు మిషన్లు పంపిణీ చేయడానికి కేటాయింపులు చేసింది.

15 మంది ఏఎన్‌ఎంల సస్పెన్షన్

▸ రక్తహీనత నివారణ చర్యల్లో విఫలమైనందుకు వేటు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 1: గర్భిణులు, ఎదిగిన బాలికల్లో ఎక్కువగా కనిపించే రక్తహీనత నివారణ చర్యల్లో విఫలమైనందుకు ఏఎన్‌ఎంల (యాక్సలరినర్సింగ్ ఫర్ విడ్ వైఫరీ)పై వైద్య ఆరోగ్య శాఖ కొరడా ఝుళిపించింది. రాష్ట్రవ్యాప్తంగా 15 మంది ఏఎన్‌ఎంలను సస్పెండ్ చేయాలని వైద్యఆరోగ్య శాఖ కమిషనర్ నివాస్ అధికారులను గురువారం ఆదేశించారు. ఏఎన్‌ఎం ఏపీ హెల్త్ యాప్‌లో ఆరోగ్య కార్యకర్తలు గర్భిణులు, ఎదిగిన బాలికల హిమోగ్లోబిన్ (రక్త శాతం) నమోదు చేస్తున్నారు. రాష్ట్రంలోని 15 సచివాలయాల పరిధిలోని గర్భిణులు, ఎదిగిన బాలికలు చాలా తక్కువ రక్త శాతం కలిగి ఉన్నట్టు కమిషనరేట్ అధికారులు గుర్తించారు. చాలా తక్కువ శాతం రక్తం కలిగి ఉన్న గర్భిణులు, ఎదిగిన బాలికలు ఉన్నప్పటికీ నివారణ చర్యలు చేపట్టడంలో సచివాలయ ఏఎన్‌ఎంలు విఫలమైనట్టు అధికారులు గుర్తించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన 15 ఏఎన్‌ఎంలను వెంటనే సస్పెండ్ చేయాలని కమిషనర్ ఆయా జిల్లాల అధికారులను ఆదేశించారు. సస్పెండ్ అయిన వారిలో అనకాపల్లి జిల్లా ఏటికొప్పాక, అనంతపురం జిల్లా బుక్కరాయ సముద్రం-5, చిత్తూరు జిల్లా కొంగన పల్లె, ఏలూరు జిల్లా ఉంగుటూరు, రమణక్కపేట, అక్కిరెడ్డిగూడెం, బుట్టాయి గూడెం-2, పెరవలి, నంద్యాల జిల్లా ముత్యాలంపాడు, పల్నాడు జిల్లా అచ్చంపేట-2, ఉప్పలపాడు, పార్వతీపురం మన్యం జిల్లా గాంధీనగర్, తిరుపతి జిల్లా బీటీఆర్ కాలనీ, వైఎస్సార్ జిల్లా గానుగపెంట సచివాలయాల ఏఎన్‌ఎంలు ఉన్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు వారి సస్పెన్షన్ కొనసాగించాలని సూచించారు.

బిల్లులివ్వకుండా కొత్త టెండర్లా?

▸ జగన్ సర్కారుపై తమిళనాడు న్యూస్‌ప్రింట్ కంపెనీ ఆగ్రహం

▸ న్యాయపరమైన చర్యలకు దిగుతామని హెచ్చరిక

▸ గతేడాది 16,514 టన్నుల కాగితం సరఫరా చేశాం

▸ దీనికి సంబంధించి రూ.199.68 కోట్లు చెల్లించాలి

▸ ఏపీ జ్యుడీషియల్ ప్రివ్యూకు తాజాగా లేఖ

▸ పాఠ్యపుస్తకాల ముద్రణకు విద్యాశాఖ కొత్త విధానం

▸ కాగితం తెచ్చుకోవాలనడంపై ప్రింటర్ల మండిపాటు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పాఠ్యపుస్తకాలకు ఉపయోగించే కాగితం విషయంలో తమిళనాడు, ఏపీ మధ్య వివాదం మొదలైంది. జగన్ ప్రభుత్వం ఇక్కడి కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్ పెట్టినట్టుగానే పొరుగు రాష్ట్రానికి కూడా దాదాపు రూ.200 కోట్ల వరకూ బకాయిలు పడటమే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. పాఠశాల విద్యాశాఖ ప్రతి సంవత్సరం తమిళనాడు న్యూస్‌ప్రింట్ అండ్ పేపర్స్ లిమిటెడ్ (టీఎన్‌పీఎల్) నుంచి కాగితం తీసుకొని పుస్తకాలు ముద్రణ చేయిస్తుంది. ఈసారి వారిని పక్కనపెట్టి కొత్తగా టెండర్లు పిలిచింది. తమకు బిల్లులు చెల్లించకుండా టెండర్లు పిలవడంపై టీఎన్‌పీఎల్ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. దాదాపు పదేళ్లుగా తాము కాగితం సరఫరా చేస్తున్నామని, బిల్లులు ఆపినా కూడా సరకు పంపుతునే ఉన్నామని, ఇప్పుడు బిల్లు బకాయిలు తీర్చకుండానే టెండర్లకు వెళ్తారా అని ఏపీ ప్రభుత్వాన్ని నిలదీసింది. ఈ వ్యవహారంపై తాజాగా ఏపీ జ్యుడీషియల్ ప్రివ్యూకు లేఖ కూడా రాసింది. బడి పిల్లల పాఠ్యపుస్తకాల ముద్రణకు ఏటా టీఎన్‌పీఎల్ కాగితం సరఫరా చేస్తుంది. దానిని స్థానిక ప్రింటర్లకు ఇచ్చి ప్రభుత్వం పుస్తకాల ముద్రణ చేయిస్తుంది. ఈ ఏడాది అందుకు విరుద్ధంగా ప్రింటర్లే కాగితం సమకూర్చుకోవాలంటూ తాజాగా ముద్రణకు టెండర్లు పిలిచింది. కాగితం తెచ్చుకుని పుస్తకాలు ముద్రించి ఇస్తే మొత్తానికీ కలిపి బిల్లులు ఇస్తామని పేర్కొంది. అయితే కొంతమందికి లబ్ధి చేకూర్చడం కోసమే పాత విధానం మార్చారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రూపాయి కూడా ఇవ్వలేదు

ఈ కాగితం వ్యవహారం రెండు రాష్ట్రాల మధ్య వివాదంగా మారింది. తమకు బకాయిలు చెల్లించకుండా టెండర్లు పిలవడంపై టీఎన్‌పీఎల్ అభ్యంతరం వ్యక్తం చేసింది. గతేడాది ఇచ్చిన కాగితానికి ఒక్క రూపాయి బిల్లు ఇవ్వలేదని, అయినా ఇప్పుడు తమను కాదని టెండర్లు పిలవడం అన్యాయమని ఏపీ జ్యుడీషియల్ ప్రివ్యూకి రాసిన లేఖలో పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వ పాఠ్యపుస్తకాల ప్రెస్‌కు గతేడాది 16,514 టన్నుల కాగితం సరఫరా చేశామని, దీనికి సంబంధించిన రూ.199.68 కోట్లలో ఒక్క బిల్లును కూడా ఏపీ ప్రభుత్వం చెల్లించలేదని అందులో తెలిపింది. ఇప్పుడు అకస్మాత్తుగా కొత్త టెండర్లు పిలిచారని ఆరోపించింది. ఎన్నిసార్లు అడిగినా నిధుల్లేవంటూ బిల్లులు చెల్లించడం లేదని పేర్కొంది. బకాయిలు చెల్లించకుండా, టెండర్లు కొనసాగిస్తే ఏపీ ప్రభుత్వంపై న్యాయపరమైన చర్యలకు దిగుతామని హెచ్చరించింది. టీఎన్‌పీఎల్ ప్రభుత్వ రంగ సంస్థ కావడంతో ఇది రెండు ప్రభుత్వాల మధ్య న్యాయ వివాదాలు రేపుతుందని ప్రింటర్లు అభిప్రాయపడుతున్నారు.

అంత సామర్థ్యం లేదు

పాఠ్యపుస్తకాలకు నాణ్యమైన కాగితం అవసరం. అందుకోసం టీఎన్‌పీఎల్ నుంచే కాగితం తీసుకుంటున్నారు. దానితో ముద్రణ చేయించి ఇచ్చినందుకుగాను ప్రింటర్లకు పేజీకి 6పైసలు ఇస్తారు. రాష్ట్రంలో 75 ప్రింటింగ్ సంస్థలు ఈ బాధ్యత చేపడుతున్నాయి. వారికి కాగితం సమకూర్చుకునే సామర్థ్యం లేదు. ఇది తెలిసీ పాఠశాల విద్యాశాఖ కాగితంతో కలిపి టెండర్లు పిలిచింది. ఆ స్థాయిలో పట్టుమని పదిమంది ప్రింటర్లు కూడా ఉండరని అంచనా. ఒకవేళ వారికే టెండరు దక్కినా మళ్లీ మిగిలిన వారికి సబ్ కాంట్రాక్టు ఇస్తేగానీ విద్యా సంవత్సరం ప్రారంభానికి పుస్తకాల ముద్రణ పూర్తికాదు. కొందరు ప్రింటర్లకు మేలు చేయడం కోసమే కాగితం తెచ్చుకోవాలనే నిబంధన పెట్టారని, సుదీర్ఘకాలంగా దీనిపైనే ఆధారపడిన తమ పొట్టకొట్టే నిర్ణయం తీసుకున్నారని పలువురు ప్రింటర్లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గతేడాది కాగితం బిల్లులే చెల్లించని ప్రభుత్వం, నిధుల్లేక ఈ నిబంధన పెట్టిందంటూ అధికార వర్గాల్లో చర్చ సాగుతోంది. కాగితం తెచ్చుకోమని నిబంధన పెడితే పుస్తకాల నాణ్యత వేర్వేరుగా ఉంటుందని, అంతిమంగా విద్యార్థులకు నష్టం కలుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పసుపు రంగువద్దు

▸ ఉద్యోగులకు హెల్త్ వర్సిటీ అధికారుల ఆదేశం

▸ 6న జరిగే స్నాతకోత్సవానికి డ్రస్ కోడ్

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): హెల్త్ యూనివర్సిటీ అధికారులు స్నాతకోత్సవ కార్యక్రమానికి ఉద్యోగులకు డ్రస్ కోడ్ విధించడం వివాదాస్పదమవుతోంది. కేవలం ఎరుపు, గులాబీ రంగు దుస్తులు మాత్రమే వేసుకుని రావాలని, పసుపు రంగు దుస్తులు అసలు వేసుకోవద్దని ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 6వ తేదీన హెల్త్ వర్సిటీ 25వ స్నాతకోత్సవాన్ని అధికారులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగులు సాధారణంగా తమకు నచ్చిన దుస్తులు ధరించి స్నాతకోత్సవానికి హాజరవుతారు. ఈ ఏడాది వర్సిటీ ఉన్నతాధికారులు డ్రస్ కోడ్ పెట్టారు. కేవలం ఎరుపు, గులాబీ రంగు దుస్తులు మాత్రమే వేసుకుని స్నాతకోత్సవానికి రావాలని మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు పసుపు రంగు దుస్తులు వేసుకోవద్దని స్పష్టంగా చెబుతున్నారు. అయితే ఈ నిర్ణయాన్ని ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కొత్తగా డ్రస్ కోడ్ ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పైగా పసుపు రంగు దుస్తులు వేసుకోవద్దని చెప్పడం మరీ దారుణమని అంటున్నారు.

జడ్పీ పరిధిలో కారుణ్య నియామకాలు చేపట్టండి

▸ ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు డిమాండ్

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తూ చనిపోయిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల కుటుంబాల్లో అర్హత కలిగిన వారికి తక్షణమే కారుణ్య నియామకాలు చేపట్టాలని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, కార్యదర్శి దామోదర్‌రావు.. మంత్రి బొత్స సత్యనారాయణకు గురువారం వినతిపత్రం అందజేశారు. జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేసే వారిలో అనేకమంది కోవిడ్ కాలంలో చనిపోయినప్పటికీ నేటికీ కారుణ్య నియామకాలు చేపట్టలేదని అన్నారు. రెవెన్యూ భవన్‌లో జరిగిన ఏపీ జేఏసీ అమరావతి కేపిటల్ యూనిట్ ఉమెన్ వింగ్ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీకి చైర్‌పర్సన్‌గా శ్రీదేవి, ప్రధాన కార్యదర్శిగా వాణి ప్రమాణ స్వీకారం చేశారు.

5 నుంచి అసెంబ్లీ... మూడు రోజులు నిర్వహణ

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం చివరి శాసనసభ సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు 5న అసెంబ్లీ సమావేశం అవుతుందని వెల్లడిస్తూ గవర్నర్ అబ్దుల్ నజీర్ గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు ఈ సమావేశాలు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. మొదటి రోజు ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. రెండో రోజున బడ్జెట్‌ను ప్రవేశపెడతారు.

'వ్యూహం' సెన్సార్ సర్టిఫికెట్ రద్దుపై తీర్పు రిజర్వు

హైదరాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): వ్యూహం సినిమాకు జారీ చేసిన సెన్సార్ సర్టిఫికెట్‌ను రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ నిర్మాత దాసరి కిరణ్‌కుమార్, దర్శకుడు రాంగోపాల్ వర్మ దాఖలు చేసిన అప్పీళ్లపై తెలంగాణ హైకోర్టు గురువారం తీర్పును రిజర్వు చేసింది. వ్యూహం సినిమాకు తొలుత సెన్సార్ బోర్డు సర్టిఫికెట్‌ను తిరస్కరించింది. తర్వాత ఏర్పాటైన రివైజింగ్ కమిటీ సర్టిఫికెట్ జారీ చేసింది. దీనిపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి ఆ సెన్సార్ సర్టిఫికెట్‌ను కొట్టేస్తూ.. చట్టప్రకారం మళ్లీ నిర్ణయం తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

జగన్‌కు 25 సీట్లు కూడా రావు: గోనె

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జగన్ పార్టీకి 25 సీట్లు కూడా దక్కవని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశరావు అన్నారు. బూతుల రోజాకు వైసీపీ టికెట్ దక్కినా డిపాజిట్ మాత్రం రాదని తేల్చి చెప్పారు. షర్మిల కాంగ్రెస్ ఏపీ అధ్యక్ష పదవి చేపట్టిన తర్వాత ఆమె దూకుడును తట్టుకోలేక బూతుల నాని, బూతుల రోజా, ఆయారాం గయారాంలు అనుచిత వాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైసీపీలోనూ 'నానీ'కి టికెట్ ఇవ్వరు: కేశినేని చిన్ని

విజయవాడ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ నుంచి వైసీపీలో చేరిన కేశినేని నానికి అక్కడ కూడా టికెట్ ఇవ్వరని ఆయన సోదరుడు, టీడీపీ నేత కేశినేని చిన్ని అన్నారు. విజయవాడలో గురువారం మాట్లాడుతూ... ఒకే జాతి పక్షులన్నీ ఒకే గూటికి చేరినట్టు సైకోలంతా జగన్ పంచన చేరారని విమర్శించారు.

వరి గడ్డికి భారీ డిమాండ్

▸ ట్రక్కు రూ.16వేలకు చేరిన గ్రాసం.. ఐదేళ్లలో రెట్టింపైన రేటు

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): వరి గడ్డికి బాగా డిమాండ్ వచ్చింది. ట్రక్కు ఎండు గడ్డి రూ.16వేల దాకా పలుకుతోంది. ఈ ఏడాది వరి సాగు గణనీయంగా తగ్గడంతో ఎండు గడ్డికి డిమాండ్ ఏర్పడింది. పైగా ఎక్కువ శాతం రైతులు యంత్రాలతోనే వరి కోతలు సాగిస్తున్నారు. యంత్రాలతో కోయడం వల్ల గడ్డి ముక్కలై, పశు గ్రాసంగా ఉపయోగపడక, రైతులు పొలాల్లోనే కాల్చేస్తున్నారు. కూలీలతో కోసిన గడ్డినే ఎక్కువ శాతం పశువులకు వేస్తున్నారు. సాగు తగ్గడం, యంత్రాలతో కోయడం వల్ల సాధారణ వరి గడ్డి ఉత్పత్తి తగ్గుతోంది. ఈ కారణంగా ఎండుగడ్డికి రేట్లు పెంచుతున్నారు. కృష్ణా డెల్టా ప్రాంతంలో వరి గడ్డిని 20-30కిలోమీటర్ల దూరం తరలించడానికి ట్రాక్టరు బాడుగ రూ.3వేల దాకా అవుతోంది. రవాణా ఖర్చులు పెరగడం కూడా వరిగడ్డి ధర పెరగడానికి కారణమౌతోంది. ఎకరం వరి కోస్తే, ట్రక్కు నిండా గడ్డి వస్తుంది. ట్రక్కు గడ్డి ఐదేళ్ల కిందట రూ.8వేలు ఉండగా, ఏటేటా ధర పెరుగుతూ ప్రస్తుతం రూ.16వేలకు చేరింది. దీంతో పశుపోషణ భారమైపోతోందని రైతులు వాపోతున్నారు.

11న కొర్నెపాడులో గో సంరక్షణ సదస్సు

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11న గుంటూరు జిల్లా కొర్నెపాడులో రాష్ట్రస్థాయి గో సంరక్షణ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు చెప్పారు. ఈ సందర్భంగా ఆవులు, గేదెలకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సదస్సు, పశువైద్య శిబిరానికి వచ్చే రైతులు ముందుగా 70939 73999 ఫోన్ నంబర్లో వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

పన్నుల్లో మార్పులు ఆశించాం.. మార్చలేదు


▸ ఉపాధి, వాణిజ్యాన్ని పెంపొందించే బడ్జెట్: చాంబర్ ఆఫ్ కామర్స్

విజయవాడ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంవత్సరం కావటంతో ప్రత్యక్ష, పరోక్ష పన్నులలో మార్పులను ఆశించామని, అయితే కేంద్ర బడ్జెట్‌లో ఆ మార్పులేమీ లేవని ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పొట్లూరి భాస్కరరావు, బి.రాజశేఖర్ పేర్కొన్నారు. మౌలిక సదుపాయాలు, రోడ్లు, రైల్వే, విమానాశ్రయాలు, ఓడరేవుల అభివృద్ధికి 11.11 లక్షల కోట్లను కేటాయించటం మంచి పరిణామమన్నారు. ఇది ఉపాధి, వాణిజ్యాన్ని పెంచడానికి దోహదపడుతుందని చెప్పారు. ప్రభుత్వం స్టార్టప్‌లకు ఇచ్చిన పన్ను వినహాయింపులను 2025 మార్చి 31 వరకు పొడిగించినట్టు తెలిపారు. బడ్జెట్‌లో ప్రకటించిన మూడు ప్రధాన రైల్వే కారిడార్ల కారణంగా లాజిస్టిక్ ఖర్చులు తగ్గనున్నట్టు పేరొన్నారు. రానున్న సాధారణ బడ్జెట్‌ను ప్రతిబింబించే విధంగా కేటాయింపులు చేసినట్టు కనిపిస్తోందన్నారు.

ఇది అబద్ధాల బడ్జెట్: నారాయణ

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 1: ఎన్నికల నేపథ్యంలో కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ అందమైన భాషతో అబద్ధాలు వల్లెవేశారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తిరుపతిలో విమర్శించారు. బడ్జెట్‌లో ఉద్యోగాల ప్రస్తావన లేకపోవడం బాధాకరమన్నారు. పన్నుల వ్యవహారంలో కార్పొరేట్ రంగానికి పెద్ద పీట వేశారని ఆక్షేపించారు. బడ్జెట్ ప్రసంగంలో అయోధ్య అంశాన్ని లేవనెత్తడాన్ని తప్పుబట్టారు. దేశంలో అభివృద్ధి జరగలేదు కాబట్టి శ్రీరాముడిని అడ్డం పెట్టుకుని ఓట్లు దండుకోవాలని బీజేపీ చూస్తోందన్నారు. కేరళ గవర్నర్ ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త కన్నా హీనంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● శుక్రవారం 2 ఫిబ్రవరి 2024



నార్మ్‌లో పీజీడీఎం అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ఐకార్ - నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్)- 'పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది రెండేళ్ల వ్యవధి గల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఇందులో ఆరు ట్రైమెస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ఆరు నుంచి ఎనిమిది వారాల సమ్మర్ ఇంటర్న్‌షిప్, 12 వారాల బిజినెస్ బూట్ క్యాంప్, 13 వారాల ప్రాజెక్ట్ వర్క్ ఉంటాయి. ఇందులో మొత్తం 66 సీట్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

అర్హత: యూజీసీ గుర్తింపు పొందిన కళాశాల నుంచి అగ్రికల్చర్, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్, కమర్షియల్ అగ్రికల్చర్, అగ్రికల్చరల్ మార్కెటింగ్ అండ్ కోఆపరేషన్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ, డెయిరీ సైన్స్/టెక్నాలజీ, ఫిషరీస్, ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్, ఫారెస్ట్రీ, హార్టికల్చర్, సెరికల్చర్, వెటర్నరీ సైన్స్, హోమ్ సైన్స్/కమ్యూనిటీ సైన్స్, అగ్రికల్చరల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగాలకు సంబంధించి ఒకదానిలో నాలుగేళ్ల డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి నుంచి డిగ్రీ స్థాయి వరకు ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదు శాతం సడలింపు వర్తిస్తుంది. క్యాట్ 2023/సీమ్యాట్ 2024 స్కోర్ తప్పనిసరి. సంబంధిత రంగంలో కనీసం ఆర్నెల్ల అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

ఎంపిక: క్యాట్ 2023/సీమ్యాట్ 2024 స్కోర్ ఆధారంగా 1:5 నిష్పత్తిలో(ఒక సీటుకి అయిదుగురిని) అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి ఇంటర్వ్యూకి పిలుస్తారు. వీరికి అనలిటికల్ రైటింగ్ స్కిల్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. క్యాట్/సీమ్యాట్ స్కోర్‌కు 30 శాతం, అనలిటికల్ రైటింగ్ స్కిల్ టెస్ట్‌కు 10 శాతం, గ్రూప్ డిస్కషన్ స్కోర్‌కు 20 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకి 20 శాతం, అనుభవానికి 5 శాతం, అకడమిక్ ప్రతిభకు 10 శాతం, డైవర్సిటీ ఫ్యాక్టర్‌కు 5 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **వెబ్‌సైట్:** naarm.org.in/

ఐఐఎం రోహ్‌తక్‌లో ఐపీఎం



రోహ్‌తక్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)- ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (ఐపీఎం)లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది అయిదేళ్ల వ్యవధిగల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో రాణించాలనుకొనేవారికి ఈ ప్రోగ్రామ్ అనువుగా ఉంటుంది. ఐపీఎం ఆప్టిట్యూడ్ టెస్ట్(ఐపీఎం ఏటీ) 2024, పర్సనల్ ఇంటర్వ్యూ, అకడమిక్ ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. మొత్తం 165 సీట్లు ఉన్నాయి. మొదటి మూడేళ్ల తరవాత ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. వీరికి బీబీఏ(బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్) డిగ్రీని ప్రదానం చేస్తారు. ప్రోగ్రామ్ మొత్తం పూర్తిచేసిన వారికి ఎంబీఏ డిగ్రీ ఇస్తారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ సౌకర్యం ఉంది.

ప్రోగ్రామ్ వివరాలు: ఈ ప్రోగ్రామ్‌లో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటి దానిలో ఫౌండేషన్ కోర్సులు, రెండోదానిలో మేనేజ్‌మెంట్ కోర్సులు ఉంటాయి. ఏడాదికి మూడు చొప్పున మొత్తం 15 టర్మ్‌ల వారీగా కోర్సులు నిర్వహిస్తారు. ఒక్కో టర్మ్ వ్యవధి మూడు నెలలు. ఏటా నిర్దేశించిన మేరకు ఇంటర్న్‌షిప్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌లో మేథమెటిక్స్, ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్, హ్యూమానిటీస్ వంటి కోర్ కోర్సులతోపాటు బిజినెస్ కమ్యూనికేషన్, మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్, బిజినెస్, ఫారిన్ లాంగ్వేజెస్ కోర్సులు ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డ్ నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి, ఇంటర్ స్థాయుల్లో జనరల్ అభ్యర్థులకు ప్రథమ శ్రేణి మార్కులు; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 జూన్ 30 నాటికి 20 ఏళ్లు మించకూడదు.

ఐపీఎం ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఐపీఎం ఏటీ) 2024 వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో క్వాంటిటేటివ్ ఎబిలిటీ, లాజికల్ రీజనింగ్, వెర్బల్ ఎబిలిటీ అనే మూడు సెక్షన్‌లు ఉంటాయి. ఒక్కో సెక్షన్‌లో 40 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. సెక్షన్‌కు 40 నిమిషాలు చొప్పున మొత్తం పరీక్ష సమయం రెండు గంటలు.

ఎంపిక: ఐపీఎం ఏటీ 2024లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఇంటర్వ్యూలో అభ్యర్థుల అకడమిక్ ప్రతిభ, జనరల్ అవే ర్‌నెస్, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితరాలను పరీక్షిస్తారు. ఐపీఎం ఆప్టిట్యూడ్ టెస్ట్ స్కోర్‌కు 45 శాతం, అకడమిక్ ప్రతిభకు 40 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూ స్కోర్‌కి 15 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఫిబ్రవరి 6 నుంచి
- **దరఖాస్తు ఫీజు:** రూ.4,500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 10
- **ఐపీఎం ఆప్టిట్యూడ్ టెస్ట్ 2024:** మే 18 నుంచి
- **వెబ్‌సైట్:** iimrohtak.ac.in

ఏఐఐఏలో ఆయుర్వేద డైటీషియన్ కోర్సు

న్యూఢిల్లీలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద(ఏఐఐఏ)- 'ఆయుర్వేద డైటీషియన్ కోర్సు'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ఇందులో హీలింగ్ సైన్స్ ఆఫ్ ఆయుర్వేద సంబంధిత అంశాలు బోధిస్తారు. ఇంగ్లీష్, హిందీ మాధ్యమాల్లో బోధన ఉంటుంది. ఈ కోర్సులో 30 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, ఎంట్రెన్స్ ఎగ్జామ్/కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసి అడ్మిషన్స్ ఇస్తారు. ఈ కోర్సు పూర్తిచేసినవారికి ఆయుర్వేదిక్ హాస్పిటల్స్, హెల్త్ రిసార్ట్స్, వెల్‌నెస్ సెంటర్లలో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీఏఎంఎస్ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసి ఫలితాల కోసం చూస్తున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 25 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలి.

ముఖ్య సమాచారం

- **అడ్మిషన్ ఫీజు:** రూ.5,000
- **ట్యూషన్ ఫీజు:** నెలకు రూ.1,000
- **కాషన్ డిపాజిట్:** రూ.5000
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.350; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150
- **రిజిస్టర్డ్/స్పీడ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 15
- **చిరునామా:** డైరెక్టర్, ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద(ఏఐఐఏ), గౌతమ్‌పురి, సరిత విహార్, మధుర రోడ్, న్యూఢిల్లీ-110076
- **వెబ్‌సైట్:** aiia.gov.in

నీలిట్‌లో స్మార్ట్ ల్యాబ్ కోర్సులు



కాలికట్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(నీలిట్)కు చెందిన స్కిల్డ్ మ్యాన్‌పవర్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ అండ్ ట్రెయినింగ్(స్మార్ట్)ఫెసిలిటీ - అడ్వాన్స్‌డ్ వీఎల్ఎస్ఐ అండ్ ఎంబెడెడ్ సిస్టమ్‌కు సంబంధించి బిగినర్ లెవెల్ ప్రోగ్రామ్‌లను అందిస్తోంది. ఇవి స్కిల్ ట్రెయినింగ్ ప్రోగ్రామ్‌లు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి వారం. రోజుకు ఒక గంట చొప్పున అయిదు రోజులు థియరీ తరగతులు, ఒక రోజు ల్యాబ్ సెషన్ ఉంటాయి. కనీసం 60 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ప్రోగ్రామ్ చివరలో ఆన్‌లైన్ మోడ్‌లో ఎగ్జిట్ టెస్ట్ నిర్వహిస్తారు. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు.

ఎంబెడెడ్ ఫర్ బిగినర్స్: ఇందులో సీ-ప్రోగ్రామింగ్, ఎంబెడెడ్ హార్డ్‌వేర్ అంశాల్లో శిక్షణ ఇస్తారు. ఐడీఈ-ఎంబెడెడ్ హార్డ్‌వేర్ ప్రోగ్రామింగ్‌లో డెమో సెషన్ ఉంటుంది.

వీఎల్ఎస్ఐ ఫర్ బిగినర్స్: ఇందులో వీఎల్ఎస్ఐ, హార్డ్‌వేర్ డిస్క్రిప్షన్ లాంగ్వేజెస్(వెరిలాగ్), ఎఫ్‌పీజీఏ ఆర్కిటెక్చర్ అంశాలకు సంబంధించి తరగతులు ఉంటాయి. ఎఫ్‌పీజీఏ ప్రోగ్రామ్‌లో డెమో సెషన్ ఉంటుంది.

పైథాన్ ఫర్ బిగినర్స్: ఇందులో ఇన్‌పుట్/అవుట్‌పుట్, మ్యాథ్ ఆపరేషన్స్, కంట్రోల్ ఫ్లో, లూప్స్, లిస్ట్స్, 2డీ గ్రాఫిక్స్ వంటి కోర్ స్కిల్స్‌లో శిక్షణ ఇస్తారు. ఈ ప్రోగ్రామ్‌లో మాత్రం రోజుకు రెండు గంటలు సెషన్స్ ఉంటాయి.

ఇంట్రడక్షన్ టు మ్యాట్‌లాబ్ & సిములింక్: ఇందులో ఇంట్రడక్షన్ టు మ్యాట్‌లాబ్, బేసిక్ మ్యాట్‌లాబ్ ప్రోగ్రామింగ్ స్కిల్స్, ఇంట్రడక్షన్ టు సిములింక్ సంబంధిత అంశాల్లో తరగతులు ఉంటాయి.

- **అర్హత:** తొమ్మిదోతరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులు సహా ఆసక్తిగలవారందరూ అప్లయ్ చేసుకోవచ్చు.
- కోర్సు ఫీజు లేదు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 8
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఫిబ్రవరి 9 నుంచి
- **వెబ్‌సైట్:** nielit.gov.in

జాబ్ కార్నర్

ఫోర్త్ పారడైమ్ ఇన్‌స్టిట్యూట్‌లో టెక్నికల్ పోస్టులు

బెంగళూరులోని సీఎస్ఐఆర్‌కు చెందిన ఫోర్త్ పారడైమ్ ఇన్‌స్టిట్యూట్(సీఎస్ఐఆర్-4పీఐ)... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 17

అర్హత: పోస్టును అనుసరించి పది, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, బీఎస్సీ(కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్), బీసీఏ ఉత్తీర్ణత, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: డ్రైవర్ పోస్టుకు 27 ఏళ్లు; మిగిలిన పోస్టులకు 28 ఏళ్లు మించకూడదు

జీతభత్యాలు: నెలకు టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.73,734. టెక్నీషియన్/డ్రైవర్ పోస్టులకు రూ.40,466.

ఎంపిక విధానం: రాత పరీక్ష, ట్రేడ్/స్కిల్ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

చివరి తేదీ: ఫిబ్రవరి 29

వెబ్‌సైట్: https://csir4pi.res.in/



టీఆర్‌టీసీ, గువాహటిలో అప్రెంటిస్‌షిప్ శిక్షణ

గువాహటిలోని ఎంఎస్ఎంఈ- టూల్ రూమ్ అండ్ ట్రెయినింగ్ సెంటర్...ఏడాది అప్రెంటిస్‌షిప్ శిక్షణలో ప్రవేశాలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

మొత్తం ఖాళీలు: 26

విభాగాలు: మెకానికల్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలి కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్.

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ, బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.

స్టయిపెండ్: నెలకు బీఈ, బీటెక్ అప్రెంటిస్‌కు రూ.12,000. డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.10,000.

ఇంటర్వ్యూ తేదీ: ఫిబ్రవరి 10

వేదిక: టూల్ రూమ్ అండ్ ట్రెయినింగ్ సెంటర్, గువాహటి, అమిన్‌గావ్ ఇండస్ట్రియల్ ఏరియా, నార్త్ గువాహటి రోడ్, గువాహటి.

వెబ్‌సైట్: https://trtcguwahati.org/

మంచిర్యాల జిల్లాలో సివిల్ అసిస్టెంట్ సర్జన్స్

మంచిర్యాలలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్, సూపరింటెండెంట్ హెడ్ క్వార్టర్స్ హాస్పిటల్ ఆఫీస్ ...కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 5

పోస్టు: సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్

అర్హత: సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, పీజీ, డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను సూపరింటెండెంట్ హెడ్ క్వార్టర్స్ హాస్పిటల్ ఆఫీస్, తెలంగాణ వైద్య విధాన పరిషత్, మంచిర్యాల చిరునామాకు పంపించాలి.

దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: ఫిబ్రవరి 3

వెబ్‌సైట్: mancherial.telangana.gov.in/

న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీలో అసిస్టెంట్‌లు

ముంబయిలోని న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్... దేశ వ్యాప్తంగా ఉన్న ఎన్ఐఏసీఎల్ శాఖల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 300 **పోస్టు:** అసిస్టెంట్

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి.

జీతభత్యాలు: నెలకు సుమారు రూ.37,000

వయోపరిమితి: 2024 జనవరి 1 నాటికి 21 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: ప్రాథమిక రాత పరీక్ష, ప్రధాన రాత పరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 15

వెబ్‌సైట్: www.newindia.co.in

ఎన్‌హెచ్ఏఐలో డిప్యూటీ మేనేజర్లు

న్యూఢిల్లీలోని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ)....డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టు:** డిప్యూటీ మేనేజర్ (టెక్నికల్)

ఖాళీలు: 60

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ/ఇన్‌స్టిట్యూట్ నుంచి సివిల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 30 ఏళ్లు మించకూడదు

పే స్కేల్: రూ.15,600 - రూ.39,100

ఎంపిక ప్రక్రియ: యూపీఎస్సీ 2023లో నిర్వహించిన ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్, పర్సనాలిటీ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 15

వెబ్‌సైట్: https://nhai.gov.in/

లిటిల్స్



అతి తెలివి కుక్క

ఒక ఊరిలో ఓ ఆశపోతు కుక్క ఉండేది. దానికి తెలివి ఉందని భ్రమపడేది. తనంత తెలివి తేటలు ఎవరికీ లేవని వాదించేది. అయితే ఎప్పుడూ తెలివి ఉండే పనులు చేసింది కాదు. అయితే తెలివి తనకు ఎక్కువని చెప్పుకునేది. 'తెలివిలేని కుక్క' అనేవి ఇతర జంతువులు. అయినా పట్టించుకునేది కాదు.

ఒక రోజు పొరుగూరుకు వెళ్తూ ఉంది. దారి మధ్యలో మంచి మాంసం ముక్క దొరికింది. ఎముకతో పాటు మంచి కండ ఉన్నది. దీంతో అదృష్టం తనదే అనుకుంది. వెంటనే మాంస ముక్క తీసుకుని దూరంగా అడవిలోకి వెళ్లి ప్రశాంతంగా తినాలనుకుంది. అయితే వెనక్కి మళ్లి తనుండే చోటు వైపు మళ్లీ అడవిలోకి బయలుదేరింది. అడవిలో ఓ వంతెన ఉంది. అది కూడా ఒక పెద్ద కట్టె వంతెనలా ఉంది. దాని మీద నడుచుకుంటూ వెళ్తోంది. ఆ మాంస ఎప్పుడెప్పుడు తినాలా? అనే ఆశతో వెళ్తోంది.




వంతెన దాటుతూంటే దాని నీడ కనపడింది. ఇదేంటీ? దాని దగ్గర ఇంకో ముక్క ఉంది. అది కూడా తింటే బావుంటుందని ఆశపడింది. ఆ రెండు మాంసం ముక్కలు తనవే అని ఊహించింది. క్షణం పాటు ఆలోచించకుండా భౌ భౌ.. అంటూ గట్టిగా మొరిగింది. క్షణాల్లో దాని నోటిలో మాంసపు ముక్క ఎగిరిపడింది. అది కాస్త నీళ్లలో పడింది. దీంతో కిందకి చూస్తే అది కుక్క కాదని అర్థం అయింది. ఆ పాటికే దాని ముక్క ఇక దొరకదని అనుకుంది. తన ఆశకు ఇది జరగాల్సిందే అనుకుంది. వెంటనే తన దారిన వెళ్లిపోయింది.

సరైన నీడ ఏది?




దారి కనుక్కోండి



ఏవి ఎన్ని?



గడుల ఆధారంగా బొమ్మ గీయండి



డైలీ సుడోకు - 219

		8	2			6		7
		4	5	9	7		2	1
2			6		8			3
7	9	2	3					
					5	7	8	9
1			9		6			4
5	6		4	3	2	9		
4		9			1	5		

సుడోకు - 218 సమాధానం

2	4	9	1	5	6	3	7	8
7	6	1	8	3	4	9	2	5
5	8	3	2	9	7	1	6	4
1	2	4	6	8	9	5	3	7
3	7	8	5	1	2	4	9	6
9	5	6	4	7	3	2	8	1
4	3	5	9	6	8	7	1	2
8	9	2	7	4	1	6	5	3
6	1	7	3	2	5	8	4	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.